

రుణమాఫీ కోసం నాసిక్ నుంచి ముంబైకి సుదూర ప్రదర్శన చేపట్టిన అఖిల భారత కిసాన్ సభ రైతులు శనివారం థానే చేరుకున్న దృశ్యం


Estd 1938

# ఆంధ్రప్రభ


www.prabhanews.com Journalism first!





సంపుటి: 62 • సంచిక: 60 • ఆదివారం 11 మార్చి 2018 • విజయవాడ ✻ పేజీలు: 14 • వెల: 6.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad


**ముహూర్తం** శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ నవమి ఉ. 9.01 అనంతరం దశమి; నక్షత్రం: మూల ఉ 7.05 వరకు అనంతరం పూర్వాషాఢ; అమృతకాలం: తె. 4.25 నుండి 7.30 వరకు; వర్జ్యం: శే ఉ. 7.05 వరకు సా 5.42 నుండి 7.28 వరకు; దుర్ముహూర్తం: సా. 4.24 నుండి 5.12 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు;



# రాజ్యసభకు ఇద్దరు చాలు!

- మూడో సీటు కోసం రిస్క్ అనవసరమని భావన
- పార్టీ సీనియర్లతో చంద్రబాబు సమీక్ష
- అధినేత చుట్టూ ఆశావహుల చక్కర్లు
- కంభంపాటి, సీఎం రమేష్, వర్ల రామయ్య తదితరుల లాబీయింగ్

**అమరావతి, ఆంధ్రప్రభ :** రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి అధికారపక్షమైన తెలుగుదేశం పార్టీ లోతుగా కసరత్తు ప్రారంభించింది. పార్టీ పటిష్టత, సామాజిక వర్గాల సమీకరణ ప్రాతిపదికగా ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అభ్యర్థులను ఎంపిక చేసి అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు శనివారం వెలగపూడి సచివాలయంలోని తన కార్యాలయంలో ఆయన పార్టీ సీనియర్లతో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసినట్లు సమాచారం. మొత్తం మూడు సీట్లకు అభ్యర్థులను రంగంలోకి దింపాలా..? లేదా..? అనే దిశగా చర్చ జరిగింది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇద్దరు అభ్యర్థులను రంగంలోకి దింపాలనే నిర్ణయానికి సూచనప్రాయంగా వచ్చినట్లు తెలిసింది. మూడు సీట్లలో పోటీ చేసినట్లయితే ఓసీ, బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు ఒక్కొక్కరు చొప్పున బరిలోకి దింపాలనే ప్రతిపాదన ఉంది. అయితే రెండు సీట్లకే పోటీ చేసే పక్షంలో వివిధ సమీకరణాలపై పెద్ద ఎత్తున చర్చించినట్లు భావిస్తున్నారు. ముఖ్యంగా ఓసీ సామాజిక వర్గాల నుంచి పోటీ అధికంగా ఉంది. ప్రస్తుత సభ్యుడు సీఎం రమేష్‌తో పాటు మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావుల మధ్య గట్టి పోటీ నెలకొన్నది. గతంలో ఎంపీగా పనిచేసిన రామ్మోహనరావు మరోసారి తనకు అవకాశమివ్వాలంటూ అధిష్టానంపై ఒత్తిడి పెంచారు. గుంటూరు, కృష్ణ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాలో రామ్మోహనరావుకు చెందిన సామాజిక వర్గం అధికంగా ఉండడంతో ఆ దిశగా చంద్రబాబునాయుడు దృష్టిసారించారు. దాదాపుగా ➩ 2వ పేజీలో...



శనివారం ఢిల్లీలో 'వియ్ ఫర్ డవలప్‌మెంట్' అంశంపై రెండు రోజుల సదస్సులో ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, డిప్యూటీ స్పీకర్ తంబి దురై, ఎంపీలు, ఎమ్మెల్యేలు.

## నిధుల్లేక కాదు.. సరైన పాలనలేకే

# వెనకబాటు!

- ఎప్పుడూ రాజకీయాలేనా...
- అభివృద్ధి మీద దృష్టి పెట్టండి
- ప్రజా ప్రతినిధులకు ప్రధాని మోడీ హితబోధ

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** దేశంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. సామాజిక న్యాయ సాధనలో ఇది చాలా కీలకమైన అంశమని ఆయన అభిప్రాయపడ్డారు. శనివారం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ప్రజాప్రతినిధుల జాతీయ సదస్సును ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. 'వియ్ ఫర్ డెవలప్ మెంట్' అనే అంశంపై రెండు రోజుల సదస్సుకు కేంద్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అసెంబ్లీల స్పీకర్లు హాజరయ్యారు. దేశంలో ➩ 9వ పేజీలో...

## మరిన్ని రాఫెల్స్ కొనుగోలు?



శనివారం ఢిల్లీలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో ప్రధాని మోడీ

సౌర విద్యుత్‌లో సాంకేతిక బదలాయింపు
రక్షణ, అణు విద్యుత్ రంగాల్లో పరస్పర సహకారం

# 14 భారత్-ఫ్రాన్స్ ఒప్పందాలు

5

## ఆర్టీసీ కార్మికులకు శుభవార్త

- సమైక్యాంధ్ర సమ్మె కాలాన్ని ప్రత్యేక సెలవుగా గుర్తింపు
- రూ. 100ల రికవరీ నిలుపుదల చేస్తూ ఆదేశాలు
- 2013 పే స్కేలుకు సంబంధించిన 20 శాతం బకాయిలు జూన్ 10న చెల్లింపు
- ఏపీఎస్ ఆర్టీసీ ఉత్తర్వులు జారీ

7

## పదిహేనేళ్ల తరువాత తీర్పు..



## కారుణ్య మరణాలకు

# ఆమోదం అవసరమా?

- సమాజం హర్షించని మరణాలివి
- చట్టబద్ధతతో మరిన్ని అనర్థాలు
- అవయవ దానాలకు ఏ చట్టబద్ధత ఉంది?
- గౌరవప్రదమైన మరణాలే వాంఛనీయం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి:** రెండ్రోజుల క్రితం సుప్రీంకోర్టు కారుణ్య మరణాన్ని ఆమోదించింది. సుమారు పదిహేనేళ్ళ క్రితం కారుణ్య మరణానికి అనుమతివ్వమంటూ దాఖలైన వాజ్యంపై వాదోపవాదాల్ని పరిశీలించిన అనంతరం దీనిపై సర్వోన్నత న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. అదే సమయంలో ప్రతి ఒక్కరు సుప్రీంకోర్టుకు రావడం సాధ్యంకాదని, ఈ అధికారాల్ని రాష్ట్రాల హైకోర్టులకివ్వాలని ప్రభుత్వానికి సూచించింది. కానీ సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శక సూత్రాల్ని ప్రపంచంలో ఉన్న ఏ మత విశ్వాసాలు కూడా అంగీకరించవు. ఇవి ఏ మత విశ్వాసాలకు అనుకూలంగా లేవు. ఏ మతానికీ ఇది ఆమోదయోగ్యం కాదు. సుప్రీంకోర్టు కారుణ్య మరణం లేక ఆకస్మిక మరణం లేక సహజ మరణాలపై కొన్ని వివరణలు ఇవ్వాల్సిన ఆవశ్యకతుంది. కొన్నిచోట్ల వాళ్ళ ప్రమేయం లేకుండానే ప్రమాదాలు లేక యుద్ధ భూముల్లోగానీ లేదా దాడుల్లో గానీ మృతిచెందిన వ్యక్తుల్ని సమాజం గౌరవంగానే పరిగణిస్తోంది. ఆ మరణాన్ని ఆమోదిస్తుంది. లేనిపక్షంలో సహజ మరణం పొందిన ఎంతటి వయోవృద్ధుల్నైనా ఊరేగింపుగా ఆఖరియాత్రలో ప్రజలు పాల్గొని దాన్నో పుణ్యకార్యక్రమంగా భావించి ఆ మరణాన్ని



ఆమోదిస్తారు. కానీ ఆత్మహత్య చేసుకున్న వారెవర్నీ సమాజం గౌరవించదు. ఏ మతంలోనూ ఈ ఆత్మహత్యను గౌరవప్రదమైన మరణంగా ఆమోదించదు. వీర్ని పిరికిపందలుగానే అందరూ భావిస్తారు. వారి మృతదేహాలకు ఆడంబరాలు, అట్టహాసాల్లేకుండా అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఈనాడు కారుణ్య మరణం అన్నది డబ్బుండి ఆస్తిపాస్తుల్తో అన్ని బాధ్యతలు పూర్తి చేసి ఇక తమ అవసరం లేదని మరణం అంటే భయపడే వ్యక్తులు కోరుకునే కోర్కె అది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సుదీర్ఘకాలం కోమాలో ఉన్నా, మరణం తప్పదని భావించిన వ్యక్తులకు లేక అవిభాజ్య కవలలుగా జన్మించి విడదీయడానికి అనువుగా లేక జీవనకాలం అత్యంత దారుణమైన జీవనాన్ని గడుపుతున్న వ్యక్తుల కుటుంబ ఆవేదనను తీర్చడానికి వారు ఇలాంటివికోరొచ్చు. అంతేగాని కారుణ్య మరణాల్ని చట్టం చేయాల్సిన అవసరంలేదు. ఇప్పటికే బ్రెయిన్‌డెడ్ అనిచెప్పి బ్రతికుండగానే ఇతరులకుపయోగపడే వారి అవయవాల్ని తొలగించి ఇతరులకు అమరుస్తున్న పరిస్థితుల్లో ప్రభుత్వమే అవయవదానం పేరిట ప్రజల్ని ప్రోత్సహిస్తోంది. దీనికే న్యాయస్థాన అనుమతి అక్కర్లేదు. ఆ కుటుంబ సభ్యుల ఆమోదం ఉంటే సరిపోతుంది. శరీరంలోని ఒక్క కళ్ళు ➩ 3వ పేజీలో...




# ప్రతిష్టంభన తొలగేదెలా?

## ద్రవ్య బిల్లు గట్టెక్కేదెలా?

### అంతు చిక్కని అధికార పక్ష వ్యూహం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాల ప్రతిష్టంభన తొలగిపోయే సంకేతాలు కనిపించడం లేదు. అధికార, విపక్షాలు, మిత్రపక్షాలు మెట్టు దిగే సూచన లేకపోవడంతో సమావేశాలు నడిచే పరిస్థితి లేదు. మొన్నటి దాకా కేవలం విపక్షాలు మాత్రమే నిరసన వ్యక్తం చేస్తుండగా, ఈ సారి సమావేశాల్లో అధికార ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాలైన తెలుగుదేశం పార్టీ, శివసేన కూడా జతకలిశాయి. ఎన్డీఎలో లేకున్నా మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న అన్నాడిఎంకె సైతం ఆందోళన ➩ 9వ పేజీలో...






# మళ్లీ మొదటికి..!

## తెలంగాణకు రూ.10 వేల కోట్ల ఆస్తులు • ఒప్పుకోని ఏపీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఇరు రాష్ట్రాల ఆస్తులు, అప్పుల పంపకాలు, తొమ్మిదో షెడ్యూల్‌లోని ఉమ్మడి సంస్థల పంపకాలపై కేంద్రం ఇచ్చిన స్పష్టతతో తెలంగాణకు భారీ మేలు చేకూర్చింది. కేంద్రం గతేడాది జారీ చేసిన కీలక మార్గదర్శకాలతో 9వ షెడ్యూల్‌లోని 89 ప్రభుత్వ రంగ సంస్థల హెడ్ క్వార్టర్స్ (ప్రధాన కార్యాలయాలు) మాత్రమే 58:42 నిష్పత్తిలో పంపకాలు చేయనున్నారు. ఇతర కార్యాలయాలు, వర్క్ షాపులు, అతిథి గృహాలు, శిక్షణా కేంద్రాలు, ఆస్పత్రుల వంటివి ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికే చెందుతాయని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ చేసిన సూచనలతో తెలంగాణకు దాదాపు రూ. 10 వేల కోట్ల ఆస్తులు మిగలనున్నాయి. ప్రధాన కార్యాలయం అంటే కేవలం హెడ్ ఆఫీస్ మాత్రమేనని మిగతా కార్యాలయాలు ఇందులో భాగం కాదని కేంద్రం స్పష్టమైన నిర్వచనాన్ని ఇచ్చి రాష్ట్ర విభజన నాటి నుంచి ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2104లోని 53వ ➩ 2వ పేజీలో...



# ఇద్దరు చాలు!

(మొదటిపేజీ తరువాయి)

మొగ్గు అటువైపే ఉందని సీఎం రమేష్‌ను మళ్లీ బరిలోకి దింపే విషయమై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఢిల్లీలో లాబీయింగ్ చేయడంలో అనుభవం ఉన్న నేతగా కంభంపాటి రామ్మోహనరావుకు గుర్తింపు ఉంది. సమీప భవిష్యత్తులో హస్తిన స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రామ్మోహనరావు లాంటి చురుకైన నేతలు అవసరమనే అభిప్రాయం కూడా లేకపోలేదు. శనివారం జరిగిన కసరత్తులో రామ్మోహనరావు పేరు ప్రముఖంగా చర్చకు వచ్చినట్టు చెబుతున్నారు. అదే విధంగా సిట్టింగ్ ఎంపీ సీఎం రమేష్‌ను ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి పరిమితం చేసి పార్టీ అవసరాల కోసం వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు చెబుతున్నారు. అదే నిజమైతే రామ్మోహనరావుకు బెర్త్ ఖరారు అయినట్లేనని తెలుస్తోంది. కాగా ఓసీ సామాజిక వర్గం నుంచి కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు నాయకులు కూడా రాజ్యసభ అవకాశాన్ని ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. అదే విధంగా బీసీ సామాజిక వర్గం నుంచి కూడా పోటీలో పలువురు ఉండడం విశేషం. గత సాధారణ ఎన్నికల్లో కర్నూలు నుంచి ఎంపీగా పోటీచేసిన బీటీ నాయుడితో పాటు సిట్టింగ్ ఎంపీ దేవేందర్‌గౌడ్ కూడా ప్రధానంగా టిక్కెట్ల రేసులో ఉన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి సంబంధించి వర్ల రామయ్యతో పాటు జూపూడి ప్రభాకరరావు, మసాల పద్మజ, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలతలు కూడా రేసులో ఉన్నారు. అయితే ముఖ్యమంత్రి మాత్రం ఎస్సీ మహిళలకు సీటును కేటాయించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. బీసీల కేటగిరిలో రాజ్యసభ టికెట్‌ను ఇవ్వాల్సి వస్తే కర్నూలు లోక్‌సభ నియోజకవర్గం నుంచి రెండు సార్లు టీడీపీ తరుపున ఎంపీగా పోటీ చేసిన బీటీ నాయుడు వైపు మొగ్గు చూపే అవకాశాలున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర వాల్మీకి బోయ ఫెడరేషన్ చైర్మన్‌గా కూడా ఉన్న ఆయన రెండున్నర దశాబ్దాలుగా పార్టీలో ఉంటున్నారు. తాజాగా ముఖ్యమంత్రిని కలిసి తనకు టికెట్ ఇవ్వాలని కోరారు. అదే విధంగా మరో బీసీ నేత కావలికి చెందిన బీద మస్తానరావు కూడా రాజ్యసభ అభ్యర్థిత్వం కోసం రేసులో ఉన్నారు. ప్రధానంగా ఎస్సీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు సంబంధించి కసరత్తు చేస్తున్నప్పటికీ ఎస్సీ మహిళ, ఓసీల నుంచి కమ్మ సామాజిక వర్గం నుంచి ఒకరిని ఎంపిక చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. శనివారం వెలగపూడి సచివాలయంలో జరిగిన కసరత్తులో టీడీపీ అధ్యక్షుడు మంత్రి కిమిడి కళావెంకట్రావు, ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

**మూడో సీటుపై తర్జనభర్జన**

మూడవ సీటులో అభ్యర్థిని బరిలోకి దింపాలంటే ఐదుగురు సభ్యుల మద్దతు అదనంగా అవసరం. ఈ దిశగా కూడా శనివారం జరిగిన భేటీలో తీవ్ర స్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. ఇంతకాలం మిత్రపక్షంలో ఉన్న బీజేపీ ప్రమేయం దూరమవుతున్న నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన నలుగురు టిడిపి అభ్యర్థికి ఓటు వేసే పరిస్థితులు లేవని చెబుతున్నారు. ఇదే జరిగిన పక్షంలో టిడిపికి కేవలం 29 మంది సభ్యుల మద్దతు మాత్రమే ఉంటుంది. ఎన్నికల్లో అభ్యర్థి విజయం సాధించాలంటే 44 మంది మద్దతు సరిపోతుంది. ఒకవేళ బీజేపీ ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొనకపోతే 42 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నా గెలుపుకు సరిపోయే అవకాశాలు ఉన్నాయి. దీంతో మూడో అభ్యర్థిపై తర్జన భర్జన జరుగుతోంది. ఈ భేటీలో పాల్గొన్న సీనియర్ మంత్రులు కూడా మూడవ సీటుపై వెనుకంజ వేసినట్లు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ నుంచి వచ్చిన 22 మంది ఎమ్మెల్యేలతో కలిపి టీడీపీకి రెండు సీట్లను సునాయాసంగా గెలుచుకునే అవకాశాలున్నాయి.

అయితే చంద్రబాబు వ్యూహంపై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది. రెన్ను సీటుకు పోటీ అనవసరం అనే భావం ఇప్పటికే టిడిపిలో నెలకొన్నట్లు చెబుతున్నారు.

**ఊపిరి పీల్చుకున్న వైఎస్సార్‌సీపీ**

వైఎస్సార్‌సీపీ ఈ ఎన్నికల్లో అనుసరించనున్న వ్యూహంపై కసరత్తు లోతుగా చర్చ జరిగింది. బీజేపీ, టీడీపీల మిత్రభేదం వైఎస్సార్‌సీపీకి బాగా కలిసివచ్చింది. బీజేపీకి ఉన్న నలుగురు ఎమ్మెల్యేలతో కలిపితే మూడో రాజ్యసభ సీటును సునాయాసంగా గెలుచుకోవచ్చని తొలుత టీడీపీ వర్గాలు అంచనా వేశాయి. ఇందుకు విరుద్ధంగా తాజా రాజకీయ పరిణామాలు చోటుచేసుకోవడంతో మూడో సీటుపై ఎటూ తేల్చుకోలేని స్థితిలో టీడీపీ ఉండగా మరోవైపు ఉన్న 44 మంది సభ్యుల సంఖ్యాబలంతో సునాయాసంగా బయట పడొచ్చని అంచనాలు విపక్ష పార్టీలో నెలకొన్నాయి. ఫలితంగా రెండు సంవత్సరాల క్రితం వైఎస్సార్‌సీపీకి ఒక్క సీటు అయినా దక్కకుండా టీడీపీ వ్యవహరించింది. కానీ ఎత్తుగడలు ఫలించలేదు. తాజాగా కూడా అదే పరిస్థితి పునరావృతం కాబోతుందని విశేషం.

**నేడు పొలిట్‌బ్యూరో సమావేశం**

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం ఈనెల 11న జరగనున్నది. ఉండవల్లిలోని గ్రీవెన్స్‌హాల్‌లో జరిగే ఈ సమావేశానికి ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షత వహిస్తారు. రానున్న ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక కసరత్తు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించడం జరుగుతుంది. అదే విధంగా సోమవారం నుంచి మళ్లీ ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలపై కూడా చర్చించడం జరుగుతుంది. పార్లమెంట్ వేదికగా ఎంపీలు చేయనున్న ఆందోళనలపైకూడా చర్చిస్తారు. ఉద్యమాన్ని ఏ విధంగా ముందుకు తీసుకువెళ్ళాలనే విషయమై చర్చిస్తారు. ఈ మేరకు ఎజెండా ఖరారైంది. రాజ్యసభ నామినేషన్లకు సోమవారం గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక అనివార్యం అయింది. ఇందుకోసమే పొలిట్‌బ్యూరో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

# 'దేశం' మరో అస్త్రం

**● ఎన్డీయే సర్కారు తీరుపై కన్నెర్ర ● విభజన అంశాలపై 'సుప్రీం'లో కేసు వేసే ఛాన్స్ ● ఈడీ జప్తు చేసిన జగన్ నిధుల వాపసుపై నేతల భేటీలో చర్చ**

**అమరావతి, ఆంధ్రప్రభ :** ఇప్పటికే కేంద్ర మంత్రి పదవుల నుంచి వైదొలగిన తెలుగుదేశం పార్టీ త్వరలోనే ఎన్డీయేకు మరో షాక్ ఇచ్చేందుకు సమాయత్తమవుతోంది. కేంద్ర మంత్రుల రాజీనామాలను మొదటి అస్త్రంగా పరిగణించిన తెలుగుదేశం కేంద్రంపై మరింత ఒత్తిడి తేవాలని సంకల్పించింది. దశల వారీగా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ఉన్నతస్థాయిలో నిర్ణయించిన తెలుగుదేశం పార్టీకి తాజాగా కేంద్రం వ్యవహరించిన తీరు ఆగ్రహాన్ని తెప్పించినట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి ప్రధాన ప్రతిపక్ష నేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి చెందిన జప్తు చేసిన రూ.34 కోట్లను ఈడీ ద్వారా తిరిగి ఇప్పించడాన్ని టిడిపి జీర్ణించు కోలేకపోతున్నది. ఇదే విషయమై శనివారం సచివాలయంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో తీవ్రంగా పరిగణించారు. అన్యాయంగా విభజనకు గురైన ఆంధ్ర ప్రదేశ్‌కు అన్ని విధాల ఆదుకోవడంతో పాటు కేంద్రం నుంచి విభేధ చట్టం, హామీల అమలు కాకపోవడంపై మెట్టు దిగే వీలులేదని టీడీపీ సంకేతాలు ఇచ్చింది. అయితే ఒక వైపు కేంద్రమంత్రులు రాజీనామాలు చేయడం, మరో వైపు ఎంపీలు పార్లమెంటు వేదికగా పోరాటం చేస్తున్న నేపథ్యంలో తాజాగా జప్తు చేసిన ఈడీ ఆస్తులను తిరిగి ఇవ్వడం వెనుక పెద్ద మతలబు ఉందనే దిశగా ఈ రోజు జరిగిన భేటీలో లోతుగా చర్చించినట్లు సమాచారం. ఇది చాలా తీవ్రమైన విషయమని ఈ వ్యవహారాన్ని విభిన్న కోణాల్లో స్పృశించిన నేతలు తదుపరి కార్యాచరణకు సంబంధించిన నిర్ణయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వదిలి వేశారు. పార్లమెంటులో కేవలం నలుగురు సభ్యుల మద్దతు ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం హాస్యాస్పదంగా ఉందనే దిశగా కూడా చర్చ జరిగింది. అయితే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి కనీసం 50 మంది సభ్యుల మద్దతు ఉండాలని పేర్కొన్న నేతలు వైఎస్సార్‌సీపీని ముద్దాయిల పార్టీగా వర్ణించినట్లు తెలిసింది. అలాంటి పార్టీని తెలుగుదేశం కాదు కదా, ఇతర పార్టీల మద్దతు కూడా లభించబోదనే అభిప్రాయం వ్యక్తమైంది. కేసుల మాఫీ కోసం వైఎస్సార్‌సీపీ కుప్పిగంతులు వేస్తోందని, ఢిల్లీ చుట్టూ, ప్రధాని చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నదని దుయ్యబట్టిన ముఖ్యమంత్రి, ఇతర నేతలు ప్రజాక్షేత్రంలోనే ఎత్తుగడలను తిప్పికొట్టాలని నిర్ణయించారు. యథావిధిగానే పార్లమెంటు వేదికగా ఆందోళన కార్యక్రమాలు కొనసాగించాలని జాతీయ రాజకీయాలను నిశితంగా పరిశీలించి మరో అస్త్రాన్ని ప్రయోగించాలనే నిర్ణయానికి నేతలు వచ్చారు. ఎన్డీయే విధానాలను ఉపేక్షిస్తే ప్రజల్లో తప్పుడు సంకేతాలు వచ్చే ప్రమాదం ఉందని అలాంటప్పుడు ఎన్డీయేలో కూడా కొనసాగితే ఎలా అనే దిశగా చర్చ జరిగిందని సమాచారం. విభజన అంశాలపై పరిష్కరించే విధంగా ఎన్డీయే వ్యవహరించడం లేదని ఆ దిశగానే సంకేతాలు వస్తున్నాయని నేతలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చట్టబద్ధంగా ఇచ్చిన హామీలు విభజన అంశాలపై సుప్రీం కోర్టుకు వెళ్ళాలనే దిశగా కూడా కసరత్తు చేశారని సమాచారం.

తొలుత సుప్రీంకోర్టులో కేసు వేసిన తరువాతే కేంద్రం స్పందనను బేరీజు వేయాలని చర్చించారు. ఎన్డీయేతో రెండు దశాబ్దాలకు పైగా కొనసాగిన బంధాన్ని కూడా సమీక్షించిన సమావేశం సమీప భవిష్యత్తులో అనుసరించనున్న వ్యూహంపై కూడా లోతుగా చర్చించినట్లు తెలుస్తోంది.

కేంద్రంలో టీడీపీ మంత్రుల రాజీనామాతో రాష్ట్ర ప్రజల నుంచి, జాతీయ, ఇతర ప్రాంతీయ పార్టీల నుంచి మంచి స్పందన లభించిందని సమావేశం అభిప్రాయపడింది. అదే విధంగా హస్తినలో ఎంపీల నుంచి కూడా పాజిటివ్ స్పందన లభించిందని, బీజేపీలో కదలిక కూడా రావడం జరిగిందని అంటూ ఇది ఒక విధంగా టిడిపికి సానుకూలమైన సంకేతాలు అనే అభిప్రాయాన్ని నేతలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా టిడిపికి ఇలాంటి పరిణామాలు కొత్త కాదని పేర్కొన్న చంద్రబాబునాయుడు ఆచితూచి అడుగు వేద్దామని నిర్ణయించారు.

# నాకు మరో చాన్స్ ఇవ్వండి

**● సీఎంకు మాజీ ఎంపీ దేవేందర్‌గౌడ్ లేఖ**



**అమరావతి, ఆంధ్రప్రభ :** తనకు రాజ్యసభ సభ్యుడిగా మరోసారి అవకాశం ఇవ్వాలంటూ తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలంగాణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ శనివారం ఒక లేఖ రాశారు. కార్మికసంఘ నేతగా, జెడ్పీ చైర్మన్‌గా మూడు సార్లు ఎమ్మెల్యేగా పదేళ్లపాటు కేబినెట్ మంత్రిగా పనిచేసిన తనకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం దక్కిందని, ఇక ముందు కూడా క్రియాశీల కంగా సమాజ శ్రేయస్సుకు, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయాలన్న తపన, ఉన్నత వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిని ఎంపిక చేయాలని అధినేత చంద్రబాబుకు సూచించారు. గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధికి అమెరికాలో చికిత్స పొందుతున్న ఆయన ఎక్కువ రోజులు అక్కడే గడుపుతున్నారు. ఇటీవలే కొద్దిగా కోలుకున్న ఆయన మళ్ళీ క్రియాశీలక రాజకీయాల్లో అడుగుపెట్టే ఆలోచనలో ఉన్నారు.

# కేంద్రం ఇచ్చిన మాట తప్పింది

**● మీడియాతో భూగర్భ గనుల శాఖ మంత్రి ఎస్‌కె రంగారావు**

**విజయనగరం, ప్రభ బ్యూరో:** రాష్ట్రానికి ఇచ్చిన మాట కేంద్ర ప్రభుత్వం తప్పిందని, అందుకే ప్రజల పక్షాన నిలిచి కేంద్రంతో పోరాడతామని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు పేర్కొన్నారు. శనివారం స్థానిక అశోక్ బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం వైఖరిని తీవ్రంగా తప్పు పట్టారు. ఏపీకి ఇచ్చిన మాటకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి వుండకపోవడం వల్లనే అశోక్ గజపతిరాజు తన మంత్రి పదవిని తృణప్రాయంగా విడిచిపెట్టినట్లు చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అప్పట్లో రాష్ట్ర విభజనకు పాటుపడితే, అశోక్ గజపతిరాజు రాష్ట్ర ప్రయోజనాల కోసం మంత్రి పదవిని త్యజించారన్నారు. విభజన చట్టంలోని 19 అంశాలు అమలు కోసం ప్రభుత్వం పోరాడుతూనే వుంటుందన్నారు. ఇంత వరకు వీటిపై ఒక్క చర్చ కూడా జరపకపోగా ఎంత వత్తిడి పెంచినా కేంద్రం పట్టించుకోలేదన్నారు. ప్రత్యేక ప్యాకేజీలు, రాయితీలు



ఇస్తామన్నందునే కేంద్రం మాటలకు ఒప్పుకున్నామని, నాలుగేళ్ల పాటు నిరీక్షించినా మాట నిలబెట్టుకోలేకపోయిందన్నారు. మూడు రాష్ట్రాలకు రాయితీలు, ప్రత్యేక హోదా పొడిగించిన నేపథ్యంలో ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి ప్రధానిని, అరుణ్ జైట్లీని కోరారన్నారు. ఆంధ్రుల మనోభావాలు దెబ్బతినేలా జైట్లీ వ్యవహరించారన్నారు. పోలవరాన్ని పూర్తి చేస్తామన్న కేంద్రం ఇప్పుడు అడ్డంకులు సృష్టిస్తోందని మంత్రి ఆరోపించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మీసాల గీత, బొబ్బిలి చిరంజీవులు పాల్గొన్నారు.

# మళ్లీ మొదటికి...!

(మొదటి పేజీ తరువాయి)

అధికరణం కింద మిగతా విభాగాలు, కార్యాలయాల పంపకాలు ఉంటాయని స్పష్టతనిచ్చింది. అంటే అవి ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికే చెందుతాయని స్పష్టం గా పేర్కొన్నట్లయింది. మూడున్నరేళ్లుగా ప్రతిష్టంభన ఎదుర్కొంటున్న ఆస్తులు, అప్పుల పంపకాలపై అనేక వివాదాలు ఇరు రాష్ట్రాలకు ఎదురు కావడం, కేంద్రానికి ఫిర్యాదుల పరంపర పెరగడంతో కేంద్ర హోంశాఖ వీటిపై స్పష్టతకు సంకల్పించింది. ఈ మేరకు సొలిసిటర్ జనరల్‌తో సమావేశమై గతంలో కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాల విషయంలో అనుసరించిన విధానాలను పరిశీలించింది. ఆ తర్వాత చట్టంలో పొందుపర్చిన అధికరణాలను పరిగణనలోకి తీసుకుంది. ఇరు రాష్ట్రాల అభ్యర్థనలు అధ్యయనం చేసి జనాభా నిష్పత్తిలో హెడ్ క్వార్టర్స్‌ను మాత్రమే పంచుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ డైరెక్టర్ అశుతోష్ జైన్ గతేడాది కీలకమైన ఉత్తర్వులు జారీ చేశారు. 6151 సీఎస్‌పీ2017 ఉత్తర్వులో హెడ్ క్వార్టర్ అంటే ఏమిటో స్పష్టంగా నిర్వచనమిచ్చారు. దీంతో ఏపీఎస్ఆర్టీసీ, ఏపీ ఫుడ్స్, విజయా డైరీ, ఏపీ ఆగ్రోస్‌లపై రెండు రాష్ట్రాల మధ్య వాదోపవాదాలకు కారణమవుతున్న అంశాలపై స్పష్టత వచ్చింది. తార్నాకలోని ఏపీఎస్ఆర్టీసీ ఆస్పత్రి, ముషీరాబాద్‌లోని కళాభవన్, ఆర్టీసి క్రాస్ రోడ్‌లోని వర్క్‌షాప్, ఏపీ ఫుడ్స్ నిర్వహణా కార్యాలయాలు, మల్కాజ్‌గిరిలోని విజయా డైరీ, ఏపీ ఆగ్రో టెస్టింగ్ సెంటర్, రీసెర్చ్ యూనిట్లు తెలంగాణకే చెందనున్నాయి. వీటి విలువ రూ. 10వేల కోట్లుగా ఉండవచ్చని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది.

ఈ వ్యవహారంలో తమకు అన్యాయం జరిగిందని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం చర్చలకు సిద్ధమైంది. హోంశాఖకు అనేక సందార్భాల్లో ఫిర్యాదులు చేసింది. దీంతో తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పుల విభజనలో కొన్ని ప్రతికూలతలు పెరిగాయి. విభజన అంశాలు మరింత జఠిలంగా మారుతున్నాయి.

రెండు రాష్ట్రాలకు చెందిన అనేక సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే మిగలడంతో కేంద్రం చొరవ చూపుతోంది. రాష్ట్ర విభజన జరిగి మూడున్నరేళ్లయినా ఇంకా ఆస్తులు, అప్పుల విభజన కొలిక్కి రాకపోవడంపై కేంద్ర హోంశాఖ స్పందించింది. రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఉన్నతస్థాయి సమావేశాలకు పూనుకున్నది. గతంలో పలు మార్లు కేంద్ర హోంశాఖ ఇద్దరు సీఎస్‌ల భేటీకి ప్రయత్నాలు చేసినా అవి సఫలం కాలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 13లోని అంశాలతోపాటు అనేక అంశాల్లో వివాదాల పరిష్కారమే లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. షెడ్యూల్ 9, 10ల విషయంలో ఇంకా అస్పష్టత వీడలేదు. షీలా బేడీ కమిటీ కొన్ని సిఫార్సులు చేసినా ఇంకా పంపకాలు పూర్తి కాలేదు. పబ్లిక్ రంగ సంస్థల పంపకాలు, ఆస్తులు, అప్పుల అంశంలో వివాదాలు ఇంకా తొలగిపోలేదు.

ప్రధానంగా ఉన్నత విద్యాశాఖకు చెందిన కొన్ని ఆస్తుల అంశం జఠిలంగా మారింది. ఈ అంశంలో న్యాయం కోరుతూ ఏపీ సర్కార్ కోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో చరాస్తుల పంపిణీకే తెలంగాణ ప్రభుత్వం ముందుకు వస్తుండగా గరిష్ట నిష్పత్తిలో ఆస్తుల పంపిణీ జరగాలనే ఏపీ వాదనకు తెలంగాణ సుముఖంగా లేదు. కేవలం నగదునే పంపిణీ చేసుకుందామని, ఇక్కడి స్థిరాస్తుల పంపిణీ సరికాదని తెలంగాణ ప్రభుత్వం అంటోంది. ఏపీ మాత్రం నిర్ధేశిత నిష్పత్తిలో పంపకాలు చేసుకోవాలని కోరుతోంది. కీలకమైన హైదరాబాద్‌లోని పబ్లిక్ రంగ సంస్థల ఆస్తులపైనే ఇరు రాష్ట్రాలు పట్టుదలకు పోతున్నాయి. అత్యంత విలువైన ఆస్తుల పంపిణీకి కేంద్రం కూడా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దాదాపు 100కు పైగా పబ్లిక్ సెక్టార్ సంస్థల లెక్కలు తీసి దీనిపై డిస్ప్యూట్ రిజల్యూషన్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ నేతృత్వంలో పరస్పర చర్చల ద్వారా పరిస్థితిని చక్కబెట్టాలని యోచిస్తోంది.



ముత్తంశెట్టి

# హోదాపై అలుపెరుగని పోరాటం

**అనకాపల్లి, ప్రభ న్యూస్:** ప్రత్యేక హోదా ఇచ్చేంతవరకూ కేంద్రంపై అలుపెరుగని పోరాటం చేస్తామని పార్లమెంటు సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బైపాస్‌రోడ్డు లోని ఎంపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 2014లో రాష్ట్ర విభజన చేయమని ఏపీ ప్రజలు కోరలేదని, తెలంగాణ కోరిందని, అయితే విభజన కోరిన తెలంగాణకు రాజధానిని ఇచ్చి ఏపీకు రాజధాని లేకుండా చేశారన్నారు. హోదా విభజన చట్టంలో 5ఏళ్లు కాదు పదేళ్లు ఇవ్వాలని అప్పటి ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ కోరిందని, ఇపుడు మాటమార్చి చట్టంలో లేదంటున్నారన్నారు. విభజన ఏకపక్షంగా చేసిన కాంగ్రెస్‌పార్టీకి ప్రజలు అధికారం నుంచి దూరం చేశారని, ఆ పరిస్థితి బీజేపీ రాకుండా చూసుకోవాలని సూచించారు. రాష్ట్ర విభజన జరిగి ఐదేళ్లలో రూ.15వేల కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. ప్రజల సెంటిమెంటంటూ నేడు మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి జైట్లీకి రాష్ట్ర విభజన సమయంలో తమ సెంటిమెంటు కనిపించలేదా అని ప్రశ్నించారు. అన్ని పార్టీల సపోర్టు తీసుకొని ప్రత్యేక హోదాపై పోరాటంచేస్తామన్నారు. కేంద్ర మంత్రి వర్గంనుంచి తమ పార్టీ వెలుపలకు వచ్చిన నేపథ్యంలో హోదాపై ఎంతవరకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తమ నాయకుడు చంద్రబాబుగతంలో బీజేపీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో కూడా తమ పార్టీ సపోర్టు చేసిన విషయాన్ని బీజేపీ మరువకూడదన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా బీజేపీ ప్రవర్తించడం మానుకోవాలన్నారు. ఇంకా విభజన చట్టంలోని 11అంశాలను నేటికీ నెరవేర్చలేదన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్, విశాఖ రైల్వేజోన్, ఆయిల్‌రిఫైనరీ, పెట్రోలు, అమరావతికి ఆర్థిక సహాయం, జాతీయ విద్యా సంస్థలు, దుగ్గిరాజుపట్నం పోర్టు, అసెంబ్లీ సీట్ల పెంపు, పన్ను రాయితీలు, కడపలో స్టీలుప్లాంటు, విశాఖ -చెన్నై కోస్టల్ కారిడార్, విశాఖ-విజయవాడ మెట్రో రైలు, అమరావతికి రోడ్ల అనుసంధానం, వెనుకబడ్డ జిల్లాలకు ఆర్థిక ప్యాకేజీ, 9,10షెడ్యూలులోని అపోర్షన్‌మెంట్లు, గ్రేహౌండ్ శిక్షణ కేంద్రం వంటి అనేక అంశాలను నేటికీ అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ ప్రత్యేక హోదా ఇచ్చే అంశంతోపాటు మిగిలిన అంశాలను అమలు చేయాలని కోరుతున్నామన్నారు. లేకుంటే తమ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

# నేడు రెండో విడత పల్స్‌పోలియో



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను వైద్య, ఆరోగ్యశాఖ ఇప్పటికే పూర్తిచేసింది. ఈ రెండో విడత పల్స్‌పోలియో ద్వారా 13 జిల్లాల్లోని 50,90,130 మంది చిన్నారులకు పోలియోడ్రాప్సు వేయనున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాలలకు 65 లక్షల వ్యాక్సిన్ డోసులను వైద్య ఆరోగ్యశాఖసరపరా చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 37 వేల పోలియోడ్రాప్స్ కేంద్రాలను ఏర్పాటుచేయడమే కాకుండా సుమారు లక్షమంది సిబ్బందిని చుక్కల మందు వేసేందుకు నియమించింది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రతిజిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్లు, ముఖ్యకూడళ్లలో ప్రత్యేక పల్స్‌పోలియో బూత్‌లను ఏర్పాటుచేసింది. కార్యక్రమాన్ని వినియోగించుకోనివారి కోసం సోమవారం పేరామెడికల్, అంగన్‌వాడి, ఆశ సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియోడ్రాప్సు వేసే విధంగా వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది.

# రాష్ట్ర బీజేపీలో కీలక మార్పులు!

**● నేడు విజయవాడలో కోర్ కమిటీ సమావేశం ● పార్టీ పటిష్టత, కొత్త కమిటీ ఏర్పాటుపై విస్తృత చర్చ ● రాష్ట్రంలో రాజకీయ పరిణామాలపై లోతైన అధ్యయనం**

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్న నేపథ్యంలో ఆదివారం విజయవాడలో జరుగుతున్న బీజేపీ కోర్ కమిటీ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. అధికార తెలుగుదేశం పార్టీతో దాదాపు తెగదెంపుల వరకు వచ్చినందున కోర్ కమిటీ భేటీలో వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలున్నాయి. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలు, కేంద్రం నుంచి విడుదలైన నిధుల విషయం ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వైఫల్యం, నియోజకవర్గాలకు పూర్తి స్థాయి కమిటీలు, తాత్కాలిక కమిటీ స్థానంలో పూర్తి స్థాయిలో కొత్త కమిటీ నియామకం వంటి అంశాలు ప్రధానంగా చర్చించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సతీష్‌జీ, రవీంద్రరాజు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హరిబాబు, దగ్గుబాటి పురంధేశ్వరి, కన్నా లక్ష్మీనారాయణ, కావూరి సాంబశివరావు సహా పలువురు కీలకమైన నేతలు పాల్గొననున్నారు. గత నెలలో ఏపీ నేతలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంలోనే రాష్ట్రబీజేపీకి పూర్తిస్థాయి కమిటీ విషయంపై చర్చించారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో కిషన్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన కమిటీనే ఇప్పటికీ కొనసాగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత తాత్కాలిక అధ్యక్షునిగా హరిబాబును నియమించిన అధిష్టానం మిగిలిన కార్యవర్గ సభ్యుల విషయంలో మాత్రం కిషన్‌రెడ్డి కమిటీలో కొనసాగిన వారినే ఉంచారు. అప్పటి నుంచి అనేకమార్లు అధ్యక్ష, బీజేపీ కొత్త కార్యవర్గంపై చర్చలు సాగినప్పటికీ అధిష్టానం పెద్దగా ఆసక్తి చూపలేదు. గత నెలలో ఢిల్లీలో జరిగిన సమావేశంలో కూడా అమిత్ షా ఇదే విషయాన్ని స్పష్టం చేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో అధికార తెలుగుదేశం పార్టీతో మిత్రత్వం కొనసాగినంత కాలం పార్లమెంటు సభ్యుడు హరిబాబు అధ్యక్షుడిగా కొనసాగుతారని ఆయన పేర్కొన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. పురంధేశ్వరి, కన్నా లక్ష్మీనారాయణ, సోము వీర్రాజుకు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో సఖ్యత లేనందునే హరిబాబు ఉండాలంటూ అమిత్ షా చెప్పినట్లు తెలిసింది. ఇప్పుడు తెలుగుదేశం పార్టీతో దాదాపు తెగదెంపులు జరిగే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో కొత్త కమిటీ నియామకంపై ప్రత్యేకంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. రాష్టంలో అమలవుతున్న అనేక పథకాలకు మెజారిటీ నిధులు కేంద్రం ఇచ్చినవేనని బీజేపీ అధిష్టానం చెపుతోంది. వీటిని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడంలో ఏపీ బీజేపీ వైఫల్యం చెందిందనేది అధిష్టానం భావన. దీనిపై కోర్ కమిటీలో విస్తృతంగా చర్చించే అవకాశం ఉన్నట్లు చెపుతున్నారు. వీటిని అధిగమించి ప్రజల్లోకి కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలను తీసుకెళ్లడంతో పాటు రానున్న ఎన్నికల్లో ఒంటరిగా వెళితే ఎలా ఉంటుంది? అనే అంశంపై కూడా చర్చించనున్నారు. రాష్ట్రం లోని 175 నియోజకవర్గాలకు గాను 57 నియోజకవర్గాలకు బీజేపీ తరపున పూర్తి స్థాయిలో కమిటీలు వేశారు. 100 నియోజకవర్గాలకు పూర్తి స్థాయి కమిటీలు వేసినప్పుడే తాను రాష్ట్ర పర్యటనకు వస్తానంటూ అమిత్ షా ఏపీ నేతలకు స్పష్టం చేసినట్లు తెలిసింది. గత కొంతకాలంగా దీనిపై కసరత్తు చేస్తున్న బీజేపీ నేతలు ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో దీనిని పక్కనపడేశారు. తిరిగి కమిటీలు వేసేందుకు కసరత్తును పూర్తి చేయడంపై సమావేశంలో చర్చించనున్నారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై కూడా చర్చ జరగనుంది. రాష్ట్రంలో ఆయా పార్టీల బలాలు, బలహీనతలు చర్చించడంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ నిర్వహించాల్సిన పాత్రపై కూడా చర్చ సాగనుంది.

# జనసేన ఆవిర్భావ సభకు భారీ కసరత్తు

**● 13 జిల్లాల నుంచి భారీ జన సమీకరణాలు ● సభ విజయవంతానికి సీనియర్ నేత గంగాధరానికి బాధ్యతలు ● సభా వేదికపై పవన్ రాజకీయ ప్రకటన**



**అమరావతి, ఆంధ్రప్రభ :** సరికొత్త రాజకీయ విధానాలు, సమీకరణలకు తెరతీసి రాష్ట్ర రాజకీయాల్లో ప్రభంజనం సృష్టిస్తున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. 14న గుంటూరు నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించేందుకు అన్ని శక్తులు కూడగడుతున్నారు. పార్టీ అధినేత జనసేనాని పవన్‌కల్యాణ్ పాల్గొనే ఈ బహిరంగసభకు భారీ ఎత్తున జనాన్ని సమీకరించి, జనసేన సత్తా రుజువు చేయాలని భావిస్తున్నారు. ఇందు కోసం సీనియర్ రాజకీయవేత్త, రెండు సార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న గంగాధరానికి సభను విజయవంతం చేసే బాధ్యతలను అప్పగించిన సంగతి తెలిసిందే. జనసేనాని ప్రతిష్టతకు దీటుగా సభా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభా వేదిక నుంచే జనసేనాని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తారంటున్నారు. పార్టీ వైఖర్నీ కూడా జనసేనాని ప్రకటిస్తారని భావిస్తున్నారు.ఇప్పటికే జేఎఫ్‌సీ కమిటీని ఏర్పాటు చేసి, ప్రత్యేక హోదా,ఇతర సమస్యలపై సమరం చేస్తున్న జనసేనాని బహిరంగ సభ వేదికపై పార్టీ రాజకీయ భవిష్యత్‌ను ప్రకటిస్తారని అంతా ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. అందు కోసం దాదాపు లక్ష మందికి పైగానే జనసమీకరణ చేసే పనిలో పార్టీ శ్రేణులు రేయింబవళ్లు శ్రమిస్తున్నాయి.సభకు హాజరయ్యే కార్యకర్తలు, అభిమానుల భద్రత దృష్ట్యా కృష్ణా,గుంటూరు జిల్లాలకు చెందిన 200 మంది విద్యార్థులకు బేసిక్ లైఫ్ సపోర్ట్(బిఎల్ఎస్) శిక్షణ ఇచ్చారు. ఇందుకు సంబంధించి శిక్షణ పొందిన విద్యార్థులకు నేటి ఉ. 10 గంటలకు విజయవాడలోని సభా సమన్వయ కార్యాలయంలో ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ఉండే [illegible] సభకు వచ్చే వారి సంరక్షణకు విద్యార్థుల [illegible] సన్నద్ధం చేస్తున్నారు. కా[illegible] సాధన కోసం [illegible] ఇప్పటికే పూర్తి స్థాయిలో రాజకీయా ల్లో గడుపుతున్న పవన్‌కల్యాణ్ సభ అనంతరం ఏపీలో విస్తృతంగా పర్యటించబోతున్నారు. ప్రధానంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే విషయమై కేంద్రంలోని పెద్దలతో ఢీకొనేందుకు అన్ని విధాలా సిద్ధమయ్యారు. సభకు జనసేనాని నుంచి ఇప్పటికే అన్ని పార్టీల ప్రముఖులకు ఆహ్వానాలు వెళ్లాయి. సభా వేదిక వద్ద జనసేనాని సమక్షంలో పెద్ద ఎత్తున చేరికలు కూడా ఉంటాయని భావిస్తున్నారు. వివిధ పార్టీల నుంచే కాకుండా పలువురు మాజీలు పవన్‌కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరుతారనే ప్రచారం ఊపందుకున్నది. కాగా సభా వేదిక వద్ద భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. లక్ష మందికి పైగానే కూర్చునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, దగ్గరుండి ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. తాజాగా పార్టీలో చేరిన సీనియర్ రాజకీయ నాయకులు గంగాధరంను సభా ఏర్పాట్ల పర్యవేక్షణ బాధ్యతలను కూడా అప్పగించిన సంగతి తెలిసిందే. పార్టీ శ్రేణులు సభను విజయవంతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రచారం చేయడమే కాకుండా జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు.జిల్లాల వారీగా జనసమీకరణకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఇప్పుడు అందరి దృష్టి జనసేన పార్టీ వైపే ఉందంటున్నారు. పవన్‌కల్యాణ్ పైకి కామ్‌గా ఉంటూనే అంతర్లీనంగా పార్టీ పటిష్టం,బలోపేతానికి పెద్ద ఎత్తున కసరత్తు చేస్తుండడంతో రాజకీయ పార్టీల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇప్పటికే అనేక సమస్యలపై పోరాడుతున్న జనసేనాని అంతర్లీనంగా పార్టీ విస్తరణపైమల్లగుల్లాలు పడుతున్నారు.ఒక వైపు సుశిక్షితులైన నేతలను,కార్యకర్తలను తయారు చేసుకుంటూ ఇంకో వైపు పార్టీ అభివృద్ధికి బాటలు వేస్తూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంటున్నారని అంటున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కూడా రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణకు తెరతీసిన ఘనత జనసేనానిది. తాజాగా ప్రత్యేక హోదా విషయంలో ఆయన చేస్తున్న పోరాటం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. రాష్ట్ర విభజన అంశాలకు సంబంధించి సరికొత్త పంథాలో పోరాడుతున్న జనసేనాని తన దైన శైలిలో అవకాశం ఉందంటున్నారు. ఉద్యమిస్తూ అందర్నీ కూడగట్టే ప్రయత్నంలో ఉన్నారంటున్నారు. ఏదో రాజకీయాల్లోకి వచ్చామని కాకుండా పవన్‌కల్యాణ్ పార్టీని వినూత్నరీతిలో నడిపేందుకు నడుం బిగించారంటు న్నారు.అందుకే తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా చాలా జాగ్రత్తగా ఆలోచిస్తూ, మేధావులతో సంప్రదింపులు జరుపుతూ ముందడుగు వేస్తున్నారు. ఇప్పటికే ఏపీలోని అనంతపురంలో పార్టీ ఆఫీస్‌ను కూడా ఆయన ప్రారంభించారు. విజయవాడలో కూడా పార్టీ సమన్వయ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గుంటూరు సభా వేదిక నుంచే జనసేనాని ఆంధ్ర ప్రజానీకానికి వివరణాత్మక మేసేజ్ ఇస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది. ఈ సభ ద్వారానే కేంద్రాన్ని పెద్ద ఎత్తున ఎండగట్టే అవకాశం ఉందంటున్నారు. అందుకే ముందుగానే కేంద్రంనుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి వచ్చిన నిధుల వివరాలను సేకరించారు. వీటిని విశ్లేషించి,సభ ద్వారా జనసేనాని జనానికి ఒక క్లారిటీ ఇస్తారంటున్నారు. కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని,ఆయన మాట్లాడే అవకాశం కూడా లేకపోలేదంటున్నారు. గత ఎన్నికల సమయంలో బీజేపీకి మద్దతుగా ప్రచారం చేసిన జనసేనాని సభ ద్వారా ఆ పార్టీకి పూర్తి క్లారిటీ ఇస్తారంటున్నారు. అయితే ఆయన విమర్శలు కాకుండా , గణాంకాలు ప్రాతిపదికన కేంద్రాన్ని ఎండగట్టేందుకు జనసేనాని సిద్ధమవుతున్నారు. కేంద్రం విభజన చట్టాన్ని తుంగలో తొక్కిన నేపథ్యంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఇప్పటికే ఎంపీలను కూడగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రంలోని పలు జాతీయ పార్టీల నేతలతో కూడా టచ్‌లో ఉన్నారు.. మొత్తం మీద ఆయన 14న గుంటూరు ఆవిర్భావ సభ తర్వాత ఇరు రాష్ట్రాల్లోను భారీ ఎత్తున పర్యటించి,ప్రజల్ని కలుస్తారని అంటున్నారు.పార్టీ అనుబంధ సంఘాలను కూడా ఏర్పాటు చేసి,పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్న జనసేనాని రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకురావడం తథ్యమంటున్నారు. రానున్న ఎన్నికల్లో రెండు రాష్ట్రాల నుంచి ఎన్నికల బరిలోకి దిగబోతున్న జనసేన పార్టీ ప్రత్యేకించి,ఆంధ్రాలో అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలబెడుతుందంటున్నారు.అయితే కలిసివచ్చే పార్టీలతో కలిసి పని చేయాలని కూడా భావిస్తున్న సంగతి తెలిసిందే..ఇప్పటికే సీపీఐ పార్టీతో పవన్‌ప్రాథమిక చర్చలు జరిపిన సంగతి విదితమే.

# ఆమోదం అవసరమా?

(మొదటిపేజీ తరువాయి)


తప్పించి ఏ భాగం కూడా తిరిగి ఉపయోగపడవు. ఇప్పటికే చాలామంది నేత్ర దానాలు చేస్తున్నారు. ఈనాడు దైవంగా భావించే వ్యక్తులు కానీ, అవతార పురుషులు గాని ఏ ఒక్కరూ కూడా కారుణ్యమరణం లేదా ఆత్మహత్యలకు పాల్పడలేదు. జీవితకాలం పూర్తిగా అనుభవించి ఎంతటి బాధనైనా సహించి మరణిస్తున్నారు. సత్యసాయిబాబాను ఇందుకు ఉదాహర ణగా తీసుకోవచ్చు. అలాగే పేదరికంలో చాలా మంది వైద్యం చేయించుకోలేక ఇళ్ళల్లోనే చనిపోయేవరకు వేచిచూస్తూ మరణానంతరం గౌరవప్రదంగా సంస్కారాలు చేస్తున్నారు. ఇలాంటి మరణాలకు ప్రధాన కారణం ఆసుపత్రి వర్గాలే. వారు వెంటిలేటర్లు ఏర్పాటు చేసి వేల రూపా యలు సంపాదిస్తూ కట్టలేని పరిస్థితుల్లో వార్ని ఇళ్ళకు పంపేస్తున్నారు. రెండు మూడ్రోజులు బాధపడుతూ ఇళ్ళల్లో మరణిస్తున్నారు. దీనికెలాంటి న్యాయస్థానం ఆమోదంలేదు. ఒకసారి ఆసుప త్రిలో చేరాక మరణం వరకు కూడా ఆసుపత్రి వర్గాలే బాధ్యత వహించాలి. మధ్యలో ఏదొక సాకుతో ఇళ్ళకు తిప్పి పంపించ డాన్ని హత్యగానే భావించాలి. ప్రస్తుతం సర్వోన్నత న్యాయ స్థానం ఆశిస్తున్నది గౌరవ ప్రదమైన, ఎలాంటి బాధాలేని మరణించడానికవసరమైన చర్యలు తీసుకోవాలని మాత్రమే సూచించింది.

గౌరవప్రదమైన బాధారహితమైన మరణాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. కేన్సర్ రోగులు ఆఖరి దశలో అత్యంత భయంకరమైన బాధ అనుభవిస్తారు. అవి చూడలేక కుటుంబ సభ్యులు కుమిలిపోతుంటారు. అలాంటి పరిస్తితుల్లో కూడా ప్రస్తుతం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో వార్ని బాధ నుంచి విముక్తి చేసి ప్రశాంత మరణాన్ని కల్పించ డానికి అనేక ఆసుపత్రులు అందుబాటులోకొచ్చాయి. అనేక రకాల ఇలాంటి ఆలోచనలు సమాజంలో అమలౌతున్నాయి. ఈ విధానాలపై న్యాయస్థానం మరొక తీర్పు ఇవ్వాల్సిన అవసరం లేదని పరిశీలకులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా విధివిధానాల్ని ప్రటించాల్సిన అవసరంలేదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ప్రభుత్వమే ముందుకొచ్చి కనీసం జిల్లా అధికారి ఆమోదంతో ఇలాంటి కారుణ్య మరణాలకు అనుమతులివ్వాల్సిన అవసరముంది. సామాన్యులెవరూ కూడా లక్షలు, కోట్లు ఖర్చుపెట్టి హైకోర్టులు, సుప్రింకోర్టులకు వెళ్ళి ఆమోదం కోరాలనుకోవడం హాస్యాస్పదం. దీనిపై దేశ వ్యాప్తంగా తీవ్రస్థాయిలో చర్చలు సాగుతున్నాయి. ఈ విషయంలో న్యాయనిపు ణులు మరోసారి సమాజంలోని ప్రస్తుత పరిస్థితుల్ని అధ్యయనం చేయాల్సిన అవసర ముందని సూచిస్తున్నారు.

## ఆశలు రేపిన రాజీనామాలు...

# ఆవిరైన ఎంపీల కలలు!!

- ఖాళీల భర్తీకి మొగ్గు చూపని మోడీ
- సురేశ్ ప్రభుకు అదనంగా పౌరవిమానయానం
- తెలుగువారే లేని కేంద్రమంత్రి వర్గం



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** తెలుగుదేశం పార్టీ నేతల రాజీనామాలతో కేంద్ర మంత్రివర్గంలో ఏర్పడ్డ ఖాళీలపై ఆశలు పెట్టుకున్న తెలుగు ఎంపీలకు నిరాశే ఎదురవుతోంది. ఈ ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరమే లేకుండా ప్రధాన మంత్రి నిర్ణయం తీసుకున్నారు. వాణిజ్యం మరియు పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేస్తున్న సురేశ్ ప్రభుకు అదనంగా పౌరవిమానయాన శాఖ బాధ్యతల్ని మోడీ అప్పగించారు. తెలుగుదేశం సీనియర్ నేత అశోక్ గజపతి రాజు నిర్వహించిన ఈ శాఖను భర్తీ చేయడానికి కొత్తగా ఎవరినైనా మంత్రివర్గంలోకి తీసుకుంటారని తొలుత భావించారు. అలాగే మరో టీడీపీ నేత వై.ఎస్. చౌదరి (సుజనా చౌదరి) నిర్వహించిన సహాయ మంత్రి బాధ్యతల్ని కూడా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీల్లో ఎవరో ఒకరికి అప్పగించవచ్చని ప్రచారం జరిగింది. అయితే ప్రధాని మోడీ మాత్రం అందరి అంచనాలకు భిన్నంగా నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఖాళీ అయిన రెండు బెర్తులను ఆ రాష్ట్రానికే చెందిన నేతలతో భర్తీ చేస్తారని భావించిన నేతలకు చుక్కెదురైంది. నేరుగా కేబినెట్ ర్యాంక్ పదవి కట్టబెట్టకపోయినా, మార్పులు చేర్పులు చేస్తూ కనీసం సహాయ మంత్రి పదవులైనా ఇవ్వకపోతారా అని రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు కంభంపాటి హరిబాబు, గోకరాజు గంగరాజు ఎంతో ఆశతో ఎదురు చూశారు. తాజా మోడీ తీసుకున్న నిర్ణయంతో కేంద్ర కేబినెట్‌లో నిర్మలా సీతారామన్ మినహా తెలుగువారెవరూ లేకుండా అయ్యారు. నిజానికి నిర్మలా సీతారామన్ తెలుగింటి కోడలే అయినప్పటికీ ఆమె తమిళ ఆడపడచు అన్న విషయం అందరికీ తెలుసు. పైగా కర్ణాటక నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో నేటి కేంద్ర మంత్రివర్గంలో అసలు తెలుగువారే లేకుండా పోయారు.

నిజానికి హరిబాబుకు గత ఏడాది ఆగస్టులో జరిగిన మంత్రివర్గ విస్తరణలోనే చోటు దక్కుతుందని అందరూ భావించారు. అంతేకాదు, ఒక దశలో ఆయన కుటుంబ సభ్యులను సైతం తీసుకొచ్చి ప్రమాణ స్వీకారానికి సిద్ధమయ్యారు. అయితే, ఏ కారణం చేతనో హరిబాబుకు చుక్కెదురైంది. పరాభవంతో ఆయన వెనుదిరగాల్సి వచ్చింది. ఇప్పుడు తెలుగుదేశం నేతల రాజీనామాలతో మరోసారి అవకాశం ఎదురొచ్చిందని భావించారు. రాజీనామాలు ఆమోదం పొందిన మరుక్షణం నుంచే ఏపీ బీజేపీ ఎంపీలిద్దరూ ఎవరికి వారు తమ ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలిసింది. విద్యావంతుడు, సుదీర్ఘకాలం పార్టీకి సేవలందించడం వంటివి కంభంపాటి హరిబాబుకు సానుకూలాంశాలుగా ఉన్నప్పటికీ, ఆయన తెలుగుదేశం పార్టీకి సన్నిహితంగా మెలుగుతారనే ముద్ర ప్రతికూలాంశంగా మారింది. ఇక గోకరాజు గంగరాజు విషయానికొస్తే ఆయనకు ఆరెస్సెస్, విశ్వహిందూ పరిషత్ నేపథ్యం సానుకూలాంశాలే అయినా, వయస్సు అడ్డంకిగా మారే అవకాశం ఉంది. 70 ఏళ్లు వయస్సును ప్రధాని మోడీ కేంద్ర కేబినెట్‌కు అనధికార కటాఫ్‌గా నిర్ణయించినట్టు తెలుస్తోంది.

### పార్లమెంటు సమావేశాల తర్వాత మార్పులు, చేర్పులు!

ప్రస్తుతానికి ఖాళీ అయిన బెర్తులను భర్తీ చేసే ఆలోచనే లేదని స్పష్టమవుతున్నా, పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత తెలుగు నేతలకు కేంద్ర కేబినెట్‌లో చోటు కల్పించవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక హోదా విషయంలో బీజేపీని దోషిగా చిత్రీకరిస్తూ తెలుగుదేశం పార్టీ వ్యవహరించిన తీరు కారణంగా ప్రజల్లో వ్యతిరేక భావన ఏర్పడిందని అధిష్టానం గ్రహించింది. జరిగిన నష్టాన్ని పూడ్చడంతో పాటు, పార్టీని ప్రజల్లోకి మరింత విస్తరించడం కోసం రాష్ట్ర నాయకత్వంలో మార్పులు చేయాలని అధిష్టానం నేతలు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల్లో ఉన్న కంభంపాటి హరిబాబును కేంద్ర సహాయ మంత్రిగా ప్రభుత్వంలోకి తీసుకుని, పార్టీ సారథ్య బాధ్యతల్ని వేరే ఎవరికైనా అప్పగించే అవకాశం ఉందని మరో చర్చ జరుగుతోంది. అలాగే హిమాలయ, ఈశాన్య రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్, దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ విస్తరణకు కృషి చేస్తున్న మురళీధర్ రావు పేర్లను బీజేపీ అధినేతలు కేంద్ర మంత్రి పదవులకు పరిశీలనలో పెట్టినట్టు తెలుస్తోంది. గత విస్తరణలోనే తెలంగాణ నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న ఏకైక నేత దత్తాత్రేయను తొలగించినందున, ఆ ప్రాంతానికే చెందిన మురళీధర్ రావుకు చోటు కల్పించవచ్చని అప్పట్లో అనుకున్నారు.

## ఫైళ్ల క్లియరెన్స్‌లో ఆ ముగ్గురూ టాప్



**అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో:** ఫైళ్ల పరిష్కారంలో మంత్రుల పనితీరును ముఖ్యమంత్రి పరిశీలిస్తున్నారు. మంత్రుల పేషీలకు వచ్చే ఫైళ్ల క్లియరెన్స్‌ల అంశంలో ఎవరెవరు సత్వరమే పరిష్కారాలుచూపుతున్నారనే అంశంపై దృష్టిసారించినప్పుడు మంత్రులు నారాయణ, చినరాజప్ప, లోకేశ్ టాప్‌లో ఉన్నట్లు తెలిసింది. మంత్రివర్గంలో ఎనిమిది మంది మంత్రులు 24 గంటలలోపే తమ వద్దకు వచ్చిన ఫైళ్లను పరిష్కరించారు. మంత్రి నారాయణ, చినరాజప్ప సగటున ఒక ఫైల్‌ను రెండు గంటల్లో పరిష్కరించగా, లోకేశ్ మూడు గంటల్లో పరిష్కరించారు. మంత్రులు, శాఖాధిపతులతో శుక్రవారం సచివాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ఈ వివరాలను వెల్లడించారు. గత నెల రోజుల్లో మంత్రులు తమ వద్దకు వచ్చిన ఫైళ్లను, వాటిని పరిష్కరించిన సమయాన్ని వివరించారు. కాగా, ఈ-ఆఫీసును వేగవంతంగా అమలు చేసే విషయంలో ఎన్ఐసి నుంచి సరైన సహకారం ఉండటం లేదని కొందరు ఉన్నతాధికారులు సిఎం దృష్టికి తీసుకురాగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మిగతా మంత్రుల్లో

నక్కా ఆనందబాబు సగటున మూడు రోజుల తొమ్మిది గంటలు, యనమల నాలుగు రోజులు, కేఈ కృష్ణమూర్తి నాలుగు రోజుల పదిగంటలు, కామినేని ఒక రోజు 19 గంటలు, సోమిరెడ్డి 18 గంటలు, మాణిక్యాలరావు 10 గంటలు, పితాని రెండు రోజుల 11 గంటలు, అమర్‌నాథ్‌రెడ్డి ఒకరోజు 13 గంటలు , అఖిల ప్రియ నాలుగురోజుల 15 గంటలు, అయ్యన్న పాత్రుడు నాలుగు రోజుల 11 గంటలు, జవహర్ రెండు రోజుల 6 గంటల్లో ఒక ఫైలును పరిష్కరించారు. పరిటాల సునీత 11 రోజుల్లో, గంటా 11 రోజుల 22 గంటల్లో ఒక ఫైలును పరిష్కరించారు.

### యూసీలు వెనువెంటనే సమర్పించండి

ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు మారాయని చంద్రబాబు పేర్కొన్నారు. మారిన రాజకియ పరిస్థితుల్లో యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఎప్పటికప్పుడు సమర్పించేలా ఉన్నతాధికారులు చూసుకోవాలని ఆదేశించారు. ఆరు నెలలు, ఏడాదిగా యూసీలు సమర్పించమని తాను వెంటపడుతూనే ఉన్నానన్నారు. ఉపాధి హామీ పనుల్లో మెటీరియల్ కాంపోనెంట్‌ను ఖర్చు చేయడంలో కొన్ని జిల్లాలు వెనుకబడి ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. అన్ని జిల్లాలు మార్చి 31 నాటికి మెటీరియల్ కాంపోనెట్‌ను సమగ్రంగా వినియోగించుకోవాలని కోరారు. భూధార్ ప్రాజెక్టును కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామన్న ఆయన, ఈ నెలఖరుకు పూర్తి చేస్తామన్నారు.

# వైసీపీవి అన్నీ నాటకాలే

- కేసుల మాఫీ కోసం హస్తిన చుట్టూ ప్రదక్షిణ
- ప్రజా సమస్యలు తాకట్టు : మంత్రి యనమల
- స్వంత లాభం కోసం పుట్టిన వైసీపీ : మంత్రి కళా



**అమరావతి, ఆంధ్రప్రభ :** కేవలం స్వార్ధ రాజకీయాల కోసం వైఎస్సార్‌సీపీ ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ఆరోపించారు. నాలుగు సంవత్సరాల పాటు కేంద్రం తీరుతో సంయమనం పాటిస్తూ వచ్చామని, అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో తమ మంత్రులు రాజీనామా చేశారని తెలిపారు. మరో మంత్రి కిమిడి కళా వెంకట్రావుతో కలిసి ఆయన శనివారం వెలగపూడి సచివాలయంలోని ముఖ్యమంత్రి బ్లాకులో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణుడు మాట్లాడుతూ ఢిల్లీకి జగన్ కేసుల్లో ఏ2 అయిన విజయసాయిరెడ్డి చేరిన తర్వాత రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడం అధికమై పోయిందని అన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని ఒకవైపు, ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడం మరోవైపు వైఎస్సార్ సీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే ఊరుకోలేమని, జాతీయ రాజకీయాలను పరిశీలిస్తున్నామని, అవసరాన్ని బట్టి ఒకవైపు ఉద్యమ బాటలో పయనిస్తునే మరోవైపు కఠిన చర్యలకు ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. వైసీపీవి అన్ని నాటకాలనీ రాజకీయ లబ్ధికోసమే వెంపర్లాడుతుందని విమర్శించారు. అధికారం మాటున లక్ష కోట్ల రూపాయలు దోపిడీ చేసి జైలుకు వెళ్ళిన చరిత్ర వైసీపీకి ఉందని మొత్తం 12 కేసులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హామీలతో పాటు పునర్విభజన చట్టాన్ని అమలు కోసం తాము పోరుబాటను ఎంచుకున్నామని అన్నారు. కేంద్రం అసలే ఇవ్వలేదని తాము అనడం లేదని అయితే చట్టప్రకారం రావాల్సిన విషయంలో వివక్ష ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ప్రత్యేక ప్యాకేజీ కోసం ఎదురు చూస్తే ఎనలేని జాప్యం చేశారని అన్నారు. కాగ్, నీతి అయోగ్, ఆర్‌బీఐ వంటి వ్యవస్థలు స్పష్టంగా పేర్కొన్నప్పటికీ కేంద్రం రెవెన్యూ లోటు విషయంలో రాద్ధాంతం చేయడం ఆక్షేపణీయమని ధ్వజమెత్తారు. బీజేపీకి మద్దతుగా వైఎస్సార్ సీపీ మాట్లాడడని ఆయన తప్పుపట్టారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, టిడిపి అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు మాట్లాడుతూ కేవలం స్వలాభం కోసమే వైఎస్సార్‌సీపీ పుట్టిందని విమర్శించారు. 5 కోట్ల మంది అభివృద్ధి, సంక్షేమాన్ని ఆ పార్టీ విస్మరించిందని జగన్ కేసుల్లో ఏ2 అయిన విజయసాయిరెడ్డి కేసుల మాఫీ కోసమే ఢిల్లీలో ఉన్నారని అన్నారు. ఈ.డీ జప్తు చేసిన రూ.34 కోట్లను విడుదల చేయడం కుట్రలో భాగమేనన్నారు. అది ఒక రాజకీయ పార్టీ కాదని అంటూ అక్రమాస్తులను చట్టబద్ధం చేసుకునేందుకు వైఎస్సార్ సీపీ ప్రయత్నిస్తుందని ఆ పార్టీ విధానాలను విమర్శించారు. ఈ సమావేశంలో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ సి.కుటుంబరావు కూడా పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం కోసమే

# కాంగ్రెస్ పోరాటం

- టీడీపీ పునాదులు కదలడంతోనే మంత్రుల రాజీనామా
- పీసీసీ అధ్యక్షుడు రఘువీరా విమర్శ



**మడకశిర, ప్రభ న్యూస్:** రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవంగా భావించే ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో పెద్ద ఎత్తున పోరాటం చేసి కేంద్ర ప్రభుత్వానికి ధీటైనా సమాధానం ఇచ్చామని రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలియజేశారు. శనివారం అనంతపురం జిల్లా మడకశిరలో నీలకంఠ కోల్డ్ స్టోరేజ్ నందు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటానికి దేశంలోనే తొలిసారిగా ఎఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విచ్చేసి ప్రత్యేక హోదాకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి వుంటుందని హామీ ఇచ్చారని, ఐదు కోట్ల మంది ప్రజలు సమైక్యంగా ప్రధాని మెడలు వంచి ప్రత్యేక హోదా సాధించుకోవాలని సూచించడమే కాకుండా 2019లో ప్రధానిగా ప్రత్యేక హోదాపై తొలి సంతకం చేస్తామని సభలో హామీ ఇచ్చారన్నారు. దీంతో రాష్ట్రంలో కదలికలు వచ్చాయన్నారు. హోదా వద్దు అన్న టీడీపీ చెంపలేసుకునే పరిస్థితికి వచ్చిందన్నారు. ఆంధ్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని టీడీపీ ప్రధాని ముందు తాకట్టు పెట్టిన నేపథ్యంలోనే తమ పార్టీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఢిల్లీలో పోరాటం చేశామన్నారు. ఈ పోరాటం విజయవంతం కావడంతోనే రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవం కాపాడడం కోసం కాంగ్రెస్ పార్టీ నిజాయితీగా, నిబద్దతగా వ్యవహరిస్తుందన్న విషయాన్ని తెలియజేశామన్నారు. అంతే కాకుండా పార్లమెంట్ ఆవరణంలోని పోలీస్ స్టేషన్‌లోనే ప్రధానమంత్రిపై కేసు నమోదు చేయించామన్నారు. టీడీపీ పునాదులు కదులుతున్న నేపథ్యంలోనే మంత్రులు రాజీనామా చేశారన్నారు. కేవలం ప్రత్యేక హోదా అంశం ప్రజల్లో బలపడిన నేపథ్యంలో ఆందోళన చేసినారే తప్పా వారి ఆందోళనలో నిజాయితీ లేదని ఆయన పేర్కొన్నారు. రాజీనామాలు కేవలం ఓ డ్రామా మాత్రమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతాయుతంగా పనిచేస్తోందని, ప్రత్యేక హోదా కోసం ఎవరు కలిసి వచ్చినా అందుకు సహకరించడానికి సిద్ధమన్నారు. 2019లో యూపీయే ప్రభుత్వమే వస్తుందన్నారు. థర్డ్ ఫ్రంట్ అన్నది కేవలం బ్లాక్ మెయిల్‌కు తప్పా ఆచరణలో సాధ్యం కాదన్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు ప్రభాకర్ రెడ్డి, నర సింహమూర్తి, దొడ్డయ్య, శ్రీనివాస్ రెడ్డి, టౌన్ కన్వీనర్ నాగేంద్ర, కాంట్రాక్టర్ ఈశ్వర్, అక్రమ్, ఆవుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడులో సాంస్కృతిక కేంద్రం, తెలుగు అకాడమీ ఏర్పాటు

- లింగ్విస్టిక్ మైనార్టీ ఫోరం ఆఫ్ తమిళనాడు ప్రతినిధుల భేటీలో సీఎం చంద్రబాబు హామీ



**అమరావతి, ఆంధ్రప్రభ:** తమిళనాడులో తెలుగు విద్యాభ్యాసం జరిగేలా ఆ ప్రభుత్వాన్ని ఒప్పించే అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సానుకూలత వ్యక్తం చేయడంతోపాటు సాంస్కృతిక కేంద్రం తెలుగు అకాడమీ ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. దీనికి అవసరమైన చర్యలు తీసుకోవల్సిందిగా సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును లింగ్విస్టిక్ మైనార్టీ ఫోరం ఆఫ్ తమిళనాడు అధ్యక్షుడు ప్రొఫెసర్ సీఎంకె రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సచివాలయంలో కలిసింది. ఈ సందర్భంగా తమిళనాడులో తెలుగు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఏటా కోర్టు ఆదేశాల మేరకు తమిళేతరులకు మాతృభాషలో పదోతరగతి పరీక్షలు రాసేందుకు అనుమతిస్తుందని దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని ముఖ్యమంత్రికి వివరించారు. ఇతర భాషావాదులు తమ మాతృభాషలో చదువుకుని పరీక్షలు రాసేందుకు అనుమతించే అంశంపై తమిళనాడు ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించాలని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని అభ్యర్థించింది. తమిళనాడులో తెలుగు, ఉర్ధూతోపాటు ఇతర భాషావాదులు మాతృభాషలో చదువుకునేందుకు తగిన అవకాశాలు లేకపోవడంతోపాటు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన సీఎం ప్రభుత్వపరంగా తమ వంతు సహకారాన్ని అందిస్తామని అదే విధంగా ఫోరం ప్రతినిధులు కూడా ముమ్మర ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ అంశంపై తమిళనాడు ప్రభుత్వంతో మాట్లాడతానని బృందానికి హామీ ఇచ్చారు.

## వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా ఎమ్మెల్సీ రాము సూర్యారావును నియమించండి

- ముఖ్యమంత్రికి కాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం వినతి

**అమరావతి, ఆంధ్రప్రభ:** వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా సామాజికవేత్త, ఎమ్మెల్సీ రాము సూర్యారావు(ఆర్ఎస్ఆర్ మాస్టారు)ను నియమించాలని కాపు ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావి శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం ఆయన సీఎంకు వినతిపత్రం అందజేశారు. గాంధేయవాదిగా అన్ని సామాజిక వర్గాలలోని పేదల పాలిట పెన్నిధిగా , రోగుల పాలిట ఆత్మబంధువుగా రాము సూర్యారావు ప్రజలకు సేవలను అందించారన్నారు. గతంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి చైర్మన్‌గా నియమించిన సమయంలో ఎన్నో అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. అలాంటి సూర్యారావుకు వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి బాధ్యతలు అప్పగించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేదల అభిమానాన్ని పొందాలన్నారు. 2018-19 బడ్జెట్‌లో కాపు కార్పొరేషన్‌కు రూ. 1,000 కోట్లు కేటాయించిందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కాపుల చిరకాల కోరిక అయిన బీసీ రిజర్వేషన్‌ను సత్వరమే ప్రభుత్వ పరిధిలోకి తీసుకు వచ్చి విద్య, ఉద్యోగాలలో అవకాశం కల్పించాలని రావి శ్రీనివాస్ ముఖ్యమంత్రిని కోరారు.

# హోదాపై బాబువన్నీ డ్రామాలే

- కేంద్రమంత్రుల రాజీనామాలు నాటకం
- పాదయాత్రలో ప్రతిపక్షనేత వైఎస్ జగన్



**ఒంగోలు, ప్రభ న్యూస్ బ్యూరో :** ప్రత్యేక హోదా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని వైసీపీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ ఆరోపించారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా చీరాలలో శనివారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లా డారు. ప్రజల నుంచి ఒత్తిడి రావడంతో బీజేపీతో మాట్లాడుకొని కేంద్ర మంత్రులు తూతూ మంత్రంగా రాజీనామాలు చేశారన్నారు. వారు రాజీనామాలు చేస్తారు, చంద్రబాబు మాత్రం ఎన్‌డీఏ కన్వీనర్‌గా కొనసాగుతానంటాడని, ఇదెక్కడ రాజకీయ నీతి అని జగన్ ధ్వజమెత్తారు. అవిశ్వాస తీర్మానానికి టీడీపీ ఎంపీలు మద్దతు పలకరని, ఎంపీలు రాజీనామాలు చేయరని విమర్శించారు. ప్రత్యేకహోదా పోరాటాలను నీరుగార్చడం, వెకిలిగా మాట్లాడటం మాత్రమే చంద్రబాబుకు తెలుసునని ధ్వజమెత్తారు.

గత నాలుగేళ్లుగా చంద్రబాబు అనేక రకాలుగా ప్రజలను మోసగించారన్నారు. ప్రత్యేక హోదా అంశం తెరమీదకు రావడంతో మరోసారి మోసం చేయడానికి సిద్ధమయ్యారన్నారు. జైట్లీ ప్రకటనకు వ్యతిరేకంగా కేంద్ర మంత్రులు రాజీనామాలు చేశారని, అయితే 2016లో జైట్లీ ప్రకటనకు ఇప్పటి ప్రకటనకు తేడా ఏముందని జగన్ ప్రశ్నించారు. రాష్ట్రాన్ని విభజించిన యూపీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ప్లానింగ్ కమిషన్‌కు అప్పుడే ఫైల్ పంపిందని, ఆ ప్లానింగ్ కమిషన్ 2014 డిసెంబర్ 31 వరకు పనిచేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఏడు నెలల పాటు ప్రత్యేక హోదా అంశాన్ని చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. వైసీపీ ధర్నాలు చేసినా, నిరాహార దీక్షలు చేసినా తన అధికారాన్ని ఉపయోగించి అడ్డుకున్న చంద్రబాబు ఇప్పుడు ప్రత్యేక హోదా పోరాటం అంటూ బూటకపు మాటలు చెబుతున్నారని విమర్శించారు.

నిజంగా పోరాడే వారైతే దేశంలో అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికేవారని, ఎంపీల చేత రాజీ నామాలు చేయించేవారన్నారు. అయితే అవేమీ చేయకుండా కేంద్రంతో మాట్లాడుకొని తూతూ మంత్రంగా రాజీనామాల డ్రామాలకు తెర తీశారన్నారు. ఎక్కడాలేని విధంగా అధికార దుర్వినియోగం చేస్తూ అవినీతికి పాల్పడుతూ సామాన్య ప్రజలను నానా రకాలుగా ఇబ్బందులు పాలుచేశాడన్నారు. ఇసుక నుంచి విద్యుత్ వరకు అన్నీ అమ్ముకున్నారని, ఆ డబ్బుతో ఎమ్మెల్యేలను కొన్నారని ఆరోపించారు. ఓటుకు నోటు కేసులో ఆడియో, వీడియో టేపులు దొరికినా ఆ పెద్ద మనిషి మీద కేసులు లేకుండా చేసుకున్నాడన్నారు. అదే ఏ చిన్న ఉద్యోగి లంచం తీసు కుంటూ దొరికినా పెద్దఎత్తున శిక్షి స్తారని జగన్ పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలుండవని, వారిని రాజీనామా చేయించరని, రాజీనా మా చేసి తిరిగి పోటీచేసే దమ్ము ఉందా అని జగన్ ప్రశ్నించా రు. ఇంత మోసపూరితమైన పాలన గతంలో మనం ఎప్పు డైనా చూశామా అని ప్రశ్నించారు. ఎన్నికలలో గెలవడానికి ఏ స్థాయికైనా చంద్రబాబు తెగబడతారని ఎద్దేవా చేశారు.

తాము అధికారంలోకి వస్తే చదువుకునే పిల్లల కోసం నవరత్నాలలో భాగంగా అనేక పథకాలు అమలు చేయబోతున్నానని జగన్ తెలిపారు. ప్రజల మేలు కోసం దివంగత రాజశేఖర్‌రెడ్డి ఒక అడుగు ముందుకేస్తే ఆయన కొడుకుగా రెండడుగులు వేస్తానని చెప్పారు. పాలనలో విశ్వసనీయత తీసుకురావడానికే తాను పాదయాత్ర చేస్తున్నానని, ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోరారు. 2019లో రాజశేఖర్‌రెడ్డి కాలం నాటి స్వర్ణయుగం మళ్లీ తీసుకువస్తానని తెలిపారు. ఈ సభలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, చీరాల ఇన్‌చార్జియడం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# 26న చలో విజయవాడ

- జర్నలిస్టు ఫెడరేషన్ పిలుపు





**కాకినాడ, ప్రభ న్యూస్ బ్యూరో :** ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కోరింది. సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న ఛలో విజయవాడ అంటూ జర్నలిస్టులకు ఫెడరేషన్ పిలుపు నిచ్చింది. శనివారం కాకినాడలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సంర్భంగా పదేళ్ళ ఉత్సవ ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం జర్నలిస్టుల అక్రిడేషన్‌లు, సంక్షేమ నిధి తదితర అంశాలపై కూడా చర్చ నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరమేశ్వర రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు, కార్యదర్శి శ్రీనుబాబు, తదితరులు మాట్లాడారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది సొంతింటి కల నెరవేరుతుందని జర్నలిస్టులు ఆశిస్తున్నారని ఆ ంజనేయులు పేర్కొన్నారు.

ఇది వాస్తవరూపం దాల్చేందుకు సిఎమ్ చొరవతీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 26న పదేళ్ళ పండుగను నిర్వహిస్తున్నామన్నారు. దీనికి మంత్రి కాలువ శ్రీనివాసుల్తో పాటు పలు రాజకీయ పక్షాల ప్రముఖులు హాజరౌతారన్నారు. ఈ కార్యక్రమానికి తనవంతు విరాళంగా శ్రీనుబాబు 50వేలు ప్రకటించారు. కొత్త జిఓ జారీకాకపోవడంతో కమిటీ సూచనలకనుగుణంగా అర్హులందరికీ అక్రిడేషన్‌లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమ నిధిని పునర్వ్యవస్థీకరించి వందకోట్లుకేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇతర రాష్ట్రాల తరహాలో జర్నలిస్టులకు పెన్షన్లు ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. [illegible] జర్నలిస్టులను సన్మానించారు.

ఆంధ్రప్రభ


# ఎవరెవరి దారెటు?

**తుపాన్ ఉద్ధృతి నాలుగైదు గంటల్లో సద్దుమణుగుతుంది. అది సృష్టించిన బీభత్సం నుంచి కోలుకోవడానికి నెలలు పడుతుంది. రాజకీయ తుపాన్ అయితే చెప్పే పనేలేదు. పర్యవసానాలు నిరంతర ప్రభావ కారకాలవుతాయి. దేశ రాజకీయ గమనాన్నే కొత్త బాటలు పట్టిస్తాయి. అది మంచికి కావచ్చు. చెడూ జరగొచ్చు. అది మాత్రం చరిత్రే నిర్ణయిస్తుంది. ఆ నిర్ణయం జరిగేలోపు ఏళ్లూ పూళ్లూ గడిచి తరాలకు తరాలే మారిపోతాయి. ప్రస్తుతం దేశంలోని రాజకీయ స్థితిగతుల్ని బేరీజు వేస్తే కనిపిస్తున్న దృశ్యం ఇది. అంతా ప్రశ్నలమయం. ప్రధానమంత్రి మోడీ తెలుగుదేశం మంత్రుల్ని తన కేబినెట్ నుంచి నిష్క్రమించేలా చేయడం ద్వారా ఏమి సాధించారు? ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తదుపరి అడుగు ఏమై ఉంటుంది? ఇప్పుడిక ఉభయ పార్టీల మిత్రత్వం ఏ స్థాయిలో నడుస్తుంది? తెలుగుదేశం ఎన్డీయే నుంచి పూర్తిగా ఎప్పుడు బైటకొస్తుంది? చంద్రబాబు ఒంటరి ప్రయాణమేనా? మూడో ఫ్రంట్‌తో వెళతారా? అసలా మూడో ఫ్రంట్ ఎవరిది అవుతుంది? తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోనే నడుస్తుందా? కాంగ్రెస్ ఫ్రంట్ నిలుస్తుందా? చంద్రబాబు ఎవరి పక్షాన మొగ్గుతారు? లేక ఆయనే కొత్త బాట పడతారా? ఇన్ని ప్రశ్నల నడుమ భారతదేశ రాజకీయాలు ఒక పెద్ద ప్రశ్నార్థకంగా నిలిచాయి. మహోత్పాతానికి ముందు భీకర నిశ్శబ్దం..రాజకీయ మేలుమలుపుకి ముందు అంతుచిక్కని అయోమయం సహజ పరిణామాలే!**

మొత్తానికి చంద్రబాబు సాధించారు. ప్రధానమంత్రి మోడీ చేత ఫోన్ చేయించుకున్నారు. అందుకు ఆయన చెల్లించిన మూల్యం రెండు కేంద్ర మంత్రి పదవులు. అదేమంత పెద్ద ఖరీదైన మూల్యం కాదు. అయినా ఆయనదే పైచేయి అయింది. ఇద్దరు మంత్రుల చేత రాజీనామాలు చేయించబోతున్నానని బుధవారం రాత్రి చంద్రబాబు మోడీకి చెప్పే ప్రయత్నం చేశారు. కాని ఆయన ఫోన్‌లైన్‌లోకి రాలేదు. ఇక చేసేది లేక ఇద్దరి మంత్రులు రాజీనామాలు చేస్తారని అదే రాత్రి చంద్రబాబు ప్రకటించేశారు. దరిమిలా మర్నాడు ప్రధాని మోడీ రాజస్థాన్ పర్యటనకు వెళ్లొచ్చాక మొదటగా ఆయన చేసిన పని..చంద్రబాబుకి ఫోన్ చేయడం. మిత్రత్వం దాగుడుమూతలు ఆడుతున్న తరుణంలో మోడీ ఒక మిత్రుడికి ఫోన్ చేయడం ఇదే ప్రథమం. ఇక్కడే చంద్రబాబు ఎక్కువ మార్కులు కొట్టేశారు. ఎప్పుడు చేయాల్సిన పని అప్పుడు చేసేస్తే దాని పరిణామాలు మరో రకంగా ఉంటాయి. ఆ రాత్రి చంద్రబాబు ఫోన్ చేసినప్పుడే మోడీ పలికి ఉంటే సింహభాగం మార్కులు మోడీ ఖాతాలో పడి ఉండేవి. దూరం పెరుగుతున్నదని తెలిశాక తక్షణమే నష్ట నివారణ చర్యలు చేపట్టడం ఒక పద్ధతి. అందుకు నేరుగా ఫోన్‌లో సంభాషించి అవతలి వ్యక్తిని శాంతపరచడం లేదా నమ్మించి.. ఒప్పించడం రాజకీయ దౌత్యనీతి అనిపించుకుంటుంది. కాని.. ఆ పెరిగే దూరాన్ని కాలానికి వదిలేసి తన పనేదో తాను చేసుకుపోవడం మోడీ రాజకీయ నీతి. ఇది చాలా ఖరీదైనది. చెల్లించే మూల్యమూ ఎక్కువే. అందుకే చంద్రబాబు ఫోన్‌కి మోడీ బదులు పలకలేదని తెలిసి నివ్వెరపోని ప్రజలు..మోడీ చంద్రబాబుకి ఫోన్ చేశారనగానే..నిద్రలో లేచి ఉలిక్కిపడినంతగా ఒక్కసారి హతాశులయ్యారు.ఏమో..మోడీ సముదాయిస్తారేమో.. చంద్రబాబుని నమ్మించి ఒప్పించి ఢిల్లీకి పిలిపించుకుని అక్కున చేర్చుకుని అడిగినవన్నీ ఇచ్చేసి కథ సుఖాంతం చేస్తారేమోనని లక్షలాది మంది ఆ కాసేపు ఊహించారు. ఎందుకంటే భారతీయులకు..అందులోను తెలుగు ప్రజలకు కలలంటే అమితమైన సెంటిమెంటు. నిత్య జీవితంలో జరగని వాటిని కలల్లో జరిగిపోవాలని కోరుకుంటారు. అందుకే మోడీ ఫోన్ మీద అన్ని ఆశలు. ఆ కాసేపు ప్రధాని మోడీ కదలికల మీద దేశ ప్రజల మనస్సు అంతగా లగ్నం చేశారు. ఆయన్ని నిఘా కళ్లతో అనుక్షణం గమనిస్తున్నారు. కాస్తంత వివాదాస్పదమైతే చాలు..నీటికుండ ఓటిమోత మోగినట్టు ప్రజా పాలకుడు నిఘా నేత్రంలోకి వెళతాడు. ఇదే ప్రజాస్వామ్యపు రీతి. మొత్తం మీద మర్నాడైనా మోడీ స్పందించడం... ముఖ్యంగా చంద్రబాబుకి ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న గౌరవాన్ని ఆయన గుర్తించి కాపాడినట్టయింది. కాని ఏం లాభం? సంక్షోభం అలలై ఉవ్వెత్తున ఎగియక ముందే కలగజేసుకోవాలి. కాని చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుగా సమయం మించిపోయాక ఎవరు ఎవరికి ఫోన్ చేస్తే ఏం ప్రయోజనం? ఆ అలలు చేయాల్సిన అలజడినంతా చేసేసి ఒడ్డుకి చేరాక..మళ్లీ వాటిని వెనక్కి పంపడం సాధ్యమా? ప్రధానమంత్రి మోడీ ఈ పనేదో కొద్ది నెలల ముందో లేక కొద్ది వారాల ముందో చేసి ఉంటే ఇంతటి రాజకీయ సంక్షోభం వచ్చి ఉండేది కాదేమోనన్న రాజకీయాలాభిలాషుల అభిప్రాయాన్ని కరాఖండీగా ఖండించలేని స్థితి ఇది.

ఇంత జరిగాక రాజీనామాలు ఆమోదించనని బెట్టు చేసే స్థితి మోడీ చేతులు దాటిపోయి చాలారోజులైంది. ఆ విషయం మోడీకి తెలీకకాదు. కేవలం మర్యాదపూర్వకంగానే ఆయన చంద్రబాబుని అనునయించే ప్రయత్నం చేశారని అర్థమవుతుంది. రాజకీయాల్లో ఏ క్షణాన పడాల్సిన అడుగు ఆ క్షణంలో కచ్చితంగా పడకపోతే అనర్థాలే మిగులుతాయి. ఆంధ్రప్రదేశ్ విషయంలో మోడీ రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా అది సమయానుకూలంగా జరగలేదు. ఇక ఆతర్వాత దిద్దుకోలేని పరిణామాలు అనివార్యమయ్యాయి. తెలుగుదేశం మంత్రులు ఇద్దరు ఆయన టీమ్ నుంచి పోవడాన్ని మోడీ కోణంలోనుంచి చూస్తే..అది ఆయనకు మైనస్ పాయింటే. ఎన్డీయేలో మోడీ పనితీరుకి ఇది మధ్యంతర తీర్పుగా ప్రజలు భావిస్తున్నారు. పైగా చంద్రబాబుతో బేరీజు వేసి చూసినప్పుడు..మోడీ దూకుడు మనిషని, చంద్రబాబు ఆచితూచి వ్యవహరించే నాయకుడని ఇప్పటికే పడిపోయిన ముద్ర సహజంగానే మోడీ వైపు వేలు చూపుతున్నది. వరాలు అనుగ్రహించడంలో జాప్యం జరగొచ్చు..అడిగినవన్నీ ఇవ్వలేకపోవచ్చు...కాని దేశ ప్రధానిగా మోడి ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి సకాలంలో స్పందించకపోవడం వల్లే వ్యవహారం ఇంతదాకా వచ్చిందన్నది ఒక అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. నాలుగేళ్ల వ్యవధిలోనే మిత్రత్వంలో బీటలు రావడాన్ని భారతదేశ సంకీర్ణ వ్యవస్థలోని లోపాలకు చిహ్నంగా కాకుండా మోడీ భిన్న శైలికి ప్రతిరూపంగా భావించడాన్ని కమలనాథులు పరిశీలనలోకి తీసుకోవాల్సిన అంశంగా నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. ప్రజాస్వామ్యంలో చర్చలే కీలకమని పదేపదే చెప్పుకునే మనమే ఇరవై తొమ్మిదిసార్లు ఒక ముఖ్యమంత్రి ఈ దేశ ప్రధానమంత్రిని కలవాల్సి రావడంలోని ఔచిత్యాన్ని ప్రశ్నించకపోతే ఈ రాజకీయ వైరుధ్యం మున్ముందు మరింత పెరిగిపోతుంది. ఏది ఏమైనా..మోడీ కేబినెట్ నుంచి ఇద్దరు మంత్రులు వెళ్లిపోతే మరో ఇద్దరు వచ్చి భర్తీ చేస్తారు. అదేమంత పెద్ద విషయం కాదు. కాని..ఒక ప్రభుత్వం ఇచ్చిన చట్టబద్ధ హామీలను తదనంతర ప్రభుత్వం నెరవేర్చే చట్టబద్ధమైన మెకానిజం లేకపోవడమే సర్వసత్తాక సార్వభౌమ భారతదేశ దురదృష్టం!

తెలుగుదేశం ఎంతోకాలం ఎన్డీయేలో కొనసాగలేదని పరిణామాలు సూచిస్తున్నాయి. తెలుగుదేశం మంత్రులు రాజీనామాలు చేశాక శుక్రవారం తొలిసారిగా పార్లమెంటు భవనం దగ్గర మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట ప్లకార్డులు పట్టుకుని కనిపించారు.

మంత్రి పదవులనే కవచ కుండలాలు వదిలేశాక వారు అధికార పటాటోపం నుంచి విముక్తమయ్యారు. సాధారణ ఎంపీల్లాగా అందరిలో కలిసిపోయారు. ఏతావాతా ఇక రోజూ పార్లమెంటులో సభనిస్తంభింపచేయడం..ఆ తర్వాత బైట ధర్నాలు మామూలైపోతాయి. ఈలోగా పార్లమెంటు అయిపోతుంది. ఆతర్వాత ఏం చేయాలనేది ప్రశ్న. కాని తెలుగుదేశం తమ నిరసనోద్యమాన్ని సజీవంగా ఉంచడం తప్పనిసరవుతుంది. అందుకే మలి దశలో ఎన్డీయేతో పూర్తిగా తెగదెంపుల అస్త్రాన్ని చంద్రబాబు ప్రయోగించక తప్పదు. ఒక్కసారి అది కూడా అయిపోయాక..ఇక బీజేపీతో పేగుబంధం పూర్తిగా తెగిపోయినట్టే అవుతుంది. అప్పుడొక మిత్రుడి హోదాలో కాకుండా ఒక మమతలాగా..ఒక నవీన్ పట్నాయక్‌లాగా చంద్రబాబూ పరాయి వ్యక్తి అవుతారు. అప్పుడు ఆయన స్వరంలో తీవ్రత పెరుగుతుందా? మళ్లీ ఇదొక



ఆసక్తికరమైన అంశం. స్వతహాగా చంద్రబాబు సంఘర్షణాత్మక రాజకీయాలకు దూరంగా ఉండే ప్రయత్నమే చేస్తారు. చూసిచూసి ఆయన ఆవేశంగా మాట్లాడబోయినా అందులో ఆవేశం పాలు కన్నా ఆవేదన పాలే ఎక్కువగా ధ్వనిస్తుంటుంది. ఆలాంటిది ప్రధానమంత్రి దగ్గరకు వెళ్లాల్సివచ్చినా ఆయన తీరులో మార్పేమీ ఉండకపోవచ్చు. కాని మళ్లీ వాళ్లిద్దరి మధ్యా ముఖాముఖి సమావేశం జరుగుతుందా? అందుకు ఉన్న అవకాశాలేమిటి? సమయ సందర్భాలెప్పుడు రావచ్చు? వీటికి మాత్రం సమాధానాలు దొరకడం లేదు. చంద్రబాబు స్వయంగా కార్యాచరణలోకి దిగాల్సిన అవసరమొస్తే అప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాల కోసం తానెంతవరకు వెళ్లాల్సివచ్చినా వెళతానని చంద్రబాబు పదేపదే చెప్పడంలోని ఆంతర్యం ఇదేకావచ్చు.

ప్రధాని మోడీ పాలనలో తొలి టరమ్‌లోనే తృతీయ ఫ్రంట్ ఊసుల గుసగుసలు మొదలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఈ దిశగా కసరత్తులో తలమునకలై ఉంది. వచ్చే మంగళవారం భారీ సమావేశానికి సోనియాగాంధీ నడుం బిగించారు. పార్టీ బాధ్యతల్ని కొడుక్కి అప్పగించాక మళ్లీ కార్యరంగంలోకి దూకడం ద్వారా తృతీయ ఫ్రంట్ మీద ఆమె ఎంత సీరియస్‌గా ఉన్నారో ఇట్టే అర్థమవుతున్నది. దానికి ఎవరెవరు హాజరవుతారన్నది అందర్నీ ఆకర్షిస్తున్నది. తెలుగుదేశం దీనికి హాజరవుతుందన్న ఊహాగానాలు విస్తృతంగా వ్యాపిస్తున్నాయి. చంద్రబాబు కేంద్రం నుంచి దూరంగా జరిగిన నేపథ్యంలో ఆయనకు జాతీయస్థాయిలో ఒక సురక్షిత గొడుగు అవసరమన్న భావన వ్యక్తమవుతున్నది. మరోవంక తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తృతీయ ఫ్రంట్ కోసం రంగంలోకి దిగుతున్నందున అందరిలో ఆసక్తి ద్విగుణీకృతమైంది. ఆయన చంద్రబాబుతోనూ మాట్లాడతానని ప్రకటించి మరింత ఉద్విగ్నతను పెంచారు. బీజేపీయేతర పక్షాలకు రెండు ఫ్రంట్‌ల ప్రత్యామ్నాయం ఉన్నట్టు లెక్క. అయితే జాతీయస్థాయిలో బీజేపీకి కళ్లెం వేయాలంటే రెండు ఫ్రంట్‌లు అవసరమా అన్న ప్రశ్న పలువురి మదిని తొలుస్తున్నది. ఇలాంటి ఫ్రంట్‌లు గతంలో చేదు అనుభవాలు మిగిల్చిన సంగతి తెలిసిందే. ఈసారి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రంగప్రవేశం చేస్తుండటంతో ఈ మొత్తం భావనకే కొత్త ఊపు వచ్చినట్టయింది. ఉద్యమ నేతగా కేసీఆర్‌కున్న వ్యూహరచనా చమత్కృతిని యావద్దేశ ప్రజలు తెలంగాణ ఉద్యమ సమయంలో చూశారు. ఆతర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాక ఆయన ఆలోచనా విధానం సర్వత్రా ఆకర్షణీయ అస్త్రంగా మారింది. దానికితోడు దేశస్థాయిలో ఆయన లేవనెత్తుతున్న అంశాలు..సంధిస్తున్న బాణాలు అందర్నీ ఆలోచింపచేసేవిగా ఉంటున్నాయి. సహజంగానే దేశంలోని వివిధ పార్టీల్లో ఇది చర్చనీయాంశంగా మారింది. ఆయన నడుం బిగించి కార్యరంగంలోకి దూకితే ఎవరెవరు ఆయన వైపు సమీకృతమవుతారో ఒక అవగాహన వస్తుంది. అటు సోనియాగాంధీకైనా, ఇటు కేసీఆర్‌కైనా మమతా బెనర్జీలాంటి వాళ్ల అవసరం చాలా ముఖ్యం. కాని వామపక్షాలు-మమతా బెనర్జీ ముడి ఎవ్వరికైనా చిక్కుముడిగానే మిగులుతుంది. ఏతావాతా ఈసారి జాతీయస్థాయి బీజేపీయేతర పక్షాలకు ఒక అగ్నిపరీక్షే. కాంగ్రెస్ సారథ్యంలో వెళ్లాలా? కేసీఆర్ వైపు నడవాలా? అన్నది వారి రాజకీయ వ్యూహరచనా సామర్థ్యానికి సవాలుగా నిలుస్తుంది.

ఇదంతా ఒక ఎత్తయితే..జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న అలజడి రెండు తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నది. ఆయనలో రాజకీయ అమాయకత్వం కనిపిస్తున్నదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నా..ఆయన మాత్రం వాటికన్నింటికీ అతీతంగా ఒక్కోసారి మెరుపు నిర్ణయాలతో అందర్నీ ఆకట్టుకుంటున్నారు. కేసీఆర్ జాతీయ రాజకీయాలపై దృష్టి సారిస్తానని ప్రకటించిన తర్వాత పవన్ కల్యాణే స్వచ్ఛందంగా ముందొకొచ్చి ఆయనకు మద్దతు ప్రకటించారు. తద్వారా పవన్ తన యుద్ధం ఎవరిమీదో నేరుగా చెప్పకుండా చెప్పేశారు. ఆయనిప్పుడు బీజేపీకి చాలా దూరం వెళ్లిపోయారని స్పష్టమవుతున్నది.

కాని తెలుగుదేశానికి ఎంత దగ్గరగా ఉన్నారు? లేదా ఎంత దూరంగా ఉన్నారన్నది మాత్రం బయటపడకుండా జాగ్రత్త పడుతున్నట్టు అనిపిస్తున్నది.

ఆయనలోని అపరిచిత పవన్ కల్యాణ్ ఆయనకు ఆత్మబోధ చేస్తున్నట్టే కనిపిస్తున్నాడు. తనను అటు బీజేపీ, ఇటు తెలుగుదేశం పార్టీలు కరివేపాకులా వాడుకుని వదిలేశాయన్న భావనలో ఉన్నారు. మొన్నామధ్య మీడియాతో ఇష్టాగోష్టిలో ఆయన చాలా కలుపుగోలుగా మాట్లాడారు. చాలా సమయం గడిపారు. తన కార్యాచరణ, తన భావి కర్తవ్యం గురించి మీడియా మనోగతాన్ని తెలుసుకునే నిశిత ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో తన స్థాయి గురించి ఆయన నిర్మొహమాటంగా తన ఆలోచనలు పంచుకున్నారు. తృతీయ ఫ్రంట్ ప్రస్తావన వచ్చినప్పుడు..తాను చొరవ తీసుకునే విషయమై మాట్లాడుతూ..మమతా బెనర్జీ దగ్గరకు తాను వెళ్లి ఆమెను ఎలా కన్విన్స్ చేయగలనని అన్నారు. తన గురించి ఆమెకు ఏమి తెలుస్తుంది? అని కూడా తన మనస్సులో మాట బైటపెట్టారు. పవన్ కల్యాణ్ అందరు రాజకీయ నాయకుల్లాగా నేల విడిచి సాము చేయడం లేదని స్పష్టమవుతున్నది. అంతేకాదు. ఆయనొక రాజకీయ యదార్థవాదిలా పరిణతి చెందుతున్నారు. ప్రస్తుత అమానవీయ రాజకీయ రణరంగంలో తానొక మానవీయ రాజకీయ సంప్రదాయాన్ని చొప్పించే ప్రయత్నంలో ఉన్నారు. కేసీఆర్‌తో కలిసి వెళితే మరి చంద్రబాబుతో కటీఫ్ చెబుతారా? లేక చంద్రబాబుతో కలిసే కేసీఆర్‌తో నడుస్తారా? రకరకాల కారణాల వల్ల ఆయనకు భవబంధాలున్నాయి. బీజేపీతో అవి తెంచేసుకున్నట్టే. కాని తెలుగుదేశంతోనే ఇంకా మీమాంస ఉంది. తృతీయ ఫ్రంట్ విషయంలో ఆయనకు అంతగా అయోమయం లేదుగాని ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక హోదా అంశం మీద పోరాటంలోనే ఆయనింకా ఇదమిద్ధంగా తేల్చుకున్నట్టు లేరు. ఆయనకు రకరకాల వర్గాల నుంచి అందుతున్న సలహాలు, సూచనలు ఆయన్ని సందిగ్ధావస్థలో ఉంచుతున్నాయా అనిపిస్తుంది. ఎన్నటికీ రాని హోదా కోసం ప్రజల సెంటిమెంట్ వెనకాలే తానూ పరుగెత్తడమా? లేక కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం పోరాడటమా? మొదటి బాటలో వెళితే ప్రజలు ఆమోదిస్తారా? రెండో బాటలో వెళితే రాష్ట్రానికి పూర్తిగా న్యాయం చేసినట్టవుతుందా? ఈ సందేహాల నడుమ ఆయన వచ్చే బుధవారం పార్టీ ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నారు. అందులో నూటికి నూరు శాతం స్పష్టత ఇచ్చేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. జనసేన విధి విధానాలతో పాటు రాష్ట్ర, దేశ రాజకీయాల్లో పవన్ కల్యాణ్ పాత్ర మీద కూడా స్పష్టత ఇచ్చే ఉద్దేశంతో ఆయన సన్నద్ధమవుతున్నారు!

**- వయ్యాస్సా రెస్**

## కృత్రిమ శ్వాస అమానుషం!



దీర్ఘ కాలిక రోగాల వల్ల బాధ పడుతున్న వారికి మరణించే స్వేచ్ఛను ఇవ్వొచ్చునంటూ సుప్రీంకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పునకు దేశంలో పలువర్గాల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. ఎంతకాలం బతుకుతారో తెలియని రోగులను కృత్రిమ శ్వాస ద్వారా బతికించడం అమానుషమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీఅధ్యక్షుడు కెకే అగర్వాల్ అన్నారు. ప్రాణం తీసుకుంటాం అనుమతి ఇవ్వండి ఏ ప్రభుత్వమూ, లేదా వైద్య సంస్థా అనుమతి ఇవ్వదు. కృత్రిమ శ్వాసనే ఇటీవల కాలంలో వెంటిలేటర్స్‌ని అమర్చడం అంటున్నారు. శరీరంలో అన్ని అంగాలు చచ్చుబడినా ఆ రోగికి వైద్యం చేస్తుంటారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బు కోసం అలా వైద్యం చేస్తారనే ప్రచారంఉంది కానీ, కొన ఊపిరి ప్రాణం ఉన్నారోగిని అలా వదిలివేయడం వైద్య శాస్త్రం ప్రకారం ఒప్పదు. అందుకే వైద్యం చేస్తుంటారు.


అయితే, వైద్యులు అందించే మందులు అందక రోగులు మరణయాతన పడుతుంటారు. మరణ రోగులకు అయిన వారే సేవలందించ లేక, ఎప్పుడు పోతారోనని విసుక్కునే వారిని మనం చూస్తుంటాం. అయితే,ఏ ఒక్కరికీ కూడా బలవంతంగాప్రాణం తీసుకునే హక్కు లేదు. అలాగే, ప్రాణం తీసే హక్కు కూడాలేదు. అందుకే, సర్వోన్నత న్యాయస్థానం అనుమతికోరుతూ ఒక సేవా సంస్థ పిటిషన్ దాఖలు చేసింది.దానిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు అందుకు అనుమతి ఇస్తూ కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. మొత్తం మీద బలవంతంగా ప్రాణం తీసుకోవడం ఎంత తప్పో,ప్రాణాన్ని నిలబెట్టడంకూడా అంతే తప్పు అని వైద్యరంగంలో నిపుణులు పేర్కొంటున్నారు.

## మంచు తుపానులో వేణ్ణీళ్ళు

ఎండలు ముదిరి తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు అప్పుడే ఉక్కపోతతో సతమత మవుతున్నారు. నిమ్మకాయ సోడా, కొబ్బరి బొండాలు, పుచ్చకాయల దుకాణాల వద్ద జనం బారులు తీరుతున్నారు. మరోవంక అమెరికాలోని న్యూజెర్సీ, మసాచ్యూట్స్, న్యూహాంపైర్ రాష్ట్రాల్లో మంచు తుపాను దెబ్బకు ప్రజలు అల్లాడిపోతున్నారు. యూరప్‌పై గత వారం పంజా విసిరిన మంచు తుపాను ఇప్పుడు అమెరికాలోని పలు రాష్ట్రాలను వణికిస్తోంది. మంచు తుపాను కారణంగా విద్యుత్, టెలిఫోన్ సౌకర్యాలు స్తంభించాయి. దాదాపు మూడు వేల విమాన సర్వీసులు



రద్దయ్యాయి. అంతే సంఖ్యలో విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల వేడి నీరు కాచుకుందామన్న లేక జనం చలితో వణుకుతున్నారు. పది లక్షల మందిపైగా విద్యుత్ సౌకర్యం లేక అల్లాడిపోతున్నట్టు ప్రభుత్వ సమాచారం.ఇలాంటి సమయాల్లో నీళ్లు, పాల వ్యాపారాలు చేసేవారు పెరిగిపోతుంటారు. వేడి నీటి వ్యాపారం చేస్తున్న వారు కొందరైతే, పాలను బ్లాక్ చేసి అమ్ముకుంటున్నవారు మరికొందరు. ఎంత అగ్రరాజ్యమైన ఇలాంటి పరిస్థితుల్లో అందరికీ సకాలంలో సరైనసౌకర్యాలు అందించడం కష్టమే. మంచుతుపాను కొందరికి ప్రాణసంకటంగా మారగా,మరికొందరికి వరంగా మారింది. మంచు తుపానులో చిక్కుకుని పోయిన తమ వాహనాలు ఎక్కడున్నాయో తెలియక జనం తికమక పడుతున్నారు. తిరిగి మామూలు పరిస్థితి నెలకొనడానికి ఎన్నిరోజులు పడుతుందో నని ఆందోళన చెందుతున్న ప్రజలకు మరో వారంరోజుల్లో మరో తుపాను ముంచుకొస్తోందన్నది పిడుగులాంటి వార్తే.



ఆదిత్యహృదయం


వి.ఎస్.ఆదిత్య

# నాన్న స్కూటర్ సినిమాలకు డబ్బులిచ్చింది..

ఇది నిజానికి సీరియల్ కాదు, ఆర్టికల్, కానీ, నా జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలని అవి జరిగిన వరుస క్రమంలోనే రాయడం సముచితం అని భావించి అప్పుడప్పుడు సీరియల్‌లా రాస్తున్నారు.

ఉగాది శుభాకాంక్షలతో... మీ రావి కొండలరావు అనే కార్డు కూడా రావడం మానేసి పదేళ్లయ్యింది. కానీ నేను మాత్రం బృందావనం సినిమా తిరుపతి షూటింగ్ పూర్తయిన దగ్గర్నుంచి ఒక ఎనిమిది నెలలపాటు ప్రతివారం ఒక ఉత్తరం రాసి పోస్ట్ చేసేవాణ్ణి రావి కొండలరావు గారికి. ఆయనలా క్లుప్తంగా ఒక్క వాక్యం రాసి పోస్టుకార్డు కాదు. ప్రతివారం పేజీలకు పేజీలు. నేనెందుకు దర్శకుణ్ణి అవ్వాలని చిన్నప్పట్నుంచి అభిలషించాను, ఏయే సినిమాలు చూసి ఏ దర్శకుల శైలి ఎలా పసిగట్టాను? ఇలా రకరకాల సినిమా టాపిక్స్ మీద. అసలాయన చదివారో లేదో కూడా తెలీదు. అప్పటికి నేనింకా మా ఇంట్లో చెప్పలేదు. ఇంట్లో తెలీదు కాబట్టి అమ్మా వాళ్లు నేనేదో ఎమ్మెస్సీలో జాయిన్ అవుతాననో, సివిల్స్ రాస్తాననో అనుకుంటూ ఉండేవాళ్లు. విజయవాడ ఆల్ ఇండియా రేడియోలో ఇంటర్మీడియట్ నుంచి వరుసగా నెలకో ప్రోగ్రామ్ నాటికో, నాటకమో, కదంబ కార్యక్రమమో, డాక్యుమెంటరీనో, పండగలు, పబ్బాల వంటి స్పెషల్ షోసో ఏదో ఒకటి రాస్తుండేవాణ్ణి. ఇంచుమించు కొన్ని వందల సినిమాలు నేను చూడడానికి కావల్సిన పాకెట్‌మనీ నాకు విజయవాడ రేడియో స్టేషనే ఇచ్చింది. సెకండ్ ప్లేస్‌లో మా నాన్న బజాజ్ చేతక్ ఇచ్చింది. అదో చిన్న పిట్టకథ. మా నాన్నకి స్కూటర్ నడపడం సరిగా రాదు కానీ ఒక బజాజ్ చేతక్ కొన్నారు. నేను ఇంటర్‌లో ఉండగా. నేను తెగ వాడేసే వాడిని ఆ బండిని. మా నాన్నని బ్యాంకు దగ్గర డ్రాప్ చేస్తే చాలు. అలా ఆ టైమ్‌లో ఆ చేతక్ రిపేరుకి వచ్చిందని చెప్పి, మెకానిక్ దగ్గరకి తీస్కెళ్లడం, పెట్రోలుకని అయిదు లీటర్లకి డబ్బులు తీసుకుని నాలుగున్నర లీటర్లు కొట్టించడం. అస్తమానూ కూలెంట్ ఆయిల్ మార్చాలని చెప్పి దాని డబ్బులు తీస్కోవడం - అలా ఆ బజాజ్ చేతక్ నా పాలిట మహారాజ పోషకురాలై పోయింది. ఈ డబ్బులన్నీ చాలా నిజాయితీగా, నిబద్ధతగా సినిమాలు చూడడానికి మాత్రమే ఖర్చు చేశాను. ఇంకే అలవాటు లేదు నాకు. అలా ఒకానొక కాలంలో ఆలిండియా రేడియో, నాన్న స్కూటర్‌ల పుణ్యమా అని మద్రాలు వెళ్లి స్టూడియోలు, ఆఫీసుల చుట్టూ తిరిగి రావడం, రావికొండల రావు గారింటికి వెళ్లి వస్తూ ఉండడం, ఒక్కోసారి రాత్రి ట్రైను మిస్సయితే, మద్రాసు రైల్వేస్టేషన్‌లో మంచం అద్దెకు తీసుకుని పడుకోవడం. ఇలా ప్రయాణాలకీ, ప్రయత్నాలకీ ఖర్చు రేడియోలో నేను రాసిన నాటకాలు, ఇంట్లో నేనాడిన నాటకాలూను. పైగా డిగ్రీ తర్వాత కాబట్టి ఏ మద్రాసు ట్రిప్ పేరైనా ఏదో ఒక పుణ్యక్షేత్రం అన్నమాట. మొక్కు తీర్చుకోడానికి వెళ్లొస్తానని వెళ్లడం. చివరికి మా అమ్మ ఒకరోజు అనేసింది. “డిగ్రీ పాసవ్వడం అంత కష్టం ఏమిట్రా? ఇన్ని మొక్కులు మొక్కుకున్నావ్” అని, నీకేం తెల్సు? మీ రోజుల్లో లాంటి చదువులు కావు మావి అని బుకాయించేశాను.

ఇదిలా ఉండగా, తొమ్మిది నెలల తర్వాత రావికొండలరావు గారు చిన్న బాంబ్ పేల్చారు. అప్పటికే బృందావనం సినిమా రిలీజ్ అయింది. మంచి హిట్ అయింది. తర్వాత చిత్రం చర్చల్లో ఉన్నారని తెలిసింది. మరోపక్క రజనీకాంత్, పి.




వాసు కాంబినేషన్‌లో ఉళైప్పాళి అనే తమిళ చిత్రం ముహూర్తం జరిగిం[illegible]గులో రెండో సినిమా నందమూరి బాలకృ[illegible] హీరోగా [illegible] సింగీతం గారే దర్శ[illegible] పంతం, కసి, పట్టుదల, కోపం, బాధ, అసహనం అన్నీ బీపీ పెరిగినట్టు, షుగర్ లెవెల్స్ పడిపోయినట్టు పెరుగుతున్నాయ్, తగ్గుతున్నాయ్. నిర్మాణ సంచాలకులు రావికొండలరావు గారేగా, ఈయనెందుకు నన్ను అసిస్టెంట్ డైరెక్టర్‌గా తీసుకోలేకపోతున్నారని. ఆయనకి నామీద, మా కుటుంబం [illegible] కన్‌సర్న్ తోనే నిర్ణయం తీసుకోవడం [illegible] కొన్నేళ్లకి నాకర్థమైంది. [illegible]సుకుని ఉండగలవా అనడిగారు ఓ అనేశాను. జీతం ఉండదు మొదటి సినిమాకి. పేరేస్తాం. మరీ నీ ఖర్చులు నువ్వే పెట్టుకోగలవా అనడిగారు. ఓహో అనేశాను. నీవల్ల నాకు కించిత్తు చెడ్డపేరు రాకుండా ఓరిమితో పనిచేయగలవా అనడిగారు. ఓహోహో... అనేశాను.

అయితే సింగీతం గారికి పరిచయం చేస్తాను రా అన్నారు. అదే భైరవ ద్వీపం సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పరిచయం. సింగీతం గారు బీఎస్సీ చదివి హాయిగా ఉద్యోగం చేసుకోక ఎప్పుడెలా ఉంటుందో తెలీని రిస్కీ ప్రొఫెషన్ ఎందుకండీ అన్నారు. నేనింకో జాబ్‌కి పనికిరానండి. సరిగ్గా చదవలేదు. చూసినవన్నీ సినిమాలే. అందుకని కష్టమో, నష్టమో ఈ రంగంలోనే ప్రయత్నిద్దాం అనుకుంటున్నాను అన్నారు. టక్కున రావికొండలరావు గారు అందుకని, ఇతని హ్యాండ్ రైటింగ్ బావుంటుందండీ, నాకు పుంఖాను పుంఖాలుగా ఉత్తరాలు రాశాడు అన్నారు. అప్పట్లో అసిస్టెంట్ డైరెక్టర్‌కి చేతివ్రాత బావుండడం ఒక కంపల్సరీ క్వాలిఫికేషన్. ఇప్పుడు తెలుగు రాయడం కాదు, సరిగా చదవడం కూడా రాదు తొంభైశాతం మంది తెలుగు అసిస్టెంట్ డైరెక్టర్స్‌కి. సరే, సింగీతం గారు ఒక రోజు తర్వాత భైరవ ద్వీపం టీమ్‌లో తీసుకుందాం అన్నారు. ఇంటికెళ్లి మీ నాన్నగారితో నో అబ్జెక్షన్ లెటర్ ఒకటి తేవయ్యా నువ్వు. అలాగే ఈ సినిమా అయ్యేంతవరకూ నీ ఖర్చులన్నీ నువ్వే చూసుకోవాలి. నీకు సగంలో మోజు తీరిపోయో, కష్టంకలిగో ఇండస్ట్రీ నుంచి ఇంటికెళ్లిపోతేమేం వేరేవాణ్ణి డబ్బిచ్చి పెట్టుకోవాలిగా అన్నారు రావికొండల రావు గారు. అలాంటిదేమీ ఉండదండి. నేను ఇండస్ట్రీని వదిలి ఇంటికెళ్లే ప్రసక్తే లేదు అన్నాన్నేను. లోపల విపరీతమైన ఎగ్జైట్‌మెంట్ ఉండి, బైటకి చాలా సాదాసీదాగా, మామూలుగా, మర్యాదగా ఉండడం చాలాకష్టం. ఆ రోజు రావికొండల రావు గారి దగ్గర నా పరిస్థితి అదే. తొలిప్రేమ సినిమాలో చెట్టుతొర్రలో పవన్ కళ్యాణ్ డ్యాన్స్ చేసే సీన్ అందుకే నాకు చాలా ఇష్టం. ఆ ఎమోషన్ నా లైఫ్‌లో నేను ఈ సందర్భంలో ప్రప్రథమంగా అనుభవించాను కాబట్టి. సింగీతం గారి, రావికొండలరావు గారి అనుమతులతో నా సినిమా జీవితం ప్రారంభమైంది. ఇంటికొచ్చి మొదటిసారి చెప్పాన్నేను సినిమాల్లో ట్రై చేశాను. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఆపర్చ్యూనిటీ వచ్చింది. నా కెరీర్ సినిమాలే అని. మా అమ్మ ససేమిరా అంది. నాన్న నుంచి పెద్దగా ప్రతిఘటన లేదు. కానీ ఖర్చులు భరించాలన్న కండిషనే ఆయన్ని ఆలోచనలో పడేసింది. అయిదుగురం ఒక్క దగ్గర ఉంటేనే అయిదు వేళ్లూ నోట్లోకెళ్లే మధ్యతరగతి కుటుంబం. ఏ ఒక్కడు బైటకెళ్లినా ఒక్కోవేలు నోటిదాకా వెళ్లదు. అందుకే అప్పట్లో మా ఫ్యామిలీలో బాండింగ్ చాలా స్ట్రాంగ్‌గా ఉండేది. నాన్నని ఒక్కరూపాయి అడగనని ప్రామిస్ చేశాను. అయినా, ఆయన కూడా ప్రామిస్ చేశారు నెలకి కచ్చితంగా ఒక వెయ్యి రూపాయలైనా పంపుతానని. ఒక సినిమా అయ్యేదాకా. ఇలా పరస్పర వాగ్దానాలతో నాక్కావల్సి వచ్చినట్టుగా రావికొండలరావు గారికి నాన్నతో ఉత్తరం రాయించాను. అప్పట్నుంచి నా సినిమా కష్టాలు మొదలు...

# భారత్ - ఫ్రాన్స్ 14 ఒప్పందాలు




● సుస్థిర దేశాల వారసులం ● భారత్- ఫ్రాన్స్ సంబంధాలపై ప్రధాని మోడీ వ్యాఖ్య ● రక్షణ, అణు విద్యుత్ రంగాల్లో పరస్పర సహకారం ● సౌరవిద్యుత్ రంగంలో సాంకేతిక బదలాయింపు

**న్యూఢిల్లీ:** స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఫ్రాన్స్‌లోనే కాకుండా భారతదేశ రాజ్యాంగంలో లోతుగా వేళ్లూనుకున్నాయని ప్రధాని మంత్రి నరేంద్రమోడీ అన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు 20 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో మోడీ శనివారం సమావేశం అయ్యారు. వ్యూహాత్మక భాగస్వామ్య బంధాన్ని మరింత ఉన్నత స్థాయిలకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా సంకల్పించారు. ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛ, చట్టాలు, మానవహక్కులను గౌరవించడం వంటి అంశాల్లో ఆలోచనలు పంచుకోవడం ద్వారా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఫ్రెంచ్, భారత్ సైనికుల త్యాగాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. నవంబర్ 11న ప్యారిస్‌లో జరగనున్న మొదటి ప్రపంచయుద్ధం శత వార్షికోత్సవ వేడుకల్లో ఇండియా పాల్గొంటుందని మోడీ చెప్పారు. ప్రపంచశాంతికి భారత ప్రధాని కృషిని ప్రశంసించిన మేక్రాన్ మోడీకి ధన్యవాదాలు తెలిపారు. ద్వైపాక్షిక చర్చల అనంతరం సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. ఫ్రాన్స్ ప్రజలు, భారతీయులు ఇరు దేశాల గురించి మరింత తెలుసుకోవాలని ఆకాంక్షించారు. మనం రెండు సుస్థిర దేశాల వారసులమన్నారు. ఉభయ దేశాల మధ్య వ్యూహాత్మక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. రక్షణ, భద్రత, అణువిద్యుత్ వంటి కీలక రంగాలతో సహా మొత్తం 14 ఒప్పందాలపై ఇరువురు ప్రధానులు సంతకాలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలు, సవాళ్లపై సుదీర్ఘంగా చర్చించారు. హిందూ మహాసముద్రంలో విస్తృత సహకారానికి ఉమ్మడి వ్యూహాత్మక విజన్‌ను మోడీ ప్రకటించారు. ప్రజల మధ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు మైగ్రెంట్ మొబిలిటీ, పార్టనర్‌షిప్‌ను పటిష్టపరిచేందుకు భారతదేశం సిద్ధంగా ఉందన్నారు. భారతదేశం, ఫ్రాన్స్ రక్షణ సహకారంలో నూతన చరిత్రను ఆవిష్కరించే ఒప్పందం కుదరడం హర్షణీయమన్నారు. ఇరు దేశాల యువత ఒకరి దేశం గురించి మరొకరు తెలుసుకోవడం అవసరమని, దీని కోసం తాము రెండు ఒప్పందాలను కుదుర్చుకున్నామని చెప్పారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్‌కు ఆహ్వానం పలికారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య రక్షణ సహకారానికి కీలక ప్రాధాన్యం ఉందన్నారు. ఉగ్రవాదం, రెచ్చగొట్టి, ప్రేరేపించడం వంటి ముప్పులతో పోరాడాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు తెలిపారు. 18,19 శతాబ్దాల్లో ఫ్రెంచ్ రచయితలు భారత్ పర్యటించి, ఎంతో స్ఫూర్తి పొందారని గుర్తుచేశారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక విశ్వాసం పాదుకొల్పేలా సమాచార భద్రతకు ఒప్పందం జరిగింది. రక్షణ మంత్రుల స్థాయిలో వార్షిక సమావేశాలు ఉండాలని నిర్ణయించారు. హిందూ మహాసముద్రంలో సంయుక్త భాగస్వామ్య చర్యలకు సంసిద్ధత వ్యక్తంచేశారు. అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో అడ్డంకుల్లేకుండా వాణిజ్య, సమాచార అంశాల్లో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. సముద్ర తీవ్రవాదం, దోపిడీ నియంత్రణకు అవగాహన పెంపొందించుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఒప్పందం చేసుకున్నారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు సంబంధిత ఒప్పందంపై చర్చించారు. ఫ్రెంచ్ షిప్ బిల్డర్ సహకారంతో నిర్మించిన ఐఎన్ఎస్ కల్వరి అంశాన్ని ప్రస్తావించారు. మేడిన్ ఇండియా పథకంలో భాగంగా నిర్మించిన తొలి స్కార్పీన్ జలాంతర్గామి ఇది నిలిచింది. ఆదేవిధంగా ఇతర రక్షణ పరికరాల తయారీ భాగస్వామ్యానికి ఫ్రాన్స్ ఆసక్తి కనబరిచింది. సహకార అభివృద్ధి, సహకార ఉత్పత్తి విధానానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. వేర్వేరు రంగాల్లో ఫ్రెంచ్ సంస్థలు పెట్టుబడులు పెట్టాలని ఆకాంక్షిస్తున్నామని మోడీ పిలుపునిచ్చారు. అంతరిక్ష పరిశోధనలు, వాణిజ్యం, విద్య, సైన్స్ అండ్ టెక్నాలజీ, సాంస్కృతికం, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ సౌర కూటమి, పునరుత్పాదక విద్యుత్, సుస్థిర అభివృద్ధి సాధన, స్మార్ట్ నగరాలు వంటి అంశాల్లో పరస్పర సహకారానికి ఫ్రాన్స్-ఇండియా మధ్య కీలక ఒప్పందాలు జరిగాయి.

### సౌరవిద్యుత్ రంగంలో సాంకేతిక బదలాయింపు

ఫ్రాన్స్ ప్రధాని పర్యటనతో పునరుత్పాదక విద్యుత్ రంగంలో కొత్త ఆశలు చిగురించాయి. వాతావరణ మార్పుల అంశానికి మోడీ ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, ఫ్రాన్స్ సహకారంతో సౌరవిద్యుత్ రంగాన్ని ప్రోత్సహించేలా ఇరుదేశాలు వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయి. భారత్‌లో సౌరవిద్యుత్ ఉత్పత్తికి గల అపార అవకాశాలను నేడు జరగనున్న అంతర్జాతీయ సౌర కూటమి సదస్సులో ప్రస్తావించనున్నారు. ఈ రంగంలో భారతకు సాంకేతిక బదలాయింపునకు ఫ్రాన్స్ ఒడంబడిక చేసుకునే అవకాశం ఉంది. వెయ్యి గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. తద్వారా 2030 నాటికి ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేయనుంది.

## హిమాలయాలకు రజనీకాంత్



**న్యూఢిల్లీ:** సూపర్‌స్టార్ రజనీకాంత్ శనివారం హిమాలయాలకు బయలు దేరి వెళ్లారు. ఇప్పటివరకు ఆయన సినిమాలు రిలీజ్ అయ్యేముందు కొద్దిరోజులు ధ్యానం చేసేందుకు హిమాలయాలకు వెళ్ళడం రజనీ కాంత్‌కు అలవాటు. అయితే, ఈసారి రిలీజ్ కావాల్సిన సినిమాలు ఈనెలలో ఏవీ లేనప్పటికీ ఆయన హిమాల యాలకు వెళ్ళడం చర్చనీయాంశమైంది. ఎందుకు వెళుతున్నది చెప్పనప్పటికీ ఆయన రెండు వారాల పాటు అక్కడే ప్రశాంతంగా గడపాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. తరచుగా ఆయన హిమాలయాలకు వెళ్ళినప్పుడు సాధువు మహావతార్ బాబాజీ నివశించిన గుహను సందర్శించేవారు. యొగోడా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా(వైఎస్ఎస్) శతవార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రజనీకాంత్ తన స్నేహితులతో కలిసి హిమాలయాలలో నిర్మించిన ధ్యానమందిరంలో కొంత సమయం గడపవచ్చని తెలిసింది. గత ఏడాది డిసెంబర్ 31 న రజనీకాంత్ తన రాజకీయరంగ ప్రవేశం గురించి ప్రకటించిన విషయం విధితమే. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తమిళనాడులోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తన అభ్యర్థులను పోటీకి నిలబెట్టనున్నట్టు ఆయన ఆసందర్భంగా పేర్కొన్నారు. తన సొంత వెబ్‌సైట్ ద్వారా ప్రజలతో మమేకమవుతున్నారు.

## గాంధీ సంతకంతో కూడిన ఫోటోకు 41వేల డాలర్లు



**న్యూఢిల్లీ:** మహాత్ముడి సంతకంతో ఉన్న అరుదైన చిత్రాన్ని అమెరికాలో వేలం వేశారు. ఈ ఫొటో 41,806 డాలర్లు (సుమారు రూ.27 లక్షలు) పలికింది. ఫొటోలో మహాత్మాగాంధీతోపాటు మదన్ మోహన్ మాలవ్య కూడా ఉన్నారు. విషయమేమంటే ఫొటో మీద 'ఎంకే గాంధీ' అని ఫౌంటెన్ పెన్‌తో సంతకం చేశారు. ఈ ఫొటో 1931 సెప్టెంబర్‌లో లండన్‌లో రెండో సెషన్ భారత రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం తీసిందని బోస్టన్‌కు చెందిన ఆర్ఆర్ వేలం సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బాబీ లివింగ్ స్టన్ వెల్లడించారు. అయితే, భారత నేషనల్ కాంగ్రెస్ తరపున గాంధీ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇదిలా ఉండగా, ఇదే వేలంలో 19వ శతాబ్దానికి చెందిన కమ్యూనిస్టు, ఫిలాసఫర్ కారల్ మార్క్స్ రాసిన అరుదైన ఉత్తరాన్ని కూడా వేలం వేశారు. 1879, అక్టోబర్ 1న రాసిన ఈ ఉత్తరం 53 వేల డాలర్లు పలికింది. లండన్ నుంచి పంపించిన ఈ ఉత్తరంలో కారల్ మార్క్స్ తన పుస్తకం 'రివిలేషన్స్'ను ఒక కాపీ పంపించమని రాడికల్ ఇంగ్లీష్ ఎడిటర్ కొల్లేట్ డబసన్‌ను కోరారు.

## విప్లవ్‌కుమార్‌కు మార్గదర్శకత్వం వహించండి

### మాణిక్ సర్కార్‌ను కోరిన మోడీ



**అగర్తల :** త్రిపురలో ఏర్పడిన బిజెపి ప్రభుత్వంలో తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విప్లవ్‌కుమార్ దేవ్‌కు పరిపాలనా వ్యవహారాల్లో మార్గదర్శకత్వం వహించాలని సిపిఎం నేత, మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌ను ప్రధాని మోడీ కోరారు. త్రిపుర ముఖ్యమంత్రిగా విప్లవ్ కుమార్ నిన్న ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి గత రెండు దశాబ్దాలుగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన సిపిఎం నాయకుడు మాణిక్ సర్కార్ హాజరయ్యారు. బిజెపి సీనియర్ నేతలు ఎల్‌కె అద్వానీ, మురళీ మనోహర్ జోషిలిద్దరూ మాణిక్ సర్కార్‌కు చెరొకవైపు కూర్చున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన మోడీ నేరుగా మాణిక్ సర్కార్ వద్దకు వచ్చి అభివాదం చేశారు. తరువాత రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన అనుభవం లేని ప్రభుత్వానికి మాణిక్ సర్కార్ తన విశేషానుభవంతో మార్గదర్శకత్వం వహించాలని కోరారు.

### విప్లవ్ జీ.. సెప్టిక్ ట్యాంక్ క్లీన్‌చేయించండి


త్రిపురలో బీజేపీ విజయానికి మూల కారకుడైన సునీల్ దేవ్‌ధర్ శనివారం పేల్చిన ఓ ట్వీట్.. రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. త్రిపుర సీఎంగా పగ్గాలు చేపట్టిన విప్లవ్ దేవ్‌కు ఆ రాష్ట్ర బీజేపీ ఇంచార్జి సునీల్ దియోదర్ ఓ విజ్ఞప్తి చేశారు. సీఎంగా మీరు, మంత్రులు తమ క్వార్టర్స్‌లోకి వెళ్లే ముందు సెప్టిక్ ట్యాంక్‌లను క్లీన్ చేయించండి అని విప్లవ్ దేవ్‌కు సునీల్ విన్నవించారు. మాణిక్ సర్కార్ పాలనలో 2005లో ఆయన ఉండే క్వార్టర్స్‌లోని సెప్టిక్ ట్యాంక్‌లో మహిళా అస్థిపంజరం లభ్యమైందని గుర్తు చేశారు సునీల్ దియోదర్. 25 ఏళ్ల వారి పాలనలో ఎన్నో రాజకీయ హత్యలు జరిగాయని తెలిపారు.

### అల్లర్లు బాధించాయి అందుకే తప్పుకుంటున్నాం: సీపీఎం

గిరిజన ప్రాంతంలో బీజేపీ నాయకులు సృష్టించిన అల్లర్లకు నిరసనగా సీపీఎం సంచలన నిర్ణయం తీసుకుంది. చార్లిలామ్ అసెంబ్లీ స్థానం పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు శనివారం ప్రకటించింది. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు సీపీఎం ఈ నిర్ణయం తీసుకోవడం కొసమెరుపు. త్రిపుర వ్యాప్తంగా బీజేపీ భయానక వాతావరణం సృష్టించిందని, ఏజెన్సీ ప్రాంతంలో దీని తీవ్రత అధికంగా ఉందని సీపీఎం పార్టీ చెప్పుకొచ్చింది. తమ పార్టీ నుంచి అభ్యర్థి నిల్చుని ఎన్నికలు జరిగితే మళ్లీ అల్లర్లు చెలరేగే అవకాశం ఉంటుందని, అందుకే తామే అభ్యర్థిని ఉపసంహరించుకున్నట్టు వివరించింది.

## ప్రధాని కావాలనుకోవడం లేదు

● ఆ స్థాయి నాకు లేదు ● మోడీ క్రమశిక్షణకు మారుపేరు ● 2019లోనూ మాదే అధికారం
● నేను ఎవరికీ ఫోటోలు, బయోడేటాలు ఇవ్వలేదు ● ఇండియా టుడే కాంక్లేవ్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



**ముంబై :** నేను ప్రధాని కావాలని అనుకోవడం లేదు.. పార్టీ బలోపేతం చేయడమే నా ముందున్న కర్తవ్యం.. నేను సాధారణ కార్యకర్తను.. నేను అనుకున్నది సాధించాను.. అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. తెలుగుదేశం, శివసేన, అకాలీదల్ పొత్తుల విషయంలో బీజేపీపై ఒత్తిడి పెరుగుతున్నది. ఒకవేళ బీజేపీ సరైన మెజార్టీ పొందలేకపోతే 2019 లోక్‌సభ ఎన్నికల్లో అనుకున్నది సాధించుకుంటుంది. మోడీ నాయకత్వంలోనే కేంద్రంలో ఎన్‌డీఏ మళ్లీ అధికారంలోకి వస్తుందని గడ్కరీ ధీమా వ్యక్తం చేశారు. నేను ఓ సాధారణ వ్యక్తిని, ప్రధాని కావాలని అనుకుంటున్నారనే వార్తల్లో వాస్తవం లేదు. పార్టీపై అపారమైన నమ్మకం ఉంది. ప్రధాని అభ్యర్థిగా మళ్లీ మోడీనే ఎన్నుకుంటుంది. ఆయన నాయకత్వంలోనే నాయకులు అందరూ కలిసి పోరాటం చేస్తాం. అంతిమంగా 2019 ఎన్నికల్లో విజ యం సాధిస్తాం అని ఇండియా టుడేతో నిర్వహించిన సమావేశంలో అభిప్రాయపడ్డారు. నేను అస్సలు ప్రధాని కావాలనే కలలు కనడం లేదు. ప్రధాని కుర్చీలో కూర్చునే స్థాయి నాది కాదు. ఎవరికీ నా ఫొటోలు ఇవ్వలేదు. అదే విధంగా నా బయోడాటా కూడా ఎవరికీ పంపించలేదు. వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. నా కటౌట్‌లు పెట్టాలని కూడా ఎవరికీ చెప్పలేదు. అదేవిధంగా నా కోసం విమానాశ్రయానికి రావాలని కూడా ఎవరినీ ఆదేశించలేదు. నేను నా స్థాయికి తగిన విధంగా ప్రవర్తిస్తాను. నా స్థాయికి తగిన పనులే చేస్తాను. అత్యాశకు వెళ్లే మనిషిని తాను కాను. అన్నారు. మోడీ శాంతి స్వభావులు. క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని కొనసాగిస్తున్నారు. మోడీ, అమిత్‌షాతో పాటు పలువురు నాయకులతో బీజేపీ రోజురోజుకూ పటిష్టం అవుతున్నది. పరిస్థితులకు అనుగుణంగా మార్పులు ఉంటుంటాయి. ప్రస్తుతం బీజేపీ అచ్చేదిన్ నినాదంతో ముందుకు వెళ్తున్నది. ఎన్నికల్లో ఇచ్చినహామీలను అమలు చేయడంపై దృష్టిసారించింది.

## పెద్దనోట్ల రద్దు చెత్త నిర్ణయం

● నేనైతే ఆ ప్రతిపాదనను చెత్తబుట్టలో వేసేవాడిని ● మలేసియా పర్యటనలో ప్రవాసులతో రాహుల్ గాంధీ



**సింగపూర్:** పెద్దనోట్ల రద్దు ప్రతిపాదన మంచి నిర్ణయం కాదు. ఒకవేళ నేనే గనుక ప్రధానమంత్రి అయివుంటే, అలాంటి ప్రతిపాదనను చెత్తబుట్టలో పడేసివుండే వాడిని అని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పారు. ఐదు రోజుల ఆగ్నేయాసియా దేశాల పర్యటనలో భాగంగా శనివారం ఆయన మలేషియా చేరుకున్నారు. ఈ సందర్భంగా కౌలాలంపూర్‌లో ప్రవాస భారతీయులతో ఔత్సాహిక సమావేశంలో పాల్గొన్నారు. పెద్దనోట్ల రద్దును మీరెలా అమలు చేసే వుండేవారన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానం చెప్పారు. 'నేను ప్రధానమంత్రి అయివుంటే, ఎవరైనా నోట్లరద్దు అని రాసివున్న ఫైల్‌ను నాచేతికి ఇస్తే, చెత్తడబ్బాలో పడేసివుండే వాడిని. బయటకు విసిరి దూరంగా ఉన్న చెత్తలో పడేసేవాడిని. నా అమలు విధానం అలా వుండేది. ఎందుకంటే, ఏకోణంలో చూసినా అది మంచిది కానేకాదు' అంటూ బదులిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో టేపును కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్‌లో ఉంచింది. 2016 నవంబర్ 8 రాత్రి నరేంద్ర మోడీ ప్రకటించిన పెద్దనోట్ల నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. వ్యతిరేకించింది. ఈ చర్య ఆర్థిక అభివృద్ధిని మందగమనం పట్టిస్తుందని హెచ్చరించింది. ఇదివరకు కాలిఫోర్నియా, బార్కిలే యూనివర్సిటీల్లో మాట్లాడిన సందర్భాల్లోనూ రాహుల్ పెద్దనోట్ల రద్దుపై తీవ్ర వ్యాఖ్యలుచేశారు. నిర్లక్ష్య, ప్రమాదకర నిర్ణయాలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆర్థిక వ్యవస్థకు విపరీత నష్టం కలిగిస్తున్నారంటూ పెద్దనోట్ల రద్దు, వస్తు సేవా పన్నుల అమలు చర్యలను విమర్శించారు. మహిళాసాధికారతపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, సమానత్వం మాత్రమే సరిపోదు. వారి పట్ల ఉన్న వివక్షతను రూపుమాపేందుకు పురుషుల కంటే మహిళలకు మరింత మద్దతు అందించాలి. పురు షులకు సమానంగా మాత్రమే మహిళలను చూడాలని అనుకోవడం లేదు. వారికంటే మెరుగైన దశలో ఉండాలన్నదే నా ఆలోచన. పాశ్చాత్య దేశాలతో సహా అన్ని సమాజాల్లోనూ నేటికీ మహిళల పట్ల వివక్ష ఉంది. దీన్ని సరిదిద్దాల్సిన అవసరం ఉందని రాహుల్ అభిప్రాయపడ్డారు.ఐకాన్‌లో యువ వృత్తినిపుణులను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు. మలేషియన్ ఇండియా (ఎంఐసీ)కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్రమణియం సదాశివంను కలిశారు. 1946 వరకు ఏఐసీసీలో భాగమైన ఎంఐసీ మలేషియా స్వాతంత్ర ఉద్యమంలో వహించిందని రాహుల్ గుర్తుచేశారు.

### 'రాఫెల్' మరకలు తుడిచివేయాలి

### కాంగ్రెస్ సీనియర్ నేత టామ్ వడక్కన్

ఫ్రెంచ్ ప్రధాని ఎమాన్యుల్ మాక్రోన్‌తో శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ భేటీ కావడంపై కాంగ్రెస్ రాఫెల్ ఒప్పందాన్ని తెరపైకి తీసుకొచ్చింది. ఎన్‌డీఏ హయాంలో అంటిన రాఫెల్ కుంభకోణానికి సంబంధించిన మరకలు వారే శుభ్రం చేయాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రతినిధి టామ్ వడక్కన్ మాట్లాడారు. ఫ్రెంచ్ ఆధారిత రాఫెల్ ఏయిర్‌క్రాఫ్ట్‌లను భారత్ అత్యధిక డబ్బులు కట్టి తీసుకుంది. ఈజిప్ట్, ఖతర్‌తో పోలిస్తే భారత్ చెల్లించింది చాలా ఎక్కువ. ఇలా ఎందుకు చేశారో మోడీ ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

## నోటాకు 1.33కోట్ల ఓట్లు

**న్యూఢిల్లీ :** భారత ఎన్నికల ప్రక్రియలో నోటాతో విప్లవాత్మక మార్పు వచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2013లో భారత ఎన్నికల సంఘం నోటాను అమల్లోకి తెచ్చింది. ఏ పార్టీ అభ్యర్థికి కూడా ఓటు వేయొద్దు అనుకునే ఓటర్లు.. తమ ఓటును నోటాకు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. తొలిసారిగా 2013లో జరిగిన ఛత్తీస్‌గఢ్, మిజోరం, రాజస్థాన్, ఢిల్లీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో నోటా అనే ఆప్షన్‌ను ఈవీఎంలలో పొందుపరిచారు. 2013 నుంచి ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో 1.33 కోట్ల మంది ఓటర్లు తమ ఓటును నోటాకు వేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో నోటాను తొలిసారిగా అమలు చేశారు. మొత్తంగా లోక్‌సభ ఎన్నికల్లో నోటాకు 60,02,942 కోట్లు వచ్చాయి. తమిళనాడులోని నీలగిరి లోక్‌సభ నియోజకవర్గంలో అత్యధికంగా(46,559 ఓట్లు) నోటాకు ఓట్లు నమోదు కాగా, అత్యల్పంగా(123 ఓట్లు) లక్షద్వీప్‌లో నోటాకు ఓట్లు నమోదు అయ్యాయి. రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో సరాసరి 2.70 లక్షల ఓట్లు నోటాకు పడ్డాయి. గోవా, ఢిల్లీ(ఎన్సీటీ), ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు నోటాకు వేశారు. 2017లో పనాజీ, వాల్పాయి నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 301(1.94 శాతం), 458 (1.99 శాతం) ఓట్లు నోటాకు పోలయ్యాయి.

### 32 కోట్ల ఆధార్ లింక్: ఈసీ ఓపీ రావత్

32 కోట్ల ఆధార్ నెంబర్లను ఓటర్ ఐడీ కార్డులతో లింక్ చేసినట్టు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఓపీ రావత్ శనివారం తెలిపారు. 14వ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) జాతీయ స్థాయి సమావేశాల్లో రావత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంకా 54.5 కోట్ల ఆధార్ కార్డులు ఓటర్ ఐడీ కార్డులతో లింక్ చేయాల్సి ఉందని, దీన్ని కూడా త్వరలో పూర్తి చేస్తాం. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను ప్రారంభించడం జరిగింది. 54.5 కోట్ల ఆధార్‌కార్డులను ఎన్ని రోజుల్లో ఓటర్ ఐడీ కార్డులతో లింక్ చేస్తారు..? అని ప్రశ్నించగా, కేవలం మూడు నెలల్లో 32 కోట్ల ఆధార్ కార్డులను లింక్ చేశాం. బయోమెట్రిక్ మిషన్లు సక్రమంగా పని చేయడం లేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ కర్నాటకకు చెందిన మాథ్యు థోమస్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, ఆధార్ చట్టంలోని అంశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మాథ్యు ఆరోపించారు. అదేవిధంగా ఈవీఎం పనితీరుపై కూడా ఆయన సమస్యలు లేవనెత్తారు. ఈ విషయంలో ట్యాంపరింగ్ జరుగుతున్నదని మాథ్యు వివరించారు. ఇటువంటి ఫిర్యాదులు అత్యధికంగా వస్తున్నాయని, కమిషన్ దీన్ని సీరియస్ తీసుకుని వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించినట్టు రావత్ తెలిపారు. ప్రతిపక్షాలు కూడా ఇటీవల నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కూడా ఈవీఎంల పనితీరుపై ఆరోపణలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో రావత్ స్పందిస్తూ.. తాము నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నామని తెలిపారు. దీనికి సంబంధించిన కేసు విషయమై సుప్రీంకోర్టు మార్చి 6న తీర్పు వెలువరించిందని చెప్పారు.

## కూలిన కోస్ట్‌గార్డు చాపర్

### సిబ్బంది సురక్షితం

**రాయ్‌ఘర్:** మహారాష్ట్రలోని రాయ్‌ఘడ్ జిల్లాలో, మురుద్ నందగాన్‌కు సమీపంలో భారతీయ కోస్ట్‌గార్డ్స్ కు చెందిన ఒక హెలీకాప్టర్ ప్రమాదవశాత్తూ శనివారం కూలిపోయింది. ప్రమాదం సంభవించినప్పుడు చాపర్‌లో నలుగురు సిబ్బంది వున్నారు. వీరిలో ముగ్గురు సురక్షితంగా ప్రాణాలతో బయటపడగా, ఒక మహిళకు మాత్రం గాయాలయ్యాయి.

చేతక్ చాపర్ లాండింగ్ అవుతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. చాపర్ గాలిలో వుండగానే సాంకేతిక లోపం తలెత్తింది. కిందికి దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ భూమిని ఢీకొంది. భారత నావికా దళానికి చెందిన హెలీకాప్టర్‌లో వైద్య బృందం తరలివచ్చి సిబ్బందికి చికిత్సలు అందించారు. దక్షిణ ముంబైకి 160 కి.మీ. దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

## ఆమరణ దీక్షచేస్తానన్న ఢిల్లీ సీఎం

### సీలింగ్ డ్రైవ్ నిలిపివేయాలని డిమాండ్



**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్రానికి హెచ్చరిక జారీ చేశారు. ఈ నెల 31లోపు సీలింగ్ డ్రైవ్(షాపుల మూసివేత) నిలిపివేయకపోతే ఆమరణ నిరాహారదీక్షకు దిగుతానని శనివారం ప్రకటించారు. నిబంధనలకు విరుద్ధంగా నివాస ప్రాంతాల్లో ఉన్న దుకాణ సముదాయాలను ము న్సిపల్ కార్పొరేషన్ అధికారులు సీజ్ చేస్తున్నారు. వ్యాపారులకు మద్దతుగా నిలిచిన కేజ్రీవాల్ అవసరమైతే వారి తరపున పోరాడేందుకు సిద్ధమని తెలిపారు. 'వ్యా పారులు నిజాయితీగాను పన్నులు కడుతున్నారని, సీలింగ్ డ్రైవ్ వల్ల వేలాది మంది జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడతారని, దీంతో నిరుద్యోగ సమస్య పెరిగి పోతుంద'ని తెలిపారు. పార్లమెంట్‌లో చట్టం చేయడం ఒక్కటే సీలింగ్ డ్రైవ్‌కు పరిష్కారమని కేజ్రీవాల్ సూచించారు. కేంద్రం తక్షణమే దీనిపై స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ, ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి కేజ్రీవాల్ లేఖ రాశారు. చట్టపరమైన చిక్కులు తలెత్తకుండా పార్ల మెంట్‌లో బిల్లుచేసి సీలింగ్ డ్రైవ్ ఆపేలా చొరవ చూపాలని ఆ లేఖల్లో పేర్కొన్నారు.

## ప్రధాని రాఖీ సోదరి కన్నుమూత

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాఖీ సోదరి షర్బతీ దేవి(104) కన్ను మూశారు. శనివారం ధన్‌బాద్‌లో ఆమె తుదిశ్వాస విడిచినట్లు బంధువులు తెలిపారు. గతేడాది మోడీకి రాఖీ కట్టాలని ఉందం టూ లేఖ రాయడం ద్వారా షర్బతీ దేవి వార్తల్లోకి వచ్చారు. 50 ఏళ్ళ క్రితం సోదరుడిని కోల్పోయిన తాను ప్రధా నికి రాఖీ కట్టాలని కోరు కుంటున్నట్లు కుమారుడి ద్వారా లేఖ రాశారు. ఇందుకు మోడీ సాను కూలంగా స్పందించడంతో, లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసానికి ఆమె చేరుకుని రాఖీ కట్టా రు. కాగా షర్బతీ దేవీకి 9మంది సం తానం. గతంలోనే భర్త, ఇద్దరు పిల్లలు చనిపోయారు. నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నేడు అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

## అల్లావుద్దీన్ ఖిల్జీ ఇంకా బతికే ఉన్నాడా..?

**న్యూఢిల్లీ:** నటి, రాజకీయ వేత్త జయప్రద మరోసారి వార్తల్లోకి వచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ వివాదాస్పద నేత అజంఖాన్‌ను అల్లావుద్దీన్ ఖిల్జీతో పోల్చారు. ఇటీవల విడుదలై విజయవంతమైన 'పద్మావత్' చిత్రంలో అల్లావుద్దీన్ ఖిల్జీ పాత్రను చూసి నప్పుడు తనకు అజంఖానే గుర్తొచ్చాడని చెప్పారు. ఒకప్పుడు తాను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు అజంఖాన్ తనను ఇదే తరహాలో వేధించారని శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ అన్నారు. 'పద్మావత్ చూసినప్పుడు ఖిల్జీ క్యారెక్టర్ సరిగ్గా అజంఖాన్‌ను గుర్తు చేసింది. నేను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ఆయన ఎలా వేధించారో ఒక్కసారి కళ్ల ముందు మెదిలింది' అని జయప్రద చెప్పారు. 2009లో జయప్రద ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు అజంఖాన్ వేధింపులపై ఆమె బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. తన ఫోటోలతో కొన్ని నీచమైన పోస్టర్లను ఆయన విడుదల చేశారంటూ మండిపడ్డారు. 2012లోనూ జయప్రద-అజంఖాన్ మధ్య ఇలాంటి శత్రుత్వమే కొనసాగింది.

## ఏపీ, బీహార్‌కు అత్యుత్తమ ప్యాకేజీలివ్వండి

### ప్రధాని మోడీకి శతృఘ్నసిన్హా విజ్ఞప్తి

**పాట్నా:** ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు అత్యుత్తమ ప్యాకేజీలను ప్రకటించి అమలు చేయాలని బీజేపీ ఎంపి శతృఘ్న సిన్హా ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు. ఈ అంశం నిప్పురవ్వలా రాజుకుని కార్చిచ్చులా వ్యాపిస్తోందని ఆయన అన్నారు. కేంద్ర మంత్రివర్గంనుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులు రాజీనామా చేసిన నేపథ్యంలో శతృఘ్న సిన్హా ఈ విజ్ఞప్తి చేశారు. 'సర్.. ఏం జరుగుతోంది. మీరు వాగ్దానం చేశారు. ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు కచ్చితంగా అత్యుత్తమ ప్యాకేజీ అవసరం. అదే విధంగా మన స్నేహితుడు నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రిగా ఉన్న బీహార్ రాష్ట్రానికి కూడా ప్రత్యేక ప్యాకేజి అవసరం.' అంటూ శతృఘ్న సిన్హా ట్వీట్ చేశారు.

## ఆర్ఎస్ఎస్ సెక్రటరీగా భయ్యాజీ జోషీ

**న్యూఢిల్లీ:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జనరల్ సెక్రటరీగా భయ్యాజీ జోషీ తిరిగి ఎన్నికయ్యారు. 2021 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. భయ్యాజీ ఆర్ఎస్ఎస్ జనరల్ సెక్రటరీగా ఎన్నికవడం ఇది వరుసగా నాల్గొవసారి. ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రచార్ ప్రముఖ్ మన్మోహన్ విద్య జనరల్ సెక్రటరీగా భయ్యాజీ జోషీ ఎన్నికైనట్లు ప్రకటించారు.

## యూపీలో అంబేద్కర్ విగ్రహ ధ్వంసం

లక్నో : దేశంలో మహనీయుల విగ్రహాల విధ్వంసం కొనసాగుతూనే ఉంది. త్రిపురలో మొదలైన విగ్రహాల విధ్వంసం దేశ వ్యాప్తంగా పాకింది. ఉత్తరప్రదేశ్‌లోని అజాంఘర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శనివారం ఉదయం అక్కడికి చేరుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని శుక్రవారం ధ్వంసం చేసిన విషయం విదితమే. గత నాలుగైదు రోజులుగా దేశవ్యాప్తంగా లెనిన్, పెరియార్, శ్యామ ప్రసాద్ ముఖర్జీ, అంబేద్కర్ విగ్రహాలను ధ్వంసం చేస్తున్న విషయం తెలిసిందే.

## జమ్మూకాశ్మీర్‌లో భూకంపం

**న్యూఢిల్లీ:** జమ్మూ కాశ్మీర్‌లో శనివారం ఉదయం స్వల్ప భూకంపం చోటు చేసుకుంది. రిక్టర్ స్కేలుపై 4.5 తీవ్రతతో సంభవించిన భూప్రకంపనలు స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాయి. పలు నగరాల్లో ప్రజలు ప్రాణభయంతో ఇళ్ల నుంచి బయటికి పరుగులు తీసినట్టు స్థానిక మీడియా వెల్లడించింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రీకృతమైందనీ.. ఈ కారణంగా కొద్ది సెకన్ల పాటు రాష్ట్రంలో పలుచోట్ల ప్రకంపనలు చోటుచేసుకున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ ప్రభావం ''స్వల్పం''గానే ఉంటుందని ప్రకటించింది.




# రొటోమాక్ కంపెనీ మూత!

**• వేలానికి బ్యాంకర్లు సిద్ధం**

**ముంబై :** బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఎగ్గొట్టే కంపెనీ యజమానులపై భారతీయ బ్యాంకులు గట్టి చర్యలు తీసుకుంటున్నాయి. తాజాగా శుక్రవారం రొటోమాక్ కంపెనీ యజమాని రుణాలను పునర్వ్యవస్థీకరించేందుకు 90 రోజుల గడువును భారతీయ బ్యాంకులు నిర్ద్వంద్వంగా తిరస్కరించాయి. కాగా రొటొమాక్ ఎక్స్‌పోర్ట్స్, రొటోమాక్ గ్లోబల్ కంపెనీలు రూ.4,000 కోట్ల వరకు బ్యాంకులకు బకాయిపడింది. ఈ రెండు కంపెనీల ప్రమోటర్ విక్రంకొటారి ఆస్తులను ప్రస్తుతం బ్యాంకులు వేలం వేయబోతున్నాయి. కంపెనీని తిరిగి గాడిలో పెట్టే అవకాశాలు పూర్తిగా సన్నగిల్లడంతో బ్యాంక్‌రప్టసీ కోర్టు కంపెనీని వేలం వేస్తుంది. కొఠారికి ముందుగా ఇచ్చిన 180 రోజుల గడువు మార్చి 19తో ముగుస్తుంది. ఇన్సాల్వెన్సీ బ్యాంక్‌రప్టసీ కోడ్ ప్రకారం ముందుగా 90రోజుల గడువు ఇస్తుంది. అటు తర్వాత కావాలనుకుంటే మరో 90 రోజుల గడువుఇచ్చి కంపెనీని గాడిలో పెట్టుకోవడానికి అవకాశం ఇస్తుంది. ప్రస్తుతం బ్యాంకులు రొటొమాక్ కంపెనీకి అదనపు సమయం ఇచ్చే పరిస్థితుల్లో బ్యాంకులు లేవు. గత కొన్ని వారాల క్రితం కేంద్ర నేరపరిశోధన సంస్థ (సీబీఐ) రొటొమాక్ యజమాని విక్రం కొఠారి, ఆయన కుమారుడు రాహుల్ కొఠారిని అరెస్టు చేశాయి. కొఠారితో పాటు ఆయన తనయుడు రాహుల్ విచారణ అధికారులకు దర్యాప్తులో సహకరించలేదు. కాగా కొటారి బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంకు ఆఫ్ బరోడా, ఒరియంటెల్ బ్యాంకు ఆఫ్ కామర్స్, అలహాబాద్ బ్యాంకు, యూనియన్‌బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్రల నుంచి రూ.4,000 కోట్ల రుణాలుతీసుకొని ఎగ్గొట్టిన విషయం తెలిసిందే.




# పీఎన్‌బీ స్కాం దెబ్బకు కార్పొరేట్ రుణాలకు గండి

**• కార్పొరేటర్లకు రుణాలు తగ్గించిన బ్యాంకర్లు**

**• ట్రేడ్ క్రెడిట్‌కు కోత, గ్యారంటీ, లెటర్ ఆఫ్ క్రెడిట్ కుదింపు**




**హైదరాబాద్ :** ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) స్కాం దెబ్బకు భారతీయ కార్పొరేట్ రంగానికి రుణాలు దక్కడం పెద్ద గగనమైపోయింది. ఈ నెలాఖరుతో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది కాబట్టి కార్పొరేట్లకు ఈ నెల అత్యంత కీలకం. పీఎన్‌బీలో స్కాం తలెత్తిన తర్వాత ముఖ్యంగా ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు డిఫెన్స్‌లోపడ్డాయి. ప్రస్తుతం బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండిబకాయిలపై కొత్త ఫ్రేమ్ వర్క్ ద్వారా రుణాల పునర్వ్యవస్థీకరణపై అధ్యయనం చేస్తుండటంతో రుణాల పంపిణీకి బ్యాంకర్లకు చాలా సమయం పడుతోంది.

సాధారణంగా మార్చి నెల అంటే ఆర్థిక సంవత్సరం పూర్తి కావడానికి ఇదే చివరి నెల కాబట్టి బ్యాంకుల్లో లావాదేవీలు జోరుగా సాగుతుంటాయని ప్రభుత్వరంగానికి చెందిన టాప్ ఎగ్జిక్యూటివ్ చెప్పారు. ప్రస్తుతం చాలా బ్యాంకుల యాజమాన్యాలు.. ముఖ్యంగా ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకులు .. దేశంలోని బడా కంపెనీలకు 70 శాతం రుణాలిచ్చేవి ఈ బ్యాంకులే. పెద్ద వ్యాపారసులకు లేదా కంపెనీలురుణాలు ఇవ్వడానికి వారి వద్ద సమయంలేదు. ప్రస్తుతం బ్యాంకులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడానికి (రుణాల పంపిణి)ని పక్కకు పెట్టేశాయి.పంజాబ్ నేషనల్ బ్యాంకు బాగోతం బయటపడ్డ తర్వాత ఆడిటర్లు కూడా అన్ని సవ్యంగా ఉన్నాయా లేదా అని చూసుకుంటున్నాయి. దీనికి కొంత సమయం పడుతుందని.. మొత్తానికి బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుతం సబ్దత నెలకొందని మరో బ్యాంకరు వివరించారు.స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కి చెందిన ఎగ్జిక్యూటివ్ ఒకరు మాట్లాడుతూ.. పీఎన్‌బీలో జరిగిన మోసాన్ని ప్రభుత్వం కానీ.. నియంత్రణా సంస్థలు కానీ ఈ కేసును సరిగా నిర్వహించలేకపోతున్నాయని.. మొత్తం నెపాన్ని బ్యాంకర్లపై నెట్టివేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పేయే పరిస్థితి ఏర్పడుతుందని...అలాగే బ్యాంకర్ల మనోధైర్యం దెబ్బ తింటున్నారు.ఇప్పుడిప్పుడే బ్యాంకింగ్ రంగంలో రుణాల డిమాండ్ పెరుగుతోందని, గత మూడు సంవత్సరాల నుంచి చూస్తే వివిధ కారణాల వల్ల బ్యాంకుల రుణాల డిమాండ్ తగ్గముఖం పట్టింది. డిసెంబర్ 2017 త్రైమాసికంలో బ్యాంకుల రుణాల డిమాండ్ పెరుగుతుందన్నా ఆశలు చిగురించాయని, దీంతో పాటు బ్యాంకు రుణాల వసూళ్లు కూడా జోరందుకున్నాయని అన్నారు. అయితే అనుకోకుండా పంజాబ్ నేషనల్ బ్యాంకులో స్కాం బయట పడ్డంతో మార్చిలో రుణాల డిమాండ్ పెరుగుతుందన్న ఆశపై నీళ్లు చల్లినట్లయిందని ఎస్‌బీఐ ఎగ్జిక్యూటివ్ వివరించారు.

**బ్యాంకు రుణాల డిమాండ్ రూ. వేల కోట్లు**

| సంవత్సరం | పరిశ్రమ మొత్తానికి | సంవత్సరం ప్రాతిపదికన |
|---|---|---|
| ఏప్రిల్ 2017లో | 26,245 | -1.39 శాతం |
| మే 2017లో | 26,068 | -2.12 శాతం |
| జూన్ 2017లో | 26,185 | -1.07 శాతం |
| జులై 2017లో | 26,280 | -0.32 శాతం |
| ఆగస్టు 2017లో | 26,112 | -0.27 శాతం |
| సెప్టెంబర్ 2017లో | 26,404 | -0.44 శాతం |
| అక్టోబర్ 2017లో | 25,991 | -0.21 శాతం |
| నవంబర్ 2017 | 26,041 | 0.96 శాతం పెరిగింది |
| డిసెంబర్ 2017 | 26,341 | 2.13 శాతం పెరిగింది |
| జనవరి 2018 | 26,151 | 1.10 శాతం పెరిగింది. |

(రిజర్వుబ్యాంకు ఇచ్చిన గణాంకాలను బట్టి)పట్టిక తయరు చేయడం జరిగింది.

## మంచి కంపెనీలకు రుణాలిస్తున్నాం

అయితే ట్రాక్ రికార్డు బాగా ఉన్న కంపెనీలకు రుణాలు నిరాకరించడం లేదని బ్యాంకర్లు స్పష్టం చేస్తున్నారు. అయితే బోర్డర్‌లైన్స్ కేసుల విషయానికివస్తే, అలాంటి కంపెనీల నుంచి వచ్చే ప్రతిపాదనలు, ఖాతాలో ఎక్కువ రుణాలు కనిపిస్తే మాత్రం ఈ కంపెనీలు ఎక్కువ రిస్కుతో కూడుకున్నవని రుణాలు ఇవ్వడానికి బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌లు వెనుకంజవేస్తున్నారు. పీఎన్‌బీఐ దెబ్బ నుంచి కోలుకోవాలంటే బ్యాంకింగ్ రంగానికి మరో మూడు నుంచి ఆరు నెలల సమయం పడుతుందని బ్యాంకర్లు చెబుతున్నారు. రేటింగ్ ఏజెన్సీలు కూడా బ్యాంకులకు ఈ సారి రుణాల డిమాండ్ తగ్గుతుందని భావిస్తున్నాయి. ఫైనాన్షియల్ రంగానికి చెందిన రేటింగ్ ఏజెన్సీ చీఫ్ మాట్లాడుతూ.. బ్యాంకులు రుణాలు మంజూరు చేయడానికి సాధారణంగా తీసుకునే సమయం కంటే ఎక్కువ సమయం తీసుకుంటున్నాయని పరిశ్రమలకు చెందిన వారు తమకు ఫిర్యాదు చేస్తున్నారని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా బ్యాంకులు కూడా ప్రామ్ట్ కరెక్టివ్ యాక్షన్ (పీసీఏ) కింద పనిచేస్తున్నాయి. ప్రస్తుతం ఇవి కూడా నిబంధనల ప్రకారమే పనిచేస్తున్నాయి. ప్రస్తుతం విదేశీమారకద్రవ్యం వ్యాపారంపై కూడా వీరు నిదానంగా తీరికగా పనిచేస్తున్నరని సీనియర్ బ్యాంకరు ఒకరు చెప్పారు. సీనియర్ ఫారిన్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ ఒకరు మాట్లాడుతూ.. ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు తమ లావాదేవీలను కూడాతగ్గించుకున్నాయని ఉదాహరణకు ట్రేడ్ క్రెడిట్ పొడిగింపును తగ్గించేశాయని, దీంతో పాటు గ్యారంటీ, లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను కూడా తగ్గించాయి. దీంతో విదేశీ వ్యాపారాల లావాదేవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెబుతున్నారు.

## దర్యాప్తు సంస్థలతో భయం

పంజాబ్ నేషనల్ బ్యాంకులో వెలుగు చూసిన స్కాం తర్వాత దర్యాప్తుసంస్థలు సీబీఐ, ఈడీలు, విజిలెన్స్ యంత్రాంగాలు జోరుపెంచాయి. దీంతో బ్యాంకర్లు పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వడానికి జంకుతున్నారు. అదే సమయంలో రుణాల పునర్వ్యవస్థీకరిస్తే తమపై అనుమానంతో చూస్తారని.. మళ్లీ దర్యాప్తు సంస్థల ముందు హాజరై వివరణ ఇచ్చుకోవాల్సి వస్తుందని బ్యాంకు ఉన్నతాధికారులు భయాందోళనకు గురవుతున్నారు. మరో ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకు ఎగ్జిక్యూటివ్ ఆయనకు దశాబ్దాల తరబడి బ్యాంకింగ్ రంగంలో అనుభవం ఉంది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కేసులో మాజీ ఐడీబీఐ టాప్ ఎగ్జిక్యూటివ్‌లు దర్యాప్తు సంస్థల ముందు ఎదుర్కొన్న చేదు అనుభవాలు మరచిపోక ముందే తాజాగా పీఎన్‌బీ స్కాం తెరపైకి వచ్చిందన్నారు. రిటైర్మెంట్ అయిన తర్వాత ఇలాంటి అనుభవం వద్దని ప్రతి బ్యాంకరు కోరుకుంటారని.. ఉద్యోగంలో ఉన్నప్పుడు తమకు పరిమితి స్థాయిలో ఉన్న వనరులతో రుణాలు ఎలా ఇచ్చింది తాము తీసుకున్న నిర్ణయాలు సక్రమమైనవేనని వాదించుకునే అవకాశాలుంటాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కాలంలో మొట్టమొదటిసారి ప్రైవేట్‌రంగానికి చెందిన టాప్‌ఎగ్జిక్యూటివ్‌లను కూడా విచారణకు పిలిపిస్తున్నారని ఆయన పోయారు. గతంలో ఇవి ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌లకలు మాత్రమే పరిమితం.. ఇప్పుడు ఇవి ప్రైవేట్ బ్యాంకులకు కూడా సోకాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తానికి చూస్తే ఈ ఆర్థికసంవత్సరం రెండవ సగభాగంనుంచి రుణాల పంపిణి కాస్తా మెరుగుపడింది. అయితే పరిశ్రమలకు ఇచ్చే రుణాల డిమాండ్ మాత్రం బాగా తగ్గింది. ఏడాది ప్రాతిపదికన చేస్తే రుణాల డిమాండ్ ఫిబ్రవరి 2018 రెండవ వారం వరకు 10.7 శాతం పెరిగింది. అంతకు ముందు ఇదే రెండవ వారం ఫిబ్రవరి 2017 నాడు 4.4 శాతం రుణాల డిమాండ్ ఉందని రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా గణాంకాలు తెలియజేస్తున్నాయి. కాగా పరిశ్రమలకు రుణాల డిమాండ్ జనవరి 2017న చూస్తే 5.5 శాతం తగ్గింది. గత ఏడాది అక్టోబర్ బాగా తగ్గి ప్రస్తుతం రుణాల డిమాండ్ పెరగడం మొదలయ్యింది. ఇంతలోనే ఈ జోరుకు పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం అడ్డుకట్ట వేసింది.

# రూ.50 కోట్ల రుణంపై పాస్‌పోర్టు వివరాలు తప్పనిసరి




**న్యూఢిల్లీ :** బ్యాంకుల్లో పెరిగిపోతున్న మోసాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. తాజాగా రూ.50 కోట్లు లేదా అంత కంటే ఎక్కువ మొత్తం లో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటే పాస్‌పోర్టు వివరాలు తప్పనిసరి ఇవ్వాలనే నిబంధన తీసుకొచ్చినట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి శనివారం నాడు తెలిపారు. పాస్‌పోర్టు వివరాలు తీసుకుంటేబ్యాంకు అధికారులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి కొంత వరకైనా మోసాలను తగ్గించవచ్చునని, మోసగాళ్లు దేశం వదిలిపారిపోకుండా నిరోధించవచ్చునని ప్రభుత్వం భావిస్తోంది. తదపరి లక్ష్యం బ్యాంకుల్లో మోసాలను పూర్తిగా తగ్గించి బాధ్యతాయుతమైన బ్యాంకులుగా తీర్చిదిద్దడమేనని, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి రాజీవ్‌కుమార్ ట్విట్ చేశారు. రూ.50 కోట్లు అంత కంటే ఎక్కువ మొత్తం బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న వారి పాస్‌పోర్టు వివరాలను తీసుకుంటున్నామని తెలియజేశారు. కొత్తగా బ్యాంకుల నుంచి రూ.50 కోట్లు లేదా అంత కంటే ఎక్కువ మొత్తం రుణాలు తీసుకోవాలనుకునే వారి నుంచి 45 రోజుల్లోగా పాస్‌పోర్టు వివరాలు తీసుకుంటామని కుమార్ వివరించారు. ఒక వేళ పాస్‌పోర్టు వివరాలు లేకపోతే బ్యాంకులే ప్రత్యేకంగా ఉద్దేశపూర్వక ఎగవేతదారుడు దేశనుంచి పారిపోకుండా చూస్తారని తెలిపారు. ఇప్పటికే అతి పెద్ద డిఫాల్టర్లు నీరవ్‌మోడీ, మెహుల్‌చోక్సీ, విజయ్‌మాల్యా, జతిన్ మెహతాలు దేశం నుంచి పారిపోయిన విషయం తెలిసిందే. ఇక వారి నుంచి బకాయిలు రాబట్టడం కష్టంగాకనిపిస్తోంది.ఇదిలా ఉండగా నీరవ్‌మోడీతో పాటు మెహుల్‌చోక్సీలు పంజాబ్‌నేషనల్ బ్యాంకు నుంచి రూ.12,700 కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన విషయం తెలిసిందే. దీంతో కేంద్ర కేబినెట్ గతవారం ఫుగిటివ్ ఎకనమిక్ ఆఫెండర్ బిల్లును ఆమోదించింది. ఈ బిల్లు ద్వారా దేశంలోని బ్యాంకులను మోసం విదేశాలకుపారిపోయిన ఆర్థిక నేరస్తుల ఆస్తులను జప్తు చేసి వీలైనంత త్వరగా వారి నుంచి బకాయిలువసూలు చేస్తారు. రూ.100కోట్లు లేదా అంత కంటే ఎక్కువమొత్తంలో డిఫాల్ట్ అయిన వారికి ఇది వర్తిస్తుంది. బ్యాంకింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి ఆర్థికమంత్రిత్వశాఖ గత వారం కొన్ని నిర్ణయాలు తీసుకుంది. వాటిలో ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల్లో ఎన్‌పీఏ ఖాతాలు రూ.50 కోట్ల కంటే ఎక్కువ మొత్తంగల ఖాతాలపై సమీక్ష జరిపి మోసాలు జరిగే అవకాశాలుంటే వాటిని సీబీఐకి అప్పగించాలని కోరింది. వీటితో పాటు రూ.250 కోట్ల కంటే ఎక్కువ మొత్తం రుణాలపై దృష్టి పెట్టాలని బ్యాంకుల ఆదేశించింది. రుణ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని, దీని కోసం ఈ ఏడాది జనవరిలో ఆరుపాయింట్ల కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది.




ఓలా ఎలక్ట్రిక్ కార్ల ప్రయోగం వికటించింది.నిర్వాహణ వ్యయ భారం అధికంగా ఉండటం, చార్జింగ్ కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో డ్రైవర్లు వ్యతిరేకత చూపుతున్నారు. ఎలక్ట్రిక్ కార్లను వెనక్కి ఇచ్చేస్తున్నారు. మళ్లీ పెట్రోల్,డీజిల్ కార్లవైపు మెగ్గుచూపుతున్నారు.

# ఒకటి నుంచి ఈ-వే బిల్లు అమలు

**• జీఎస్‌టీఆర్-3బీ జూన్ వరకు పొడిగింపు • జైట్లీ వెల్లడి**



**న్యూఢిల్లీ :** వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి రాష్ట్రాల మధ్య సరకు రవాణాకు ఎల్క్ట్రానిక్ వే బిల్లులను అమల్లోకి తేవాలని శనివారం నాడు జరిగిన జీఎస్టి మండలి సమావేశం నిర్ణయించింది. అయితే వ్యాపారస్తులకు టాక్స్ రిటర్న్స్ ఫైలింగ్ సరళతరం అంశంపై మాత్రం సమావేశం ఏకగ్రీవానికి రాలేకపోయింది. ఫైలింగ్ సరళరతం చేసే అంశంపై రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. అయితే ప్రస్తుతం ఉన్న పద్దతినే మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే మంత్రుల బృందం టాక్స్ రిటర్న్స్ ఫైలింగ్ మరింత సరళతరంచేయడంపై కసరత్తు చేస్తారు. సమావేశం తర్వాత ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలకు చెందిన పన్ను అధికారులు పన్ను రిటర్న్స్ సరళతరంగా ఉండాలని కోరుతున్నారని.. అదే సమయంలో పన్ను ఎగవేత ఉండరాదని అంటున్నారని అన్నారు. దీనిపై సమగ్రంగా చర్చలు జరపుతున్నామని, మండలి మాత్రం ప్రతి నెల సింగిల్‌రిటర్న్ ఉండాలని కోరుకుంటోందని, అదే సమయంలో ఫైలింగ్ సరళతరంగా ఉండేలా... పన్ను ఎగవేతకు అవకాశాల్లేకుండా ఉండాలనే అందరి భావన అని.. అయితే శనివారం జరిగిన సమావేశంలో దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. ప్రస్తుతం ఉన్న పద్దతే మరో మూడు నెలల పాటు కొనసాగుతుందని జైట్లీ కౌన్సిల్ సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న పద్దతి ప్రకారం చూస్తే జీఎస్టిఆర్-3బీ ప్రకారం అమ్మకాల రిటర్న్స్, తుది అమ్మకాల రిటర్న్స్ జీఎస్‌టి ఆర్-1 జూన్‌లోగా ఫైల్ చేయాల్సి ఉంటుంది.ఏప్రిల్ 1 నుంచి ఈ వేబిల్లు: వచ్చే నెల 1వ తేదీనుంచి ఈ వే బిల్లు అమల్లోకి వస్తుందని జైట్లీ స్పష్టం చేశారు. అంతరాష్ట్రంగా సరకు రవాణాపై ఈ-వేబిల్లు అమల్లోకి వస్తుందన్నారు. అయితే ఏప్రిల్ 15వ తేదీ నుంచి దేశంలోని అన్నీ రాష్ట్రాలను నాలుగు గ్రూపులుగా విభజిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చిన వే బిల్లు వ్యవస్థలో కొన్ని అడ్డంకుల వల్ల నిలిపివేయాల్సి వచ్చిందని.. అటు తర్వాత ఈ -వే బిల్లు వ్యవస్థను పటిష్టంగా రూపుదిద్దిన తర్వాత అమల్లోకి తేవాలని నిర్ణయించినట్లువివరించారు. కాగా మొదటి గ్రూపు అంతరాష్ట్ర ఈ -వేబిల్లును ఏప్రిల్ 15 నుంచి అమల్లోకి తెస్తామని, అయితే ఏప్రిల్ 7వ తేదీన తుది నిర్ణయం తీసుకుంటామని జైట్లీ చెప్పారు. అన్నీ రాష్ట్రాలు జూన్ 1 నుంచి కొత్త వ్యవస్థలోకి మారిపోవాల్సి ఉంటుందన్నారు. ఇక ఈ వేబిల్లును జీఎస్టి ఇన్‌స్పెక్టర్ అడిగినప్పుడు చూపించాల్సి ఉంటుందని, పన్ను ఎగ్గొట్టకుండా ఉండేందుకు... పన్ను వసూళ్లు పెంచుకునేందుకు ఈ వే బిల్లును తీసుకొచ్చినట్లు వివరించారు. ప్రస్తుతం నగదు లావాదేవీల ద్వారా పన్ను వసూళ్లు తగ్గుతున్నాయన్నారు. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే కొత్త ఈ వేబిల్లు ద్వారా రూ.50వేల కంటే ఎక్కువ విలువ చేసే సరకు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి సరకు తరలిస్తుంటే ఈ వేబిల్లు తప్పనిసరి. అక్టోబర్ 1, 2018 నుంచి ఈ-వాలెట్ స్కీంను అమల్లోకి తెచ్చి ఎగుమతిదారులకు రీఫండ్స్ ఇస్తామని తెలిపారు. అక్టోబర్ 6వ తేదీన జరిగిన సమావేశంలో ఎగుమతిదారులకు కొన్ని మినహాయింపులు ప్రకటించింది. వాటిని క్లెయిమ్ చేసుకోవచ్చునని తెలిపింది. ఉదాహరణకు మర్చంట్ ఎగుమతి దారులు ఎగుమతుల కోసం కొనుగోలు చేసిన సరకుపై 0.1 శాతం పన్ను చెల్లించి, ఆ మొత్తాన్ని రీఫండ్ కింద క్లెయిమ్ తీసుకోవచ్చునని జీఎస్టి మండలి విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. విదేశాలకు ఎగుమతి చేసే ఎగుమతి దారులకు ఇది వర్తిస్తుంది. అదే విధంగా జూన్ 30 వరకు టీడీఎస్ డిడక్షన్, టీసీఎస్ కలెక్షన్లను రివర్స్ చార్జ్ మెకానిజమ్‌ను నిలిపివేసినట్లు స్పష్టం చేసింది.గతంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వల్ల తలెత్తిన ఇబ్బందుల వల్ల పన్ను చెల్లింపు దారులు ఇబ్బంది పడితే వారి ఇబ్బందులను పరిష్కరించాలని కూడా జీఎస్టి మండలి తీర్మానించింది.

## పన్ను రాబడులే లక్ష్యం

**కొత్తవేం కాదుః**

వే బిల్లులు జీఎస్టీతో అమలు లోకి వచ్చిన తర్వాత వచ్చిన కొత్తవేం కాదు. 50ఏళ్లకు ముందునుంచే ఇవి వాడుకలో ఉన్నాయి. వ్యాపార వర్గాలు, రవాణా సంస్థలకు ఈ పదం సపరిచితమే. 2005కుముందు ఉన్న రాష్ట్రాల సాధారణ విక్రయ పన్ను 2005నుంచి 2017 వరకు అమలైన రాష్ట్రాల విలువ ఆధారిత పన్ను(వ్యాట్) సమయాల్లోనూ వే బిల్లుల వినియోగం కొనసాగింది.

**ఇవి ఎందుకంటేః**

సరుకు, వస్తువులను ఒక ప్రదేశః నుంచి మరో ప్రదేశానికి తరలించేందుకు ఈ వే బిల్లులు తీసుకోవాలి. ఈ పత్రం ప్రభుత్వం జారీ చేస్తుంది. తొలి దశలో ఇవి ముందస్తుగా ముద్రించిన విధానంలో అధికార వ్యవస్థ ధృవీకరణతో చెల్లుబాటయ్యేవి. ఇప్పుడు వీటిని ఆన్‌లైన్‌లో చేస్తారు. నమోదైన డీలర్ ఎవరైనా వే బిల్లులను వ్యక్తి లేదా కొనుగోలు దారుకు జారీ చేస్తారు. రోడ్డు, రైలు, విమాన, నౌక మార్గంలో సరుకు రవాణాకు సరఫరాదార్లకు ఇచ్చే అధికారిక ధృవీకరణే ఈ వే బిల్లు.

**లక్ష్యం...**

పన్నుల ఎగవేతను నిరోధించడమే దీని ప్రధాన లక్ష్యం. సరఫరా అవుతున్న సరుకుపై నియంత్రణ అమలులోకి రానుంది. ఏ సరుకు రవాణా అవుతోంది. ఏ ప్రాంతానికి చేరుతోంది. విక్రయదారు, కొనుగోలు దారు ఎవరెవరు...ఎంత పరిమాణం.. వంటి అంశాలపై ప్రభుత్వానికి స్పష్టత రానుంది. వ్యాపార లావాదేవీలపై ప్రభుత్వానికి అవగాహన పెరగనుంది.

**జీఎస్టీతో రాబడి అంచనాలపై ప్రభావంః**

కాగా జీఎస్టీ అమలుతో రాష్ట్ర బడ్జెట్ అంచనాలపై కొంత ప్రభావం పడే అవకాశముంది. 14.5 శాతం పరిధిలోని పన్నుల జాబితాలోని అంశాలు 18 శాతంలోకి వెళ్లడం, భారీగా సీఎస్టీ బకాయిలు పేరుకుపోవడం. వాటిని తిరిగి చెల్లించేది లేదని కేంద్రం స్పష్టం చేయడం, పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టులపై పెరగనున్న భారంతో బడ్జెట్ అంచనాలు కొంత గతి తప్పనున్నాయి. ఈ ఏడాది మొత్తం రాష్ట్ర బడ్జెట్ రూ. 1,49,646కోట్లు కాగా ఇందులో నిర్వహణా వ్యయం రూ. 61,607.20 కోట్లుగా, ప్రగతి పద్దు కింద రూ. 88,038 కోట్లుగా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా [illegible]

# థర్డ్ పార్టీ ప్రీమియం చౌక

**• చిన్న కార్లు, 75 సీసీ బైక్‌లకు వర్తింపు**

**• వాణిజ్య వాహనాల ప్రీమియం పెంపు**

**న్యూఢిల్లీ :** బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏ చిన్న ప్రైవేట్ కార్లు, ద్విచక్ర వాహనాలపై ప్రీమియం తగ్గించాలనే ప్రతిపాదన చేసింది. అదే సమయంలో పలు రకాలకు చెందిన గూడ్స్ వాహనాలు (సరకు రవాణా) వాహనాల ప్రీమియం పెంచాలని నిర్ణయించింది. ప్రభుత్వరంగానికి చెందిన బీమా నియంత్రణ సంస్థ 2018-19 ఆర్థికసంవత్సరానికి మోటార్ థర్డ్‌పార్టీ (టీపీ) ప్రీమియం రేట్ల ముసాయిదాను విడుదల చేసింది. దీనిపై భాగస్వాములు అభిప్రాయాలను మార్చి 22వ తేదీలోగా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతిపాదించిన ముసాయిదాలో ఈ-రిక్షా ప్రీమియంలపై ప్రస్తుతం రూ.1, 440 నుంచి వచ్చే ఏప్రిల్1 నుంచి ఇది కాస్తా రూ.1,685 అవుతుంది. కార్ల థర్డ్ ప్రీమియం విషయానికి వస్తే 1,000 సీసీ అంత కంటే తక్కువ సామర్థ్యం కలిగిన ఇంజిన్లపై ప్రస్తుతం రూ.2, 055 ప్రీమియం నుంచి రూ.1,850కి సవరించారు. అయితే 1,000 సీసీ ఇంజిన్ సామర్థ్యం కంటే ఎక్కువ ఉండే కార్లపై ప్రీమియంలో ఎలాంటి మార్పుల్లేవు. ఒక వేళ ముసాయిదా ఆమోదం పొందితే.. ద్విచక్ర వాహనాల ప్రీమియం 75 సీసీ కంటే తక్కువ ఇంజిన్ సామర్థ్యం కలిగిన వాహనాలపై ప్రస్తుతం రూ. 569 ప్రీమియం వసూలు చేస్తున్నారు. ఇది రూ.427కు దిగివస్తుంది. అయితే 75 సీసీ నుంచి 150 సీసీ బైక్‌ల విషయానికి వస్తే ప్రీమియంలలో ఎలాంటి మార్పుల్లేవు. ఇక సూపర్‌బైక్‌ల విషయానికి వస్తే 350 సీసీ ఇంజిన్ కలిగిన బైక్‌లపై రెట్టింపు ప్రీమియం ప్రతిపాదించారు. ఇది కాస్తా రూ.2,323కు చేరుతుంది. 150 నుంచి 350 సీసీ బైక్‌లపై ప్రీమియం పెంచుతూ ప్రతిపాదనలు చేసింది. ఇక వాణిజ్య వాహనాల విషయానికి వస్తే ప్రస్తుతం ప్రీమియం రేట్లను యధాతథంగా కొనసాగించే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. 40వేల కిలోల సరకు చేరవేసే వాణిజ్య వాహనాలపై ప్రీమియంను రూ.33,024 నుంచి రూ.39,299కి పెంచుతూ ప్రతిపాదన చేశారు. ఇక వింటేజ్ కార్ల విషయానికి వస్తే .. వింటేజ్ అండ్ క్లాసిక్ కార్ క్లబ్ ఆఫ్ ఇండియా వారు వింటేజ్ కారు అని సర్టిఫై చేస్తే ప్రైవేట్ కారు యజమానులకు 50 శాతం డిస్కౌంట్ అనుమతిస్తారు. కొన్ని రకాల కార్లపై థర్డ్ పార్టీ ప్రీమియం తగ్గించాలని ప్రతిపాదనలు చేసింది. అదే సమయంలో వ్యవసాయరంగానికి వినియోగించే ట్రాక్టర్లు 6 హెచ్‌పీలపై ప్రీమియంనురూ.653 నుంచి రూ.816కు పెంచారు. ఇన్స్యూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా (ఐఐబీఐ) అందించిన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకొని 2018-19 ఆర్థిక సంవత్సరానికి థర్డ్‌పార్టీ ప్రీమియంలను ప్రతిపాదించామని ఐఆర్‌డీఏ పేర్కొంది.



# ఏడాదికో మొబైల్‌ఫోన్ మారుద్దాం


**• ఇది భారతీయుల మనోగతం • ఆన్‌లైన్ సైట్ క్వికర్ బజార్ అధ్యయనంలో తేలిన నిజాలు**

Quicker

**హైదరాబాద్ :** ప్రస్తుతం సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకు చేతిలో మొబైల్‌ఫోన్ లేదంటే పొద్దుగడవదు. మొబైల్‌ఫోన్లు మన జీవితాల్లో ఒక భాగమైపోయాయి. దీనిపై తాజాగా క్వికర్‌బజార్ ఆన్‌లైన్‌లోల జరిపిన అధ్యయనంలో తేలిన కొన్ని అంశాలు ఇక్కడ చూద్దాం. మన దేశంలోని 40 శాతం మంది ప్రజలు ఏడాదికో మొబైల్‌ఫోన్ మార్చాలనుకుంటున్నారు. చాలా మంది యువకులు మాత్రం మార్కెట్లోకి వచ్చే అత్యాధునిక స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. 50 శాతం మంది వినియోగదారులు అత్యాధునికస్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేస్తే పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందన్న అవగాహన కలిగి ఉన్నారు. అదే సమయంలో ఖరీదైన బ్రాండ్లు [illegible] బ్రాండ్ల వైపు చాలా మంది కస్టమర్లు మొగ్గుచూపారు. ఇతర బ్రాండ్లు ఉదాహరణ ఒప్పో, వివో, లావాలు మాత్రం కొత్త కొత్త ఫీచర్ల వైపు పోవడం లేదని పేర్కొంది. అదే క్వికర్ బజార్ అధ్యయనంలో తేలిందేమిటంటే 75 శాతం మంది ప్రజలు మొబైల్‌ఫోన్‌పై రూ.10వేల కంటే ఎక్కువ మొత్తం వ్యయం చేయడానికి సిద్దంగా ఉన్నారు. కేవలం 3 శాతం మంది ప్రజలుమాత్రం రూ.5వేల కంటే తక్కువ రకం ఫోన్లు కొనుగోలు చేయడానికి మొగ్గుచూపారు. దీన్ని బట్టి చూస్తే చాలా మంది వినియోగ దారులు ధర కాస్తా ఎక్కువైనా.. అత్యాధునిక మోడల్‌తో పాటు అదనపు ఫీచర్లు ఎక్కువగా ఉండే ఫోన్లు కొనుగోలు చేయాలని భావిస్తున్నారని తెలుస్తోంది.

ఇదే అధ్యయనంలో 55 శాతం వినియోగదారులు లెటెస్ట్ టెక్నాలజీకి అప్‌డేట్ కావడానికి మొగ్గు చూపుతున్నారని తెలిసింది. కేవలం తొమ్మిది శాతం మంది మాత్రం తమ ఫోన్లుచోరీ అయినా.. లేదా పగిలిపోతేనే మాత్రం కొనుగోలు చేస్తామని స్పష్టంచేశారు.

తాజాగా హాంగ్‌కాంగ్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న కౌంటర్ పాయింట్ రీసెర్చి తాజా అధ్యయనంలో తేలిదేమిటంటే గ్లోబల్ మార్కెట్లో సరికొత్త స్మార్ట్‌ఫోన్ మార్కెట్ ఏడాది ప్రాతిపదికన చూస్తే గతేడాది 2017లో 13 శాతం పెరిగి 140 మిలియన్ యూనిట్లకు చేరిందని తెలిపింది. కాగా అంతకు ముందు ఏడాది ఇదేస్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో కేవలం మూడు శాతం మాత్రమే వృద్ధి కనిపించింది. అయితే అత్యాధునిక స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్లకు అతి పెద్ద మార్కెట్లు అమెరికా, యూరోప్ లు అగ్రస్థానంలో ఉంటే, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఆఫ్రికా, ఆగ్నేయాసియా, ఇండియాలు కూడా ఉన్నాయని తేల్చిచెప్పింది.



# ఏడేళ్ల ప్రయాణం..

# అడుగడుగునా ప్రభంజనం

**• ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటం**

**• రేపు వైకాపా ఆవిర్భావ దినోత్సవం**



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆత్మగౌరవాన్ని అవహేళనగా చూడటంతోనే ఆలోచన పుట్టింది. పార్టీ ఏర్పాటుకు దారితీసింది. పార్టీ ఆవిర్భావమే ఒక సంచలనంగా మారింది. ప్రజలకు మెరుగైన పాలన, విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయాలే లక్ష్యాలుగా చేసుకుని ప్రజా క్షేత్రంలోకి అడుగిడింది. ఒక మహనీయుడి హఠాన్మరణంతో గెండెలవిసేలా రోదిస్తున్న వేల కుటుంబాలను ఓదార్చాలన్న లక్ష్యానికి అడ్డుచెప్పిన ఢిల్లీ పెద్దల అహంకారాన్ని సవాల్ చేస్తూ..తండ్రి ఆశయాలకు అనుగుణంగా తమకు అండగా నిలచిన ప్రజలకు తోడుగా ఉండాలనే ఆశయంతోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటైంది. తండ్రికి తగ్గ తనయుడిగా మడమ తిప్పని సంకల్పంతో మార్చి 12, 2011న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం జరిగింది. పార్టీ ఏర్పాటుచేసి ఏడు సంవత్సరాలు పూర్తిచేసి, ఈనెల 12నాటికి విజయవంతంగా ఎనిమిదో సంవత్సరంలోకి అడుగిడబోతోంది. ఈ ఏడేళ్ల ప్రయాణంలో ఎన్నో విజయాలు..మరెన్నో అవమానాలు..అడుగుడునా పోరాటాలు చేస్తూ ప్రజా క్షేత్రంలో తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది ఒక జాతీయ పార్టీ, దాదాపు రెండు దశాబ్దాలు అధికారం అనుభవించిన మరో ప్రాంతీయ పార్టీ కలిసి అనుక్షణం వేదిస్తున్నా మొక్కవోని ఆత్మస్థైర్యంతో పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్‌రెడ్డి నూటికి నూరు మార్కులు సాధించారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతమైనా..ఏ కులమైనా..ఏ మతమైనా..వారికి అపద వచ్చినప్పుడు నేనున్నానంటూ భరోసా కల్పించారు జగన్. యువత, శ్రామికులు, రైతులు ఎజెండాగా జెండా తయారుచేసి వారి సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తూ వచ్చున్నారు. ప్రజా నాయకుడిగా, ప్రతిపక్షనేతగా అటు ప్రజా క్షేత్రంలోనూ ఇటు అసెంబ్లీలోనూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. పోరాట యోధుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

**ఆవిర్భావంతోనే విజయపరంపర..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంతోనే సంచన విజయాలు నమోదు చేసుకుంది. రెండు ప్రధాన పార్టీలను ఢీకొని సంచనాలకు కేంద్రబిందువుగా నిలచింది. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి కడప ఎంపీగా 5 లక్షల పైచిలుకు ఓట్ల మెజార్టీతో దేశంలోనే అత్యధిక మెజార్టీ సాధించిన ఎంపీల్లో ఒకరిగా చరిత్ర సృష్టించారు. పార్టీ గౌరవాధ్యక్షులు వైయస్ విజయ్మ పులివెందుల స్థానం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అలా ఇద్దరితో మొదలైన పార్టీ ప్రయాణం ఈ ఏడేళ్లలో ప్రతిపక్ష హోదాకి ఎగబాకింది. అధికారాన్ని అతికొద్ది ఓట్ల దూరంలోనే ఆగిపోయినా ప్రజా సమస్యల మీద పోరాడటంలో మాత్రం జాతీయ పార్టీలను కూడా తలదన్నే రీతిలో వైయస్సార్‌సీపీని నడిపిస్తున్నారు జగన్ మోహన్ రెడ్డి. పార్టీ ఏర్పాటైన తరువాత అతికొద్ది రోజుల్లోనే 18 స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించింది. 2014 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోని 67 అసెంబ్లీస్థానాలు, 8 ఎంపీలతో రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అధికార పార్టీతో పోల్చుకుంటే కేవలం 2 శాతం కన్నా తక్కువ ఓట్లతో వెనుకబడి ప్రభుత్వ ఏర్పాటుకు దూరమైనా ప్రజా క్షేత్రంలోనే ప్రజా సమస్యలపై పోరాడుతూ వస్తోంది.

**ఒకే కుటుంబం నుండి ముగ్గురు పాదయాత్రలు**

మహానేత వైయస్సార్ కుటుంబం నుండి ముగ్గురు పాదయాత్రలు చేయడం విశేషం. భారత దేశ చరిత్రలో ఇలా ఎక్కడా ఒకే కుటుంబం నుండి ముగ్గురు పాదయాత్రలు చేసిన దాఖలాలు లేనేలేవు. కాంగ్రెస్‌ను ఎదిరించినందకు పార్టీ అధినేతను అక్రమ కేసులు బనాయించి జైల్లో నిర్బంధించినా..ఆయన స్థానంలో వైయస్ షర్మిల కఠోర పాదయాత్రచేసి పార్టీని ప్రజల గుండెల్లో నిలపారు. జగనన్న వదిలిన బాణంగా ప్రజల్లోకి దూసుకెళ్లారు. జగన్ గొంతుకను ప్రజల్లో వినిపించి 18 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో పార్టీకి తిరుగులేని విజయాన్ని అందించారు. గతంలో 2014కు ముందు దివంగత మహానేత వైయస్ రాజశేఖర రెడ్డి ప్రజా ప్రస్థానం పేరుతో పాదయాత్ర నిర్వహించగా..వైయస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన తరువాత మహానేత ముద్దుల తనయ వైయస్ షర్మిల మరో మహాప్రస్థానం పేరుతో పార్టీని ముందుకు తీసుకెళితే..వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల పక్షాన పోరాడుతూనే ఉన్నారు.

**సంక్షేమ పథకాలు నిర్వీర్యం కాకూడదనే :**

మహానేత వైయస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిర్వీర్యం చేస్తుండటంపై వైయస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే వస్తున్నారు. పేదలకు అండగా ఉండేందుకు మహానేత ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ఆయన హఠాన్మరణం తరువాత వచ్చిన కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు పథకం ప్రకారం నీరుగార్చాయి. పేదింట్లో చదువుల పంట పండించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి మంగళం పాడేందుకు ఫీజులు అమాంతం రెండింతలు పెంచేశారు. విడతలవారీగా ఆరోగ్య శ్రీ కిందకు వచ్చే వ్యాధులను తొలగిస్తూ వచ్చారు. చివరకు ఆంధ్రాలో తప్ప ఎక్కడా ఆరోగ్య శ్రీ అమలుకాని పరిస్థితి కల్పించారు. పథకం నిర్వీర్యం కావడంతో ఎంతో మంది డబ్బులు చెల్లించి కార్పొరేట్ వైద్యం చేయించుకోలేక ప్రాణాలు వదిలారు. ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యారు. ఇదే వైయస్ జగన్‌ను తీవ్రంగా కలచివేసింది. ప్రభుత్వంపై యుద్ధానికి పూనుకునేలా చేసింది. ఇదేకాక రైతుల పక్షాన కరువొచ్చినప్పుడు, వరదొచ్చినప్పుడు, డ్వాక్రా రుణాలు మాఫీ కాలేదని, రైతు రుణమాఫీ జరగలేదని, అప్పులపాలై రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు..జనం కష్టంలో ఉన్నప్పుడు వారిని పలకరించే తొలి పిలుపు వైయస్ జగనే అయ్యారు.

**ప్రత్యేక హోదా కోసం ప్రాణాలు ఫణంగా పెట్టిన జగన్**

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమంటూ వైయస్ జగన్ తన ప్రాణాలను ఫణంగా పెట్టారు. గతంలో రైతు సమస్యలు, విద్యార్థుల సమస్యలు, ఇలా అనేక సమస్యలపై 24 గంటల నుండి 72 గంటల వరకు దీక్షలు చేసిన జగన్ ప్రత్యేక హోదా కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. అంతేకాదు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేలను లోబర్చుకుని వారికి మంత్రి పదవులు కట్టబెట్టిన సందర్భంలో అసెంబ్లీ సమావేశాలను బాయ్‌కాట్ చేసి మరోవారు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. వ్యక్తి స్వార్థం విడనాడి సంఘ సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హోదాలో చేస్తున్న ప్రజా పోరాటాలకు ప్రజల నుండి మద్దతు పెరుగుతూ వస్తోంది.

## స్వచ్ఛతా ఎక్సలెన్స్ అవార్డుల పంట

**• దేశవ్యాప్తంగా 57 అవార్డులలో 10 ఏపీకే • మహిళా సమాఖ్యల సహకారంతో వరించిన అవార్డులు • ఈ నెల 23న ఢిల్లీలో అవార్డుల ప్రదానోత్సవం**

**అమరావతి, ఆంధ్రప్రభ:** జాతీయ స్థాయిలో ప్రకటించిన స్వచ్చతా ఎక్సెలెన్స్ అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌కు అవార్డుల పంట పండింది. భారత ప్రభుత్వ గృహ మరియు పట్టణాభివృద్ధి వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రకటించిన ఈ అవార్డులతో రాష్ట్ర ఖ్యాతి పెరిగింది. దేశవ్యాప్తంగా ఏరియా లెవెల్ ఫెడరేషన్ (స్లమ్ సమాఖ్య) 57 అవార్డులు ప్రకటిస్తే వాటిలో 10 అవార్డులు ఆంధ్రప్రదేశ్‌లోని సమాఖ్యలు దక్కించుకున్నాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని పట్టణాల నుండి ఈ అవార్డుల కోసం మహిళా సమాఖ్యలు పోటీపడగా 10 అవార్డులను ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పట్టణాల్లోని మహిళా సంఘాలు దక్కించుకోవడం విశేషం. గుంటూరు జిల్లాలోని 5 సంఘాలకు, ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో రెండేసి సంఘాలు, తూర్పు గోదావరి జిల్లాలోని ఒక సంఘం ఈ వార్డులకు ఎంపికయ్యాయి. ఈ అవార్డులను ఈనెల 23న ఢిల్లీలో గృహ మరియు పట్టణాభివృద్ధి వ్యవహారాల మంత్రిత్వ శాఖ అందజేయనుంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా అన్ని మునిసిపాలిటీలలో పారిశుధ్యం మరియు ఘన వ్యర్థపదార్థాల నిర్వహణపై భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం మరియు మౌలిక సదుపాయాల కల్పనలో మెప్మా సభ్యులు కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా స్వచ్ఛాంధ్రలోని అవగాహనా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడంలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాయి. స్వచ్ఛ భారత్ నిర్మాణంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్ర భాగాన నిలపడంలో ఈ సంఘాలు కీలకపాత్ర పోషించాయి. కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే రాష్ట్రంలోని అన్ని పట్టణాలను బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా మార్చిన తీరు అరుదైన రికార్డును నెలకొల్పింది. తడిచెత్త మరియు పొడిచెత్తపై ఇంటింటి అవగాహన కల్పించడంలో కూడా ఈ సంఘాలు తమ వంతు పాత్రను సమర్థవంతంగా పోషించాయి. పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్మాణం అంశాల్లో ఇంటింటి ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో అవగాహన కల్పించగలిగారు. ఫలితంగా మంచి ఫలితాలు సాధించగలిగారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా నెలవారి సంఘ సమావేశాలు నిర్వహించడం, ఆ సమావేశాల్లో పురోగతిపై చర్చించి తదుపరి చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చడంలో మహిళా సంఘాల పనితీరు అద్భుతమైన ఫలితాన్ని కనబర్చింది. అయితే, ఈ ఫలితాలు నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ కీర్తి కిరీటంలో మకుటంగా మారాయి.

**అవార్డులకు ఎంపికైన సమాఖ్యల వివరాలు ఇవే..**

గుంటూరు జిల్లాలోని నరసారావుపేట మునిసిపాలిటీలోని శివపార్వతి స్లమ్ సమాఖ్య, సత్తెనపల్లి మునిసిపాలిటీలోని రంగాకాలనీ స్లమ్ సమాఖ్య, గుంటూరులోని అభ్యుదయ శివనాగరాజు సమాఖ్, బాలాజీ నగర్1 స్లమ్ సమాఖ్యలు, తెనాలిలోని ఇస్లాంపేట మహిళా స్లమ్ సమాఖ్య, ప్రకాశం జిల్లాలోని చీరాల మునిసిపాలిటీకి చెందిన లక్ష్మీ గాయత్రి స్లమ్ సమాఖ్య, చీమకుర్తి మునిసిపాలిటీకి చెందిన సాయికృష్ణ స్లమ్ సమాఖ్య, విజయనగరం జిల్లాలోని సాలూరు మునిసిపాలిటీకి చెందిన శ్రీ శ్యామలగౌరి స్లమ్ సమాఖ్య, నెల్లిమర్ల మునిసిపాలిటీకి చెందిన శ్రీ విద్యా స్లమ్ సమాఖ్య, తూర్పు గోదావరి జిల్లాలోని సామర్లకోట మునిసిపాలిటీ పరిధిలోని శ్రీరామ స్లమ్ సమాఖ్యలు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికయ్యాయి.

**సమాఖ్యలకు మంత్రి నారాయణ అభినందనలు**

జాతీయ స్థాయిలో 10 అవార్డులను ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘాలు దక్కించుకోవడం రాష్ట్రానికే గర్వకారణమని రాష్ట్ర పురపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ హర్షం వ్యక్తంచేశారు. ఈ అవార్డులు దక్కేలా పనిచేసి రాష్ట్రాన్ని దేశస్థాయిలో నిలబెట్టిన సమాఖ్యలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగానే నేడు రాష్ట్రానికి ఇన్ని అవార్డులు దక్కాయన్నారు. ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో అధికారులకు చేసిన దిశానిర్దేశాన్ని మెప్మా డైరెక్టర్ చిన తాతయ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాలను స్వచ్ఛాంధ్రలో భాగస్వామ్యులను చేసిన తీరు అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన మునిసిపాలిటీల్లోనూ మహిళా సమాఖ్యలు పనిచేసి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కేవలం అవార్డులు రావడమేకాదని, మనం కూడా మంచి పరిసరాలతో మంచి ఆరోగ్యంతో ఉండేందుకు అవకాశముందని, ఆ విషయాన్ని గమనించి అధికారులు, సమాఖ్య ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. కాగా, అవార్డులు దక్కించుకున్న మహిళా సమాఖ్యలకు మెప్మా డైరెక్టర్ చిన తాతయ్య ప్రత్యేకంగా అభినందించారు.

## అజయ్, విజయ్‌లకు ప్రభుత్వ సహాయం

**• పేరెంట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ**



**కేపీహెచ్‌బీకాలనీ, ప్రభ న్యూస్ :** అమెరికాలో షార్ట్ ఫిల్మ్‌లు నిర్మించి పలు అవార్డులు సొంతం చేసుకుంటున్న తెలంగాణ యువకులు అజయ్, విజయ్‌లకు ఆంధ్రప్రదేశ్ తరపున సహాయ సహకారాలు అందచేస్తానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లు అజయ్, విజయ్‌ల తల్లిదండ్రులు ఆర్.బి.ఆంజనేయులు సాగర్, సులోచనలు తెలియచేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు రావుల చంద్రశేఖర్‌రెడ్డితో చంద్రబాబు నాయుడును కలిసిన వారు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమారులు అజయ్, విజయ్‌లు ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి అక్కడ తమకున్న ఫ్యాషన్‌తో సినీ రంగంలో షార్ట్ ఫిల్మ్‌లు నిర్మించి అనేక అవార్డులను గెలుచుకోవడమే కాకుండా ఉత్తమ సినిమాలను ఎంపిక చేసే జ్యూరీ బోర్డులో కూడా సభ్యులుగా ఎంపికయ్యారని తెలియచేశారు. వారికి వచ్చిన అవార్డులు, తీసిన సినిమాల గురించి చంద్రబాబు నాయుడుకి ఫోటోలతో సహా చూపించి వివరించగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ చిన్నారులిద్దరికి చక్కటి భవిష్యత్తు ఉంటుందని, అమరావతి లాంటి ప్రాంతంలో సినీ స్టూడియోల్లాంటివి ఏర్పాటు చేసుకుంటామంటే తమ ప్రభుత్వం అన్ని విధాల సహకరమందిస్తుందని తెలిపినట్లు చెప్పారు. గద్వాల్ జిల్లా, రంగాపురంనకు చెందిన తాను వ్యవసాయాన్ని చేసి పిల్లల ఉన్నత చదువుల కోసం అమెరికా పంపించగా వారు చదువుతో పాటు తమకున్న మక్కువతో సినీ రంగంలోకి ప్రవేశించి అమెరికాలో అవార్డులు సాధించడం ద్వారా తెలంగాణ ఖ్యాతిని ఇనుమడింప చేయడం పట్ల ఆంజనేయులుసాగర్ హర్షం వ్యక్తం చేశారు.

## రైతు పక్షపాతి చంద్రబాబు

**• రైతు రథాలు పంపిణీ చేసిన ఎంపి కేశినేని**



**అమరావతి, ఆంధ్రప్రభ:** వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక వ్యవసాయ పద్ధతులను రైతులకు పరిచయం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ అన్నారు. రైతుల కోసం నిరంతరం పాటుపడే నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఆయన పేర్కొన్నారు. శనివారం విజయవాడలోని కేశినేని భవన్‌లో రైతులకు ట్రాక్టర్ల పంపిణీ కార్యాక్రమం జరిగింది. రైతులకు 12 రైతు రథం ట్రాక్టర్లను కేశినేని శ్రీనివాస్ (నాని) అందజేశారు. ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ మాట్లాడుతూ ఎంపీ నాని పేదవారి జీవితాలలో వెలుగులు నింపుతున్నరి కొనియాడారు. నియోజకవర్గం ప్రజలకు రైతు రథం ట్రాక్టర్లను అందించడం అభినందనీయం అన్నారు. పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాను విజయవాడ తీసుకువచ్చి నియోజవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ గోగుల వెంకట రమణ, తిరువూరు పార్టీ అధ్యక్షులు బొమ్మసాని మహేష్, పార్టీ నాయకులు గన్నే వెంకట నారాయణ ప్రసాద్, కాట్రగడ్డ బాబు, లింగమనేని శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.

## నౌకాదళం సర్వసన్నద్ధం కావాలి

**• నౌకాదళ ప్రధానాధికారి సునీల్ లాంబా**



**విశాఖపట్నం, ప్రభ న్యూస్ :** హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రతాపరమైన అన్ని సవాళ్ళనూ ఎదుర్కొనేందుకు నౌకాదళంలోని నౌకలు, జలాంతర్గాములు, వైమానిక విభాగాలు ఎప్పుడూ సన్నద్ధంగా ఉండాలని నౌకదళ ప్రధానాధికారి అడ్మిరల్ సునీల్ లాంబా అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం తూర్పు నౌకాదళానికి శనివారం వచ్చిన ఆయన అన్ని విభాగాల ఆఫీసర్లు, సెయిలర్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ మహాసముద్ర ప్రాంతంలో మన పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో భద్రత బాధ్యత నౌకాదళానిదేనని అన్నారు. అనంతరం ఆయన ఐఎన్ఎస్ కళింగ, ఐఎన్ఎస్ కర్ణలను సందర్శించారు. ఆదివారం ఆయన గవర్నింగ్ కౌన్సిల్ మీటింగ్ (జీసీఎం), నేవల్ ఫౌండేషన్ వార్షిక జనరల్ బాడీ సమావేశం (ఏజీఎం)లకు పాల్గొంటారు. నేవీ ఫౌండేషన్ ఏజీఎంకి పదిహేను ఛాప్టర్ల అధ్యక్షులు, కార్యదర్శులు హాజరవుతారు. శనివారంనాటి కార్యక్రమాల్లో తూర్పు నౌకాదళ ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ కరంబీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు ఏపీ అసెంబ్లీ భవనం

**• సీఎంల మధ్య కుదిరిన అంగీకారం**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన హైదరాబాద్‌లోని శాసనసభ భవనాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణాకు అప్పగించింది. పదేళ్ళపాటు ఈ నగరం ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పటికీ, పరిపాలనా వ్యవస్థను పూర్తిగా అమరావతికి తరలించడంతో ఇక్కడున్న అసెంబ్లీ భవనం ఖాళీగా మిగిలిపోయింది. గడిచిన మూడేళ్ళపాటు ఏపీకి కేటాయించిన పాత భవనంలోనే ఆ రాష్ట్ర శాసన సభ సమావేశాలను నిర్వహించారు. అమరావతిలో తాత్కాలిక అసెంబ్లీ భవనం నిర్మించడంతో 2017-18 బడ్జెట్ సమావేశాల నుంచీ అక్కడే నిర్వహిస్తూ వస్తున్నారు. గత ఏడాది కాలంగా ఇక్కడున్న ఏపీ అసెంబ్లీ భవనం నిరుపయోగంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఆ రాష్ట్ర భూభాగానికి తరలి పోవడంతో ఇక్కడున్న భవనాలను ఉపయోగించుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో అసెంబ్లీ భవనాన్ని తెలంగాణాలకు ఇచ్చేయాలని పలు సందర్భాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు చేసిన విజ్ఞప్తి మేరకు ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఏపీ సాధారణ పరిపాలనశాఖ అధికారులు ఈ మేరకు శనివారం ఏపీ శాసనసభ భవనాన్ని తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించినట్లు తెలిసింది. ఈ భవనం అత్యంత పురాతనమైనది అయినందున ప్రక్కనే మరో భవనాన్ని నిర్మించారు. 1983 నుంచీ కొత్త భవనంలోనే శాసనసభ సమావేశాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర విభజన పాత భవనాన్ని ఆంధ్రాకు కేటాయించడంతో మరమ్మతులు చేసి అధునాతనంగా తీర్చిదిద్దారు. ఏపీ శాసనసభ సమావేశాలు మూడేళ్ళపాటు ఇక్కడే జరిగాయి. తాజా పరిణామాల నేపథ్యంలో ఇరువురు ముఖ్యమంత్రుల మధ్య సహృద్భావ వాతావరణం ఏర్పడింది. చిక్కుముడిగా ఉన్న విభజన అనంతర సమస్యలను పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. హైదరా బాద్‌లో ఉన్న ఏపీ అసెంబ్లీ భవనాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించారు. అధునాతన సౌకర్యాలు ఉన్న ఈ భవనంలోనే సోమవారం నుంచి ప్రారంభం కానున్న 2018-19 బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నగసింహన్ ప్రసంగించనున్నారు.

## తెలంగాణకు మరో మణిహారం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** తెలంగాణ రాష్ట్రానికి మణిహారంగా నిలిచే మరో భారీ పరిశ్రమ రానుంది. ఏవియేషన్ రంగంలో పేరు పొందిన సంస్థ శాఫ్రాన్ ఎలక్ట్రికల్స్ హైదరాబాద్‌లో తమ ఏరోస్పేస్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు ఢిల్లీలోని ఓ ప్రైవేట్ హోటల్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు సమక్షంలో ఆ సంస్థ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రూ. 52 కోట్ల పెట్టుబడితో సంస్థ నెలకొల్పే యూనిట్ ద్వారా 250 మందికి పైగా ఉపాధి లభించనుంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎకనమిక్ జోన్ (సెజ్)లో ఈ సంస్థ తన యూనిట్‌ను నెలకొల్పనుంది. పూర్తిగా 100 శాతం విదేశీ పెట్టుబడితో వస్తున్న ఈ సంస్థ ఎలక్ట్రికల్ హార్నెస్ పరికరాల అసెంబ్లింగ్ చేయనుంది. వీటిని పౌరవిమానయానంతో పాటు రక్షణ రంగంలోని వాయుసేన కూడా ఉపయోగించుకోనుంది.

## ఆర్టీసీ కార్మికులకు శుభవార్త

**•సమైక్యాంధ్ర సమ్మె కాలాన్ని ప్రత్యేక సెలవుగా గుర్తింపు • రూ.100ల రికవరీ నిలుపుదల చేస్తూ ఆదేశాలు • 2013 పే స్కేలుకు సంబంధించిన 20 శాతం బకాయిలు జూన్ 10న చెల్లింపు • ఏపీఎస్ఆర్టీసీ ఉత్తర్వులు జారీ**

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఎట్టకేలకు ఏపీఎస్ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం మంచి శుభవార్తను అందించింది. ఈనెల 5న విజయవాడ బస్ భవన్‌లో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో గుర్తింపు సంఘం ఎన్ఎంయూతో యాజమాన్యం చర్చలు జరిపి, చేసుకున్న ఒప్పందాల మేరకు సంస్థ వి.సి.ఎండి మాలకొండయ్య శనివారం ఆదేశాలు జారీ చేశారు. 60 రోజుల సమైక్యాంధ్ర సమ్మె కాలానికి ప్రత్యేక సెలవు మంజూరుతో పాటు రూ.100 లు ఆస్పత్రి ఫండ్ రికవరీని నిలపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే 2013 పే స్కేలు బకాయిలు 20 శాతాన్ని జూన్ 10న ఇవ్వడానికి అంగీకరిస్తూ ఆదేలిచ్చారు. ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్యకు అందజేశారు. సమస్యలపై సానుకూలంగా చర్చించి, ఆమోదం తెలపడమే కాకుండా అధికారికంగా శనివారం ఆదేశాలు జారీచేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, రవాణా శాఖా మంత్రి అచ్చెన్నాయుడుకు, సంస్థ వి.సి, ఎండి డాక్టర్ మాలకొండయ్యకు ఎన్ఎంయూ అధ్యక్షులు చల్లా చంద్రయ్య, ఛైర్మన్ ఆర్‌వివిఎస్‌డి ప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పివి రమణారెడ్డి, ఉపాధ్యక్షులు డిఎస్‌పిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త పేస్కేల్ అమలుకు సంబంధించి చర్చలు పురోగమణలో ఉన్నాయని చెప్పారు. త్వరలోనే మెరుగైన వేతన సవరణ జరుగుతుందని భావిస్తున్నామని వారు చెప్పారు.

## ఐఎస్‌టీఎస్‌వో ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విజయభేరీ

**• ల్యాప్‌టాప్స్, టాబ్‌లను సొంతం చేసుకున్న విద్యార్థులు**

**• డాక్టర్ బిఎస్ రావు వెల్లడి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దేశ వ్యాప్తంగా 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు జరిగిన ఐఎన్‌టిఎస్‌వో ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థు లు విజయభేరి మోగించారు. ఆలిండియా స్థాయిలో 75 మంది ల్యాప్‌టాప్‌లను గ్రాండ్ ప్రైజ్‌లుగా గెలుపొందగా 82 మంది విద్యార్థులు ట్యాబ్స్‌ను గెలుపొంది నట్టు శ్రీచైతన్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ బిఎస్ రావు తెలిపారు.

ఆలిండియా మొదటి ర్యాంకును 27 మంది, 2వ ర్యాంకును 25 మంది 3వ ర్యాంక్‌ను 30 మంది సాధించారని చెప్పారు. వీరితోపాటు 114 మంది ప్రత్యేక బహుమతులను 2664 మంది ప్రోత్సాహక బహుమతులను గెలుపొందారని తెలిపారు.

## పెళ్లి వేడుకలో విషాదం

**• కుప్పకూలిన నవవధువు • ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి • మిన్నంటిన బంధువుల రోధనలు**



**సూర్యాపేట, ప్రభన్యూస్ :** మూడుముళ్ళ బంధంతో ఒక్కటై నిండునూరేళ్ళు జీవించాలన్న నూతన జంట కలలు కొన్ని గంటలలోనే కల్లలయ్యాయి. పెళ్లి తంతు పూర్తి చేసుకొని బంధు మిత్రుల సందోహంతో ఊరేగింపుగా ఇంటికి వెళ్తున్న క్రమంలో పెళ్లి కూతురు కుప్పకూలింది. హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషాద సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట పట్టణానికి చెందిన కటకం పుష్పలత, హన్మయ్యల కుమార్తె గాయత్రి(23) వివాహం మహబుబాబాద్‌జిల్లా, నెల్లికుదురు గ్రామానికి చెందిన గుండా వేణుతో స్థానిక జే గార్డెన్‌లో జరిగింది. అనంతరం సంతోషంగా స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాల నుంచి పెళ్లి కుమార్తె ఇంటి వరకు బంధుమిత్రుల సందోహంగా వెళ్తున్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కొబ్బరికాయకొట్టి వాహనం వద్దకు వచ్చి నవవధువు గాయత్రి కుప్పకూలిపోవడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గాయత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ సంఘటనతో రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది. నిండు నూరేళ్లు కలకాలం జీవించాలని ఆశీర్వదించిన బంధుమిత్రుల ముందే నవవధువు మృతి చెందడంతో ఏరియా ఆసుపత్రిలో బంధువులు రోధనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు కూడా అధిక సంఖ్యలో ఏరియా ఆసుపత్రికి తరలి వచ్చి విచారం వ్యక్తం చేశారు.

## టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

**• 15 నుంచి 29 వరకు పది పరీక్షలు • ఉదయం 9.30 గంటల నుంచి 12.15 వరకు నిర్వహణ • మొత్తం 6,16,946 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు • 2,835 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు • సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

**అమరావతి, ఆంధ్రప్రభ:** పరీక్షల సమయం సమీపిస్తుండడంతో పదో తరగతి విద్యార్థుల్లో తీవ్ర ఉత్కంఠత పెరుగుతోంది. ఇప్పటికే రాష్ట్ర ఎస్ఎస్‌సీ బోర్డు ఉన్నతాధికారులు పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుంచి 29 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఉన్నత విద్యాశాఖాధికారులు కింది స్థాయి సిబ్బందికి అన్ని ఆదేశాలు జారీ చేశారు. చీఫ్ పరీక్షల సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, జాయింట్ కస్టోడియన్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్స్, డివిజన్ స్థాయి అధికారులను నియమించారు. పరీక్షలకు మొత్తం 6,16,946 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,835 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈసారి 65 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయబోతున్నారు. కాగా మూల్యాంకణం మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు నిర్వహించనున్నారు. మే మొదటి వారంలో ఫలితాలను వెల్లడించాలని విద్యా శాఖ భావిస్తోంది. ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం తీవ్రంగా యత్నిస్తోంది. అందులో భాగంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ప్రత్యేకించి, శిక్షణ ఇచ్చారు. ఏ విధంగా పరీక్షలను ఎదుర్కోవాలి..ఉత్తమ ఫలితాల సాధనకు సంబంధించి విద్యార్థులను అన్ని విధాలా తీర్చిదిద్దారు. ప్రైవేట్ విద్యా సంస్థలకు ధీటుగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖాధికారులు తగు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే రెగ్యులర్, ప్రైవేట్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12.15 గంటల వరకు జరుగుతాయి. ఈనెల 15న ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష ఉంటుంది. 16న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ 1 ఉంటుంది. 17న సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష ఉంటుంది. 19న ఇంగ్లీస్ పేపర్ 1 ఉంటుంది. 20న ఇంగ్లీష్ పేపర్2 ఉంటుంది. 21న గణితం పేపర్1, 22న గణితం పేపర్ 2, 23న జనరల్ సైన్స్ పేపర్ 1 , 24న జనరల్ సైన్స్ పేపర్ 2, 26న సోషల్ స్టడీస్ పేపర్ 1, 27న సోషల్ పేపర్ 2, 28న మెయిన్ లాంగ్వేజ్ పేపర్ 2 పరీక్ష ఉంటుంది. 29న ఒకేషనల్ కోర్సు థియరీ పరీక్ష ఉంటుంది. హాల్ టిక్కెట్లు అందని విద్యార్థులు, పోగొట్టుకున్న వారు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత ప్రధానోపాధ్యాయుడి చేత అటెస్ట్ చేయించుకోవాలి. చీఫ్ సూపరింటెండెంట్‌కు ఆదేశాలు.

**జంబ్లింగ్ విధానం అమలు**

ఈసారి ఈ రెండు కొత్త విధానాలను అవలంభించబోతున్నారు. ఇన్విజిలేటర్లకు కూడా జంబ్లింగ్ అమలుతో పాటు చూచిరాతకు పాల్పడే విద్యార్థులపై 1997లో తీసుకువచ్చిన జీవో 25 ప్రకారం చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. జంబ్లింగ్ విధానం అమలు పర్యవేక్షణ బాధ్యతను జిల్లా విద్యాశాధికారులకు అప్పగించారు. ప్రతి ఇన్విజిలేటర్ తనకు కేటాయించిన పరీక్షకేంద్రంలో నాలగు రోజులు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అనంతరం మరో పాఠశాలలకు మారుస్తారు. ఇలా పరీక్షలు ముగిసే సమయానికి ఒక్కో ఇన్విజిలేటర్ నాలుగు పాఠశాలలు దాకా మారాల్సి ఉంటుంది. దీని వల్ల అవినీతికి చెక్ పెట్టగలుతామని భావించి, ఈ చర్యలు తీసుకున్నారు. చూచిరాతకు పాల్పడితే విద్యార్థితో పాటు ఆ గదిలోని ఇన్విజిలేటర్లపైనా 1997 చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సమస్యాత్మక ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

**ఈసారి గ్రేడింగ్ పద్ధతికి శ్రీకారం**

ఈసారి నుంచి గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. 92-100 మార్కులు సాధించిన వారికి ( 10 పాయింట్లు ) ఏ-1 గ్రేడు ఇస్తారు. 83 -91 మార్కులు సాధించిన వారికి (9 పాయింట్లు ) ఏ-2 గ్రేడ్, 75 - 82 మార్కులు సాధించిన వారికి ( 8 పాయింట్లు ) బి-1 గ్రేడ్ ఇస్తారు. అదే విధంగా 67-74 మార్కులు సాధించిన వారికి ( 7పాయింట్లు ) బి- 2 గ్రేడ్, 59-66 మార్కులు సాధించిన వారికి ( 6 పాయింట్లు ) సీ-1 గ్రేడ్ , 51-58 మార్కులు సాధించిన వారికి ( 5 పాయింట్లు ) సీ-2 గ్రేడ్, 43 -50 మార్కులు సాధించిన వారికి ( 4 పాయింట్లు ) డీ-1 గ్రేడ్, 35 - 42 మార్కులు సాధించిన వారికి ( 3 పాయింట్లు )డీ-2 గ్రేడ్ ఇస్తారు. 34-0 మార్కులు సాధించిన వారిని ఫైయిల్ చేస్తారు.

## బ్రాహ్మణ సంక్షేమానికి రూ.75 కోట్లు

### దేశంలో కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదే: ఆనంద్‌సూర్య

**అమరావతి, ఆంధ్రప్రభ:** బ్రాహ్మణ సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.75 కోట్లు కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ వైస్ చైర్మన్ వేమూరి ఆనంద్‌సూర్య కృతజ్ఞతలు తెలిపారు. శనివారం విజయవాడ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలోని బ్రాహ్మణుల సంక్షేమం, మెరుగైన జీవనం కోసం విద్యారంగంలో, స్వయంఉపాధి, నైపుణ్య అభివృద్ధి కోసం వివిధ పథకాలను ప్రభుత్వం అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 90 వేల మందికిపైగా లబ్ధి చేకూరినట్లు వెల్లడించారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం దేశచరిత్రలోనే మొట్టమొదటిసారిగా కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. బ్రాహ్మణ సంక్షేమానికి వందల కోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వానికి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. త్వరలో ప్రతి జిల్లాలో ఆంధ్ర కేసరి భవనాల పేరుతో బ్రాహ్మణ కమ్యూనిటీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ఆనంద్‌సూర్య తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌పై సోషల్ మీడియాలో కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలను బ్రాహ్మణ సంఘాలకు తెలిసేలా చేయాలని కోరారు. సమాజంలోని అన్ని వర్గాలలో మనల్ని మనమే కించపరచుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఇబ్బందులుంటే పార్టీలకతీతంగా పరిష్కరించుకోవడానికి తానెప్పుడు సిద్ధమేనని ఆయన అన్నారు. చైర్మన్‌గా తాను బ్రాహ్మణుల డిమాండ్లను, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కె.వెంకటసుబ్బారావు, కార్పొరేటర్ గండూరి మహేష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

## బీసీలకు టీడీపీనే అండ



**అమరావతి, ఆంధ్రప్రభ:** విశ్వబ్రాహ్మణులకు బడ్జెట్‌ను వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.50 కోట్లు పెంచడం పట్ల కార్పొరేషన్ చైర్మన్ సింహాద్రి కనకాచారి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఈమేరకు శనివారం నాడు వెలగపూడి సచివాలయంలో మిడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిల అభ్యున్నతి తెలుగు దేశంతోనే ప్రారంభమైందని పేర్కొన్నారు.

నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విశ్వబ్రాహ్మణుల కులవృత్తిపై ఆధారడి గడుపుతున్న దుర్భర జీవితానికి చలించారని అన్నారు. అదే విధంగా మంచి హృదయంతో కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి ప్రతిబడ్జెట్‌లో కోట్లాది రూపాయిలు పెంచుతూ వచ్చారని అన్నారు. 2015-2016గాను రూ.19 కోట్లు, 2016-2017కి రూ.22కోట్లు, 2017-2018కి రూ.30 కోట్లు ఉండగా, ప్రస్తుత బడ్జెట్ అయిన 2018-2019కి గాను రూ.50 కోట్లకు పెంచడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలోగల విశ్వబ్రాహ్మణసామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికప్పుడు తమదృష్టికి తీసుకువచ్చి, తమకు అండదండలు అందిస్తున్న బిసి మంత్రి అచ్చే న్నాయుడుకు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరి ఉదయలక్ష్మికి సింహాద్రి కనకాచారి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో గల విశ్వబ్రాహ్మణ కార్మికులు అండగా ఉంటామని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కో-ఆపరైటవ్ కార్పొరేషన్ చైర్మన్ సింహాద్రికనకాచారి అన్నారు. ఈసమావేశంలో డైరెక్టర్లు బంగారువెంకటేశ్వర్లు, గోడినర్సింహాచారి, దశరదాచారి బి.ఎం.రామ మూర్తి, ఏలూరు కోటేశ్వరరావు,ముగడ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధికి జగన్ ఆరాటం

### ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు

**అమరావతి, ఆంధ్రప్రభ:** పారిశ్రామిక ప్రోత్సాహాల గురించి మాట్లాడకుండా కేవలం ప్రత్యేకహోదా సెంట్‌మెంట్ ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని ప్రతిపక్షనేత జగన్ చూస్తున్నారని ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు విమర్శించారు. ఆయన చేస్తున్న పోరాటం కేంద్రంపైనా లేక చంద్రబాబుపైనా అన్నది తొలుత స్పష్టం చేయాలన్నారు. శనివారం విజయవాడలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం 16 వేల కోట్ల లోటులో ఉన్నప్పటికీ సంక్షేమానికి ఎటువంటి డోకా లేకుండా పరిపాలన సాగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. జగన్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో చర్చాంశనీయంగా మారిందన్నారు. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని తాముపోరాటం చేస్తుంటే జగన్ మాత్రం కేంద్రానికి ప్రయోజనం కల్పించేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేవలం ప్రధాని మోడీ మెప్పుపొందేందుకే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని అర్జునుడు విమర్శించారు. సమైక్యాంధ్ర ముసుగులో ఆనాడు సోనియాగాంధీతో కుమ్మకై బెయిల్ తెచ్చుకున్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. జగన్‌తో పాటు ఏ-2 ముద్దాయిగా ఉన్న విజయసాయిరెడ్డి కేసుల మాఫీకోసం ప్రధాన మంత్రి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇకనైనా జగన్ బాధ్యతగల ప్రతిపక్షనేతగా వ్యవహరించి రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నెప్రసాద్, కార్యాలయ కార్యదర్శి కె.నాగబాబు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఎం.శోభన్ పాల్గొన్నారు.

## బీజేపీతో జగన్ చేసుకున్న రహస్య ఒప్పందం బహిర్గతం చేయాలి: నాగుల్ మీరా

**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రతిపక్షనేత జగన్‌మోహన్ రెడ్డి బీజేపీతో చేసుకున్న రహస్య ఒప్పందాన్ని బహిర్గతం చేయాలని, అలా జరగని పక్షంలో నార్కో ఎనాలసిస్ పరీక్షలు జరిపైనా సరే బహిర్గతం చేయాలని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా డిమాండ్ చేశారు. రాష్ట్రప్రయోజనాల కన్నా వ్యక్తిగత ప్రయోజనాల కోసం జగన్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. శనివారం విజయవాడలోని కేశినేని భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నాగుల్ మీరా మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి జరగకూడదు, విభజన హామీలు అమలు జరగకూడదని ఆలోచించే వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. బీజేపీతో రహస్య ఒప్పందం చేసుకుని ఏవిధంగా అవిశ్వాస తీర్మానం పెట్టాలని చూస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం చుట్టూ వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి తిరుగుతున్నది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. వైసీపీ అధినేత జగన్ తమ సొంత ప్రయోజనాల కోసం బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. నిన్నటి వరకు ప్రభుత్వం నుంచి బయటకు రమ్మని నేడు తాము బయటకు వచ్చిన తరువాత కుడితిలో పడిన ఎలకలాగా కొట్టుకుంటున్నారని విమర్శించారు. మైనార్టీల అభ్యున్నతికి బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చేసినందుకు ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాజధానికి 'డయేరియా' ఫీవర్

- వారం రోజులుగా పెరుగుతున్న కేసులు
- సహాయక చర్యల్లో తలమునకలవుతున్న అధికారులు
- 198కు చేరిన డయేరియా కేసులు
- 24/7 వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాజధాని నగరం గుంటూరును డయేరియా వణికిస్తోంది. గత ఆరురోజుల నుండి వరుసగా వస్తున్న డయేరియా కేసులు ఏదో రోజుకూడా కూడా నమోదవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పైగా నిన్నటి వరకూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మాత్రమే ఉన్న డయేరియా శుక్రవారం నుండి పశ్చిమ నియోజకవర్గంలో సైతం కొన్ని ప్రాంతాల్లో కేసులు నమోదైనట్లు వార్తలు రావడం ప్రజలను మరింత గందరగోళానికి గురిచేసింది. వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చికిత్సకోసం వస్తున్న బాధితుల సంఖ్య మాత్రం తగ్గడం లేదని స్థానికులు వాపోతున్నారు. గుంటూరు జీజీహెచ్ రోగుల తాకిడి కొనసాగుతూనే ఉంది. జీజీహెచ్‌తోపాటు అనేక ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా ఈ కేసులు నమోదవుతున్నట్లుగా తెలుస్తోంది. తాజాగా శనివారం నాటికి మొత్తంగా 198 కేసులు నమోదైనట్లుగా అధికారిక సమాచారం. అయితే, ప్రభుత్వ వర్గాలు మాత్రం డయేరియా వ్యాధి బారిన పడిన వారు 140 మంది మాత్రమేనని, మిగిలిన 58 మంది సీజనల్ వ్యాధుల బారిన పడినవారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా మరణించిన10 మందిలో కూడా 6గురు మాత్రమే డయేరియా బారిన పడి మృతి చెందినట్లుగా అధికారులు లెక్కలు వేస్తున్నారు. దీంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. వాస్తవిక పరిస్థితులకు, అధికారుల లెక్కలకు పొంతన లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీనికితోడు శనివారంనాటికి పట్టణంలో డయేరియా అదుపులోకి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ కేసులు నమోదవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో డయేరియా పట్ల ప్రజలు భయాందోళనలు వ్యక్తంచేస్తున్నారు. ఈనెల 3వ తేదీన గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పాత గుంటూరు, ఆనందపేట, సంగడిగుంట, చిన్నబజారు, చౌత్రా సెంటర్, ఎల్‌బి నగర్, లాంచెస్టర్ రోడ్డు, వడ్డెర కాలనీ, బాలాజీ నగర్, ఐపీడీ కాలనీ ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదయ్యాయి. గత ఏడు రోజులుగా ఈ ప్రాంతాల్లో ప్రజలు వెయ్యికిపైగా డయేరియాతో ఆస్పత్రిలో చికిత్స పొందగా 10 మంది డయేరియాతో చనిపోయారు. 20 మంది వరకు కిడ్నీ సంబంధిత వ్యాధుల బారినపడి పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గురువారం డయేరియా మృతి కేసు నమోదవకపోవడంతో డయేరియా తగ్గుముఖం పట్టినట్లు అధికారులు భావించారు. కానీ గురువారం రాత్రి నుండి మళ్ళీ డయేరియా కేసుల సంఖ్య పెరగడం మొదలైంది.

**తూర్పు నియోజకవర్గం నుంచి విస్తరిస్తున్న డయేరియా**

తూర్పు నియోజకవర్గం నుండి ఈ డయేరియా క్రమంగా పట్టణంలోని పలు ప్రాంతాలకు విస్తరిస్తోంది. తూర్పు నియోజకవర్గంలో మురికి కాలువలో ఉన్న మంచినీటి పైపులైన్ లీకవడంతో ఈ డయేరియా కేసులు నమోదైనట్లుప్రాథమికంగా గుర్తించారు. డయేరియా విస్తరిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కోన శశిధర్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ లోతుగా అధ్యయనం చేస్తోంది. ప్రాథమికంగా వచ్చిన సమాచారం మేరకు ఈ ఘటనకు సంబంధించి 10 మంది మునిసిపల్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. అదేవిధంగా ఈ వ్యాధి బారిన పడి మృతి చెదిన కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా ప్రభుత్వం ప్రకటించింది. తూర్పు నియోజకవర్గంలో వారం రోజులుగా ఉన్న ప్రాంతాల్లో కాకుండా గురువారం రాత్రి నూతన ప్రాంతాల్లో సైతం డయేరియా కేసులు నమోదవడంతో వైద్యులు, ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. వల్లూరివారితోట, శారదాకాలనీ, నల్లచెరువు, నెహ్రూ నగర్, కొత్తపేట, లాలాపేట, రామిరెడ్డితోట తదితర ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదయ్యాయి. పశ్చిమ నియోజకవర్గంలోని గుజ్జనగుళ్ళ, మల్లికార్జునపేట, కేవీపీ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, నల్లచెరువు తదితర ప్రాంతాల ప్రజలు డయేరియాతో బాధపడుతూ చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చారు. తాడికొండ, లాం, పెదకాకాని ఇతర గ్రామాల్లో సైతం డయేరియాతో బాధపడుతూ చికిత్సకోసం పలువురు జీజీహెచ్‌కు వచ్చారు. కేవలం ఒక్క గుంటూరు జీజీహెచ్‌లోనే గురువారం రాత్రి 8 గంటల నుండి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు ఓపీ వైద్య విభాగంలో 56 మంది, ఇన్‌పేషంట్ల విభాగంలో 36 మంది చేరారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓపీ విభాగంలో 42 మంది, ఇన్‌పేషెంట్ విభాగంలో 32 మంది చికిత్స పొందారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఓపీ విభాగంలో 30 మంది, ఇన్‌పేషెంట్ విభాగంలో 24 మంది చికిత్స పొందారు. జీజీహెచ్‌లో డయేరియా కేసులు పెరుగుతూ ఉండటంతో శుక్రవారం అదనంగా ప్రత్యేక వార్డును ఏర్పాటుచేశారు. జీజీహెచ్‌లో శుక్రవారం 250 మందికిపైగా డయేరియా బాధితులు ఆడ్మిట్ అయి చికిత్స పొందుతున్నారు. వీరిలో పిల్లలు 56 మంది ఉండటంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. శనివారం కూడా ఇదే పరంపర కొనసాగింది.



జీజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతున్న బాధితులు

ఆస్పత్రిలో వారం రోజులుగా డయేరియా బాధితులు చికిత్స పొందుతూ ఉండటంతో ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది ఆస్పత్రిలో మంచినీరు తాగాలంటే భయపడిపోతున్నారు. శుక్రవారం ఆస్పత్రిలో డయేరియా బాధితులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు, మంచినీరు తెప్పించినా డయేరియా భయంతో వాటిని ముట్టుకోకుండా పక్కన పడేశారు. ఇంటివద్ద నుండి కాచి తెచ్చుకున్న నీటినే వైద్య సిబ్బంది తాగుతున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదవుతున్న దృష్ట్యాప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలకు కాచి చల్లార్చిన నీటినే తాగించడం ఉత్తమమని వారు చెబుతున్నారు.

**వైద్యుల పర్యవేక్షణ**

డయేరియా కేసులు రోజురోజుకు పెరుగుతూ ఉండటంతో వైద్యాధికారులు ఆస్పత్రిలో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజునాయుడు, ఆర్ఎంవోలు డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ రమేష్, నర్సింగ్ సూపరింటెండెంట్ పుష్పావతి, పలువురు సీనియర్ వైద్యులు డయేరియా బాధితులు ఉన్న వార్డులపై ప్రత్యేక దృష్టి సారించారు. జూనియర్ వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బందిని పలు వార్డులు నుండి డిప్యుటేషన్‌పై డయేరియా వార్డులకు కేటాయించి సత్వర వైద్య సేవలు అందిస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది సైతం అంబులెన్స్‌ల్లో, ఆటోల్లో వచ్చిన డయేరియా బాధితులను సకాలంలో వార్డులకు చేర్చివారికి మెరుగైన వైద్యసేవలను అందించేందుకు కృషి చేస్తున్నారు. డయేరియా రోగులకు మినరల్ వాటర్ బాటిళ్లను ఆసుపత్రి అధికారులు అందజేస్తున్నారు.

## సమాజంలో నేరస్తులు మంచి జీవితం గడిపేలా చూడాలి

- హోం శాఖ ముఖ్య కార్యదర్శి అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.ఆర్.అనురాధ

**అమరావతి, ఆంధ్రప్రభ:** సమాజంలో నేరగాళ్లు మంచి జీవితం గడిపేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసులు కృషి చేయాల్సిన అవసరం ఉందని హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.ఆర్.అనురాధ అన్నారు. ప్రాసిక్యూషన్స్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో చట్టపరమైన కొత్త పోకడలు (ఎమర్జింగ్‌లీగల్ ట్రెండ్స్) అంశంపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఒక రోజు సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న అనురాధ మాట్లాడుతూ సమాజంలో క్రైమ్ రేటు తగ్గించటంతోపాటు ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండే వాతావరణం కల్పించాలన్నారు. క్రిమినల్స్‌ను శిక్షించడంతో పాటు అమాయకులను కాపాడాల్సిన బాధ్యత విచారణాధికారులపై ఉందన్నారు. తామేం చేసినా చెల్లుతుందనే ధైర్యం క్రిమినల్స్‌లో రాకూడదని ఆమె అన్నారు. క్రైమ్ రేటు తగ్గించేందుకు నేరస్తుల దైనందిన జీవితాన్ని ఓ కంట కనిపెట్టాలని, తద్వారా వారిని నేరాలకు దూరం చేసి మంచి పౌరులుగా తయారయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలానుగుణంగా మారుతున్న న్యాయపరమైన పోకడలపై విచారణ అధికారులకు ఈ తరహా సదస్సులు ఉపయో గపడతాయని చెప్పారు. ఫుడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్స్‌పై తరుచుగా అవగాహనా తరగతులు నిర్వహి స్తున్నట్లు ఆమె పేర్కొ న్నారు. విచారణ అధికా రులు ఎమర్జింగ్ లీగల్ ట్రెండ్స్‌పై ఏరోజుకారోజు చోటుచేసుకునే మార్పులను అవగాహన చేసుకో వాలన్నారు. ఇందుకోసం తరుచు సుప్రీం, హైకోర్టు తీర్పులను పరిశీలిస్తుండాలని ఆమె చెప్పారు. వీటిని ఇక్కడ అన్వయించుకుని ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. విభజనాంధ్రప్రదేశ్‌లో సైబర్ నేరాలపై నమోదయ్యే కేసులను పరిశీలిం చడంతోపాటు చట్టాలపై అవగాహన ద్వారా నూతన విధానాలు తెలుసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో నమోదవుతున్న సైబర్ కేసులను పరిశీలిస్తూ చట్టానికే సవాల్‌గా మారుతున్నట్లు ఆమె చెప్పారు. విజిలెన్స్ తనిఖీల్లో కల్తీలకు సంబంధించిన కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. వీటిలో అత్యధికంగా కల్తీ నెయ్యికి సంబంధించిన కేసులేనన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో టీ పొడి కల్తీ ఎక్కువగా జరుగుతున్నట్లు చెప్పారు. ఔషధాల్లో కూడా కల్తీ జరుగుతున్నట్లు ఇటీవల వెలుగులోకి వస్తున్నట్లు ఆమె తెలిపారు. నిందితులను పట్టుకోవ డంలో అధునాతన పద్ధతులు అమలు చేసి నూతన సాంకేతికపద్ధతులను అవలంభించాల్సి ఉందన్నా రు. పట్టుకున్న నిందితులకు శిక్షలు పడినప్పుడే ప్రాసిక్యూషన్‌కు ప్రాధాన్యత పెరుగుతుందని అనురాధ అన్నారు. ప్రాసిక్యూషన్‌లో మెరుగైన పద్ధతులు అవలంభించేందుకు సరైన లేబరేటరీ సౌకర్యాలు కలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే సైంటిఫిక్‌గా నేరాలను అదుపు చేయడంతో పాటు తగిన సాక్ష్యాలు చూపడం ద్వారా శిక్షలు పడేలా చేయవచ్చన్నారు. విజయవాడ జాయింట్ పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా మాట్లాడుతూ తాను సివిల్స్‌లోకి రాకముందు న్యాయవాదిగా పని చేసినట్లు చెప్పారు. 41ఎ సిఆర్‌పిసి చట్టంపై విచారణ అధికారులకు అవగాహన ఉంటే నిజమైన దోషులకు శిక్షలు పడేలా చేయవచ్చన్నారు. ఇదే సమయంలో 324, 326 చట్టాలపై అవగాహనకు విస్తృతంగా చర్చించాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ప్రాసిక్యూషన్స్ అదనపు డైరెక్టర్ బి.రామకోటేశ్వర రావు, జాయింట్ డైరెక్టర్ వి.రఘురామ్, 13 జిల్లాలకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

### మధురై జాతీయ సమ్మేళనానికి న్యాయాధికారుల ఎంపిక

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** వాణిజ్య వివాదాలు - 2018 అనే అంశంపై మధురై లోని తమిళనాడు రాష్ట్ర జుడీషియల్ అకాడెమీ ప్రాంతీయ కేంద్రంలో 24, 25 తేదీల్లో జరగనున్న జాతీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు ఇద్దరు జిల్లా జడ్జీలను ఎంపిక చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సీహెచ్.మానవేంద్రనాథ్ రాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జిల్లా సెషన్స్ జడ్జి మౌలానా జునైద్ అహ్మద్, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు24వ అదనపు చీఫ్ జడ్జి సీహెచ్.రమేష్ బాబు లను ఎంపిక చేసినట్లు రిజిస్ట్రార్ జనరల్ పేర్కొన్నారు. అలాగేప్రయాణ వివరాలను చెన్నైలోని తమిళనాడు రాష్ట్ర జుడీషియల్ అకాడెమీ డైరెక్టర్ కు తెలియజేయాలని, దాని ప్రతిని మధురై లోని టీఎన్ఎస్ జేఏ డిప్యూటీ డైరెక్టర్ కు పంపాలని ఆ న్యాయాధికారులకు స్పష్టం చేశారు.

## మహిళలకు చంద్రబాబు వెన్నుపోటు

### వైకాపా ఎమ్మెల్యే రోజా

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** ఎన్నికల సందర్భంగా రాష్ట్ర మహిళలకు ఇచ్చిన ఏఒక్క హామీని కూడా అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ కంటేఘోరమైన రీతిలో వెన్నుపోటు పొడిచారని వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆర్‌కె రోజా అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రోజా మాట్లడుతూ డ్వాక్రామహిళలకు వడ్డీతోసహారుణాలు మాఫీ చేస్తామని చెప్పి మోసగించారన్నారు. బెల్టు షాపులు ఎత్తివేస్తామని చెప్పిన బాబు రోడ్ల వెంట విచ్చల విడిగా బెల్టు షాపులు పెట్టిదోచుకుంటున్నారన్నారు. మహాలక్ష్మి పథకం కింద ఆడపిల్ల పుడితే రూ.30వేలు వేస్తామని చెప్పిన చంద్రబాబు ఈ నాలుగేళ్లలో ఏ ఒక్కరికి కూడా30 వేలు ఇవ్వలేదన్నారు. కాలేజి స్థాయి విద్యార్థినులకు ఐప్యాడ్‌లు , ఆడపడుచులకు సెల్ ఫోన్లు, పాఠశాల స్థాయి విద్యార్థునులకు సైకిల్స్ కొని ఇస్తామని చంద్రబాబు ఎన్నికల సందసందర్భంగా హామీలు ఇచ్చారన్నారు. తీరా చూస్తే ఒక పత్రిక ద్వారా శానిటరి ప్యాడ్స్‌పై 50శాతం రాయితీ ఇస్తామని ప్రకటించారన్నారు. చంద్రబాబుకు ఐప్యాడ్‌కు శానిటరి ప్యాడ్‌కు తేడా తెలియదా అని ప్రశ్నించారు. మహిళాబిల్లు ఆమోదింప చేస్తామని చెప్పిన బాబు ఒక్క రోజుకూడా పార్లమెంటులో ఈబిల్లుపై ప్రస్తావన చేయలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి సంపాదనతో ఆయన కోడలు, ఆయన భార్యతో మాత్రమే వ్యాపారాలు చేయిస్తే రాష్ట్ర మంతటా మహిళా సాధికారత వచ్చినట్టా అని ప్రశ్నించారు. మంత్రివర్గంలో ఉన్న ఇద్దరు తెలుగుదేశం పార్టీకి చెందని మహిళలను తొలగించి ఆదే మహిళాకోటాలో లోకేష్‌కు మంత్రి పదవి ఇవ్వటమే మహిళాసాధికారతా అని ప్రశ్నించారు.

## 'పొత్తుతో లబ్ధి పొందింది తెదేపానే'

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** భాజపాతో పొత్తుపెట్టుకుని రాజకీయంగా ఎక్కువగా లబ్దిపొందింది తెలుగుదేశంపార్టీయేనని ఆంధ్రప్రదేశ్ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పొత్తులో నష్టపోయింది భాజపానేనని అని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.1,91,063 కోట్లలో కేంద్రం నుంచి రూ. 50,696 కోట్ల గ్రాంటు రూపంలో , కేంద్ర పన్నుల వాటా కింద రూ. 84,626 కోట్లు వస్తాయని తెలిపిందన్నారు. ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు మొత్తం పోనూ రూ, 5,235 కోట్లు మిగులుతాయని ఆర్థిక మంత్రి యనుమల రామకృష్ణుడు తెలిపారన్నారు. తద్వారా రాష్ట్రం లోటు బడ్జెట్‌లో లేదని అసెంబ్లీలో చెప్పారన్నారు. ఈ విషయాన్ని భాజపా నేతలు ప్రస్తావిస్తే వారిపై ఎదురుదాడికి దిగడం తెదేపా నేతలకు అలవాటుగా మారిందని విష్ణువర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు కేంద్రమే నిధులు కేటాయిస్తుంటే రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 9వేల కోట్ల ఎందుకు కేటాయించారో రాష్ట్ర ప్రజలకు వివరించాలన్నారు. 2014 ఎన్నికల్లో తెదేపా ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, వారి తప్పులను కప్పిపుచ్చుకోవడానికే భాజపాపై నెపం వేస్తున్నారన్నారని ఆరోపించారు.

## గురవయ్య మరణం పార్టీకి తీరని లోటు

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**అమరావతి, ఆంధ్రప్రభ:** భారత కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సభ్యులు నర్సేటి గురవయ్య మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ గుంటూరు జిల్లాలో స్టేట్ టీచర్స్ యూనియన్ కార్యక్రమాల్లో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. గుంటూరు జిల్లా సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులుగా, కార్యవర్గ సభ్యులుగా పలు బాధ్యతలు సమర్ధవంతంగా నెరవేర్చారన్నారు. గత 4 దశాబ్దాలుగా పార్టీ కార్యక్రలాపాల్లో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ప్రస్తుతం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్న గురవయ్య మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి, రైతు రంగానికి తీరని లోటన్నారు. రైతాంగ సమస్యల పై జరిగిన పలు ఉద్యమాలలో ప్రత్యక్షంగా పాల్గొనడమేగాక, రాష్ట్ర రైతు సంఘానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివన్నారు. ధూళిపాళ్ల కోపరేటివ్ సొసైటీ చైర్మన్ సొసైటీ అభివృద్ధి కోసం ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు.

## 15న గ్రామపంచాయతీ వర్కర్స్ చలో అసెంబ్లీ

**అమరావతి, ఆంధ్రప్రభ:** వేతనాల పెంపు, ప్రమోషన్స్ , బకాయి వేతనాల కోసం 15న గ్రామపంచాయతీ కార్మికుల చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ వర్కర్స్ మరియు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2012లో నాటి ప్రభుత్వం గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఈఎస్ఐ అమలుకు ఆదేశాలు జారీ చేసిన ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ఎన్ఎంఆర్, పార్ట్ టైం, ఫిక్సెడ్ పేతో సహా కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలన్న డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగానైనా తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ 15న చేపట్టిన చలో అసెంబ్లీకి గ్రామ పంచాయతీ కార్మికులందరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

# కర్షకుల జీవితాల్లో వెలుగులు

- సాంకేతికత, యాంత్రీకరణకు బడ్జెట్‌లో అధిక నిధులు
- అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడుల లక్ష్యం

**అమరావతి, ఆంధ్రప్రభ:** నవ్యాంధ్ర జనాభాలో 62 శాతం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తాజా బడ్జెట్ కేటాయింపులతో తేటతెల్లమయింది. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ఏపీలో ప్రవేశపెట్టడంతో పాటు ఏటేటా అధిక నిధులను కేటాయించడం చంద్రబాబుకే చెల్లిందని చెప్పవచ్చు. సేద్యాన్ని మొదలు పెట్టినప్పటి నుంచి భూసార పరీక్షలు, ఎరువుల పరీక్షలు, పురుగుల మందుల పరీక్షలు, విత్తన పరీక్షలు, భూ వినియోగ గణాంకాల తయారీ, రుణ సౌకర్యం, పంటల భీమా ఏర్పాటు, నాణ్యమైన విద్యుత్ సరఫరా తదతర సూచనలు, సలహాలు, సేవలను చంద్రబాబు సర్కార్ అందిస్తోంది. దీనితో గత ఏడాది 149.16 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయగా, ఈ ఏడాది దానికి 6 శాతం అదనంగా 157.59 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుడం జరుగుతోంది. దీనితో వ్యవసాయ రంగంలో గణనీయమైన వృద్ధిరేటును సాధిస్తూ దేశ వృద్ధిరేటు కంటే రెండు రెట్లు అదనంగా 14.03 శాతం సాధించిన ఏపీ వైపు దేశం యావత్తు చూస్తోందని చెప్పవచ్చు.

**వ్యవసాయ రంగాభివృద్ధికి రూ.7,607.49 కోట్లు..**

తాజాగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నేతృత్వంలో రూపొందించబడిన ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌లోని రూ.19,078 కోట్లలో వ్యవసాయ రంగాభివృద్ధికి రూ.7,607.49 కోట్లను కేటాయించడం జరిగింది. ఈ నిధుల్లో ప్రధానంగా విత్తనాలను రాయితీపై రైతులకు అందించేందుకు రూ.220 కోట్లు, కర్నూలులో ఏర్పాటు చేయనున్న మెగా సీడ్ పార్క్ అభివృద్ధికి రూ.100 కోట్లు, సూక్ష్మ పోషకాల కోసం రూ.59.87 కోట్లు, భూసార పరీక్షలకై రూ.5.20 కోట్లు, యాంత్రీకరణ ప్రోత్సాహకానికి గత ఏడాది కంటే రెట్టింపుగా రూ.258.16 కోట్లు, టెక్నాలజీ, సాగుపై రైతులకు ప్రత్యేక శిక్షణలకు రూ.81.77 కోట్లు, సాగులో టెక్నాలజీ వినియోగం కోసం రూ.34.84 కోట్లు, సకాలంలో ఎరువుల పంపిణీకై రూ.40 కోట్లను టీడీపీ సర్కార్ కేటాయించింది. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు ప్రత్యేకంగా రూ.500 కోట్లను కేటాయించిన ప్రభుత్వం, రైతులకు వ్యవసాయ పెట్టుబడులపై ప్రోత్సాహకాలను అందిస్తూ వడ్డీలేని రుణాలకు రూ.172 కోట్లు, పావలా వడ్డీ రుణాలకు రూ.5.44 కోట్లను కేటాయించింది. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి రైతు రుణమాఫీ కోసం 4వ విడతగా రూ.4,100 కోట్లు కేటాయించడం పట్ల కర్షకలోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

**అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం..**

వ్యవసాయంతో పాటు ఉద్యాన, మార్కెటింగ్, పశు సంవర్ధక, మత్స్యశాఖ తదితర అనుబంధ రంగాలకు తాజా బడ్జెట్‌లో అధిక నిధులను కేటాయించడం ద్వారా వాటి అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వ శ్రీకారం చుట్టినట్లు తేటతెల్లమైంది. ఉద్యాన శాఖకు రూ.1,517.88 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,223.40 కోట్లు, మత్స్యశాఖకు రూ.386 కోట్లు, మార్కెటింగ్ శాఖకు రూ.208.11 కోట్లను కేటాయించడం జరిగింది. గత ఏడాది కేటాయింపులతో పోలిస్తే తాజా కేటాయింపులు గణనీయంగా పెరిగాయని చెప్పవచ్చు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను గడించే అవకాశమున్న ఉద్యాన పంటల వైపు రైతాంగాన్ని ప్రోత్సహించాలని సంకల్పించిన సర్కార్ ప్రస్తుతం ఉన్న 40 లక్షల ఎకరాల ఉద్యాన పంటలతో 246.98 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులను కోటి ఎకరాలకు విస్తరించాలని ప్రణాళికలను రచించింది. ఇక పశుసంపద వృద్ధిలో గొర్రెలు, మేకలులో దేశంలోనే నెంబర్ వన్‌గా, కోళ్ల సంఖ్యలో మూడవ స్థానం, గేదెల సంఖ్యలో ఐదవ స్థానం ఉన్న నవ్యాంధ్రలో దాదాపు 20 లక్షల కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి జీవినోపాధిని పొందడం జరుగుతోంది. అలాగే మత్స్య పరిశ్రమలో చేపలు, రొయ్యల ఉత్పత్తిలో దేశంలోనే నెంబర్ వన్‌గా రెండెంకల వృద్ధి రేటును ఏపీ కలిగి ఉంది. 14.5 లక్షల మంది ఉపాధి పొందుతున్న ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని సంకల్పించింది ప్రభుత్వం.

### గణనీయంగా పెరిగిన ఉద్యాన ఎగుమతులు



ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలతో ఇటీవల కాలంలో ఉద్యాన పంటల ఎగుమతులు గణనీయంగా పెరిగాయని రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ చిరంజీవ్ చౌదరి తెలియజేశారు. గతంలో 39.78 లక్షల ఎకరాల్లో ఉన్న ఉద్యాన పంటలు తాజాగా 41.62 లక్షల ఎకరాలకు విస్తరించడం జరిగిందని, ఈ ఏడాది చివరి నాటికి అదనంగా 2.5 లక్షల ఎకరాలకు విస్తరించేలా ఉద్యాన రైతులను ప్రోత్సహించేందుకు తాజా బడ్జెట్ కేటాయింపులు దోహదపడతాయని చెప్పారు. పండ్లు, కాయగూరలు, దినుసుల పంటల్లో నూతన వంగడాలను ఈ ఏడాది ప్రవేశపెడుతున్నామని, దీనితో తక్కువ పెట్టుబడి, శ్రమతో అధిక దిగుబడులు రావడం ద్వారా ఉద్యాన రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని తెలిపారు.

\- కమిషనర్ చిరంజీవ్ చౌదరి

### రూ.10 వేల ఆదాయం చేకూర్చడమే లక్ష్యం



అన్నదాతలకు నెలకు రూ.10 వేలు ఆదాయం చేకూర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనంద్ తెలియజేశారు. తాజా బడ్జెట్ కేటాయింపులతో మరిన్ని గోడౌన్‌లు, షెడ్స్, శీతల గిడ్డంగులను ఏర్పాటు చేసే అవకాశం కలిగిందని, అలాగే 80 రైతు బజార్లను ఆధునీకరించడంతో పాటు కొత్తగా 56 రైతు బజార్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే దళారీ వ్యవస్థకు పూర్తిగా చెక్ పెడుతూ ప్రస్తుతం ఉన్న 22 మార్కెట్‌లకు తోడు మరో 47 మార్కెట్ యార్డుల్లో ఈనామ్ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

\- కమిషనర్ శామ్యూల్ ఆనంద్

# ఆచూకీ తీసి.. అమ్మానాన్నల చెంతకు!





**● సతీ స్వచ్ఛంద సంస్థకృషి ● వివిధ రాష్ట్రాల నుంచి విశాఖకు తరలివచ్చిన తల్లిదండ్రులు ● కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో పిల్లల అప్పగింత**

**ఆరిలోవ, ప్రభ న్యూస్ :** ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఖేష్ చందన్ (15)ను తల్లిదండ్రులు మందలించారని మూడేళ్ల క్రితం ఇంట్లో కొంత సొమ్ము దొంగిలించి, అక్కడ రైలు ఎక్కి విశాఖ చేరుకున్నాడు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్ (12)ను స్కూల్‌కు వెళ్లలేదని తల్లిదండ్రులు మందలించారని అలిగి అక్కడ రైలు ఎక్కి విశాఖ చేరుకున్నాడు. ఇతను కూడా జువైనల్ హోంలో ఉంటున్నాడు. వీరిని శనివారం జువైనల్ హోమ్ నుంచి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

### భాష, ప్రాంతం సంప్రదాయం వేర్వేరు

క్షణికావేశంలో కోపతాపాలకు ఇల్లు వదిలి వచ్చిన పిల్లలు కోకొల్లలు. అయితే ఇలా తప్పిపోయి రైల్వే స్టేషన్లలో తిరుగుతున్న వేలాది మంది పిల్లలను తిరిగి తమ తల్లిదండ్రుల చెంతకు చేరుస్తున్నారు. సతీ అనే స్వచ్ఛంద సంస్థ వారు విశాఖ ఆరిలోవలోని ప్రభుత్వ బాలుర గృహం జువైనల్ హోంలో సుమారు 120 మంది బాల నేరస్తులు, ఇంటి నుంచి తప్పిపోయి వచ్చినవారు ఉంటున్నారు. వీరిలో అధిక శాతం పిల్లలకు తమ తల్లిదండ్రులు ఎక్కడుంటారో తెలియని పరిస్థితి ఉంది. ఒక విధంగా చెప్పుకోవాలంటే వీరు అనాథలే. విక్రయించ చేసుకునే వారి పిల్లలు, కడు పేదరికంలో జీవిస్తున్న వారి పిల్లలు ఎక్కువ శాతం ఈ హోంలో తలదాచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సతీ అనే స్వచ్ఛంద సంస్థకృషితో దేశంలోని వివిధ రాష్ట్రాలలో రైల్వే స్టేషన్లలో అనాథలుగా దిక్కులేక తిరుగుతున్న పిల్లలను చైల్డ్ లైన్ ద్వారా జువైనల్ హోంకు తరలించడమే కాకుండా వారి తల్లిదండ్రుల వివరాలు సేకరించి వారిని అమ్మ ఒడికి చేర్చేందుకు విశేషమైన కృషి చేస్తోంది. ఇందులో భాగంగా బీహార్, రాజస్థాన్, ఒడిశా, జార్ఖండ్, రాష్ట్రాలకు చెందిన 16 మంది పిల్లలను వారి తల్లి దండ్రుల ఆచూకీ సేకరించి వివిధ రాష్ట్రాల నుంచి తల్లిదండ్రులను రప్పించి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, డీఐజీ/ఎం.ముఖల్‌కరణ్, డీసీపీ ఫకీరప్ప ఆధ్వర్యంలో సతీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఈ పిల్లలను అమ్మ ఒడికి చేర్చారు. ఈ నేపథ్యంలో తమ తల్లి దండ్రులను కలుసుకున్న ఆనందంలో పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆనందభాష్పాలతో ఒకరినొకరు చెంతకు తీసుకుని కన్నీళ్లు రప్పించింది. కుటుంబ సభ్యుల చెంతకు పిల్లలు చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. పోలీస్ శాఖ పరంగా పిల్లలు తల్లి దండ్రుల చెంతకు చేర్చే పాత్ర ఉండడం చాలా సంతోషం వ్యక్తం చేశారు. డీసీపీ ఫకీరప్ప పిల్లలను దీవించి పంపించారు. సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ శ్యామలారాణి, ఇప్పటి వరకు ఆనందంగా పెరిగిన బాలురు తల్లి తండ్రుల చెంతకు చేరడం శుభపరిణామంగా భావిస్తూ పిల్లలను తగు జాగ్రత్తగా పెంచాలని హోం సూపరింటెండెంట్ సూచించారు. ఈ కార్యక్రమంలో సతీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ప్రోగ్రాం మేనేజర్ జాన్ ఫీటర్, రైల్వే చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యులు అబ్దుల్ రకీబ్, బాలుర గృహ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్ఠంభన తొలగేదెలా?

(మొదటిపేజీ తరువాయి)

చేస్తోంది. లోక్‌సభ, రాజ్యసభలో ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు, మిత్రపక్షాలు నేరుగా స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి పెద్దపెట్టున నినాదాలు చేస్తున్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్, కావేరి నదీ జలాల బోర్డు ఏర్పాటు చేయాలని అన్నా డీఎంకె ఆందోళన కొనసాగిస్తున్నాయి. ఇక తెలంగాణ రాష్ట్ర సమితి సైతం రిజర్వేషన్ల కోటా పెంచాలని కోరుతూ వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన వ్యక్తం చేస్తున్నాయి. భాగస్వామ్యపక్షాలు, మిత్రపక్షాల పరిస్థితి ఇలా ఉంటే, ఇక విపక్షాలు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ నీరవ్ మోడీ అంశాన్ని లేవనెత్తుతున్నాయి. నీరవ్‌మోడీ కోలాపోఛ, చోటా మోడీ-బడా మోడీ అంటూ రెండు సభల్లోనూ నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను నడవనివ్వడం లేదు. బ్యాంకు కుంభకోణాలపై 193 నిబంధన కింద వెంటనే చర్చకు స్పీకర్ అనుమతించాలి అన్నారు. అయితే వాయిదా తీర్మానం కింద చర్చ జరగాలని కాంగ్రెస్ పట్టుబట్టడంతో ప్రతిష్ఠంభన నెలకొంది. మరోవైపు యూపీఏ హయాంలో జరిగిన కుంభ కోణాలపైనా చర్చ జరగాలని బీజేపీ ఎంపీ వినయ్‌సహస్రబుద్ధే నోటీసు ఇచ్చారు. అధికార, విపక్షాల ఈ అంశంపై పరస్పర నోటీసులు ఇచ్చుకున్నా, దేనిపైనా చర్చ ఎత్తుల్లో పోయాయి. దాంతో ఉభయసభల్లోనూ వారం పాటు సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. ఈ ప్రతిష్ఠంభన తొలగించేందుకు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రయత్నాలు ప్రారంభించారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల నాయకులతో సంప్రదింపులు జరిపారు. సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సభ నడిచేందుకు సహకరిస్తే ఏ నిబంధన కింద చర్చ జరపాలన్నది నిర్ణయిద్దామని ప్రతిపాదించారు. అయితే దీనిపై అధికార, విపక్షాల నుంచి పెద్దగా స్పందన కనిపించ లేదు. దీంతో స్పీకర్ ప్రయత్నాలు నిష్ఫలమయ్యాయి. సభ సజావుగా జరిగేలా తనకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని సుమిత్రా మహాజన్ వాపోయారు.

పార్లమెంటును నడిపించే బాధ్యత అధికార పార్టీదేనని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడుతోంది. ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలపై జవాబు చెప్పాల్సిన బాధ్యత అధికార ఎన్‌డీఏదేనని అంటున్నారు. సభ ప్రతిష్ఠంభన తొలగించేందుకు ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి ప్రయత్నాలు కనపడడం లేదని యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అభిప్రాయపడ్డారు. ఎన్‌డీఏలో ఉన్న భాగస్వామ్య పార్టీలు టీడీపీ, శివసేనను సైతం వారు నియంత్రించలేకపోతున్నారని అంటున్నారు. ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదని అభిప్రాయ పడ్డారు. చర్చ నుంచి ప్రభుత్వం పారిపోతోందని టీఎంసీ ఎంపీలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు తాము బ్యాంకు కుంభకోణాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ చెప్తున్నారు. నిరసనలు, ఆందోళనలు ఆపి సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

### నిబంధనల పేరుతో సభను అడ్డుకోవడం సరికాదు

సభా నిర్వహణపై అధికార, ప్రతిపక్షాలు మెట్టుదిగకపోవడంతో పార్లమెంటు సమావేశాలు నడిచే అవకాశం కనిపించడం లేదు. అధికారపక్షం, విపక్షాల మధ్య చర్చలు జరిగే వాతావరణం ఏర్పడడం లేదు. దాంతో ఈ వారం కూడా సమావేశాలు జరిగేది అనుమానంగానే ఉంది. దీని ఫలితంగా అనేక కీలక బిల్లులు పెండింగ్ లో పడ్డాయి.

బీసీ కమిషన్ కు రాజ్యాంగ హోదా, ట్రిపుల్ తలాక్ బిల్లు ఈ సమావేశాల్లోనే ఆమోదించాలని ప్రభుత్వం భావించింది, నీరవ్‌మోడీ కుంభ కోణంతో సభ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. మార్చి 31లోగా ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందాల్సిన ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిపక్షాల డిమాండ్ నెరవేరుస్తుందా లేదా చూడాలి. దీనిపైనే పార్లమెంటు సమావేశాల భవితవ్యం ఏర్పడిఉంది.

# వెనకబాటు!



(మొదటిపేజీ తరువాయి)

115 జిల్లాలు వెనుకబడి ఉన్నాయని ప్రధానమంత్రి మోడీ చెప్పారు. ఈ జిల్లాల సర్వతోముఖాభివృద్ధితోనే సామాజిక న్యాయం సాధ్యమని అన్నారు. వెనుకబడిన జిల్లాలను ఆకాంక్షలు కలిగిన జిల్లాలుగా తమ ప్రభుత్వం పరిగణిస్తుందన్నారు. అన్ని ఇళ్లకు కరెంటు, చిన్నారులం దరూ పాఠశాలలకు వెళితే సామాజిక న్యాయం దిశగా ఓ అడుగు పడినట్లు అని చెప్పారు. ఈ జిల్లాలలో అభివృద్ధి జరగకపోవడానికి కారణం నిధుల లేమి కాదని, సరైన పరిపాలన లేకపోవడమేనని స్పష్టం చేశారు. సుపరిపాలన, ప్రభావవంతంగా పథకాల అమలు, నిశితదృష్టితో కార్యకలపాల నిర్వహణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నిరంతరం రాజకీయాలపైనే దృష్టి సారించకుండా, ప్రజల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. గతంలో ధర్నాలు, నిరసనలు చేసి జైలుకు వెళ్లే రాజకీయ భవిష్యత్ నిర్మించుకునేవారని, అయితే ఇప్పుడు కాలం మారిందన్నారు. ప్రజల ఆశలను నెరవేర్చి వారి ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం కావాలని సూచించారు. సామాజిక న్యాయమనేది కేవలం సామాజిక పరిస్థితులకే పరిమితమవుతోందన్నారు. అయితే ఒక ఇంట్లో కరెంటు ఉండి, మరో ఇంట్లో లేకపోతే సామాజిక న్యాయం అక్కడే అవసరమవుతుందన్నారు. సామాజిక న్యాయమనేది కేవలం రాజకీయ పదంగా తయారయ్యేలా జనతా పరివార్ చేసిందన్నారు. కులం, వెనుకబడినవర్గాల అంశాలకే పరిమితంచేశారన్నారు. పదేపదే ఎన్నికవుతున్న ప్రజాప్రతినిధులను పరిశీలిస్తే రాజకీయాలకు అతీతంగా వారంతా నియోజకవర్గాన్ని ప్రత్యేక అభివృద్ధి చేశారని తెలిపారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు కలిసి కూర్చొని అభివృద్ధిపై చర్చించడం నిజమైన సమాఖ్య స్ఫూర్తికి అద్దం పట్టిందని సంతోషం వ్యక్తంచేశారు.

దేశంలో 115 జిల్లాల్లో అభివృద్ధి కార్యకలాపాలను వేగవంతంచేసి దేశాన్ని మానవాభివృద్ధి సూచికలలో ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ జిల్లాలో నేరుగా యువ ఐఏఎస్‌లను కలెక్టర్లుగా నియమించాలని సూచించారు. ప్రమోట్ చేసిన ఐఏఎస్‌ల కంటే నేరుగా నియామకమైన యువ ఐఏఎస్‌లతో వేగం పెరుగుతుందన్నారు. దేశంలో సాధారణంగా జిల్లా కలెక్టర్ల వయస్సు 27-30 ఉంటుందని అయితే, 115 జిల్లాలో మాత్రం 80శాతం మంది కలెక్టర్లు 40 ఏళ్లకు పైబడ్డవారేనని అన్నారు. పెద్ద వయసున్న అధికారులకు కుటుంబం, కెరీర్ తదితర అంశాలపై దృష్టి సారిస్తారని, ఈ జిల్లాలో నియమించేటప్పుడు వీటిని పరిశీలించాలన్నారు. ఈ జిల్లాల్లో పనిచేయడం సామాజిక న్యాయ సాధన దిశగా పని చేయడమేనని అన్నారు. ఈ జిల్లాలలో వెనుకబాటుకు కారణమేమిటో తెలుసుకోవాలని, దానిని పసిగడితే సమస్యను పరిష్కరించవచ్చన్నారు. ఓ మిషన్ లాగా పనిచేస్తే ఈ జిల్లాలలో మంచి ఫలితాలు సాధించవచ్చారు. సరైన పాలన లేకపోవడం వల్ల వెనుకబడిన జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు బాగాలేదని, అదే సుపరిపాలన ఉన్న జిల్లాలలో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. 2022 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందు అందరూ కృషి చేయాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ అన్నారు.

# ఏపీ విద్యార్థి జేఏసీ ప్రత్యేక హోదా ధర్నాకు ఆప్ మద్దతు

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ఇది భారత పార్లమెంట్‌కు జరిగిన అవమానమని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి యువజన జేఏసీ సంఘాలు మండిపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ఏపీ భవన్‌లో ఏపీ విద్యార్థి యువజన జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు తెలిపింది. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌కు భారీగా తరలివచ్చిన విద్యార్థులు, ఆప్ కార్యకర్తలు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. ఆందోళన అనంతరం ఏపీ విద్యార్థి యువజన జేఏసీ స్టేట్ చైర్మన్ నరేష్ ఢిల్లీ మీడియాతో మాట్లాడుతూ... ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తున్నామని తెలిపారు. బీజేపీ, టీడీపీ మంత్రులు రాజీనామాలు చేసి డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రజలకు మంచి చేయాలనే చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎంపీ పదవులకు కూడా రాజీనామాలు చేయాలని నరేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు చతికిలబడి పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా ఓపిక పట్టి వేచి చూస్తున్నా బీజేపీ మొండి వైఖరి అవలంబిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి సేవాకుమార్ ఆరోపించారు. ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలు సహించరని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. మిత్ర పక్షమైన టీడీపీ, బీజేపీతో తెగదెంపులు చేసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం పోరాడాలని సేవా కుమార్ కోరారు. ఉభయ సభల్లోను ఆమ్ ఆద్మీ పార్టీ ఏపీ తరపున ప్రత్యేక హోదా కోసం పోరాడుతుందని తెలిపారు. ప్రత్యేక హోదా అంశానికి ఆప్ పూర్తి మద్దతు ఇస్తుందని సేవాకుమార్ చెప్పారు.

# 400 మంది సైనికుల పాసింగ్ అవుట్ పరేడ్

**● పర్యవేక్షించిన మేజర్ జనరల్ శ్రీనివాసరావు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టిలరీ సెంటర్‌లో శిక్షణార్థుల శిక్షణలో తీసుకు వచ్చిన మార్పులపై తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా కమాండింగ్ మేజర్ జనరల్ శ్రీనివాసరావు సంతృప్తి వ్యక్తం చేశారు. గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఏడాది కాలంగా శిక్షణ పొందిన 400 మంది సైనికుల ధృవీకరణ పరేడ్ శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరేడ్ అనంతరం యువ సైనికుల తలిదండ్రులతో భేటీ అయ్యారు. దేశ రక్షణ కోసం తమ కుమారులను అందించినందుకు వారిని మేజర్ జనరల్ గౌరవ్ పాదక్‌ను సమర్పించారు. అనంతరం జీఓసి, టాసా బ్రిగేడియర్ ఆర్ఆర్ కుమార్, ఆర్టిలరీసెంటర్ కమాండెంట్‌లు, సీనియర్ సైనికాధికారులు, ఉపదేశకులు, సిబ్బందితో సమావేశమయ్యారు.

# ఘనంగా ప్రపంచ తొలి తెలుగు నాటకోత్సవాలు



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ఆదిలీలా ఫౌండేషన్-ప్రవాసాంధ్ర నాటక అకాడమీ... పాటా సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ ప్రథమ తెలుగు నాటకోత్సవాలు రెండోరోజూ ఢిల్లీలో ఘనంగా జరిగాయి. ఐటీవో ప్రాంతంలోని రాజేంద్ర భవన్‌లో శుక్రవారం ఈ నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలుగు నాటక సౌరభాల రుచిని ఆస్వాదించడానికి రాజధానివాసులు భారీగా తరలివచ్చారు. మాదిరాజు కార్యక్రమంలో భాగంగా కళాంజలి భిలాయి వారు ప్రదర్శించిన మిథునం నాటిక ఆద్యంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. నేటి సమాజంలో జరుగుతున్న వాస్తవాలను, ముఖ్యంగా తల్లిదండ్రులతో తమ సంతానం ఎలా వ్యవహరిస్తుందో తెలిపే ఇతివృత్తం అందరినీ అలరించింది. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా తణుకు బందం చేసిన అష్టావక్ర ఏక పాత్రాభినయం, ఆంధ్ర సంఘం టిటాఫుడ్ వారి శివతాండవం నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించాయి. తెలుగు నాటకాలకు ఆదరణ లేక అంతరించిపోతున్న సమయంలో ప్రథమ తెలుగు నాటకోత్సవాలు అందరికీ నాటకాల విలువను చాటి చెప్తున్నాయి.

# మా పరిస్థితే ఆంధ్రా మిత్రులకూ ఎదురైంది

**● కొత్త ప్రత్యామ్నాయం కోసమే థర్డ్‌ఫ్రంట్**
**● ఢిల్లీ పర్యటనలో మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** మన దేశంలో కేంద్రంలో కేంద్రీకృతమైన పెత్తనాన్ని ప్రశ్నించేవిధంగా, ఫెడరల్ వ్యవస్థకు ప్రతిబింబంగా ఓ కొత్త ప్రత్యామ్నాయం వస్తే మంచిదనే ఉద్దేశంతోనే తెలంగాణ సీఎం థర్డ్ ఫ్రంట్ చర్చకు శ్రీకారం చుట్టారని తెలంగాణా రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారకరామారావు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్లలో కాంగ్రెస్, భాజపాలకు ప్రజలు అనేక అవకాశాలిచ్చినా ఈ రెండు పార్టీలూ ప్రజాకాంక్షల్ని నెరవేర్చడంలో విఫలమయ్యాయని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించడంపై కేటీఆర్ స్పందించారు. శనివారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన 51వ స్కాచ్ సమ్మిట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఢిల్లీ మీడియాతో మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయి, ఏరకంగా ఈ కూటమి రూపుదిద్దుకుంటుందో చూడాలన్నారు. హస్తినలో కేంద్రీకృతమైన పెత్తనాలు, అధికారాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చివరకు ఉపాధి హామీ డబ్బులు కూడా కేంద్రం వేస్తే తీసుకోవాల్సిన పరిస్థితి ఏంటని కేసీఆర్ ప్రశ్నిస్తున్నారన్నారు. గ్రామాల్లో కేంద్రానికి పనేంటని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రాలు బాగుంటేనే దేశం బాగుంటుంది, మొత్తం అధికారాలు కేంద్రీకృతమైతే దేశానికి అపారమైన నష్టం జరుగుతుంది కాబట్టే ఒక కొత్త చర్చను లేవనెత్తారని ఆయన వెల్లడించారు. ఇది భవిష్యత్‌లో మంచి పరిణామాలకు దారి తీస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో ఉన్నది రెండు పార్టీల వ్యవస్థ కాదు. రెండు పార్టీల మధ్య పోరాటం అంతకన్నా కాదు. బహుళ పార్టీల వ్యవస్థ, ప్రాంతీయ పార్టీలు చాలా బలంగా ఉన్న మనదేశంలో గమనిస్తే రాబోయే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ ఒక్క పార్టీకీ పూర్తి స్థాయి మెజారిటీ రాదని అందరూ భావిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ పూర్తి మెజారిటీ సాధించే పరిస్థితుల్లో లేవని ఆయన జోస్యం చెప్పారు.

### మాకు ఎదురైన అనుభవమే ఆంధ్రా మిత్రులకూ....

తెలంగాణాకు కేంద్రం నుంచి ఈ మూడున్నరేళ్లలో ఒక్క పైసా కూడా అదనంగా రాలేదని కేటీఆర్ చెప్పుకొచ్చారు. విభజన చట్టంలో చెప్పినట్టు ఏపీకైనా కొన్ని సంస్థలిచ్చారు. మాకు కనీసం ఒక్క సంస్థను కూడా ఇవ్వలేదనడానికి మా దగ్గర లెక్కలు కూడా ఉన్నాయని ఆరోపించారు. గతంలో ఎన్నోసార్లు కేంద్రానికి నివేదించాం, ప్రధానితో పాటు అనేక మంది మంత్రులను కలిసి విన్నవించుకున్నా మార్పు లేదని కేటీఆర్ తెలిపారు. మాకు ఎదురైన అనుభవమే ఆంధ్రా మిత్రులకూ ఎదురైనట్టుంది, అందుకే వారు బయటకు వచ్చారన్నారు. అందరూ కూటమి నుంచి ఎందుకు వెళ్లిపోతున్నారో ఇప్పటికైనా కేంద్రం పునరాలోచించుకోవాలని కేటీఆర్ సూచించారు.

### తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులపై పొంగులేటి ఫైర్

### హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : గొప్పలు చెప్పుకోవడంలో ఏపీ, తెలంగాణా ముఖ్యమంత్రులు పోటీ పడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. రెండు ప్రభుత్వాలు ప్రజలను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. లక్షల కోట్ల ఒప్పందాలు పేపర్ల మీదే ఎలా కానిస్తారని శనివారం ఢిల్లీలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ప్రశ్నించారు. దేశ వృద్ధి రేటు కంటే తెలంగాణా వృద్ధి రేటు ఎలా ఎక్కువ ఉంటుందో అర్థం కావట్లేదని పొంగులేటి అన్నారు. ఎన్నికల హామీలను మాత్రం అమలు చేయరు గానీ రికార్డ్స్ చూస్తే అవార్డులు, రివార్డులు ఉంటాయని ఎద్దేవా చేశారు. రైతులు ఆత్మ హత్యలు చేసుకుంటున్నా చూస్తూ కూర్చున్న చావ లేనివి ఈ రెండు ప్రభుత్వాలని ఆయన మండిపడ్డారు. ఉపాధి హామీ కూలీ డబ్బులు రావాలన్నా కూడా ఏపీ, తెలంగాణా ప్రభుత్వాలు నాలుగు నెలల సమయం తీసుకుంటున్నాయని తెలిపారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పోటీ పడి మరీ నోట్ల రద్దు, జీఎస్టీకి మద్దతు ఇచ్చారని ఆరోపించారు.

తెలంగాణాలో వెనుకబడిన జిల్లాలకు ఎందుకు ఇంత వరకూ నిధులు ఇవ్వలేదని పొంగులేటి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తాను సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేసినట్టు ఆయన వెల్లడించారు. బెంచ్ అడ్మిట్ చేసి రెండు వారాలు సమయం కూడా ఇచ్చిందని, చట్టాన్ని అమలు చేయడం సర్కార్ విధి అని జడ్జిలు అన్నారని పొంగులేటి పాత్రికేయులకు వివరించారు. కేంద్రం ఒక్క హామీ కూడా అమలు చేయలేదని చాలా రోజుల తర్వాత మంత్రి కేటీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యసభకు రాబోయే అభ్యర్థులకు రాష్ట్ర ప్రయోజనాల కంటే వారి వ్యాపారాల మీద ఆసక్తి ఉందని పొంగులేటి జోస్యం చెప్పారు. రాష్ట్రం, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడే వ్యక్తులను సభకు పంపాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. విభజన హామీల అమలు కోసం అందరూ కలిసి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

# 26న భద్రాద్రి సీతారామ కల్యాణం



**● 27న మహాపట్టాభిషేకం**
**● లగ్న పత్రిక, పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ మంత్రులు**

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం క్షేత్రంలో ఈ నెల 26న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం, 27న మహా పట్టాభిషేకం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఎ. ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు. శనివారం ఇక్కడ రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి కళ్యాణోత్సవం లగ్నపత్రిక, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడారు. మిథిల ప్రాంగణంలో కన్నుల పండువగా జరిగే కళ్యాణ మహోత్సవానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు దంపతులు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని చెప్పారు. త్రిదండి చినజీయర్ స్వామి కూడా హాజరవుతున్నారని పేర్కొన్నారు. కళ్యాణ శోభ ఉట్టిపడే విధంగా మండపాన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గోదావరి తీరంలోని పర్ణశాల క్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. బ్రహోత్సవాలకు హాజరయ్యే లక్షలాదిమంది భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

### భద్రాద్రి పునర్నిర్మాణానికి రూ.100 కోట్లు

### కేసీఆర్‌ల శంకుస్థాపన : తుమ్మల

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, కళ్యాణ మహోత్సవానికి రాష్ట్రం నుంచే గాక ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిషా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. యాదాద్రి తరహాలోనే భద్రాద్రి ఆలయం పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ. 100 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఉగాది పండుగ సందర్భంగా సీఎం కేసీఆర్, త్రిదండి చినజీయర్ స్వామితో చర్చించి ఆలయ పనులను ఎప్పుడు ప్రారంభించాలో నిర్ణయిస్తామన్నారు. 27న మహా పట్టాభిషేకం సందర్భంగానే కేసీఆర్‌చే పనులకు శంకుస్థాపన చేయాలనే యోచిస్తున్నట్లు తుమ్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి ఆలయం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రభాకర్ శ్రీనివాసశర్మ, ఖమ్మం డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయబాబు, ఆలయం అర్చకులు పాల్గొన్నారు.

# గోదావరి నది కాలుష్యంపై కౌంటర్ దాఖలు చేయండి

**● ఐటీసీ పేపర్ బోర్డుకు హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఖమ్మం జిల్లా, భద్రాచలం వద్ద గోదావరి నదిలోకి పేపర్ బోర్డులు వ్యర్థపు నీరు వదిలిపెట్టకుండా ఆదేశించాలని అభ్యర్థిస్తూ దాఖలైన వ్యాజ్యంలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఐటీసీ లిమిటెడ్ పేపర్ బోర్డును హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. ఖమ్మం జిల్లా, భద్రాచలం రామాలయ పుణ్యక్షేత్రం సమీపంలో పవిత్ర గోదావరి నదిలోకి పేపర్ మిల్లులు వ్యర్థపు నీటిని విడుదల చేయకుండా నిలుపుదల చేసేలా ఆదేశించాలని అభ్యర్థిస్తూ సేవ్ ఎర్త్ ఆర్గనైజర్ ఎన్.ప్రభాకర్‌రావు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది భీమపాక.నాగేష్ వాదనలు వినిపిస్తూ..తెలంగాణ రాష్ట్ర కాలుష్య నివారణ మండలి( పీసీబీ) సూచించినట్లు గోదావరి నది ప్రవహించు దిశ (డౌన్ స్ట్రీమ్) లో మూడు కిలోమీటర్ల దూరంలో డిస్ పోసల్ పాయింటును విస్తరించే వరకు నదీ జలాలు కాలుష్యం బారిన పడకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంత వరకు పవిత్ర గోదావరి నదిలోకి వ్యర్థపు నీటిని వదలకుండా చూడాలని ఐటీసీ లిమిటెడ్ పేపర్ బోర్డును ఆదేశించాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ...ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని ఐటీసీ లిమిటెడ్ పేపర్ బోర్డును ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

# కనకదుర్గమ్మకు భక్తుల విరాళాలు



**అమరావతి, ఆంధ్రప్రభ :** హైదరాబాద్‌కు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు (పేరు చెప్పడానికి ఇష్టంలేని వ్యక్తి ) శనివారం బెజవాడ కనకదుర్గమ్మకు రూ. 1,67,000 విలువైన బంగారు అభరణాన్ని అందజేయడంతోపాటు మరో రెండు లక్షల రూపాయలను అన్నదానానికి విరాళంగా అందించారు. అదే విధంగా విజయవాడకు చెందిన కె.కోటేశ్వరరావు,విజయలక్ష్మీ దంపతులు కూడా అన్నదానం నిమిత్తం అమ్మవారికి రూ. 1,00,011.00 లు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ యలమంచిలి గౌరంగబాబు, సభ్యులు వెలగపూడి శంకర్‌బాబు, బడేటి ధర్మారావు, కోడెల సూర్యలతాకుమారి, సిహెచ్.సాంబసుశీలదేవి తదితరులు పాల్గొన్నారు. కాగా నెలకోసారి వచ్చే మూల నక్షత్రం రోజు కావడంతో శనివారం ఆలయంలో ఉదయం సరస్వతీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు,అమ్మ వారి పాకెట్ ఫోటో,కంకణం, ప్రసాదం అందజేశారు. అనంతరం అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. అలాగే ఆలయానికి సంబంధించిన మహామండపంలోని 6వ అంతస్తులో వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డాక్టర్ ఎం.పద్మతో పాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు ,వేద పండితులు, అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### అమ్మవారి సేవలో దినేష్‌కుమార్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి,పూజలు చేసి, కనకదుర్గమ్మను సేవించి, తరించారు. ఈ సందర్భంగా వారికి దేవస్థానం ఈవో పద్మ,ఏఈవో అచ్యుతరామయ్య, వేదపండితులు ఘన స్వాగతం పలికి,ఆశీర్వచనలు అందజేశారు. అనంతరం వారికి అమ్మ వారి చిత్రపటాన్ని అందజేశారు.

# మరో 20 రూట్లలో ట్రూజెట్ విమాన సర్వీసులు

**● మార్చి 25న చెన్నై-సేలం సర్వీస్ ప్రారంభం ● త్వరలో అహ్మదాబాద్-గౌహతిల నుంచి సర్వీసులు**

**అమరావతి, ఆంధ్రప్రభ :** ప్రాంతీయ విమానయాన సంస్థగా సేవలు ప్రారంభించిన ట్రూజెట్ అనతికాలంలోనే జాతీయ విమానయాన సంస్థగా ఎదిగి త్వరలో దేశవ్యాప్తంగా మరిన్ని సర్వీసులును తూర్పు, పశ్చిమ తీర ప్రాంతాల నుంచి కూడా ప్రారంభించనుంది. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ గ్రూపు కంపెనీలో భాగమైన టర్బో మేఘా ఎయిర్వేస్ ప్రైవేటు లిమిటెడ్ ట్రూజెట్ పశ్చిమ, తూర్పు తీరం, ఈశాన్య భారతం నుంచి కూడా విమాన సేవలను విస్తరించనుంది. త్వరలో దేశవ్యాప్తంగా మరో 20 రూట్లలో తన సేవలను ప్రారంభించనుంది. గుజరాత్ లోని అహ్మదాబాద్, అస్సోం రాజధాని గౌహతి నుంచి ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాలకు విమానాలు నడపనుంది. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా 12 ప్రాంతాలకు రోజుకు కనీసం 2 వేల మందిని వివిధ ప్రాంతాలకు తీసుకువెళుతున్న ట్రూజెట్ త్వరలో నాలుగింతలకు పెంచుకోవాలనే లక్ష్యంతో కార్యకలాపాలను విస్తరిస్తోంది. సాధారణంగా దేశంలోని ఈశాన్య రాష్ట్రాల్లో విమానయాన సేవలు ప్రారంభించేందుకు పేరెన్నికగన్న సంస్థలు ముందుకు రాని సందర్భంలో మేఘా టర్బో ట్రూజెట్ అస్సోం కేంద్రంగా ఈశాన్య రాష్ట్రాల్లో సేవలు విస్తరించనుంది. ... ట్రూజెట్ సేవలు మరిన్ని ... లిమిటెడ్ ట్రూజెట్ సంస్థ వాణిజ్య వ్యవహారాల పర్యవేక్షణ అధికారి సెంథిల్ రాజా తెలిపారు. ఉడాన్ పథకం రెండో దశ కింద తమ సంస్థ 20 రూట్లలో విమానాలు నడిపేందుకు అనుమతి పొందిందని తెలిపారు. తాము అనుమతి పొందిన రూట్లలో అహ్మదాబాద్ నుంచి గుజరాత్‌లోని పోరు బందర్, రాజస్థాన్‌లోని జైసల్మేర్, మహారాష్ట్రలోని నాసిక్, జలగావ్లతో పాటు గౌహతి నుంచి ఈశాన్య రాష్ట్రాల్లోని కుచ్చిబెహర్‌బురన్పూర్, తేజు, తేజ్‌పూర్ తదితర మార్గాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ నెల 25న తమిళనాడు రాజధాని చెన్నై నుంచి తమ సంస్థ విమాన సర్వీసులు ప్రారంభిస్తుందని రాజా తెలిపారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎయిర్ షో(వింగ్స్ ఇండియా-2018)లో మేఘా టర్బో ట్రూజెట్ పాల్గొనడంతోపాటు స్టాల్‌ను నిర్వహిస్తూ ప్రయాణికులకు మరింత సేవలు అందించే విధంగా కార్యక్రమాలను విస్తృతం చేస్తోంది.

### త్వరలో మరో ఏడు విమానాలు ..

ప్రస్తుతం ట్రూజెట్ సంస్థ ఐదు విమానాల ద్వారా ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు తీసుకెళుతోంది. ఐదు విమానాలకు తోడుగా మరో ఏడు విమానాలను వాటి సరసన త్వరలో ట్రూజెట్ చేర్చబోతుంది.

### ఆగ్రా, గౌహతికి ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఎర్నాకులం - ఆగ్రా కంటోన్మెంట్ వరకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేయడంతో పాటుగా చెన్నై సెంట్రల్ నుండి గౌహతి వరకు ప్రత్యేక ఛార్జీలతో రైలును నడిపించబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఎర్నాకులం - ఆగ్ర అన్ రిజర్వుడ్ ప్రత్యేక రైలు ఎర్నాకులంలో 11వ తేదీన ( ఆదివారం) 19.00 గంటలకు బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆగ్ర కొంటోన్మెంట్‌కు చేరు కుంటుందన్నారు. మార్గ మధ్యలోని అలువ, త్రిశూర్, పాల్ఘాట్, కోయంబత్తూర్, తిరుప్పూర్, ఆరోడా, సేలం, జోలర్‌పెట్టైయ్, కట్పడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, వరంగల్, బల్లార్షా, నాగ్‌పూర్, బేటూల్, ఇటారి, భూపాల్, బీనా, ఝాన్సీ గ్వాలియర్ స్టేషన్లల్లో నిలుపుదల చేయడం జరుగుతుంది. చెన్నై సెంట్రల్ - గౌహతి అన్ రిజర్వుడ్ ప్రత్యేక రైలు చెన్నై సెంట్రల్‌లో 12వ తేదీ సోమవారం ఉదయం 5.15 గంటలకు బయలుదేరి బుధవారం 08.45 గంటలకు గౌహతి చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ రైలు సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, న్యూ గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, దువ్వాడ, విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకారుళం రోడ్, పలాస, తోపాటు మార్గమధ్యలోని అన్ని ప్రధానమైన స్టేషన్లల్లో నిలుపుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

### నేడు హజ్ యాత్రికులకు మూడో విడత శిక్షణా తరగతులు

హజ్‌కు వెళ్లే యాత్రికులకు మూడో విడత శిక్షణా తరగతులను తెలంగాణ ప్రభుత్వం ఆదివారం నిర్వహించనుంది. హైదరాబాద్ అంబర్‌పేటలోని జామామసీదులో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ తరగతులు నిర్వహించనున్నట్లు తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పేరెన్నిక గల వక్తలు ప్రసంగం చేస్తారని ఆయన పేర్కొన్నారు.



మెస్సీ వేలు పట్టుకున్న సీరో


## మెస్సీకి పుత్రోత్సాహం

**బార్సిలోనా:** ప్రముఖ అర్జెంటీనా ఫుట్ బాలర్ మెస్సీ ముచ్చటగా మూడోసారి తండ్రయ్యాడు. భార్య పురిటి నొప్పులతో బాధపడు తుండడంతో లా లీగా టోర్నీలో బార్సిలోనా జట్టుకు తదుపరి మ్యాచ్‌లకు అందుబాటులో ఉండబోనని చెప్పి మెస్సీ.. తర్వాత బుజ్జి బాబు చేయి పట్టుకున్న ఫోటోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. బాబుకు సీరో అనే పేరు కూడా ఫిక్స్ చేసేశారు. సీరోకి ముందు తియాగో, మతెవో అని మెస్సీ దంపతులకు ఇద్దరు మగపిల్లలున్నారు. తనకు బాబు పుట్టబోతున్నట్టు మెస్సీ ఇదివరకే ప్రకటించేశాడు. కడుపులో వుండగానే పుట్టబోయేది మగబిడ్డ అని మెస్సీ చెప్పుకోగలిగాడు గానీ.. మన దేశంలో అయితే చట్టరీత్యా చర్యలు ఎదుర్కోవాల్సి వచ్చేది.

### విదేశీ పర్యటనల్లో...

## ముందు టీ20లే

**ముంబై:** దక్షిణాఫ్రికా పర్యటనలో ఆరంభంలో తడబడ్డ భారత్ పరిస్థితిని గమనించిన భారతీయ క్రికెట్ కంట్రోల్ బోర్డు విదేశాల్లో తొలుత పొట్టి ఫార్మాట్ క్రికెట్‌లో పాల్గొనేలా షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా భారత్ అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటు పడుతుందని బీసీసీఐ పేర్కొంది. ఈమేరకు బీసీసీఐ శనివారం ఒక ప్రకటనను మీడియాకు విడుదల చేసింది. దక్షిణాఫ్రికా పర్యటనలో టెస్టు సిరీస్‌ను 1-2 తేడాతో సఫారీలకు కోల్పోయిన అంశాన్ని దృష్టిలో పెట్టుకొని బీసీసీఐ ఈ మార్పును ప్రతిపాదించింది. బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీ మాట్లాడుతూ.. భారత్ ఇంగ్లండ్, ఆస్ట్రేలియా వెళుతున్న సమ యం లో ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రారంభంలో పొట్టి ఫార్మాట్లను ఆడే విధం గా పర్యటనను ఖరారు చేస్తామన్నారు. ' ఈ వేసవిలో భారత్ ఇంగ్లండ్‌లో పర్యటనకు వెళుతుంది. టెస్టు మ్యాచ్‌ల ప్రారంభానికి నెలరోజుల ముందే అక్కడికి జట్టు చేరుకుని అక్కడి వాతా వరణానికి అలవాటు పడటానికి పొట్టి ఫార్మాట్లలో ఆడు తుంది' అని రాహుల్ అన్నాడు. వచ్చే శీతాకాలంలో ఆస్ట్రేలియాలో పర్యటించనున్న భారత జట్టు నిర్ణీత షెడ్యూల్ కంటే ముందే అక్కడికి చేరుకుని పొట్టి ఫార్మాట్ మ్యాచులు ఆడుతుం దన్నాడు. ఇందుకు ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు కూడా అనుమతించిందని రాహుల్ తెలిపారు.



కోచ్ స్వెన్ గ్రోయెన్‌వెల్డ్‌తో షరపోవా

## కోచ్ స్వెన్‌కు షరపోవా టాటా

● వరుస వైఫల్యాలే కారణం

**ఇండియన్‌వెల్స్:** టెన్నిస్ స్టార్ మారియా షరపోవా, తన కోచ్ స్వెన్ గ్రోయెన్‌వెల్డ్‌తో తెగదెంపులు చేసుకోవాలని నిర్ణయించింది. డబ్ల్యుటీఏ ఇండియన్ వెల్స్ టోర్నీలో షరపోవా తొలి రౌండ్‌లోనే ఓటమి చెంది నిష్క్రమించడాన్ని జీర్ణించుకోలేకపోయిన షరపోవా కోచ్‌ను మార్చుకోవాలనే అభిప్రాయానికి వచ్చింది. ఐదింట నాలుగు గ్రాండ్‌స్లామ్‌లను గెలిపించడంలో వెనకవుండి ప్రోత్సహించిన స్వెన్... షరపోవాకు కోచ్‌గా మాత్రమేగాక ఒక మంచి స్నేహితుడిగా ఉండేవాడు. పరస్పర అంగీకారంతోనే తాము వేరుపడుతున్నామని స్వెన్, షరపోవాలు మీడియాకు తెలిపారు. 'నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో నన్ను వెన్నంటివుండి విజయం సాధించడానికి తోడ్పడ్డ స్వెన్‌కు నా కృతజ్ఞతలు. అతని అంకిత భావం, నిజాయతీ, పనిలో నైతికత, అంతకంటే ఎక్కువ ఆయనతో నా స్నేహం మరువలేనిది. నా క్రీడా జీవితంలో అలాంటి అద్భుతమైన కోచ్ లభించడం నా అదృష్టంగా భావిస్తున్నానని ' అని షరపోవా పేర్కొంది. నెదర్లాండ్స్‌కు చెందిన స్వెన్ కోచ్‌గా వైదొలుగుటకు సిద్ధమని ప్రకటించాడు. ఈ విషయంలో ఇతర ఊహాగానాలకు తావులేదు. పరస్పరం కలిసే ఈ నిర్ణయానికి వచ్చాము' అని షరపోవా ప్రకటించింది. ఎడారి టోర్నీగా పేరుపొందిన ఇండియన్‌వెల్స్ టోర్నీలో మేజర్ అట్రాక్షన్‌గా బరిలోకి దిగిన షరోపోవా తొలి రౌండ్‌లో జపాన్ నం.1 క్రీడాకారిణి నవోమి ఒసాకా చేతిలో 4-6,4-6 తేడాతో ఓటమి చెందింది.

### మరియా ఓ పోరాట యోధ : స్వెన్



ఇప్పుడున్న ప్రొఫెషనల్ క్రీడాకారిణుల్లో మారియా షరపోవా అద్భుతమైన పోరాట పటిమను కలిగివుందని కోచ్ స్వెన్ అన్నాడు. 'ఆమె కఠోర శ్రమతో గెలుపు కోసం ప్రయత్నిస్తుంది. శక్తి, పోరాట పటిమ కలబోస్తే వచ్చేదే షరపోవా. ఆమెను ఒక క్రీడాకారిణిగా, వ్యక్తిగా అపారంగా గౌరవిస్తాను' అని స్వెన్ వ్యాఖ్యానించా డు. ఈ ఏడాది ప్రారంభంలో అస్ట్రేలి యన్ ఓపెన్‌లో షరపోవా మూడో రౌండ్‌కు చేరి ఏంజెలిక్ కెర్బర్ చేతిలో ఓడింది. దు బాయ్ ఓపెన్‌లో ముంజేతికి గాయం కావడంలో తొలి రౌండ్‌లోనే వైదొలగింది.

### మూడో రౌండ్‌కు బాంబ్రి



బీఎన్‌పీ పరిబాస్ ఓపెన్‌గా పిలవబ డుతున్న డబ్ల్యుటీఏ ఇండియన్‌వెల్స్ టోర్నీ లో పురుషుల సింగిల్స్ లో భారత టెన్నిస్ ఆటగాడు యుకి బాంబ్రి రెండో రౌండ్లోకి ప్రవేశించాడు. ప్రపంచ ర్యాంకుల్లో 110వ స్థానంలో ఉన్న బాంబ్రి, 101 ర్యాంకర్ మహుత్‌ను 7-5, 6-3 తేడాతో మట్టి కరిపించాడు. ఇందుకు బాంబ్రి గంటా 41 నలబై నిమిషాలు పోరాడాడు. మెయిన్ డ్రాకు అర్హత సాధించిన వీరిద్దరు ఏటీపీలో టూర్‌లో పోటీ పడటం ఇదే తొలిసారి. మూడో రౌండ్లో బాంబ్రి ఫ్రెంచ్ క్రీడాకారుడు ల్యూకాస్ పావుల్లీని ఢీకొననున్నాడు. ల్యూకాస్‌కు తొలి రౌండ్‌లో బై దొరికింది. ఈ నెల ప్రారంభంలో ల్యూకాస్ తన కెరియర్‌లో అత్యుత్తమ ర్యాంకు 12కు చేరాడు.

# క్రీడాప్రభ

## జడేజా స్థానంలో అశ్విన్

● రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుకు ఎంపిక



**న్యూఢిల్లీ:** రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు ఆటగాడు రవీంద్ర జడేజా గాయం కారణంగా ఆటకు దూరంకావడంతో అతని స్థానంలో ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను ఎంపిక చేశారు. ఈ నెల 14-18 వరకు నాగపూర్ వేదికగా ఇరానీ ట్రోఫీ జరగనుంది. ఇందులో రంజీ ఛాంపియన్ విదర్బ, రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టుతో తలపడుతుంది. కాలి కండరాలు పట్టేయడంతో వైద్యులు విశ్రాంతి తప్పనిసరి అని చెప్పడంతో జడేజా ఆటకు దూరమయ్యాడని బీసీసీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. గాయం కారణంగా అశ్విన్ కూడా దేవదర్ ట్రోఫీలో పాల్గొనలే కపోయాడు. ఇటీవల తిరిగి ఫిట్‌నెస్ సంపాదించుకోవడంతో అతడిని ఇరాని ట్రోఫీలో ఆడటానికి ఎంపిక చేస్తున్నామని బీసీసీఐ పేర్కొంది. అశ్విన్, జడేజాలిద్దరు భారత టెస్టు జట్టులో సభ్యులుగా ఉండేవారు.

### నేటి నుంచి ముంబై క్రికెట్ లీగ్

## బ్రాండ్ అంబాసిడర్‌గా టెండూల్కర్

**ముంబై:** అదొక ముంబై సిటీ పరిధిలో జరిగే ఒక చిన్న క్రికెట్ టోర్నమెంట్. అయితే నేమి.. ఆ లీగ్ బ్రాండ్ అంబాసిడర్ మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్.. లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ లీగ్ కమిషనర్..మాజీ కెప్టెన్ కల్నల్ వెంగ్ సర్కార్.. ఇంక ఆటగాళ్ల పేర్లు అంతే స్థాయిలో వున్నాయి. ఆజంక్య రహానే, రోహిత్ శర్మ లాంటి వాళ్లు కొన్ని జట్లలో సభ్యులు. అండర్ 19 ప్రపంచకప్ ను గెలిపించిన కెప్టెన్ పృథ్వీ షా కూడా ఓ జట్టు సభ్యుడే. గతంలో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించిన అభిషేక్ నాయర్, ధావల్ కులకర్ణి లాంటి వాళ్లూ వున్నారు. ఇవన్నీ చూస్తుంటే భారత క్రికెట్ మీద ముంబై ఆధిపత్యం కనిపించడం లేదూ!

## పంత్‌ను మరో పార్థివ్ చేయొద్దు

### సయ్యద్ కిర్మాణీ

**న్యూఢిల్లీ:** పార్థివ్ పటేల్ విషయంలో చేసిన తప్పిదాన్ని రిషబ్ పంత్ విషయంలో పునరావృతం చేయొద్దని మాజీ కీపర్ సయ్యద్ కిర్మాణీ సలహా ఇచ్చాడు. అతి చిన్న విషయంలో అంతర్జాతీయ క్రికెట్‌లోకి రిషబ్ పంత్ ను ఆడించడం ద్వారా అతని భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం వుందని అభిప్రాయపడ్డాడు. పార్థివ్ పటేల్‌ను కూడా దేశవాళీ క్రికెట్‌లో పెద్దగా ఆడనివ్వకుండానే అంతర్జాతీయ స్థాయిలో ఆడించడం వల్ల అతని కెరీర్‌కు నష్టం జరిగిందని అన్నాడు. ''16 ఏళ్లకే జట్టులో చోటు సంపాదించిన ప్రతి ఒక్కరూ మరో సచిన్ కాలేరు. రిషబ్ మంచి ఆటగాడే కానీ... అతనికి దేశవాళీ క్రికెట్‌లో మరింతగా ప్రోత్సహించాలి. మరో పార్థివ్‌ను కానివ్వొద్దు'' అని వ్యాఖ్యానించాడు. టీనేజీలోనే జట్టులో చోటు సంపాదించిన పార్థివ్ కెరీర్ ధోని రాకతో డైలెమాలో పడిన సంగతి తెలిసిందే. అదే విధంగా ధోని స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడిగా పేరు తెచ్చుకున్న రిషబ్ ఇప్పటివరకూ ఆడిన అంతర్జాతీయ మ్యాచుల్లో విఫలమవుతూ వస్తున్నాడు. రిషబ్ పంత్ వలెనే ఐపీఎల్ మ్యాచుల్లో సత్తా చాటిన సంజు సాంసన్ లాంటి ఆటగాళ్లు అవకాశాలు దక్కినప్పుడు నిరాశపరుస్తుండడంతో కిర్మాణీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



## ఆధిక్యంలో సఫారీలు

### రాణించిన ఆమ్లా, డివిలియర్స్



**పోర్ట్ ఎలిజబెత్:** రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 20 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. రెండవ రోజు ఆటముగిసే సమయా నికి 7 వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. ఓవర్ నైట్ బ్యాట్స్‌మెన్ హషీమ్ ఆమ్లా(56), ఎల్గార్(57)లు ఇద్దరూ హాఫ్ సెంచరీలు సాధించా రు. అయితే నిలదొక్కుకున్న ఇద్దరూ వరుస ఓవర్లలో ఔటవ్వడంతో ఆతిథ్య జట్టు కష్టాల్లో పడ్డట్టే కనిపిం చింది. అయితే డివిలియర్స్(74) బాధ్యతా యితమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆధిక్యంలో నిలిపాడు. అవతల ఎండ్‌లో కేవలం టెయిలెం డర్లు మిగల డంతో రేపు ఉదయం ఆట వారికి కీలకం కానుంది. ఇక బౌలింగ్ విషయానికి వస్తే తొలి టెస్టు హీరో స్టార్క్ ప్రమాదకర ఆమ్లా వికెట్ తీశాడు. ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ కెప్టెన్ డుప్లెసిస్‌తో పాటూ త్యూనిస్‌ను వికెట్లముందు దొరకబు చ్చుకున్నాడు.

### సిరీస్‌లో మరో వివాదం

● స్మిత్‌ను నెట్టిన రబాడా

● రెండు టెస్టుల నిషేధం!

దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాల మధ్య జరుగుతున్న టెస్టు సిరీస్‌లో వివాదాలు ఇప్పట్లో ముగిసేలా లేవు. డికాక్, వార్నర్‌ల మధ్య మాటల యుద్ధం గురించి క్రికెట్ ప్రపంచం మరిచిపోకముందే మరో గొడవ వార్తల్లో నిలిచింది. ప్రొటీస్ పేస్ బౌలర్ రబాడా వివాదానికి కేంద్రబిందువుగా మారాడు. రెండో టెస్టులో స్మిత్ ను నెట్టిన కారణంగా అతను రెండు టెస్టుల నిషేధాన్ని కూడా ఎదుర్కొనే అవకాశాలు కనిపిస్తున్నా యి. ఆసీస్ కెప్టెన్ స్మిత్ వికెట్ తీసిన రబాడా.. ఆవేశంగా బ్యాట్స్‌మన్ వైపు వెళ్లి అతడిని తాకుతూ ముందుకు కదిలాడు. దీన్ని గమనించిన ఆన్ ఫీల్డ్ అంపైర్లు కుమార ధర్మసేన, క్రిస్ గఫానేలు రబాడాపై లెవెల్ 2 అభియోగాన్ని మోపారు.

అయితే రబాడా మాత్రం కావాలని నెట్టలేదని, అది అనుకోకుండా జరిగిన సంఘటన అనీ వివరణ ఇచ్చాడు. సదరు సంఘటన మీద మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటారు.

### ఇదేమీ మొదటిసారి కాదు



ప్రస్తుత వరల్డ్ నంబర్ వన్ బౌలర్ రబాడాకు వివాదాలు కొత్తేం కాదు. తన దురుసు ప్రవర్తనతో నిషేధాన్ని ఎదుర్కొన్న సంఘటనలు కూడా అతని కెరీర్‌లో వున్నాయి. గతేడాది శ్రీలంక ఆటగాడు నిరోశా డిక్‌వెల్లాను ఉద్దేశ్యపూర్వకంగా తాకినందుకు 3 డీమెరిట్ పాయింట్లు దక్కించుకున్నాడు. తర్వాత ఇంగ్లాండ్‌లో అలాంటి చర్యల కారణంగానే ఓ టెస్టులో ఆడే అవకాశాన్ని కోల్పోయాడు. ఇక ఇదే సిరీస్‌లో ఇప్పటికే ముగ్గురు ఆటగాళ్ల క్రమశిక్షణా రహిత నడవడికకు చర్యలు ఎదుర్కోవడం జరిగింది. డివిలియర్స్ మీద బంతి విసిరినందుకు నాథన్ లయాన్.. ఒకరినొకరు బూతులు తిట్టుకున్న కారణంగా డికాక్, వార్నర్‌ల మ్యాచ్ ఫీజులు కోతలకు గురయ్యాయి. రబాడా విషయంలో మాత్రం మ్యాచ్ ఫీజులో కోత మాత్రమే గాక సిరీస్‌లో మిగిలిన రెండు టెస్టుల్లో ఆడే అవకాశాన్ని కోల్పోయే సూచనలు కనిపిస్తున్నాయి.

## బెయిర్ స్టో సెంచరీ

● కివీస్‌పై ఇంగ్లాండ్ విజయం

● 3-2 తేడాతో సిరీస్ కైవసం

**క్రైస్ట్‌చర్చ్:** 5 వన్డేల సిరీస్‌లో నిర్ణయా త్మక ఆఖరి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఘన విజయం సాధించింది. న్యూజిలాండ్‌పై 7 వికెట్ల తేడాతో గెలిచి కిరీస్ ను 3-2తో కైవసం చేసుకుంది. ఇంగ్లీష్ బ్యాట్స్‌మన్ జానీ బెయిర్‌స్టో(104) సెంచరీతో కదం తొక్కడంతో బ్లాక్ క్యాప్స్ నిర్దేశించిన 224 పరుగుల లక్ష్యాన్ని 104 బంతులు ుగిలి వుండగానే ఛేదించింది. అలెక్స్ హేల్స్‌తో కలిసి ఓపెనింగ్‌కు దిగిన బెయిర్ స్టో 58 బంతుల్లోనే సెంచరీ నమోదు చేశాడు. ఇది అతనికి వరసగా రెండో సెంచరీ కాగా.. ఇంగ్లాండ్ తరపున మూడో ఫాస్టెస్ట్ సెంచరీ కావడం విశేషం 9 ఫోర్లు, 6 సిక్స్‌లు బాది మరిన్ని రికార్డులు ఖాతాలో వేసుకునే సమయం లో బౌల్ట్ బౌలింగ్‌లో హిట్ వికెట్‌గా వెనుదిరి గాడు. మరో ఓపెనర్ అలెక్స్(61) కూ డా అర్ధసెంచరీ చేయడం తో తొలి వికెట్‌కు 155 పరుగుల భారీ భాగ స్వామ్యం నమోదైంది. హేల్స్, బెయిర్ స్టో పెవిలియన్ చేరిన తర్వాత రూట్, స్టోక్స్‌లు కాగల కార్యాన్ని పూర్తి చేశారు.



తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజి లాండ్ టాప్ ఆర్డర్ నిరాశ పరచడంతో 223 పరుగులకే పరిమితమైంది. తొలి ఓవర్ లోనే కొలిన్ మున్రో వికెట్‌ను కోల్పోయిన కివీస్.. 100 పరుగులు కూ డా చేయకుండానే 6 వికెట్లు నష్టపోయింది. 7వ వికెట్‌కు సాంట్‌నర్(67), హెన్రీ నికొలస్(55) 84 పరుగుల భాగ స్వామ్యం జోడించడంతో కనీసం ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ఆరంభంలో వికెట్లు పడుతు న్నా మార్టిన్ గప్టిల్ (47) కాసేపు పోరాటం చేశాడు. ఇంగ్లీష్ బౌలర్లలో క్రిస్ వోక్స్, రషీద్‌లు చెరో 3 వికెట్లతో న్యూజిలాండ్ పతనాన్ని శాసించారు. సెంచరీ వీరుడు జానీ బెయిర్ స్టోకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. క్రిస్ వోక్స్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ కైవసం చేసుకు న్నాడు.

### సూపర్ సిక్స్‌లో వెస్టిండీస్

**హరారే:** ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫై యింగ్ టోర్నీలో వెస్టిండీస్ సూపర్ సిక్స్‌లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన గ్రూప్ ఎ మ్యాచ్‌లో విండీస్ 52 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. వెస్టిండీస్ రోవ్‌మన్ పావెల్ సెంచరీతో కదం తొక్కి తన జట్టు గెలుపు లో కీలక పాత్ర పోషిం చాడు. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 257 పరుగులు చేసింది. బదు లుగా ఐర్లాండ్ బ్యాటింగ్ ప్రారంభించి 46.2 ఓవర్లలోనే 205 పరుగులకు ఆలౌటయింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును పావెల్ గెలుచుకున్నాడు.



**ఇపో(మలేసియా):** తిరిగి పుంజుకున్న భారత హాకీ జట్టు ఐర్లాండ్‌ను 4-1 తేడాతో ఓడించి శుక్రవారం నాటి ఓటమికి బదులు తీర్చుకుంది. అజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్‌లో 5వ స్థానంకోసం శనివారం జరిగిన పోరులో భారత్ ఆరంభంనుచే దూకుడును ప్రదర్శించింది.

### అజ్లాన్ షా కప్‌లో

## భారత్‌కు ఐదో స్థానం

● ఐర్లాండ్‌పై 4-1 తేడాతో భారత్ గెలుపు

ఆట ఐదవ నిమిషంలో వరుణ్ కుమార్ భారత్‌కు లభించిన రెండవ పెనాల్టీ కార్నర్‌ను విజయవంతంగా గోల్‌గా మలిచాడు. ట రెండో క్వార్టర్‌లో భారత్ తన దూకుడును కొనసాగించింది. ఆట 28వ నిమిషంలో ఐర్లాండ్ గోల్ కీపర్ జెమీ కార్‌ను బోల్తా కొట్టించిన భారత ఆటగాడు శైలేంద్ర లక్రా నీలం సంజీప్ అందించిన బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. దీనితో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 32వ నిమిషంలో లభించిన మరో పెనాల్టీ కార్నర్‌ను వరుణ్ గోల్‌గా మలచగా, 37వ నిమిషంలో గుర్జాంత్ సింగ్ భారత్‌కు గోల్ చేసిపెట్టి భారత్‌కు 4-0 ఆధిక్యాన్ని సంపాందించిపెట్టాడు. అయితే ఐర్లాండ్ ఆటగాళ్లకు 48వ నిమిషంలో లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. జూలియన్ డేల్ అద్భుతంగా ఆడుతూ భారత గోల్ కీపర్‌ను తప్పించి బంతిని గోల్ చేశాడు.ఈ మ్యాచ్ గెలుపుతో భారత్ టోర్నీ లో ఐదోస్థానం లో నిలిచింది.

## బంగ్లా సంచలనం

● భారీ స్కోరు ఛేదించిన చిరు జట్టు

● ఆతిథ్య లంకకు షాక్ ● ఆసక్తికరంగా ట్రైసిరీస్

కళ్లముందు 215 పరుగుల లక్ష్యం కొండలా కనిపిస్తోంది. అయినా బంగ్లాదేశ్ బెదరలేదు. పైగా ఆదినుంచి ఎదురుదాడి చేసింది. ఏదశలోనూ పట్టువదలకుండా లక్ష్య ఛేదన పూర్తి చేసింది.

భారత్‌పై విజయంతో ఊపుమీదున్న ఆతిథ్య జట్టుకు బంగ్లాదేశ్ షాకిచ్చింది. స్థాయికి మించిన టార్గెట్ ముందుంచినా అలవోకగా ఛేదించి సిరీస్‌లో నిలబడింది. బంగ్లా విజయం తో మూడు జట్లు తలా ఒక విజయాన్ని.. ఒక ఓటమిని సాధించినట్టయింది. సిరీస్ మరింత ఆసక్తికరంగా మారింది.

**కొలంబో:** నిదహాస్ ట్రోఫీలో బంగ్లాదేశ్ తొలి విజయాన్ని నమోదు చేసింది. నమ్మశక్యం కాని రీతిలో బ్యాటింగ్ చేస్తూ ఆతిథ్య జట్టుపై 5 వికెట్ల తేడాతో నెగ్గింది. 215 పరుగుల లక్ష్యాన్ని మరో రెండు బంతులు మిగిలివుండగానే ఛేదించి అబ్బురపరిచింది. బంగ్లా విజయంలో వైస్ కెప్టెన్ ముష్ఫికర్ రహీమ్(72; 35 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక పాత్ర పోషించాడు. తమీమ్ ఇక్బాల్ (47; 29 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), లిటన్ దాస్ (43; 19 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధసెంచరీలు చేజార్చుకున్నా చక్కటి ఆరంభాన్ని అందించారు. సౌమ్య సర్కార్(24), మహ్మదుల్లా(20)లు ఛేదనలో ఓ చెయ్యేశారు. మరోవైపు తొలుత బ్యాటింగ్ చేసిన లంక ఫామ్‌ను కొనసాగిస్తూ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. కుశాల్ పెరీరా(74; 48 బంతుల్లో 8 ఫోర్లు, రెండు సిక్స్‌లు), కుశాల్ మెండిస్(57; 30 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించారు. ఆరంభంలో గుణతిలక(26), చివర్లో ఉపుల్ తరంగ(32)లు రాణించారు.





ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం

## ఆరంభం బాగుంటేనే...

### ఇంగ్లండ్‌లో నిలుస్తాం: గంగూలీ

**ముంబై:** ఇంగ్లండ్ పర్యటనలో భారత్ రాణించాలంటే ప్రారంభ మ్యాచుల్లో రాణిం చాల్సి ఉంటుందని భారత జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. అంతేకాక, విదేశాల్లో గెలవాలంటే బౌలర్ల పాత్ర కీలకమంటూ సౌరవ్ వ్యాఖ్యానించాడు. శనివారం ఇండియా టుడే సదస్సులో సౌరవ్ గంగూలీ, అజింక్య రహానేలు పాల్గొన్నారు. దక్షిణా ఫ్రికాలో బౌలర్లు అద్భుతంగా రాణించడంవల్లే భారత్ రెండు సిరీస్ ల్లో గెలిచిందన్నాడు. విదేశాల్లో గెలవాలంటే బౌలింగ్‌దే ప్రధాన పాత్ర అని.. బౌలర్లు 20 వికెట్లు తీయాల్సి ఉంటుంది. భారత్‌కు బ్యాట్స్‌మన్ల కొరత లేదు. వారు 400 పరుగులు చేస్తారు. అయితే బౌలర్లు 20 వికెట్లు తీయాల్సి ఉంటుంది. తొలి రెండు టెస్టులు మంచి పిచ్‌లపై జరిగాయి. బౌలర్లు బాగా బౌలింగ్ చేశారు. అయితే.. జొహన్నెస్‌బర్గ్(వండరర్స్) మైదానం వీటికి భిన్నంగా ఉంది. టెస్టుల్లో అలాంటి పిచ్ అరుదుగా కన్పిస్తుంది. భారత బౌలర్లు అద్భుతం చేశారు. గెలుపును అందించారన్నాడు.



Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

Lively Interaction For Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
ఆదివారం 11మార్చి 2018



మనమంతా మనుషులమే అన్న విశాలత్వం సేవకు తొలి అంకురం. కష్టానికి అందరూ సమానమే అనే ఆలోచన సహాయం వైపు నడిపించే నాందీ ప్రస్థానం. మెతుకు మెతుకు కలిస్తే ముద్దవుతుంది, అలాంటి నాలుగు ముద్దలు అన్నార్థుల ఆకలి తీరుస్తాయి అంటారు కాదంబరి కిరణ్. పరిశ్రమలో నటుడిగా 35 ఏళ్ల ప్రయాణం ఆయనది. పాత్రికేయుడిగా, బుల్లితెర నటుడిగా, వెండితెరపై భిన్నమైన పాత్రలు చేసిన క్యారెక్టర్ ఆర్టిస్టుగా బహుముఖ ప్రజ్ఞ కాదంబరి సొంతం. ఇవన్నీ ఆయనకు వృత్తిపరమైన ప్రత్యేకతను అందిస్తే...మనంసైతం సేవా కార్యక్రమాలు వ్యక్తిగతమైన సంతృప్తినిస్తున్నాయి. వేలాది మందికి అపన్నహస్తం అందించింది మనంసైతం. ఒక్కరితో మొదలై నేడు లక్షలాది సైన్యంగా సేవా సామ్రాజ్యాన్ని విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో మనంసైతం నిర్వాహకులు కాదంబరి కిరణ్ అంతరంగం ఆంధ్రప్రభ లైఫ్‌లో చూద్దాం...

# వారి కోసం... మేము!



## కష్టాల్లో ఉన్న సినీరంగ కళాకారులకు అండగా ...
## కాదంబరి కిరణ్ మనంసైతం

అతి సామాన్య కుటుంబం నుంచి చిత్ర పరిశ్రమకు వచ్చాను. 1977 ఫిబ్రవరిలో హైదరాబాద్‌కు వచ్చాను. బంధువులు అడిక్‌మెట్‌లో ఉండేవాళ్లు. అప్పుడు ప్రముఖ పాత్రికేయులు జి.కృష్ణగారి అబ్బాయితో నాకు స్నేహం ఏర్పడింది.అలా జి.కృష్ణగారి సాన్నిహిత్యం లభించింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ స్పెషల్ కరస్పాండెంట్‌గా పనిచేసేవారు జి.కృష్ణ. మంత్రులు వచ్చి ఆయన కోసం వేచి చూసే పరిస్థితి ఉండేది. అయినా జీవితాంతం నిస్వార్థంగా బతికారు జి.కృష్ణ. అద్దె ఇంటిలో ఉండి అక్కడే కన్నుమూశారు. ఇలాంటి వ్యక్తులతో సహచర్యం నా ఆలోచనను మార్చేసింది. జీవితం అంటే నిస్వార్థంగా ఉండటం, నలుగురికి సాయం చేయడం అనే దృక్పథాన్ని ఏర్పర్చింది. ఈ ప్రపంచంలో మనల్ని మనమే నమ్ముకోవాలి అనే ఆలోచన నుంచి పుట్టిందే మనం సైతం. ముగ్గురు నలుగురితో మొదలైన ఈ సంస్థ ప్రస్తుతం లక్షల సంఖ్యకు చేరువవుతోంది. ప్రధాన సభ్యులమే పాతిక మంది దాకా ఉన్నాం.

ప్రతి జీవి సంపాదన ఆహారమే. మనిషికి మాత్రం అనేక రకాలు.చీమ, కాకి, కోతి లాంటి జీవులన్నీ దొరికిన ప్రతి ఆహారాన్ని కలిసి పంచుకుంటాయి. మనిషి సంపాదనంతా తన వాళ్లకే చెందాలనుకుంటాడు. జి.కృష్ణలాంటి వ్యక్తుల జీవితాలను తెలుసుకుంటే ప్రతి హృదయాన్ని కదిలించవచ్చు. ప్రతి ఒక్కరిలో మార్పు తీసుకురావచ్చు. నాకున్నది... ఒక మెతుకే కదా అని దాన్ని వెనకేసుకుంటున్నారు. వంద మెతుకులు కలిస్తే ఒక ముద్ద. వంద ముద్దలు కలిస్తే ఒక జీవితం. మనం సైతం స్ఫూర్తిగా తీసుకునేది ఈ దృక్పథాన్నే. మా సంస్థ కార్యక్రమాలను చూసి దర్శకులు కొరటాల శివ స్పందించి రెండు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. సూపర్‌స్టార్ కృష్ణగారు దీవించి, ఏ అవసరమున్నా ఇంటికి రమ్మని చెప్పారు. చిరంజీవి గారు ఇంటికి పిలిచి మనం సైతంతో నేనున్నానని చెప్పారు. చిరంజీవి ఛారిటబుల్ ట్రస్టు కంటే మనం సైతం గొప్ప సంస్థ కావాలని ఆశీర్వదించారు. మంచి కార్యక్రమాలు చేస్తున్నావంటూ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభినందించారు.

ఒక్కరితో మొదలైన మనం సైతం ఇవాళ లక్షలాది మందితో సైన్యంగా విస్తరిస్తోంది. రోజు రోజుకూ బలోపేతమవుతోంది. సహాయం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటే చేయి అందించే మనసున్న వాళ్లు ఎందరో ఉంటారు. భగవంతుడు మనల్ని ఒక చేత్తో అభివృద్ధిలోకి తీసుకెళ్తున్నప్పుడు..మనం మరో చేయి చాస్తే ఆ అండతో కొన్ని వందల వేల మంది ఆసరా పొందుతారు. ఈ విషయాన్ని నమ్మాను కాబట్టి మనం సైతం కార్యక్రమాలను భుజానికి ఎత్తుకున్నాను. మనం సైతం సేవా కార్యక్రమాలు ఇంటర్నెట్‌లో చూసి చాలా మంది విదేశాల నుంచి ఆర్థిక సహాయం చేస్తున్నారు. వంద రూపాయల నుంచి లక్ష రూపాయల దాకా విరాళ మిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

### మనం సైతం చేసిన వందలాది సేవా కార్యక్రమాల్లో కొన్ని....

- ★ అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న సీనియర్ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ మధుబాబుకు 50 వేల రూపాయల ఆర్థిక సాయం.
- ★ కేన్సర్‌తో బాధపడుతున్న జూనియర్ ఆర్టిస్ట్ శివకు 25 వేల రూపాయల సాయం..
- ★ ప్రమాదంలో దివ్యాంగురాలైన ప్రొడక్షన్ అసిస్టెంట్ రమేష్ కూతురు కిరణ్ కుమారికి కృత్రిమ కాలు అమర్చేందుకు 20 వేల రూపాయల సాయం.
- ★ డ్రైవర్ వీరాస్వామి కొడుకు ప్రమాదవశాత్తూ గాయపడితే 20 వేల రూపాయల తక్షణ సాయం అందించారు.
- ★ పోలియోతో రెండు కాళ్లూ పనిచేయని శ్రీరంగ లక్ష్మికి ట్రై స్కూటర్ అందజేత.
- ★ బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న డాన్స్ మాస్టర్ బి. శ్యామ్యూల్ కొడుకు పవన్ కుమార్ చికిత్సకు 25 వేల రూపాయల సాయం.
- ★ ప్రొడక్షన్ మేనేజర్ ముత్యాల రాము కుమారుడు కళాశాల రుసుము నిమిత్తం 18500 రూపాయలు అందజేత.
- ★ సీనియర్ దర్శకులు ఎస్వీ రమణ వైద్య ఖర్చులకు 15 వేల రూపాయల సాయం....
- ★ చెవి, గొంతు, ముక్కు అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి సిరి వైద్య ఖర్చులకు సహాయం అందజేత.

### మనం సైతం బృందం...

కాదంబరి కిరణ్‌తో పాటు మనంసైతంలో పలువురు బృందంగా సేవలు అందిస్తున్నారు. వాళ్లలో వెంకటేశ్వరరావు, బందరు బాబీ, పద్మావతీ దేవి, రజిత, కృష్ణచైతన్య, వినోద్ బాల, వల్లభనేని అనిల్ కుమార్, అనిత, ప్రవీణ్ కుమార్ యాదవ్, సన, విజయ లక్ష్మి, సత్య శ్రీ కృతి, పూర్ణ సాయి శ్రీ, మూర్తి, ఘంటా స్వామి, కంచర్ల శ్రీకాంత్, సురేష్, తదితరులు ఉన్నారు.

- రమేష్ గోపిశెట్టి

### ప్రముఖుల ప్రశంసలు...

**బ్లడ్‌బ్యాంక్‌లా ఎదగాలి...**

మంచి కార్యక్రమాలు చేస్తున్నావ్ కాదంబరి, నీ సహాయ కార్యక్రమాల గురించి వింటు న్నాను. నేను స్థాపించిన బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ కంటే గొప్ప సంస్థగా మనం సైతం ఎదగాలి. నీతో నేనున్నా..

- చిరంజీవి

**నా సహకారం ఉంటుంది..**

మంచి కార్యక్రమాలు చేస్తున్నావు. ఈ సహాయ కార్యక్రమాలకు నీకు ఎప్పుడు డబ్బు అవసరమైనా నా దగ్గరకు రా..

- కృష్ణ

**జన సేనలో భాగమవ్వు...**

జనసేన కార్యాలయం ప్రారంభోత్సవానికి కొద్దిమందినే పిలిచాను. నువ్వు గుర్తొచ్చావు. జనసైన్యంలో నువ్వూ పాలుపంచుకోవాలని ఆశిస్తున్నా...

- పవన్ కళ్యాణ్

**నేనెందుకు ఇలాంటివి చేయలేకపోతున్నా...**

మనంసైతం కార్యక్రమానికి వచ్చినప్పుడు నేనెందుకు ఇలాంటివి చేయలేకపోతున్నాను అనే ఆలోచన వస్తోంది. అవును ఇలాంటి సేవా సంస్థ నా దగ్గర ఎందుక ం లేదు. ఎన్నో ఏళ్లుగా కాదంబరి నాకు తెలుసు. ఎప్పుడూ ఆలోచనాపరుడిగా ఉండేవాడు. ఇలాంటి సేవా సంస్థ ప్రారంభిస్తాడని ఊహించాను. వారెన్ బఫెట్ తన సంపాదనలో తొంభై శాతం విరాళం ఇచ్చేశారు. కాదంబరి కూడా మనకు వారెన్ బఫెట్ లాంటి వాడే. ఇతని దగ్గర బఫెట్‌కు ఉన్నంత ఆస్తి ఉంటే అతని కంటే ఎక్కువ సేవా కార్యక్రమాలు చేసేవాడు.

- నటకిరీటి రాజేంద్రప్రసాద్

**సేవను మించిన సంతృప్తి లేదు..**

సేవా కార్యక్రమాలు చేయడం చాలా కష్టం. చాలా ఓపిక, పట్టుదల కావాలి. ఒక్కరి వల్ల కాదు. బృందమంతా కలిసి పనిచేయడం వల్లే మనం సైతం అభివృద్ధి సాధిస్తోంది. నేను గతంలో ఒక స్వచ్ఛంద సంస్థను నడిపించాను. ఓసారి నేనే వెళ్లి ఒకరికి ఆస్పత్రి బిల్లు కట్టాల్సివచ్చింది. అప్పుడు సేవా కార్యక్రమాల్లో కష్టమేంటో తెలిసింది. సేవను మించిన సంతృప్తి మరెక్కడా దొరకదు. నా సహకారం మనం సైతంకు ఉంటుంది.

- సహజనటి జయసుధ

**దేవుడు ఎంచుకున్న వ్యక్తి..**

కాదంబరి ఎప్పుడూ ఏదో పనిలో నిమగ్నమై ఉంటాడు. నేనూ అతను ఒకేసారి కెరీర్ ప్రారంభించాం. 30 ఏళ్లుగా అతనేంటో నాకు తెలుసు. దేవుడు కొంత మందిని ఎంచుకుని వాళ్ల ద్వారా అవసరంలో ఉన్న వాళ్లను ఆదుకుంటాడు. అలా మనంసైతం ద్వారా దేవుడు ఎంచుకున్న మనిషి కాదంబరి. నేను ఎవరికీ ఏ సహాయం చేయను అనుకుంటారు గానీ...చాలా మందికి గుప్తదానాలు చేశాను.

- హాస్యనటుడు బ్రహ్మానందం

**ఒకే సమాజంలో ఉన్నందుకైనా..**

శ్రీమంతుడు చిత్రంలో ఓ సంభాషణ ఉంటుంది. ఒకే భూమ్మీద బతుకుతూ, ఒకే సమాజంలో ఉంటూ సాటి మనిషి గురించి ఆలోచించకపోతే మనిషిగా పుట్టడం వృథా. కాదంబరి కిరణ్ చేస్తున్న మనం సైతం కార్యక్రమానికి వచ్చినప్పుడు మన జీవితం ఎక్కడ నుంచి మొదలైంది, ఏం చేస్తున్నాం అని సింహావలోకనం చేసుకుంటాం. ప్రతి ఒక్కరం తీరిక లేని జీవితాల్లో ఉన్నాం. ఇలాంటి సందర్భంలో మరొకరి గురించి ఆలోచించడం, సహాయం అందించడం కష్టమైన పని. ఆ పనిని ఎంతో ఇష్టంతో చేస్తున్నారు కాదంబరి కిరణ్. నేను నా వంతుగా రెండు లక్షల రూపాయలు విరాళం ఇస్తున్నాను.

- దర్శకులు కొరటాల శివ

### నా శత్రువు అనుకున్నా...సాయంచేశారు



సినిమాలు చేస్తున్నప్పుడు కాదంబరి, నేనూ ఎక్కువగా మాట్లాడుకునేవాళ్లం కాదు. నేనంటే ఆయనకు పడదు అనుకున్నా. అయితే నాకు కేన్సర్ అని తెలిసినప్పుడు కాదంబరి నన్ను వెతుక్కుంటూ వచ్చి మనం సైతం తరుపున సాయం అందించారు. నేను అన్నం పెట్టిన వాళ్లెవరూ కష్టాల్లో నన్ను ఆదుకోలేదు. కానీ...నా శత్రువనుకున్న కాదంబరి ప్రాణ స్నేహితుడిలా సాయం అందించారు.

- నటి అల్లరి సుభాషిణి





---



# జీర్ణశక్తిని పెంచే..మరీచ్యాసనం!

**యోగా టైమ్**

కాళ్లను ముందుకు చాపి కూర్చోవాలి. ఎడమకాలిని మోకాలివద్ద మడిచి...కాలిని నిటారుగా ఉంచి పాదాన్ని నేలకు ఆనించాలి. ఇప్పుడు ఎడమ భుజాన్ని ముందుకు తీసుకుని వచ్చి..ఎడమచేతిని ఎడమకాలి మీదుగా (కాలిని చుట్టుకున్నట్టుగా ఉంటుంది) వెనక్కు తీసుకుని వెళ్లాలి. అదేసమయంలో కుడిచేతిని కూడా వీపు వైపుకి తీసుకుని వచ్చి ఎడమచేతితో కలపాలి. ఈ స్థితిలో గాఢంగా శ్వాసని తీసుకోవాలి. శ్వాస వదులుతూ తలను శరీరాన్ని ముందుకు వంచుతూ తలని మోకాలికి తాకించే ప్రయత్నం చేయాలి. ఈ స్థితిలో రెండు భుజాలు ఒకదానికొకటి సమాంతరంగా ఉంటాయి. సాధారణ శ్వాసలో 30 సెకన్లపాటు ఉండి...శ్వాస తీసుకుంటూ పైకి లేవాలి. ఇదే విధంగా కుడికాలిని కూడా మడిచి... చేతులను కూడా తదనుగుణంగా మార్చి రెండవవైపున కూడా చేయాలి.

**ఫలితాలు:**

-ఈ ఆసనం పొట్టభాగంలోని అవయవాలకు చురుకుదనం పెంచుతుంది. ఆ భాగంలో ఉన్న మందకొడితనం వదిలిపోతుంది.

-మూత్రపిండాలను, వెన్నెముకను ఉత్తేజపరచి జీర్ణశక్తిని పెంచుతుంది. తలని ముందుకి వంచి మోకాలికి ఆనించే ప్రయత్నం చేయటం వలన పొట్టలో అవయవాలు ఒత్తిడికి గురై సంకోచం చెందుతాయి. దీంతో ఆయా భాగాలకు రక్తప్రసరణ మెరుగై...అవయవాలు ఆరోగ్యవంతమవుతాయి.

మొదట్లో చేతులను వెనక్కు తీసుకువెళ్లి...ముందుకు వంగడం కష్టమనిపించవచ్చు. కానీ సాధన చేస్తుంటే ఇది సాధ్యమవుతుంది. ఈ ఆసనంతో పొట్టలోపలి అవయవాలకే కాదు...వెన్నెముకకు కూడా మంచి వ్యాయామం జరుగుతుంది, చేతులు సైతం నాజూకుగా మారతాయి.



మోడల్
యోగాట్రైనర్
గాయత్రి



# ప్రేమ గువ్వ ఎగిరిపోకుండా...

ప్రేమ...సర్వాంతర్యామి! గుండెల్లో గువ్వలా గూడుకట్టుకుని.. ..కోర్కెల రెక్కలతో గిలిగింతలు పెట్టే ఓ మధురమైన అనుభూతి.. ప్రేమ పండితే జీవితం హాయిగా సాగిపోతుంది. లేదంటే ఆటుపోట్లు తప్పవు. ప్రేమలో పడినవారు ఎవరైనా తీయని ఊహాలోకంలో విహరిస్తారు. ప్రేమ తర్వాత జీవితం గురించి ఎన్నెన్నో మధురమైన కలలు కంటారు. కానీ ప్రేమలో విజయం సాధించడం సినిమాల్లో చూపించినట్టుగా నల్లేరు మీద నడకేమి కాదు. తమ కలల సాకారం కోసం ప్రేమికులిద్దరూ తీవ్రమైన కృషి చేయాలి. లేదంటే ప్రేమ వలలో చిక్కి...విలవిలలాడాల్సి ఉంటుంది. ప్రేమ బంధం బలపడాలంటే.... అందులోకి దిగేముందే దానికి సంబంధించిన కొన్ని విషయాలపట్ల అవగాహన ఉండాలి...అవేఇవి -



♥ ప్రేమే జీవితం కాదు... జీవితంలో ప్రేమ ఒక భాగం మాత్రమే. జీవితంలోని సంతోషాలన్నింటికీ అదే మూలం కాదని గుర్తుం చుకోవాలి. ప్రేమ అనేది ఓ మధురమైన అనుభూతి. ఆస్వాదించాలే తప్ప, అదే సర్వం అనుకోరాదు. అలాంటి అభిప్రాయం బలంగా ఉన్న ప్రేమికులు....అది సక్సెస్ కాకపోయినా, ఒకవేళ విజయవంతమైనా తర్వాత సమస్యలు ఎదురైతే తట్టుకోలేరు.

♥ జీవితంతో ముడివేసుకున్న సమస్యలన్నింటినీ పరిష్కరించే మంత్రదండం ప్రేమ కాదన్న నిజం ప్రేమలోకి దిగేముందే తెలుసుకోవా... తాయని, సినిమాల్లోలాగా ఎంజాయ్ చేయొచ్చని కలలుకనే ప్రేమ జంటలకు పెళ్లి తర్వాత సమస్యలు తలెత ్తడానికి అసలు కారణం...వారి ఆలోచనలే. అంటే ప్రేమే అన్నింటికి దివ్య ఔషధం అని భావించడమే.

♥ మీరు కలలు కన్నట్లు ..మీ ప్రేమ భాగస్వామి మీలాంటి అలవాట్లు, అభిరుచులు, జీవన శైలి, దృక్పథం కలిగి ఉంటుందని, ఉండాలని ఆశించవద్దు. ఎందుకంటే ప్రేమ పక్షులు పెరిగిన వాతావరణాలు, కుటుంబ నేపథ్యాలు వేరు. అంతేకాదు ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలు ఒకేలా ఉండవు. అందుకే ప్రేమలో దిగిన కొత్తలో ..నువ్వెక్కడుంటే నేనక్కడుంటా..నీ ఇష్టాలే నా ఇష్టాలంటూ..పాడుకునే ముందు....ఈ విషయాలు గుర్తుంచుకోవాలి. ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకోవాలి. ఒకరి ఇష్టాఇష్టాలు మరొకరు అంగీకరించేందుకు సిద్ధపడాలి.

♥ మనం చూస్తున్న...అన్యోన్యంగా సాగిపోతున్న.. బంధాలన్నీ ...... పైన చెప్పుకున్న సమస్యలను అధిగమించి సాగుతున్నవేనని గుర్తుంచు కోవాలి. ప్రేమ బంధమైనా, దాంపత్య బంధమైనా..తమ ప్రయాణంలో కలహాలు, కలతలు, అలకలు.. కష్టాల మజిలీలను అధిగమించాల్సిందే. అయితే ఈ సందర్భాల్లో భాగస్వామితో ఎక్కువగా వాదనలకు దిగకపోవడం మంచిది. సమస్యలు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకుంటూ సంతోషంగా ఉండడానికి ఇద్దరూ చొరవచూపాలి. అప్పుడే బంధం బలపడుతుంది. జీవిత నౌక సాఫీగా సాగిపోతుంది.

♥ విజయం సాధించిన ఏ ప్రేమ ప్రయాణంలో అయినా..అన్నీ మంచిరోజులు, అన్నీ బాధాకరమైన రోజులు ఉండవు. ప్రేమంటేనే కష్టసుఖాల కలబోత. అయితే అభిరుచులు, అలవాట్ల విషయంలో రాజీ ఉంటుందే తప్ప, నైతిక విలువలు, గౌరవం విషయంలో రాజీ ఉండదని గుర్తుంచుకోవాలి. ప్రేమ భాగస్వామి నైతికతకు, గౌరవానికి భంగం కలిగితే మాత్రం ఆ బంధం కొనసాగదు. అందుకే ఒకరిని ఒకరు గౌరవించుకోవాలి. అసంబద్ధమైన, బాధాకరమైన ఏ బంధమూ కలకాలం కొనసాగదు. అసలు ప్రేమంటేనే ఆనందానుభూతి!

♥ ప్రేమ బంధానికి సంబంధించి చిన్న చిన్న అంచనాలు ఉండడం మంచిదే. కాని ఏ విషయమూ పూర్తిగా తమ నియంత్రణలో ఉండదని గుర్తుంచుకోండి. ఎందుకంటే అంశం ఏదైనా ఇద్దరితో ముడిపడి ఉంటుందిమరి. ఇక గతంలో జరిగిన దానిగురించి, రాబోయే రోజుల్లో జరుగబోయే దాని గురించి తీవ్రంగా ఆలోచించడం మంచిదికాదు. ఒకరి ఆలోచనలు ఒకరు పంచుకుంటూ, అందమైన భవిష్యత్తుకోసం కలలు కంటూ... ఆశాజనకంగా ముందుకు సాగిపోవాలి.

♥ నిజమైన ప్రేమ జీవితంలో ఒక్కసారే పుడుతుంది అంటారు. ఆ ప్రేమానుబంధం జీవితాంతం కొనసాగుతుంది. ఒక్కసారి ప్రేమ విఫలమై, హృదయం ముక్కలైన వ్యక్తి ..జీవితంలో తిరిగి ప్రేమించడం చాలా కష్టంగా మారుతుంది. అందుకే సాధ్యమైనంత వరకు ప్రేమ బంధాన్ని నిలుపుకునేందుకే ప్రయత్నించాలి. ఏదిఏమైనా సరిగ్గా నిలుపుకుంటే ప్రేమంత మధురమైనది లేదు...వికటిస్తే అదే విషంగానూ మారుతుంది. అందుకే ప్రేమలో పడుతున్నపుడే...దాంతోపాటు జీవితంలోకి వస్తున్న బాధ్యతలను గుర్తుంచుకుని తీరాలి.

- చొల్లేటి వేంకటేశ్వరా చారి

# నేను శరీరం కాదు!

మీరు గాలిని లోపలికి పీలుస్తున్నప్పుడు కేవలం ఉచ్ఛ్వాసం మాత్రమే జరగడం లేదు. పాక్షికంగా గాలి విడవడం, నిశ్వాస కూడా జరుగుతూ ఉంటుంది. అట్లాగే నిశ్వాసంలో కూడా అదొక్కటే జరుగుతూ ఉండదు. ఉచ్ఛ్వాస కూడా పాక్షికంగా జరుగుతూనే ఉంటుంది. మీరు శ్వాస జరుగుతున్న పద్ధతిని జాగ్రత్తగా గమనిస్తే తప్ప ఈ విషయాన్ని తెలుసుకోలేరు. అనేక విధాలుగా శారీరకంగా శ్వాసయే మీ ప్రాణాధారం. చాలామంది నిజంగా తమ శ్వాసను అనుభూతి చెందరు.

**ప్రశ్న: నిత్యం శాంభవీ అభ్యాసం ద్వారా, దాదాపు రోజూ ఈశా క్రియ అభ్యాసం ద్వారా నా శరీరం కాని, మనసు కాని నేను కాదన్న అనుభూతి పొందడం ప్రారంభించాను. నేను ఎల్లవేళలా నా శరీరం నుండి, మనస్సు నుండి ఈ దూరం అనుభూతి చెందటం ఎట్లా?**

**సద్గురు:** ఈశా క్రియ సమయంలో మీరు ''నేను శరీరం కాదు, మనస్సు కాదు'' అన్నప్పుడు అది ఒక తత్త్వం కాని సిద్ధాంతం కాని కాదు. మీరు లోపల్లోపల మళ్ళీ మళ్ళీ చేసే నినాదం కాదు. ఒకరోజు అది వాస్తవంగా మారేది కాదు. ఇది మీరు మీ శ్వాసకు చేర్చే జ్ఞాపిక. ''నేను శరీరం కాదు, నేను మనస్సు కాదు'' అన్నదాన్ని మిమ్మల్ని మానసికంగా మార్చుకోవడానికి చేసే ప్రయత్నంగా ఉపయోగించకండి. మీరు మీ శ్వాస కోశ అంశాన్ని చేరుస్తున్నారు. లేకపోతే మీరు మీ శ్వాసను గమనించలేరు. ఇప్పుడు మీరు కేవలం గాలి కదలిక వల్ల కలిగిన ప్రకంపనలను చూడగలుగుతున్నారే కాని శ్వాసను కాదు.

మీరు గాలిని లోపలికి పీలుస్తున్నప్పుడు కేవలం ఉచ్ఛ్వాసం మాత్రమే జరగడం లేదు. పాక్షికంగా గాలి విడవడం, నిశ్వాస కూడా జరుగుతూ ఉంటుంది. అట్లాగే నిశ్వాసంలో కూడా అదొక్కటే జరుగుతూ ఉండదు. ఉచ్ఛ్వాస కూడా పాక్షికంగా జరుగుతూనే ఉంటుంది. మీరు శ్వాస జరుగుతున్న పద్ధతిని జాగ్రత్తగా గమనిస్తే తప్ప ఈ విషయాన్ని తెలుసుకోలేరు. అనేక విధాలుగా శారీరకంగా శ్వాసయే మీ ప్రాణాధారం. చాలామంది నిజంగా తమ శ్వాసను అనుభూతి చెందరు. వాయు మార్గపు కదలిక అనుభూతిని ఇచ్ఛాపూర్వకంగా పొందే వ్యక్తి అన్ని రకాల పరివర్తనలూ పొందుతానంటాడు. అది నిజమే. మీరేమిటి అన్నదానికి అన్నిటికంటే పై పొరే మీ అనుభూతులు. ఆ అనుభూతులను తెలుసుకోవడం చాలా ముఖ్యం. మీరు కూర్చున్నా, నిలుచున్నా, దేన్ని తాకినప్పటికీ దాని స్పర్శ జ్ఞానం మీకుంటుంది. కాని మీ అనుభవంలోకి తేలికగా రాని చాలా ముఖ్యమైన, ఉదాత్తమైన అంశం శ్వాస.

### శ్వాసను తీసివేసుకోవడం

శ్వాసను కూర్మనాడి అన్న అర్థంలో మనం వాడినప్పుడు అది కేవలం ఆక్సిజన్ తీసికొని కార్బన్ డైఆక్సైడ్ వదలడం కాదు. మన శ్వాస అనే దాని ఫలితంగా అది జరుగుతుంది. గాలి లోపలికి రావడం, బయటికి వెళ్లడంతో పాటు శారీరక ప్రక్రియ జరగడానికి మరో స్థాయిలో వ్యవహారం జరగాలి.

వైద్యశాస్త్రపరంగా మనిషి మరణించిన తర్వాత కూడా గాలి కదలిక, గుండె కొట్టుకోవడం, మెదడు పనిచేయడం ఆగిపోయిన తర్వాత కూడా కూర్మనాడి ఇంకా ఉందనే అర్థంలో అతను మరి కొంతసేపు శ్వాసిస్తూ ఉంటాడు. ఆ ప్రక్రియ సాగుతూనే ఉం టుంది కాని గాలిని లోపలికి పీల్చుకోవడం, కార్బన్ డైఆక్సైడ్‌ను బయటికి వదలడం మాత్రం అది చేయలేదు. ఇదెలా ఉంటుందంటే ఒక పాత సైఫన్ పనిచేస్తూనే ఉంటుంది, కాని ఎక్కడో ఒకచోట లీకేజీ ఉన్నందువల్ల నీరు మాత్రం బయటికి రాదు. అదేవిధంగా కూర్మనాడి పనిచేస్తూనే ఉంటుంది. కాని ఆక్సిజన్, కార్బన్ డైఆక్సైడ్ మార్పిడి మాత్రం ఆగిపోతుంది.

ఉదాహరణకు స్టాక్ ఎక్స్ఛేంజ్ మూతబడిందనుకోండి. చాలామంది మొత్తం ఆర్థిక వ్యవస్థ పని అయిపోయిం దనుకుంటారు. కాని ఇంటి పక్క దుకాణంలో బ్రెడ్ మాత్రం దొరుకు తూనే ఉంటుంది. మీరు నగదు రూపంలో చెల్లించకపోవచ్చు. వస్తు మార్పిడి పద్ధతిలో చెల్లించవచ్చు. ఆర్థికవ్యవస్థ నడుస్తూనే ఉంటుంది. కాకపోతే దాని స్థాయిని కొలవడం సాధ్యం కాకపోవచ్చు. అదేవిధంగా మీ ఉచ్ఛ్వాసనిశ్వాసలు ఆగిపోయినప్పటికీ కూర్మనాడి ఇంకా పనిచేస్తూనే ఉండవచ్చు.


మీరు మీ శ్వాసకొక అంశాన్ని చేరుస్తున్నారు. లేకపోతే మీరు శ్వాసను గమనించలేరు.

మనం శ్వాస స్పృహ గురించి మాట్లాడుతున్నాము. అంటే మీకూ మీ శరీరానికి నడుమ ఉన్న సంబంధాన్ని గురించిన జ్ఞానం. మీ శ్వాసను తొలగిస్తే మీరు, మీ శరీరమూ విడిపోతారు. మీశ్వాసతో పాటు ప్రయాణించడం మీకు ఈ కోణాన్ని అందిస్తుంది. శరీరాన్ని మీ నుండి కొంచెం దూరంగా ఉంచితే మీరు మీ శరీరం కాదని అర్థం చేసుకుంటారు. మీరు వదులుగా ఉండే బట్టలు వేసుకున్నప్పుడు ఆ బట్టలు మీరు కాదని తెలుసుకుంటారు. కాని బిగుతుగా ఉండే బట్టలు వేసుకున్న ప్పుడు కొంత సమయం తర్వాత అవి మీరో కాదో తెలుసుకోలేరు. చర్మాన్ని 'మీరు'గా అనుభూతి చెందుతారు. శరీరం మీద కొంత చర్మం మాయమైపోవచ్చు. అయినా మీరు 'మీరు'గానే ఉంటారు. శరీరపు లోపలి పొరల్లోకి వెళ్లి చూచినప్పటికీ మీరు 'మీరు'గానే ఉంటారు.

## సద్గురుబోధ

### మీ శ్వాసకొక పరిమళం జోడించడం

'నేను శరీరం కాదు- నేను మనస్సు కాదు' అన్నదాన్ని ఒక నినాదంగా ఉపయోగించవద్దు. అది అలా పనిచేయదు. ఇది మీకు చెప్పడం ఎందుకంటే మీకు కూర్మనాడి లేదా శ్వాసను



గురించిన స్పృహ కలిగించడానికి నినాదాలు చేయడం వీధిలోని గుంపులతో వ్యవహరించే పద్ధతి. దానితో మీరేమీ చేయలేరు. నేను ఉత్తరభారతంలో కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు ''సద్గురు మహరాజ్ కీ జై'' అని నినాదం చేయాలని ప్రజలు అనుకోవడం సాధారణం. నేను వెంటనే వాళ్లను ఆపుతాను. ''ముందు ఒక నినాదం వస్తుంది, తర్వాత ఒక జెండా, తర్వాత ఒక చిహ్నం, ఆ తర్వాత మీకు మీరే ఒక దేశం అవుతారు. ఆ తర్వాత మీకొక జాతీయపక్షి వస్తుంది'' అని చెప్తాను.


'నేను శరీరం కాదు- నేను మనస్సుకాదు' అన్నది చాలా సూక్ష్మరీతిలో జరగాలి. అప్పుడే శ్వాస మీ స్పృహలోకి వస్తుంది. ఈ ఆలోచనతో మీరు శ్వాసకు ఒక పరిమళం జోడించ గలుగుతారు. ఆ పరిమళం మీరు మీ శ్వాసను గమనించడంలో తోడ్పడుతుంది. గాలి ఎటు కదులుతూ ఉందో చూడడానికి సాంబ్రాణీ కడ్డీ వెలి గించినట్లు ఇది ఉపయోగపడుతుంది. గాలి చాలా మెల్లగా కదులు తున్నట్లయితే మీరు దాన్ని తెలుసుకోగలరు. ఇదీ అంతే.

**- సద్గురు జగ్గీవాసుదేవ్**

## చింతన

### శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

## విచారమణిమాల



ముప్పదేండ్లకు పూర్వం భగవాన్ అరవంలో వ్రాసిన ''విచారసాగర సారసంగ్రహ'' మనే చిన్న పుస్తకం అరుణాచల మొదలియారు ముద్రింపించారట. కాని, శ్రీవారి పేరందులో ప్రచురించనందున ఆ గ్రంథం అజ్ఞాతమై ఉన్నది. ఈ మధ్య , మళయాళ భాషలో ఉన్న, విచారసాగరం ఒకరు తీసుకొని, తిరిగి ఇవ్వటంతో శ్రీవారి చేతికి వచ్చింది. అప్పుడీ విచార సాగర సారసంగ్రహం తాము వ్రాసినట్లు జ్ఞప్తికి వచ్చి ''అచ్చు ప్రతి ఎక్కడో ఉండా''లన్నారు భగవాన్. వెదకితే శిథిలావస్థలో ఉన్న ఆ చిన్ని పుస్తకం దొరికింది. పునర్ముద్రణార్థమొక భక్తులు కాపీ చేస్తుంటే, ''వైరాగ్యాన్ని గురించి జండా ఉపమానం చేర్చ''మన్నారు భగవాన్. ''ఈ ఉపమానం యొక్క తాత్పర్యం ఏమి?'' అని భక్తులడిగితే, భగవాన్ చిరునవ్వుతో ''జ్ఞానికి విరాగమనే జండా, అజ్ఞానికి రాగమనే జండా, ఎదుట కట్టబడినట్లుంట వన్నమాట. అది చూచేవీడు జ్ఞాని. వాడ జ్ఞాని అని గుర్తింపవచ్చు. అజ్ఞానికి ఒకవేళ ఆధి వ్యాధుల వల్ల విరాగం కలిగినా క్షణికమే. రాగమనే పతాకమే ముందుకు వచ్చి నిలుస్తుంది. విరాగమనే జండా ఉన్నదే. ఎప్పుడూ చలించదు. జ్ఞాని కంతకన్న గొప్ప చిహ్నం ఏమున్నది?'' అన్నారు.

''భగవాన్ ఈ పుస్తకం వ్రాసిన కారణమేమి?'' అన్నారింకొకరు. ''విచార సాగరం హిందీలో సాధు నిశ్చలదాసు, అనేక తర్కవాదాలతో నింపి వ్రాశారు. అది అనువదించి ముద్రించిన తమిళగ్రంథం అరుణాచల మొదలియార్ తెచ్చి, 'ఇది చాలా విస్తారంగా ఉన్నది. దీనిలో ముఖ్యాంశములు సంగ్రహించి భగవాన్ చిన్ని పుస్తకంగా వ్రాయా'లని పట్టుబట్టారు. పోనీ జిజ్ఞాసువులకనుకూలంగా ఉంటుందని వ్రాశారు. వారు వెంటనే ప్రకటించారు. ముప్పదేండ్ల నాటి ముచ్చట'' అన్నారు భగవాన్. ''భగవాన్ పేరెందుకు ప్రకటించలేదో?'' అన్నారా భక్తులు. ''ప్రకటిస్తే, అంతా ఒక్కొక్క గ్రంథం తెచ్చి, సంగ్రహంగా వ్రాయమంటారేమోనని నేనే వారించా''నన్నారు భగవాన్. ''ఇంకా అజ్ఞాతమై, ఎన్ని రచనలున్నవో, దయ చేసి సెలవిస్తే బాగుండునే'' అన్నా నేను. 'సరిపోయింది. నీకేం పనిలేదు' అంటూ మౌనం వహించారు భగవాన్.

ఈ పుస్తకానికి లోగడ ఉన్న పేరు సరికాదని ''విచారమణిమాల'' అని మార్చారు భగవాన్. ఈసారి భగవాన్ పేరు చేర్చి ప్రెస్సుకు పంపాలనుకుంటూ ఉంటే తెలుగులో కూడా శ్రీవారే వ్రాస్తే బాగుండునని మనస్సులో ఉన్నా, భగవాన్ ఒప్పుకోరని ఊరుకున్నాను. మౌనిగారు (శ్రీనివాసరావు) ''తెలుగులో గూడా భగవానే వ్రాస్తే బాగుంటుంది. రెండూ ఒకేసారి ప్రచురించవచ్చు''నని రాజగోపాలయ్యరు చేత అడిగించి, ''నాగమ్మా, నీవున్నూ ప్రార్థించరాదా'' అని నన్ను ప్రోత్సహించటం వల్ల, శ్రీవారిని వేడుకున్నాను. ''నేనేం తెలుగు పండితుడినా యేమి. మీరు వ్రాయరాదూ? నేనెందుకు వ్రాయటం'' అంటూ కొంచెం సేపు వాదించినా కరుణామయులు గనుక, కడకెట్లాగో మా ప్రార్థనానుసారం తామే తెలుగున అనువదించారు. అది రెండు భాషలలోనూ త్వరగా ముద్రణ కాగలదు. అది వచన కావ్యం. ఒక్కొక్క వాక్యం ఒక్కొక్క సూత్రం వలె ఉన్నది.

**- సూరినాగమ్మ**

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

# శ్రీరామ పట్టాభిషేక నిర్ణయం



దశరథునికి నలుగురు కొడుకులు నాలుగు చేతులవంటివారు. అందరి పట్ల దశరథునికి మక్కువ ఎక్కువే! పెద్ద కొడుకు శ్రీరామచంద్రుని పట్ల ప్రీతి మరీ ఎక్కువ. సకల సద్గుణ సంపన్నుడు, మృదుభాషి, ప్రజాహితైకాభిలాషి, ప్రజాభిమానం చూరగొన్న ప్రియాతిప్రియమైన శ్రీరాముని తాను బతికి ఉండగానే రాజుగా చూడాలని దశరథుడు ముచ్చట పడ్డాడు. అరవై వేల సంవత్సరాలు నిండాయి, వార్ధక్యం మీద పడింది. ఎప్పుడు ఏమి జరుగుతుందో ఎవరికి ఎరుక! ఆ ముచ్చట ఏదో తాను కనులారా చూస్తే, ప్రశాంత మనస్కుడై పోవచ్చు కదా అనుకున్నాడు. వెంటనే వసిష్ఠాది పురోహి తులను, సుమంత్రాది మంత్రులను, సేనాపతులను, సామంతరాజులను బ్రాహ్మణ ముఖ్యులను, పుర ప్రముఖు లను, జానపద శ్రేష్ఠులను సమావేశపరిచాడు. దశరథుడు తన మనసులో మాట అందరి వద్ద బయటపెట్టాడు. 'నాకు వయస్సు పైబడింది. అరవై వేల ఏండ్లు రాజ్యపాలన చేసి అలసిపోయాను. మా వంశంలోని పూర్వీకులను ఆద ర్శంగా తీసుకుని యధాశక్తి ప్రజా సంక్షేమానికి పాటు పడ్డాను. ఇక ఈ బరువు మోయలేను. విశ్రాంతి తీసుకోవా లని అనుకుంటున్నాను. నా రాముడు సకల గుణాభి రాముడు, ప్రజారంజకుడు, ప్రజలకు బహిఃప్రాణం, ధర్మజ్ఞుడు, నీతి కోవిదుడు, ధనుర్వేద విద్యా విశారదుడు,

## సంక్షిప్త రామాయణం

శత్రు భయంకరుడు, పరిపాలనా దక్షుడు, మంత్రి సామంత దండనాథులకు ప్రీతిపాత్రుడు, రాజకార్య దురంధరుడు, కార్యాకార్య విచక్షణా జ్ఞానసంపన్నుడు. ఈ విషయం జగమెరిగిన సత్యం! ప్రజా శ్రేయస్సును కోరి, శ్రీరాముని యువరాజుగా పట్టాభిషిక్తుడిని చేయాలని అనుకుంటున్నాను. ఇది చైత్రమాసం కదా! రేపు పుష్యమీ నక్షత్రయుక్తమైన శుభముహూర్తం కదా! ఈ ముహూర్తం లోనే ఈ శుభ కార్యం జరగాలని నా తలంపు. ఇది నా భావన మాత్రమే! ఇంతకంటె ప్రజాహితకరమైన మార్గం ఏదైనా ఉంటే మీరు సూచించవచ్చు. పక్షపాత రహితులైన మధ్యస్థుల నిర్ణయమే నా నిర్ణయం కంటె సముచితంగా ఉంటుంది కదా!' అన్నాడు దశరథుడు.

సభాసదులలో ఒక్క సారిగా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. అందరూ ముక్త కంఠులై సమ్మతిని తెలిపారు. ఇది సరైన సమయంలో తీసుకున్న సముచితమైన నిర్ణయమని అభినందించారు. దశరథుడు వారి ఆంతర్యాన్ని తెలియగోరి, నా పాలన వల్ల విసిగిపోయి, ఈ నిర్ణయానికి వచ్చారా? లేక రాముని శక్తి సామర్థ్యాలను, గుణగణాలను మెచ్చి, ఈ నిర్ణయాన్ని అంగీకరిస్తున్నారా? అని అడిగాడు. సభాజనులందరూ ఏకగ్రీవంగా ఇలా తెలిపారు.

'ఇక్ష్వాకు వంశీయులలో రాముడు కార్యదీక్షాపరతంత్రుడు, ప్రజాభిమాని, ప్రజారంజకుడు, చంద్రుని వలె చల్లనివాడు, సహనంలో భూమి వంటివాడు, బుద్ధి యందు బృహస్పతి, పరాక్రమంలో దేవేంద్రుడు, అహర్నిశలు ప్రజల బాగోగులను గూర్చి శ్రమించేవాడు. ప్రజా సంక్షేమమే తన క్షేమంగా భావించే ప్రజాహితైకాభిలాషి. గురువులను, బ్రాహ్మణులను భక్తి శ్రద్ధలతో సేవించే వినయ శీలి. ప్రజల కష్టసుఖాలలో పాలు పంచుకుంటాడు. త్రికరణ శుద్ధిచే మహానుభావుడు. కోసల రాజ్య ప్రజలు, వృద్ధ, బాల, స్త్రీ భేదం లేకుండా అందరూ రామ పట్టాభిషేకాన్ని కనులారా చూడాలని కలలు కంటున్నారు. ఆ సమయం కోసం ఉవ్విళూరుతున్నారు. ప్రజాభిప్రాయమే మీ నోట వెలువడింది. మీ కోరిక, ప్రజల ఆకాంక్ష నెరవేరే శుభ సమయం కోసం ఎదురుచూస్తున్నాం' అన్నారు.

దశరథుడు సభాసదులను ఉద్దేశించి 'నా అభిప్రాయమే మీ అభిప్రాయం అవడం నా భాగ్యం!' అన్నాడు. ప్రజాభిప్రాయం తెలిసింది కదా! ఇక శ్రీరామ పట్టాభిషేకానికి ఏర్పాట్లు కల్పింపుమని దశరథుడు వసిష్ఠుని కోరాడు.

వసిష్ఠుడు మంత్రులను ఆజ్ఞాపించాడు. పదార్థాలన్నీ క్షణాల మీద సేకరింపబడ్డాయి. వసిష్ఠుడు వచ్చి, 'ప్రభూ! సమస్తమూ సిద్ధమైంది' అన్నాడు. దశరథుడు సుమంత్రుని చూసి 'రాముని రథారూఢుని చేసుకుని రమ్ము' అన్నాడు. సుమంత్రుడు వెళ్లి రాముని తీసుకుని వచ్చాడు. సుమంత్రుడు గౌరవ పురస్సరంగా చేయి అందించాడు. సుమంత్రుని చేయూతతో రాముడు రథం దిగి తండ్రిని సమీపించి, భక్తి వినయాలతో నమస్కరించాడు. దశరథుడు రాముని చేరదీసి, దీవించి, ఆసనాసీనుని కావించాడు. కనురెప్ప వేయక రామునే చూస్తూండిపోయాడు. ఎంత చూసినా తనివి తీరలేదు. చివరకు కర్తవ్యం గుర్తుకు వచ్చి, 'రామా కౌసల్య కడుపు చల్లగా కన్న పుణ్య గుణ సంపన్నుడవు. ఆమె అందాన్ని, సుగుణాలను పుణికి పుచ్చుకున్న పుణ్య పురుషుడవు. రేపు పుష్యమీ నక్షత్ర యుక్త శుభ ముహూర్తంలో యువరాజుగా నిన్ను అభిషిక్తుని చేయాలని ఈ సభ ఏకగ్రీవంగా నిర్ణయించింది' అన్నాడు.

**- కె ఓబులేశు**
**9052847742**

## దినఫలాలు

**మేష రాశి:** గృహవిషయాలు, విద్యా ప్రయత్నాలు అనుకూలం. రుణ ఒత్తిడులు తగ్గుతాయి. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. ఆదాయంలో నూతన అవకాశాలు ఏర్పడతాయి.

**వృషభ రాశి:** మానసిక చిరాకులు పెరుగుతాయి. విద్యా ప్రయత్నాలు అనుకూలం. వాహన కొనుగోళ్ళు ఉపకరిస్తాయి. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ప్రయాణాలు సుఖవంతం. ఆర్థిక ఇబ్బందులు పరిష్కరింపబడతాయి. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. వేగవంతమైన నిర్ణయాలు పనికిరావు. ఆదాయంలో అభివృద్ధి ఉంటుంది.

**మిథున రాశి:** ఆరోగ్య అనుకూలత పెరుగుతుంది. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. స్థిరాస్తి విషయాల్లో ఆదాయం పెరుగుతుంది. పనులను అనుకొన్న సమయానికి పూర్తి చేయగలుగుతారు. అధిక ప్రయత్నాలతో అనుకూల పరిస్థితులు ఆదాయపరంగా ఉంటాయి.

**కర్కాటక రాశి:** ఆర్థిక లావాదేవీలు అనుకూలం. ఆరోగ్యం క్రమశిక్షణ తప్పనిసరి. శత్రుభీతి పోతుంది. ఆదాయంలో అనుకూలత గట్టి ప్రయత్నాలతో సాధ్యం.

**సింహ రాశి:** ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. వృత్తిలో గుర్తింపు లభిస్తుంది. ఒత్తిడులు అన్నిరకాలుగా పెరుగుతాయి. ఆరోగ్య ఖర్చులు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆదాయ మార్గాలు మూసుకుపోతాయి. కాబట్టి జాగ్రత్తలు వహించాలి. ఆదాయంలో అసహన పరిస్థితులు ఉన్నా నెట్టుకు రాగలుగుతారు.

**కన్యా రాశి:** వాహన కొనుగోళ్లు ఉపకరిస్తాయి. దూరప్రయాణాలు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆర్థిక ప్రోత్సాహం ఉంటుంది. ఆరోగ్యంలో, ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి. ప్రత్యర్థులు బలపడతారు.


**తులా రాశి:** నూతన కార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. విద్యా ప్రయత్నాలు కలసి వస్తాయి. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. విదేశీలావాదేవీలు లాభిస్తాయి. సినీరంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు ఉన్నా అంతిమ విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. సమాచారాలని సమయానికి సమర్పించలేకపోతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

**వృశ్చిక రాశి:** గృహకార్యాలు, కార్యక్రమాలలో ప్రోత్సాహం ఉంటుంది. ఉద్యోగ యత్నాలు అనుకూలం. శుభవార్తలు వింటారు. మానసిక రుగ్మతలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయం పర్వాలేదు.

**ధనూ రాశి:** శారీరక శ్రమ తగ్గుతుంది. వ్యాపార ఒప్పందాలు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. విదేశీలావాదేవీలు ఉపకరిస్తాయి. శ్రమ తగ్గుతుంది. పనులు వేగవంతంగా పూర్తి చేయగలుగుతారు. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.


**మకర రాశి:** కోర్టు వ్యవహారాల్లో ఊరట లభిస్తుంది. ఆరోగ్య రక్షణ తప్పని సరి. వ్యాపార ఒప్పందాలు లాభిస్తాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక విస్మయాలు ఆర్థికంగా ఉంటాయి. ఆదాయంలో అనుకూల వాతావరణం ఉంటుంది.

**కుంభ రాశి:** వ్యాపార విస్తరణలు కలసి వస్తాయి. ఆర్థిక ప్రోత్సాహం ఉంటుంది. ఆర్థిక ప్రయత్నాలు కలసి వస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ప్రయాణాల విషయంలో కూడా సరైన అవగాహనతో కూడిన నిర్ణయాలు మాత్రమే విజయాలను కలిగిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.



**మీన రాశి:** ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. విధులను సక్రమంగా నిర్వహించ గలుగుతారు. ఆరోగ్య రక్షణ ఉంటుంది. ముఖ్యమైన పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.

శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



## భగవద్గీత

# బ్రహ్మరాత్రి యందు జీవులు నశిస్తారు

అధ్యాయం 8
శ్లోకం 19

భూతగ్రామః స ఏవాయం
భూత్వా భూత్వా ప్రలీయతే।
రాత్ర్యాగమేవశః పార్థ
ప్రభవత్యహరాగమే ॥

**తాత్పర్యం**

బ్రహ్మదేవుని పగటి సమయము ఆరంభమైనపుడు జీవులు మరల మరల వ్యక్తమవుతూ అతని రాత్రి సమయం ప్రారంభమైనంతనే అవశులై నశిస్తారు.


**భాష్యం**

ఈ జగమునందు జీవితము మెరుగుపరుచుకోవాలనుకునేవారు స్వర్గలోకాలకు ఉద్ధరింపబడి మరల పుణ్యము తరిగినంతనే భూమిపైకి వస్తారు. ఇలా బ్రహ్మ పగలు అనగా వెయ్యి చతు ర్యుగాలు గడచినంత, బ్రహ్మ రాత్రి మొదలయ్యే సమయంలో ప్రళయం సంభవించి, జీవులందరూ విష్ణువు యందు ఉంచబడతారు. మరల పగలు మొదలైనపుడు, జీవులు వారి వారి కోరికలన నుసరించి వేరు వేరు శరీరాలను తీసుకొని భౌతిక జీవితాన్ని కొనసాగిస్తారు. ఆ విధంగా బ్రహ్మజీవిత కాలము పిదప ప్రళయం సంభవించి కోటాను కోట్ల సంవత్సరాలు అవ్యక్తస్థితిలో ఉండిపోతారు. మరలా బ్రహ్మ జన్మించినంతనే వారు భౌతిక జీవితము, వేరు వేరు జన్మలు, శరీరాలు పొందుతూ ఇలా ఈ భౌతిక ప్రపంచపు మాయాజాలంలో చిక్కుకొనిపోతారు. అదే బుద్ధిమంతులు '**హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే** 'నామ ఉచ్చారణతో కృష్ణచైతన్య సాధన చేస్తూ ఈ జన్మలోనే కృష్ణుని సాంగత్యాన్ని, నిత్య ఆనంద స్థితిని అనుభవిస్తూ జన్మమృత్యు చక్రానికి అతీతులుగా ఉంటారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఏసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



# సంస్కృతి



# భారత-గ్రీకు నాటకాలకు భేదాలు-సారూప్యతలు

గ్రీసుదేశంలో సోఫోక్లిజ్, యూరపిడన్, ఐస్కిలస్ మొదలైన నాటక రచయితలు 4వ శతాబ్ది నాటికే గొప్ప ట్రాజడీలనే రూపాలను రచించారు. ట్రాజడీల లక్షణాలను సవివరంగా తెలిపే గ్రంథం '----'ను రచించి అరిస్టాటిల్ గ్రీకు నాటక కళను ప్రపంచంలో సుస్థిర స్థానం, గౌరవం కలుగజేశాడు. క్రీ.శ. 16వ శతాబ్దంలో ఇంగ్లాండులో ఎలిజబెత్ రాణి కాలంలో వెలిసిన నాటకాలు ప్రపంచ చరిత్రలో గొప్ప గౌరవాన్ని పొందాయి. గ్రీకు ఇంగ్లీషు నాటకముల మధ్యకాలంలో భారతీయ నాటకాలను మించిన నాటకాలు ప్రపంచంలో లేవంటే అతిశయోక్తి కాదు. గ్రీకు దండయాత్ర ఫలితంగా భారతదేశంలో కళలపై గ్రీకుల ప్రభావం కొంత ప్రభావం ప్రసరించింది. శిల్పములో గాంధార రీతి ఇటువంటిదే. కాని గ్రీకు నాటకాల ప్రభావం మిక్కిలిగా ఉన్నదని కొందరు పాశ్చాత్య పండితులు అభిప్రాయపడ్డారు. వెబర్ వంటివారు అభిప్రాయపడినట్లుగా ఇది వాస్తవం కాదని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. గ్రీకు, భారతీయ నాటకాలకు కొన్ని పోలికలు ఉన్నప్పటికీ ఇతివృత్త నిర్మాణము, పాత్రపోషణ, అంకవిభజన, సన్నివేశ కల్పన, ఇంకా స్వగతము, కోరస్, భరతవాక్యము మొదలైన పెక్కింటితో భేదములు ఉన్నాయి.

నాటకకళ బహు ప్రాచీనమైనది. అయితే ఈ కళ కొన్ని దేశాలలో మాత్రమే ప్రాచీన కాలం నుండి ఉన్నట్లు పరిశోధకులు తెలుపుతారు. వాటిలో భారతదేశం గ్రీసు వంటి దేశాలు ప్రధానమైనవి. వేదకాలం నుండి భారతదేశంలో నాటక కళ ఉన్నట్టు తెలుస్తుంది. అయితే స్పష్టంగా మాత్రం బాన మహాకవి రచనల కాలం (క్రీ.పూ.3వ శతాబ్దం)లో కనిపిస్తుంది. గ్రీసుదేశంలో నాటక కళ క్రీ.పూ.4వ శతాబ్ది నాటికే ఉన్నత స్థితి పొందిందని భావిస్తున్నారు.

**ఇతివృత్తం:** భారతీయ నాటకాలలో ఇతివృత్తము ప్రఖ్యాతము కాని, కల్పితము గాని, మిశ్రమము కాని అయి ఉంటుంది. ఇతి వృత్తము కవి సూచ్యము, అసూచ్యము, నిషిద్ధము అని మూడు భాగాలుగా విభజించుకొంటారు. కథలో సూచించి విడువ దగిన భాగాలను కవి అర్థోపక్షేపములలో నిబంధిస్తాడు. రసవంతమైన భాగాలను అంకాలుగా విభజించి దానిని పంచ సంధులతో పటిష్టంగా నిర్మిస్తాడు. గ్రీకు నాటకాలలో ఇతివృత్తం పట్ల ఇటువంటి నియమాలు, నిబంధనలు కనిపించవు. స్థలైక్యము, కాలైక్యములను గ్రీకు రచయితలు పాటించరు. వారి నాటకాలలో అంక విభజన లేదు. కల్పిత రచనే అయినా అందులో దేవదానవులు (అలౌకిక పాత్రలు) ప్రవేశించడం జరుగుతుంది. పంతు సంధులు లేకపోయినా ఇతివృత్తంలో ప్రారంభం, మధ్యభాగము, చివరిభాగమునకు ఒకదానితో ఒకటి పొంతన కలిగి ఉంటాయి. భారతీయ నాటకాలలో పుణ్యపురుషులు, ధీరలకు సంబంధించిన కథలుంటే గ్రీకు నాటకాలలో అటువంటి వారు కనిపించరు. గ్రీకు నాటకాలలో పాత్రలకు మానవ సహజమైన దౌర్బల్యాలు ఉంటాయి.



**పాత చిత్రణ:** భారతీయ నాటకాలలో కథానాయకుడు ధీరుడై ఉండాలి. గ్రీకు నాటకాలలో నాయకుడు ధీరగంభీర స్వభావం కలవాడే. అయినా అతనిలో మానవ సహజమైన బలహీనతలు కూడా ఉంటాయి. నాయకుడు లీనం కావాలనే నియమము లేదు. పాత్రోన్మీలనాన్ని కల్పించే విదూషకుడు, కంచుకి వంటి పాత్రలు గ్రీకు నాటకాలలో ఉండవు.

**సన్నివేశ కల్పన:** భారతీయ నాటకాలలో భూలోకమే గాక, స్వర్గ, పాతాళలోకాలు కూడా ప్రదర్శితమవుతాయి. ఇటువంటి సన్నివేశాలు, గ్రీకు నాటకాలలో ఉండవు. అయితే గ్రీకు నాటకాలలో అలౌకిక శక్తుల ప్రభావము, ప్రవేశము కనిపిస్తాయి.

**పద్యరచన:** గ్రీకు, భారతీయ నాటకాలు రెండింటిలో పాటలకు, పద్యాలకు సముచిత స్థానం ఉన్నది. నాటక కవి కథలో, సన్నివేశ కల్పనలో పాత్ర చిత్రణలో శ్రద్ధ వహించాలే గాని కేవలం పద్యరచనలో నేర్పు చూపరాదని అరిస్టాటిల్ అంటాడు.

**దృక్పథం:** నాటక కళ ద్వారా ప్రేక్షకులకు ఆనందాన్ని, వినోదాన్ని, ఉల్లాసాన్ని, విశ్రాంతిని, ధర్మప్రభోదాన్ని కల్పించడం, భారతీయ, పాశ్చాత్య నాటక రచయితల ధ్యేయం. ఈధ్యేయాన్ని సాధించడంలో వారి మార్గాలు భిన్నమైనవి. భారతీయ నాటక కర్తలు ఆ ధర్మ మానవుణ్ణి కథానాయకుడిగా నిలిపి అతని మార్గాన్ని ప్రేక్షకులు అనుసరించాలని వాంఛిస్తారు. ఇది ఆదర్శ సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని భావిస్తారు. పాశ్చాత్యుల నాటకాలలో వాస్తవికతకు ప్రాధాన్యమిచ్చి కథానాయకుడిలోని బలహీనతలను చూపి, వాటివల్ల అతడు పతనమైనట్లు చూపిస్తారు. విషాద రూపక రచన భారతీయుల లక్ష్యము కాదు. ఊరు భంగము వంటి ఒకటి రెండు నాటకాలలో విషాదాన్ని రచయితలు చూపించినప్పటికీ వారి లక్ష్యము మాత్రము ప్రేక్షకుల మనస్సులలో ఉండి జాలి, భయము అనే వాటిని కలగజేసి మంచివైపు నడవడానికి ప్రోత్సాహమివ్వడమే.

భారతీయ నాటకాలు 'మంగళాదేవి, మంగళమిథాని, మంగళాంతని' అనే లక్ష్యంతో ఏర్పడ్డాయి. గ్రీకు నాటకాలలో తెరతీయడం, తెరవేయడం అనేది లేదు. భారతదేశంలో ఇది అనాది నుండి ఉన్నది. కోరస్ (బృందగానం) అనేది రెండు నాటకాలలో ఉన్నది. ఉత్తమ పాత్రలకు సహాయకారులుగా రంగస్థలం మీద నిలిచి గానం చేసే పద్ధతి ప్రాచీన గ్రీకు నాటకాలలో బృందగానంగా ఎప్పుడైనా రంగస్థలంపైగాక, తెర వెనుక నుండి తమ పాత్రలను కొనసాగించవచ్చు. ప్రాచ్య, పాశ్చాత్య నాటకాలు రెండూ ప్రేక్షకుల్ని ఆనందింపజేయడంలో, విజ్ఞానవంతుల్ని చేయడంలో తమ పాత్రను కొనసాగించాయి.

నియోగి
9553097319

# సమాజం నుండే కళలు

ఒక కళ ఫలానా కాలంలోనే రావాలనే నియమం ఏమీ లేదు. అలాగని కళారూపం యాదృచ్ఛికం కూడా కాదు. అది వాస్తవికతతో నిండిన కార్యాచరణ సంబంధంపై ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు. ఒక చిత్రకారుడు ఫలానా చిత్రాన్ని ఆ కాలంలో వేయడం వెనుక ఆనాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు ప్రభావం చూపుతాయి. శాస్త్రాంశమైనా, సాహిత్యాంశమైనా, మరే ఆవిష్కరణ గానీ నాటి పరిస్థితుల ప్రభావం వల్ల మాత్రమే రూపుదాలుస్తుంది. ఆ కళారూపంలో గల విషయ, వస్తువులన్నీ కాలపరీక్షకు నిలబడతాయి. అలా నిలబడగలిగినది చరిత్రలో సుస్థిరస్థానం అందుకుంటుంది.



ఇక్కడ ఒక విషయాన్ని పరిశీలిద్దాం. శాస్త్ర విషయమైన మానవుని చంద్రమండల యాత్ర 1969లో జరిగింది. దీనికి ఆనాటి శాస్త్రప్రగతి దానికి సాయపడిందనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ ఈ ప్రయాణాన్నీ దాదాపు వంద సంవత్సరాల క్రితమై జూల్స్ వెర్న్ వర్ణించి రాయగలగడం అన్నది ఆశ్చర్యకరమైన అంశం. దీన్ని మరింత పరిశీలిస్తే జూల్స్ వెర్న్ కన్నా ముందుగానే న్యూటన్ ప్రతిపాదించిన గురుత్వాకర్షణ సిద్ధాంత ఈ సూత్రాలకు మూలం. ఇక జూల్స్ వెర్న్ విషయానికి వస్తే ఇతను పారిశ్రామిక విప్లవకాలం నాటివాడు. మరి ఈ కాలంలో ఆవిరి శక్తి, విద్యుత్‌శక్తి, పెట్రోలు వంటి మరెన్నో ఆవిష్కరణలు జరిగిన కాలం. ఇలాంటి కాలంలోని ఒక సాహిత్యకారుడైన జూల్స్ వెర్న్ ఊహ మానవుడు భూమ్యాకర్షణ శక్తిని దాటి వెళ్లగలగడం దీనిని ఊహించాడు. ఇతని ఊహ వాస్తవం కాగలిగింది. ఇలాగే ఒక కళాకారుడు ఊహించగలిగినది తరువాతకాలంలో వాస్తవరూపంలో చూడగలగడం. లియోనార్డో డావిన్సీ ఎన్నో అద్భుత కల్పనలు చేశాడు. అలాంటి వాటిలో కొన్ని ప్యారాచూట్, హెలికాప్టర్, ఫిరంగి ఇలా ఎన్నో ఊహించి చిత్రాలుగా చూపాడు. తరువాత అవి వాస్తవరూపాలు కాగలిగాయి. శాస్త్రకారుడు, సాహిత్యకారుడు, కళాకారుడు ఊహలలో నుండే ఆవిష్కరణలు పుట్టుకొస్తుంటాయి. మరి ఆ ఊహలకు ప్రాతిపదిక అన్నది వారి చుట్టూ ఉన్న సమాజమే. చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావం వల్లనే ఊహ వాస్తవం అవుతుంది. అంతేకానీ మరో విషయం కాదు. కళాకారుని అంతర మనసు పైన చూపిన బాహ్యకారణాలు కళారూపాల ఆవిష్కరణలకు మూలమవుతాయి.



శాస్త్రపరంగా, సాహిత్యపరంగా సాగిన యుగవిభజనలు, కళలపరంగా ఉద్యమాలు అన్నీ కూడా ఆనాటి పరిస్థితుల ప్రాంతాల ప్రభావం నుండి వచ్చినవి గానే చెప్పవచ్చు. కళల గురించి చూసినపుడు ఆదిమ మానవుని గుహాచిత్రాలు, ఇందులో అందం, అలంకరణల కంటే అతని అవసరంగా మాత్రమే వాటిని చెప్పుకోవచ్చు. కొంత నాగరికత వచ్చిన తరువాత అలంకరణలు మొదలయ్యాయి. రాజుల కాలంలో వారిని మెప్పించడానికి గీచిన చిత్రాలు కనిపిస్తాయి. శాస్త్ర, సాంకేతిక ప్రగతితో కళారూపాలలో కూడా రంగులు, కుంచెలు, కాన్వాస్ వాడకం మొదలు కాబడింది. నీటిరంగులు, నూనెరంగుల చిత్రాలు వచ్చాయి. పారిశ్రామిక విప్లవంతో మానవుని జీవనవిధానం మార్పు వచ్చింది. కళలోనూ మార్పు వచ్చింది. వివిధ దేశాలలో వచ్చిన విప్లవాలు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ప్రపంచ కళను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. అది ఆఫ్రికా ఆదిమ కళారూపాలు కావచ్చు. జపాన్ ప్రింట్ చిత్రాలు కావచ్చు. ఇలా ప్రతి ఒక్కటి ప్రపంచాన్ని ప్రభావితం చేయగలిగాయి.

ఎల్.ఆర్. వెంకటరమణ
9866158908

# పశ్చిమ దేశాలకు విస్తరించిన పంజాబీ సంస్కృతి


ఆధునిక కాలంలో పంజాబీ ప్రజలు ప్రపంచం అంతటా విస్తరించి ఉన్న కారణంగా పంజాబీ సంస్కృతి అనేకమందికి పరిచయమై ప్రభావం చూపుతుంది. సంప్రదాయమైన పంజాబీ సంస్కృతి శక్తివంతమై పశ్చిమదేశాల వరకు విస్తరించింది. పంజాబీ సంస్కృతి యునైటెడ్ స్టేట్స్, యు.కె. యురేపియన్ యూనియన్, కెనడా, ఆస్ట్రేలియా వరకు విస్తరించింది. పంజాబీ తాత్వికత, కవిత్వం, ఆధ్యాత్మికత, విద్య, కళలు, సంగీతం, ఆహార సంస్కృతి, నిర్మాణ కళ మొదలైనవి వెలుపలి ప్రపంచంలో మరింత ప్రభావం చూపుతుంది. పలు భాషలకు, సంస్కృతులకు, అలవాట్లకు మరియు జాతులకు చెందిన ప్రజలు పలు కారణాల వలన పంజాబు చేరుకున్నారు. ఈ ప్రజలు పంజాబీ సంస్కృతి ప్రభావితులయ్యారు.



**సంగీతం:** భంగారా పలు పంజాబీ సంగీతరూపాలలో ఒకటి. దీనిని పాశ్చాత్య దేశాలలో అభిమానించే వారి సంఖ్య అధికరిస్తూ ఇది అభిమాన పంజాబీ సంగీతంగా మారింది. పంజాబీ సంగీతాన్ని ఇతర సంగీత రూపాలతో మిశ్రితం చేసి పశ్చిమ దేశాలలో ప్రాబల్యత సంతరించి అవార్డ్-విన్నింగ్ సంగీతంగా చేయబడింది. అదనంగా పంజాబీ సంప్రదాయ సంగీతానికి పశ్చిమదేశాలలో ఆదరణ అధికరిస్తూ ఉంది.

**నృత్యాలు:** దీర్ఘకాల చరిత్ర కలిగిన పంజాబీ సంస్కృతి, పంజాబీ ప్రజలలో పలు నృత్యరీతులు రూపొందించబడ్డాయి. ఇవి సాధారణంగా పండుగలు, వివాహాది వేడుకలు మరియు పంటలు చేతికి అందిన వేళలలో ప్రదర్శించబడుతుంటాయి. నృత్యాలకు మనసంబంధిత మరియు మతేతర నేపథ్యం ఉంటాయి. ఉత్సాహవంతమైన పురుషుల నృత్యం భంగారా నృత్యం అలాగే ఝూమర్, గిధా నృత్యాలు స్త్రీలకు ప్రత్యేకించబడ్డాయి.

**వివాహం:** పంజాబీలు జరుపుకునే వివాహ సంప్రదాయాలు, వేడుకలలో పంజాబీ సంస్కృతి బలంగా ప్రతిఫలిస్తూ ఉంటుంది. ముస్లిములు, హిందువులు, సిక్కులు, జైనులు తమ వివాహాది వేడుకలను అరబిక్, పంజాబీ, సంస్కృత్, ఖాజీ, పండిట్, గ్రాంథి లేక పూజారి చేత నిర్వహించబడుతుంది. ఆచారాలు, ప్రాటలు, నృత్యం, ఆహారం, దుస్తులలో కొంత సారూప్యత ఉంటుంది. పంజాబీ వివాహాలలో పలు ఆచారాలు చోటు చేసుకుంటాయి. వేడుకలు వివాహాలు పురాతన సంప్రదాయ కాలం నాటివి ఇప్పటికీ ఆచరించబడుతున్నాయి.



**ఆహారం:** వీరి ఆహార సంస్కృతిలో విస్తారమైన ఆహారాలు ఉన్నాయి. ఆహార రంగంలో ఇది ప్రపంచ స్థాయిలో అధీనత సాధించింది. పంజాబీ ఆహారానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదరణ కారణంగా పలువురు వ్యాపారవేత్తలు ప్రపంచవ్యాప్తంగా పంజాబీ ఆహార రంగంలోపెట్టుబడులు పెట్టారు. ఉదాహరణగా సర్సోకా సాగ్ , మక్కీదీ రోటీ వంటి ఆహారాలు మరింత ప్రాబల్యత సంతరించుకున్నాయి. చోళే బటూరా కూడా పంజాబీ ఆహారాలలో మరింత ఆదరణ అందుకున్నది. అత్యంత ఆదరణ పొందిన పంజాబీ ఆహరాలలో నాన్, బటర్ చికెన్, మటర్ పనీర్, తందూరి చికెన్, సమోసాలు, పకోడాలు ప్రధానమైనవి. దాదాపు అన్ని ఆహారాలకు పెరుగు ఆధరువుగా వాడుకలో ఉంది. పంజాబులో పలు తీపి తినుబండారాలు వాడుకలో ఉన్నా రసగుల్లా, బర్ఫీ, గులాబ్ జామూన్ అత్యంత ప్రజాదరణ కలిగి ఉన్నాయి.

**సాహిత్యం:** పంజాబీ కవిత్వంలోతైన అర్థానికి, సౌందర్యానికి, ఉత్సాహం చక్కని పద ప్రయోగానికి పేరు పొందింది. పంజాబీ ప్రజల మనసులో కవిత్వానికి ప్రత్యేక స్థానం ఉంది. పంజాబీ సాహిత్యం అధికంగా పలుభాషలలో అనువదించబడి ప్రపంచం అంతటా విస్తరించింది. పంజాబీ సాహిత్యంలో గురుగ్రంథ్ సాహెబ్ గ్రంథం అత్యంత ప్రధానమైనది.

**దుస్తులు:** వీరి సంప్రదాయ దుస్తులలో ప్రధానమైన పంజాబీ దుస్తులు పురుషులు, స్త్రీలు కూడా ధరిస్తుంటారు. ఇక్కడ అందరూ కుర్తా,పైజామా వేసుకుంటారు. స్త్రీలు పంజాబీ సల్వార్‌సూట్ వేసుకుంటారు. పంజాబ్‌లో పాటియాలా సల్వార్ కూడా ప్రజాదరణ కలిగి ఉంది.

**పండుగలు:** ఇక్కడి ప్రజలు సాంస్కృతిక, సీజనల్ మత సంబంధిత పండుగలు ఉత్సాహంగా జరుపుకుంటారు. పండుగలలో మాఘి, మేళాచిరాఘన్, లోహ్రి, హోళీ, బైసాఖీ, తీయాన్, దీపావళి, దసరా, గురునానక్ జయంతి ప్రధానమైనవి.

- ఉన్నం వెంకటేశ్వర్లు
8919479134



అనుష్క



ఎమ్మెల్యే చిత్రంలో
కాజల్, కల్యాణ్ రామ్



అమీ జాక్సన్

# సహజ సౌందర్యమే ఇష్టం...

దక్షిణాది భాషలతో సహా బాలీవుడ్‌లో సత్తా చాటింది బ్రిటీష్ మోడల్ అమీ జాక్సన్. తెలుగులో ఎవడు లాంటి చిత్రాలతో మన ప్రేక్షకులకు పరిచితమైంది. విక్రమ్ శంకర్‌ల భారీ బడ్జెట్ సినిమా ఐ తో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ఇక ప్రస్తుతం రోబో సీక్వెల్ చిత్రం 2.0లో నటిస్తోంది. రజినీ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. 2.0లో గ్రాఫిక్స్ మాయాజాలానికి మించేలా అందాల ప్రదర్శన చేయబోతోందట అమీ. తెరపై ఇంత అందంగా కనిపించే అమీ జాక్సన్‌కు మేకప్ అంటే ఇష్టం ఉండదట. ఈ విషయాన్ని అమీ తెలిపింది. మేకప్ వేసుకుని విసుగేస్తోందని చెబుతుందీ భామ. అమీ జాక్సన్ మాట్లాడుతూ....నాయికలుగా మేము చాలా ప్రాంతాలకు ప్రయాణిస్తుంటాం. ప్రతి చోటా వాతావరణం మారిపోతూ ఉంటుంది. అక్కడి పరిస్థితులకు తగినట్లు మేకప్ మార్చుకుంటూ ఉంటాం. ఇక సినిమా సెట్‌లో మేకప్ సంగతి సరేసరి. ప్రతి సన్నివేశంలో పాటలో అలంకరణ బాగా చేసుకోవాల్సిందే. ఇలా ఇన్నేళ్ల కెరీర్‌లో మేకప్ అంటే అయిష్టం ఏర్పడింది. అలంకరణ పదార్థాల్లో ఉండే కెమికల్స్‌తో నా చర్మం పాడయ్యే ప్రమాదం ఏర్పడింది. అందుకే సహజమైన సౌందర్య లేపనాలనే వాడుతున్నాను. ఈ ఇబ్బంది లేకుండా మేకప్‌కు ఎక్కువ ప్రాధాన్యం లేని పాత్రలు వస్తే బాగుండును అనిపిస్తోంది. అని చెప్పింది.

# అతని కలల చిత్రంలో నటిస్తున్నా

మొత్తం దక్షిణాది నాయికల్లో అనుష్క ప్రత్యేకం. ఆమె హీరోల సరసన ఆడిపాడగలదు., నాయికగా తానే కథానాయకుడై కథను నడిపించగలదు. సూపర్ చిత్రం నుంచి మొదలైన స్వీటీ అందాల ప్రస్థానం...నిత్యం ఎదుగుతూ సాగింది. పాత్రకు న్యాయం చేసేలా నటించడం, సినిమా ఒప్పుకున్నాక ఎంత శ్రమకైనా ఓర్చుకోవడం తన రహస్యాలని చెబుతుంటుంది అనుష్క. సామాజిక మాధ్యమాలతో సమయం వృధా చేసుకోవడం ఇష్టం లేదని చెప్పుకునే అనుష్క....అభినయంపైనే దృష్టిపెడతానని తెలిపింది. ఇటీవలే భాగమతితో మంచి విజయాన్ని అందుకున్న స్వీటీ...తన కొత్త చిత్రాన్ని ఇంకా ప్రకటించలేదు. అయితే ఆమె తమిళ దర్శకులు గౌతమ్ వాసుదేవ్ మీనన్‌తో ఓ చిత్రం చేయాల్సి ఉంది. ఈ మధ్య ఓ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న అనుష్క మాట్లాడుతూ...సాధారణ కథల్లో కొన్ని పాత్రల మధ్య నటించేప్పుడు నటిగా నా బాధ్యత తక్కువగా ఉంటుంది. నేనే కీలకంగా ఉండే కథల్లో నటించేప్పుడు ఆ భారం పెరుగుతుంది. అందువల్ల నాయిక ప్రధాన చిత్రాల్లో నా శ్రమ పెరుగుతుంది. ఏదైనా ఒక సినిమా ఎంచుకుంటే ఇక మనస్ఫూర్తిగా కష్టపడతాను. ఆ పాత్రగా ఉండేందుకు ప్రయత్నిస్తాను. ఇన్నేళ్ల అనుభవం తర్వాత కూడా కథలు ఎంచుకున్నాక..ఇది సరైందా కాదా అనే సందేహం కలుగుతూనే ఉంటుంది. ప్రస్తుతం కాస్త బరువు తగ్గి కొత్తగా మీ ముందుకు రావాలనుకుంటున్నాను. త్వరలో సెట్స్ మీదకు వెళ్లనున్న గౌతమ్ వాసుదేవ్ మీనన్ కలల ప్రాజెక్ట్‌లో భాగం కాబోతున్నాను. అని చెప్పింది.



నితిన్

# పెద్దపులి ఎక్కిన గండిపేట మైసమ్మ

నువ్వు పెద్ద పులినెక్కినావమ్మో గండిపేట గండి మైసమ్మ.. అనే పాట వినిపించగానే ప్రతి తెలుగు అభిమాని పూనకం వచ్చినట్టు ఊగిపోతారు. ఆ పాటలో ఉండే ఎనర్జీ అలాంటిది. ఇప్పుడు ఈ పాటని నితిన్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఛల్ మోహన రంగ చిత్రం కోసం రీక్రియేట్ చేస్తున్నారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంస్థ, త్రివిక్రమ్, శ్రేష్ట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

తెలంగాణ సంస్కృతి, పెద్దమ్మ తల్లి గొప్పదనాన్ని చాటుతూ బోనాల సంబరాల్లో చిందేసే ఈ పాట పెద్దపులి. ఈ పాట స్థాయి ఏ మాత్రం తగ్గకుండా సంగీత దర్శకుడు థమన్ స్వరపరచగా, సాహితి సాహిత్యాన్ని అందించారు. శేఖర్ మాస్టర్ నృత్య రీతులు సమకూర్చారు.

పెద్దపులి లాంటి పాట హీరో పాత్ర ప్రవేశం సందర్భంగా వస్తుంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన హీరో నితిన్‌కు ఇది 25వ సినిమా. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నారు.

# శ్రమే నా పెట్టుబడి

బాలీవుడ్‌లో ముప్పై ఏళ్లుగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు సల్మాన్ ఖాన్. పేరున్న ముగ్గురు ఖాన్ స్టార్‌లలో ఒకరిగా వెలుగుతున్నారు. బీయింగ్ హ్యూమన్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆపన్నులకు సహాయం అందిస్తున్న సల్మాన్...కొత్త తరం నటీనటులను ప్రోత్సహించేందుకు మరో సంస్థను స్థాపించాడు. ఈ కార్యక్రమాల ద్వారా తన నిస్వార్థాన్ని చాటుకుంటున్నాడు. దశాబ్దాలుగా తనకున్న పేరు కాపాడుకోవడం వెనుక రహస్యాన్ని సల్మాన్ తెలిపాడు. అసలు సెలవు అనేది లేకుండా కష్టపడటమే తన విజయానికి కారణమని చెప్పాడు. ఇటీవల ఓ సందర్భంలో సల్మాన్ మాట్లాడుతూ...యువకుడిగా ఉన్నప్పుడు ఎక్కువగా పార్టీలకు వెళ్లేవాడిని. అందరూ పిల్లల్లా నేనూ సరదాలకు అలవాటయ్యాను. మా నాన్న స్నేహితుడు ఒకాయన నన్ను తనతో పాటు విందులకు తీసుకెళ్లేవాడు. ఆయనే నన్ను మోడలింగ్‌లోకి రమ్మని ప్రోత్సహించాడు. ఒకరోజు ఆయన నాతో చెప్పాడు...మీ నాన్న డబ్బు ఖర్చు చేయడం గురించే ఆలోచించకు. నువ్వెంత సంపాదిస్తున్నావు, దానిని ఎలా ఖర్చు పెడుతున్నావో తెలుసుకో అన్నారు. ఆయన ఊరికే ఆ మాట నాతో అన్నా...అది నాపై చాలా ప్రభావం చూపించింది. మోడలింగ్ నుంచి సినిమాల్లోకి వచ్చాక ఏ రోజూ ఆయన మాట మర్చిపోలేదు. నా ఖర్చులో నా శ్రమ ఎంత అనేది తెలుసుకున్నాను. ఇక సెలవు తీసుకోవడం అనేది ఇప్పటిదాకా జరగలేదు. అని చెప్పారు.



సల్మాన్‌ఖాన్



ఆవని

# నాలో ప్రేమ నువ్వేనా లోగో

జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ నిర్మిస్తున్న చిత్రం నాలో ప్రేమ నువ్వేనా. వాసుదేవ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఇటీవలే ఈ చిత్రం లోగోను ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె.నాయుడు తఆవిష్కరించి యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హీరో, దర్శకుడు వాసుదేవ్ మాట్లాడుతూ నాలో ప్రేమ నువ్వేనా చిత్రం న్యూ ఏజ్ లవ్‌స్టోరీ చిత్రం. ప్రేమకథా చిత్రాల్లో ఇదొక వైవిధ్యమైన సినిమాగా నిలుస్తుందనే నమ్మకం ఉంది. త్వరలోనే పాటలను విడుదల చేయడం జరుగుతుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. సమ్మర్‌లో సినిమాను విడుదల చేస్తాం అని చెప్పారు.

వాసుదేవ్, ఆవని, రాశి సైనా, సంజయ్ శివలింగమ్, రాజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం అర్జున్, ఛాయాగ్రహణం సాంబమూర్తి, పాటలు వేలూరి శివబ్రహ్మ శాస్త్రి.

# ఈ నెల 16న తెరపైకి నెల్లూరి పెద్దారెడ్డి

సతీష్ రెడ్డి, మౌర్యానీ, ముంతాజ్ హీరో హీరోయిన్‌లుగా నటించిన చిత్రం నెల్లూరి పెద్దారెడ్డి. సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై దర్శకుడు వీజే రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందించారు. సీహెచ్ రఘునాథరెడ్డి నిర్మాత. గ్రామీణ నేపథ్యంలో సాగే ఆహ్లాదకరమైన ప్రేమ కథగా నెల్లూరి పెద్దారెడ్డి చిత్రాన్ని రూపొందించారు దర్శకుడు వీజే రెడ్డి. కథా నేపథ్యం భావోద్వేగంగా ఉన్నా.....వినోదాన్ని మేళవించి సినిమాను తెరకెక్కించారు. పతాక సన్నివేశాల్లో కొంత సేపు మినహా కథనం ఆద్యంతం నవ్విస్తూ సాగుతుంది. సెన్సార్ సభ్యుల అభినందనలు పొందిన నెల్లూరి పెద్దారెడ్డి యూఏ సర్టిఫికెట్ అందుకుంది. ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వీజే రెడ్డి మాట్లాడుతూ....నెల్లూరి పెద్దారెడ్డి చిత్రానికి సెన్సార్ అభినందనలు దక్కాయి. యూఏ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ శుక్రవారం దాదాపు వంద థియేటర్‌లలో మా చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం. పెద్దారెడ్డి అనే వ్యక్తి కథ ఇది. కష్టాల్లో ఉన్న వాళ్లను ఆదుకునే మంచి మనిషి పెద్దారెడ్డి. అందరిలాగే ఒక అమ్మాయికి కూడా సహాయం చేస్తాడు. ఆమె కుటుంబాన్ని ఆదరిస్తాడు. ఈ క్రమంలో పెద్దారెడ్డికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయనేది కథాంశం. పెద్దారెడ్డి జీవితంలో మానసిక అశాంతి ఉంటుంది. అదేంటి అనేది తెరపైనే చూడాలి. కథలో భావోద్వేగ అంశాలున్నా...వినోదంతో దాన్ని సమతూకం చేశాం. ప్రభాస్ శీను, అంబటి శ్రీను, జబర్దస్త్ శాంతి స్వరూప్ వంటి నటులు మంచి హాస్యాన్ని అందించారు. చింతామణి నాటక రిహార్సర్స్ ఘట్టం సినిమా మొత్తానికి బాగా నవ్విస్తుంది. ఆహ్లాదకరమైన పల్లె వాతవరణపు కథను మా చిత్రంలో చూస్తారు. అన్నారు. కథానాయకుడు సతీష్ రెడ్డి మాట్లాడుతూ...పెద్దారెడ్డి లాంటి గొప్ప పాత్రను నాకు ఇచ్చిన దర్శకుడు వీజే రెడ్డి గారికి కృతజ్ఞతలు. సినిమా ఆద్యంతం ఆహ్లాదకరంగా ఉంటుంది. మంచి పాత్రలు, వాటికి తగిన భావోద్వేగాలు ఉంటాయి. వినోదం అందిస్తూనే ఆలోచింపజేసే చిత్రమవుతుంది. అన్నారు.

నెల్లూరి పెద్దారెడ్డి చిత్రానికి మాటలు - సంజీవ్ మేగోటి, సినిమాటోగ్రఫీ - బాల సుబ్రహ్మణి, ఎడిటింగ్ - మేనగ శ్రీను, సంగీతం - గురురాజ్, డాన్స్ - [illegible] మాస్టర్.



సతీష్ రెడ్డి
మౌర్యాని



సుధీర్‌బాబు,
అదితిరావు

# ప్రేమ సమ్మోహనం

అనూహ్యమైన కథాంశంతో అద్యంతం వినోదాత్మకంగా తెరకెక్కుతున్న కొత్తతరం ప్రేమ కథా చిత్రం సమ్మోహనం. సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్నాడు. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకుడు. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు.

నిర్మాత మాట్లాడుతూ చివరి షెడ్యూల్ ఈనెల 21 నుంచి వచ్చే నెల 3వరకు హిమాచల్ ప్రదేశ్, ముంబైలో తెరకెక్కిస్తాం. దాంతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ఏప్రిల్, మే నెలల్లో పోస్ట్‌ప్రొడక్షన్ పనులు చేస్తాం. జూన్ 15న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. సంగీతానికి మంచి ప్రాధాన్యత ఉన్న చిత్రమిది. అత్యుత్తమ సాంకేతిక విలువలు, నిర్మాణ విలువలు ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి అన్నారు.

దర్శకుడు మాట్లాడుతూ కొత్త ఎత్తుగడ, కొత్త పోకడ ఉన్న నవతరం కథలో రొమాన్స్, హాస్యం మిళితమై ఉంటుంది. పిజి.విందా ఛాయాగ్రహణం, వివేక్ సాగర్ సంగీతం హైలెట్. మంచి కథ, కథనానికి చక్కటి నిర్మాణ విలువలు తోడయ్యాయి. టైటిల్‌కి తగినట్టుగా అందమైన ఫీల్ క్యారీ అయిన సమ్మోహనంగా అని పిస్తుంది అని చెప్పారు.

సుధీర్‌బాబు, అదితిరావు హైదరి, నరేష్, తనికెళ్ళ భరణి, పవిత్రా లోకేష్, హర్షిణి, నందు, కాదంబరి కిరణ్ తదితరులు నటిస్తున్నారు.